
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 221

బుధవారం 1-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



7 వికెట్లతో పాకిస్తాన్ గెలుపు

పాక్ చేతిలో ఓడి వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించిన బంగ్లాదేశ్ -14లో



భారత్ డిమాండ్.. 'బంగారం'

సెప్టెంబర్ త్రైమాసికంలో డిమాండ్ 10% అప్.. 210.2 టన్నులుగా నమోదు -15లో



బీడ్ నగరంలో కర్ఫ్యూ

ప్రత్యేక కోటా ఆందోళనలతో బీడ్‌లో కర్ఫ్యూ విధించారు. మరాఠాలకు కున్బి కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



సూపర్ అణుబాంబు!

అత్యంత శక్తిమంతమైన సూపర్ అణుబాంబును తయారు చేయనున్నట్లు అమెరికా మంగళవారం ప్రకటించింది.

వివరాలు 6లో ▸



గాజాపై నిప్పుల వాన

ఇజ్రాయెల్ ప్రతీకార దాడులతో గాజా అల్లాడుతోంది. ఒక్కరోజే 300 'లక్ష్యాలను' ఛేదించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



'ఎస్-400' మోహరింపు

చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) మూడు స్క్వాడ్రన్ల ఎస్-400 క్షిపణులను మోహరించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ప్రతిపక్షాలవి చిల్లర రాజకీయాలు: హరీశ్



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కత్తిదాడికి గురై ప్రాణాపాయస్థితిలో ఉంటే ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం ఎంపీని ఆయన పరామర్శించారు.

- వివరాలు 2లో▶

ఎంపీకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితేంటి..



బీఆర్‌ఎస్ పాలనలో ఎంపీలకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. అదే సమయంలో అధికార పార్టీ దుబ్బాక బంద్‌కు పిలుపునివ్వడాన్నీ ఖండిస్తున్నామన్నారు.

- వివరాలు 2లో▶

సెల్‌ఫోన్ వదిలితేనే స్టీరింగ్



డ్రైవర్లు బస్సు నడిపే క్రమంలో మొబైల్‌ఫోన్లు వాడుతూ ప్రమాదాలబారిన పడుతున్న ఘటనల నేపథ్యంలో టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నియంత్రణ చర్యలు ప్రారంభించింది. వారు విధుల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ల వినియోగాన్ని నియంత్రించాలని నిర్ణయించింది.

- వివరాలు 16లో▶

హుజూర్‌నగర్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్. దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



ప్రజలు గెలవాలి

హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్

- ఎన్నికల్లో ప్రజలు గెలిస్తేనే వారికి న్యాయం, అభివృద్ధి జరుగుతుంది
- పదేళ్ల వయసున్న తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉంది
- రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచే పరిస్థితే లేదు.. అప్పట్లో వాళ్లు చేసిన పనికే 50 ఏళ్లు ఏడ్చాం
- ఇప్పుడు రైతుబంధు దండుగ అంటున్నారు..ఉండాలా? తీసివేయాలా?
- కరెంటు 3 గంటలు చాలట! ధరణి రద్దు చేయాలట! మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి.. ఆలోచించుకుని ఓటేయాలి

ఎర్రవల్లిలో నేటి నుంచి కేసీఆర్ రాజశ్యామల మహాయాగం 2లో

హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ

'ప్రజాస్వామ్యం పరిణతి సంతరించుకోవాలంటే ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. అప్పుడే ప్రజలు గెలుస్తారు. లేదంటే నాయకులు గెలుస్తారు..' అని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. 'ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. నాయకులు కాదు ప్రజలు గెలవాలి. ఎన్నికల్లో ప్రజలు గెలిస్తే వారికి న్యాయం, అభివృద్ధి జరుగుతుంది. అందువల్ల ఓటు వేసేటప్పుడు అభ్యర్థి వ్యక్తిత్వం, మనస్తత్వం గుర్తుంచుకోవాలి. అతను ఏ పార్టీ నుంచి పోటీ చేస్తున్నాడో ఆ పార్టీ చరిత్ర, దృక్పథం, సరళిని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుని ఓటు వేయాలి..' అని సూచించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాయగాళ్లు వస్తుంటారని, ఒక్క చాన్స్ అని మభ్యపెట్టి గెలిచాక మోసం చేస్తారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ మాట్లాడారు.

కాంగ్రెస్ హయాంలో ఒరిగిందేమీ లేదు..

'1956లో తెలంగాణను ఆంధ్రాలో కలపాలని ప్రతిపాదన వస్తే ప్రజలు వ్యతిరేకించారు. అప్పుడు పోలీస్ ఫైరింగ్ జరిగింది. ఏడుగురు విద్యార్థులు చనిపోయారు. అప్పుడు నోరు మూసుకుంది కాంగ్రెస్ నాయకత్వం. ఢిల్లీకి పోయి ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రాలో కలిపిన పాపాత్ములు ఈ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు. వారు చేసిన చిన్న పనికి 50 ఏళ్లు ఏడ్చాం..గోసపడ్డాం. 2014లో తెలంగాణ

మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌కు ప్రజా మద్దతు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

'పాలమూరు ప్రజాభేరి'లో రాహుల్ గాంధీ



కొల్లాపూర్ సభలో మాట్లాడుతున్న రాహుల్

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

కేసీఆర్ దోచుకున్న సొమ్ము కక్కించి ప్రజల జేబుల్లో వేస్తాం

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: డబ్బు, అధికారం, మీడియా సీఎం కేసీఆర్ వెంట ఉంటే, కాంగ్రెస్ వెంట తెలంగాణ ప్రజలు ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు కలసి ప్రజా తెలంగాణ నిర్మాణం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ నిర్వహించిన 'పాలమూరు ప్రజాభేరి' బహిరంగసభలో ఆయన మాట్లాడారు. 'ఈ రోజు ఇందిరమ్మ వర్ధంతి. గతంలో మా నాయనమ్మకు అవసరమైనప్పుడు తెలంగాణ ప్రజలు మద్దతు పలికి అండగా నిలిచారు. ఇది నేను

మిగతా 3వ పేజీలో ▶

విపక్ష ఎంపీల ఐఫోన్ల హ్యాకింగ్!?

రాజకీయ కాక

- ప్రభుత్వ దన్నుతో మీ ఐఫోన్ల హ్యాకింగ్ యత్నమంటూ విపక్ష ఎంపీల ఫోన్లకు యాపిల్ అలర్ట్‌లు 6లో
- ప్రభుత్వంపై విపక్షాల మండిపాటు



ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కవిత

తెలంగాణ మోడల్ దేశానికి దిక్సూచి

అభినవ చాణక్యుడు, అపరగాంధీ కేసీఆర్

మహిళా రిజర్వేషన్ బిల్లు పోస్ట్‌డేటెడ్ చెక్

ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో ఎమ్మెల్సీ కవిత ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి నమూనా భారత దేశానికి దిక్సూచి అని, పరిపాలనలో మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభినవ చాణక్యుడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అహింసా మార్గంలో తెలంగాణను సాధించిన గాంధీగా కేసీఆర్‌ను పేర్కొంటూ.. బీడువారిన భూములను పచ్చని పంటపొలాలుగా తీర్చిదిద్ది ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ

మిగతా 2వ పేజీలో ▶

కంటి వైద్యం కోసం కండీషన్లతో బెయిల్

చంద్రబాబు కంటికి శస్త్ర చికిత్స కోసం 4 వారాల పాటు మంజూరు

- నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా లొంగిపోవాలి
- మానవతా దృక్పథం, ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తాత్కాలిక బెయిల్
- గతంలో చికిత్స చేయించుకున్న ఆస్పత్రిలోనే చేయించుకోవాలి
- రూ.లక్షతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. లొంగిపోయే సమయంలో
- [illegible] జైలు అధికారు
- [illegible]లు అధికారులు యథాతథంగా ఏసీబీ కోర్టు ముందుంచాలి
- [illegible]రాదు
- [illegible]రించడం, భయపెట్టడం చేయరాదు
- [illegible]మూర్తి జస్టిస్ మల్లికార్జునరావు
- ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ నవంబర్ 10కి వాయిదా



సాక్షి, అమరావతి : దసరా సెలవుల్లో న్యాయమూర్తులపై నాట్ బిఫోర్ అస్త్రాలను ప్రయోగించి విఫలమైన టీడీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఎట్టకేలకు తాత్కాలిక బెయిల్ పొందడంలో సఫలమయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిన కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు కంటికి శస్త్ర చికిత్స నిమిత్తం తనకు తాత్కాలిక బెయిల్ ఇవ్వాలంటూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం అనుమతించింది. కుడి కంటికి శుక్లాల (కాటరాక్ట్) శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితిలో ఆయనకు 4 వారాల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. ఎడమ కంటికి ఏ ఆసుపత్రిలో (డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్) అయితే శస్త్రచికిత్స చేయించుకున్నారో అదే ఆసుపత్రిలో ఇప్పుడు శస్త్ర చికిత్స చేయించుకునేందుకు అనుమతిచ్చింది. మానవతా దృక్పథంతో పాటు చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటూ ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. ఏసీబీ కోర్టు

మిగతా 5వ పేజీలో ▶

ఇదెక్కడి రోగం?

ఆస్పత్రి పేరుతో జైలు నుంచి బయటకు వచ్చి చంద్రబాబు విజయోత్సవాలు

నిజం గెలిచిందంటూ రాత్రంతా ర్యాలీలు.. బాబు తీరుపై విస్తుపోతున్న నేతలు

- వివరాలు 5లో

మార్కుల కోసం కాలేజీ టార్చర్..

- ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నా..
- 'నారాయణ' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- లేఖ రాసి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి బలవన్మరణం



మీర్‌పేట: 'సారీ అమ్మా నాన్న.. ఇదే నా చివరి రోజు. మార్కులు ఎక్కువగా తెచ్చుకోవాలని కళాశాల యాజమాన్యం చేస్తున్న ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నా' అంటూ సూసైడ్ లెటర్ రాసి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. మీర్‌పేటలోని గౌతంనగర్‌కు చెందిన పాల వ్యాపారి మంచన ఆనంద్, కృష్ణవేణి దంపతుల పెద్ద కుమారుడు వైభవ్ (16) చైతన్యపురిలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ) చదువుతున్నాడు. అప్పుడప్పుడూ వ్యాపారంలో తండ్రికి చేదోడువాదోడుగా ఉండే వైభవ్ మంగళవారం తెల్లవారుజామున పని ముగించుకొని కళాశాలకు వెళ్తానని ఇంటికి వచ్చాడు. అనంతరం బెడ్‌రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు

మిగతా 12వ పేజీలో ▶

ఎన్నికలవే.. ఎరలవే..

ఏ దేశమేగినా.. ఎన్నికల తీరు ఒకటే!.. ఓటర్లను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా పార్టీల పాట్లు

వినిపిస్తోందా మూడో స్వరం

వివక్ష లేని జీవితం, సామాజిక భద్రత కావాలంటున్న ట్రాన్స్‌జెండర్స్

జంగ్ తెలంగాణ

పులిటీషియన్లు.. కొంగబావలు

- వివరాలు 7,8 పేజీల్లో



... సీ యూ అగెయిన్ సార్!

కాంగ్రెస్–సీపీఎం పొత్తు చిత్తు!



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌తో సీపీఎం పొత్తు బెడిసికొట్టింది. మిర్యాలగూడ, వైరా స్థానాలు తమకు కేటాయించేందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విధించిన రెండు రోజుల గడువు ముగిసినా కాంగ్రెస్ నుంచి స్పందన రాకపోవడంతో ఒంటరి పోరుకే వెళ్లాలని ఆ పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. మంగళవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో 10 స్థానాల్లో పోటీకి సిద్ధపడాలన్న కీలక నిర్ణయానికి వచ్చింది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కలిపి 9 స్థానాల్లో పోటీ చేయాలని, ఇబ్రహీంపట్నంలోనూ బరిలో ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం. బుధవారం జరిగే రాష్ట్ర కమిటీ సమావేశంలో మరో ఐదు స్థానాలను గుర్తించి మొత్తం 15 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు చర్చలు బెడిసికొట్టగా తెలంగాణలోనూ తమతో పొత్తుకు కాంగ్రెస్ సిద్ధంగా లేనట్లు ఢిల్లీ నుంచి సంకేతాలు అందిన నేపథ్యంలోనే ఈ దిశగా కసరత్తు చేస్తున్నట్లు సీపీఎం వర్గాలు చెబుతున్నాయి.

ఐదు నుంచి రెండు సీట్లకు తగ్గినా...

మునుగోడు ఉపఎన్నికలో తమతో పొత్తు పెట్టుకున్న బీఆర్‌ఎస్... ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధపడటంతో కాంగ్రెస్‌తో

మిగతా 3వ పేజీలో ▶

తమ్మినేని విధించిన గడువు ముగిసినా పొత్తుపై స్పందించని కాంగ్రెస్

- ఢిల్లీ నుంచి పొత్తు లేదన్న సంకేతాలు వచ్చాయంటున్న సీపీఎం వర్గాలు
- ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవాలని సూత్రప్రాయ నిర్ణయం
- నేడు రాష్ట్ర కమిటీ సమావేశం... 15 సీట్లలో పోటీకి కసరత్తు?



చూసుకుందాం.. దమ్ముంటే రా

కామారెడ్డిలో కేసీఆర్ మీద రేవంత్‌రెడ్డి పోటీ చేస్తడట: కేటీఆర్

- డిపాజిట్ కూడా రాకుండా చిత్తుగా ఓడిస్తాం
- కేసీఆర్ మీద పోటీ అంటే పోచమ్మ గుడి ముందు మేకపోతును బలి ఇచ్చినట్టే..
- తెలంగాణ పోరుగడ్డ మీద ద్రోహులకు స్థానం లేదు
- కామారెడ్డి జిల్లాలో మంత్రి ప్రచారం

సాక్షి, కామారెడ్డి: 'కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేస్తడని అనంగనే ప్రతిపక్షాల ఫ్యూజులు ఎగిరిపోయినయి. జబ్బలు చరిచినోళ్లు తప్పించుకునే పరిస్థితి ఏర్పడింది. అసలే కామారెడ్డి తెలంగాణ ఉద్యమాల గడ్డ. షబ్బీర్ అలీ అసొంటోళ్లు పోటీ నుంచి తప్పుకున్నరు. ఇగ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీకి వస్తడట. రేవంత్‌రెడ్డి.. దమ్ముంటే రా చూసుకుందాం. డిపాజిట్ కూడా దక్కనీయం. చిత్తుచిత్తుగా ఓడిస్తం. పోరాటాల గడ్డ మీద తెలంగాణ ద్రోహులకు స్థానం లేదు'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి, కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన సభల్లో కేటీఆర్ మాట్లాడారు. 'కేసీఆర్ పోటీ చేస్తున్నడని తెలవంగనే కొందరు నాయకులు పోటీ నుంచి తప్పుకున్నరు. షబ్బీర్ అలీ పోటీ చేయనని పక్కన కూసున్నట్టు మీడియాలో చూసిన. కేసీఆర్ మీద పోటీ చేయడం అంటే పోచమ్మ గుడి ముందు మేకపోతును బలిచ్చినట్టే. గ్రామగ్రామాన ప్రజలే ఏకగ్రీవంగా కేసీఆర్‌కు మద్దతు ఇస్తున్నరు. పోటీ ఏకపక్షమే'అని పేర్కొన్నారు.

కామారెడ్డికి గోదావరి తెస్తాం

'పుట్టుక నుంచి చావు వరకు కేసీఆర్ పథకాలు ఇంటింటికీ చేరినయి అంటూ బిడ్డ పుట్టగానే కేసీఆర్ కిట్టు వస్తది, ఏదేని పరిస్థితుల్లో ప్రాణాలు పోతే కేసీఆర్

మిగతా 2వ పేజీలో ▶


క్లుప్తంగా...

మంత్రి కేటీఆర్ వివరణ అందింది
రిటర్నింగ్ అధికారి రోనాల్డ్‌రాస్



సాక్షి, హైదరాబాద్: ప్రగతిభవన్‌లో రాజకీయ కార్యకలాపాలకు సంబంధించి మంత్రి కేటీ రామారావుపై కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదుపై సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) జారీ చేసిన నోటీసుకు కేటీఆర్ నుంచి వివరణ అందిందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో రోనాల్డ్‌రాస్‌ను ప్రగతిభవన్‌కు నోటీసుల విషయంపై అడగ్గా విషయాన్ని తెలిపారు.

హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోం
ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కేసులో సుప్రీం



సాక్షి, న్యూఢిల్లీ: ఫ్యాక్టరీపై దాడి కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు దోషిగా ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే ఇవ్వగా వాటిని సవాల్ చేస్తూ ఎంఏ ముఖీమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్ జస్టిస్ అరవిందకుమార్‌ల ధర్మాసనం విచారించింది. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది.

బీఆర్ఎస్ నేతలకు భద్రత పెంపు
ఇంటెలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ నేతలకు భద్రత పెంచాలని పోలీసుశాఖ నిర్ణయించింది. దుబ్బాక ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఓ వ్యక్తి కత్తితో దాడి నేపథ్యంలో.. బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆ పార్టీ అభ్యర్థులకు భద్రతను పెంచాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లను ఇంటెలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు 2+2గా ఉన్న వారి భద్రతను 4+4కు , 3+3గా ఉన్న వారి భద్రతను 4+4కు పెంచాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తికి కాంగ్రెస్‌తో సంబంధం లేదు
దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తికి కాంగ్రెస్‌పార్టీతో అస్సలు సంబంధం లేదని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు, హింసకు తావులేదని పేర్కొన్నారు. దాడి జరిగిన గంటలోపే కాంగ్రెస్‌పై సీఎం కేసీఆర్ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దాడిలో గాయపడిన ప్రభాకర్‌రెడ్డిని సిద్దిపేట సూపర్ స్పెషాలిటీకి కాకుండా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లడంపై అనుమానం కలుగుతోందని ఆరోపించారు.

కోలుకుంటున్న గటాని రాజు
ఎంపీపై దాడి చేసిన నిందితుడికి ఆర్ఐసీయూలో చికిత్స

గాంధీ ఆస్పత్రి: మెదక్ ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసిన నిందితుడు గటాని రాజు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. రాజును బీఆర్ఎస్ శ్రేణులు ఘటనాస్థలంలోనే పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించగా, వెంటనే ప్రభాకర్‌రెడ్డిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి, రాజును గాంధీ ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గాంధీ ఆస్పత్రి రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఆర్ఐసీయూ)లో రాజుకు బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్స్‌రే, సీటీ స్కానింగ్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. శరీర లోపలిభాగాల్లో ఎటువంటి అంతర్గత గాయాలులేవని, ఎముకలు ఫ్యాక్చర్స్ కాలేదని వైద్యులు నిర్ధారించి బాహ్య గాయాలకు చికిత్సచేశారు. ప్రాణాపాయంలేదని, గాయాలు నయమైన తర్వాత డిశ్చార్జి చేస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

ఎంపీపై కత్తితో దాడి చేసిన నిందితుడి కారు దగ్ధం

మిరుదొడ్డి (దుబ్బాక): మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడికి పాల్పడిన నిందితుడు రాజు కారును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం దగ్ధం చేశారు. చెప్యాలలో నిందితుడి ఇంటి వద్ద పార్కు చేసిన కారు అద్దాలను పగులగొట్టి నిప్పంటించడంతో కారు ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా...పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి దగ్ధమైన కారును మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



మిర్యాలగూడలో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

ప్రజలు గెలవాలి

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చుడో కేసీఆర్ చచ్చుడో అని ఉద్యమిస్తే తెలంగాణ వచ్చింది. వచ్చిన తెలంగాణలో ప్రస్తుతం మూడోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో డజన్ మంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారు. వారిలో వారు కొట్టుకుంటున్నారు. కానీ అసలు రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచే పరిస్థితే లేదు. కాంగ్రెస్ వారి ధోరణి, వైఖరి, ఆలోచన ప్రజలకు తెలుసు. పేదలను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే కాంగ్రెస్ వాడుకుంది. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఒరిగిందేమీ లేదు. తెలంగాణ వచ్చాక మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరైడ్ బాధలు తప్పించుకుని మంచినీరు తాగుతున్నాం. పల్లెలు పచ్చబడాలని, పంటలు రావాలని, రైతులకు స్వేచ్ఛ ఉండాలని, రైతులు బాగుపడాలని రైతుబంధు తెచ్చాం. ఈ పథకం బాగుందని దివంగత వ్యవసాయవేత్త స్వామినాథన్‌తో పాటు యూఎన్ఓ పొగిడింది. కాంగ్రెస్ నాయకులు రైతుబంధు దండుగ అంటున్నారు. రైతుబంధు ఉండాలా.. తీసివేయాలా?.. ప్రజలు ఆలోచించుకోవాలి. గతంలో రైతులకు అన్నీ పైరవీల బాధలు ఉండేవి. ఇప్పుడు హైదరాబాద్‌లో రైతుబంధు డబ్బులు వేస్తే మీ సెల్‌ఫోన్‌లో మెసేజ్ వస్తుంది. రైతులను ఆదుకోవడం వల్ల దేశంలో 3 కోట్ల టన్నుల ధాన్యం పండిస్తూ పంజాబ్ తర్వాత తెలంగాణ రెండవ స్థానంలో ఉంది. అంతకుముందు 30 లక్షలు, 50 లక్షల టన్నులు మాత్రమే పండించేవారు..' అని సీఎం తెలిపారు.

కరెంటు 3 గంటలు సరిపోతదా?

'కరెంటు వేస్టు చేస్తున్నారని ఒకాయన అంటాడు.. 3 గంటలు చాలని మరొకాయన అంటున్నాడు. 3 గంటలు సరిపోతదా.. ఆలోచించాలి. కర్ణాటక నుంచి డీకే శివకుమార్ వచ్చి తమ రాష్ట్రంలో రైతులకు 5 గంటల విద్యుత్ ఇస్తున్నామని, వచ్చి చూసుకోవాలంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడు. అలాంటి వారిని నమ్మితే మోసపోయి గోస పడతాం. తెలంగాణలో ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తోంది. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, రేవంత్, భట్టి ధరణి తీసివేయాలని మాట్లాడుతున్నారు. భూరికార్డుల్లో పారదర్శకత కోసం ధరణి పోర్టల్‌ను తెచ్చాం. ఒక రైతును ఏడెమినిది మంది రెవెన్యూ అధికారుల బాధలు, అవినీతి నుంచి తప్పించేందుకు ధరణి తెచ్చాం. భవిష్యత్తులో పింఛన్ల క్రమంగా రూ.6 వేల వరకు, రైతుబంధు రూ.16 వేలకు పెంచుతాం, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, బడి పిల్లలకు టిఫిన్, కంటి వెలుగు తదితర పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టాం..' అని సీఎం వివరించారు.

కేసీఆర్ బతికున్నంత కాలం సెక్యులర్ రాష్ట్రమే

'తెలంగాణ వచ్చిన తర్వాత పది సంవత్సరాల కాలంలో కర్ఫ్యూలు, మత కల్లోలాలు లేవు. కేసీఆర్ బతికున్నంత కాలం తెలంగాణ సెక్యులర్ రాష్ట్రంగానే ఉంటుంది. ఇటీవల దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేశారు. మేము ఏనాడూ అరాచకాలు చేయలేదు. దుర్మార్గాలు, దౌర్జన్యం, కుట్రలకు పాల్పడలేదు. అభివృద్ధికి ఆటంకం కలగకుండా మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలి..' కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఆయా సభల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగులు లింగయ్య యాదవ్, టీఎస్ఐఎస్‌సీ చైర్మన్ బాలమల్లు, బీఆర్ఎస్ అభ్యర్థులు శానంపూడి సైదిరెడ్డి, నలమోతు భాస్కరరావు, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు బతుకులు ఎలా ఉన్నాయో ఆలోచించాలి

'రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణ ప్రజల బతుకులు ఎలా ఉన్నాయో ఒక్కసారి ఆలోచించాలి. దళిత బిడ్డలు అనాదిగా అణచివేతకు గురవుతున్నారు. మా తండాలో మా రాజ్యం అని ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడీ హక్కుల పోరాట సమితి) ఆధ్వర్యంలో కొట్లాడారు. అయినా వారిని ఎవరూ పట్టించుకోలేదు. యువత ఆలోచన చేయాలి. దేశం మీది, భవిష్యత్ మీది.. మీ చేతుల్లో ఉంది..' అని కేసీఆర్ పేర్కొన్నారు.

నల్లగొండకు గోదావరి జలాలు..

'గోదావరి జలాలను నల్లగొండ జిల్లాకు అందించి సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. గోదావరి జలాలను ఉదయసముద్రం ద్వారా పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు తీసుకువస్తాం. కాంగ్రెసోళ్ల కేసుల వల్లే డిండి లిఫ్టు పనులు ఆలస్యం అయ్యాయి. రానున్న కొద్దిరోజుల్లోనే లిఫ్టు పనులు పూర్తి చేసి దేవరకొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. దేశం, రాష్ట్రం బాగుపడాలంటే తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగం గీటురాయి. ఈ విషయంలో నాడు పదవ స్థానంలో ఉన్న తెలంగాణ నేడు మొదటి స్థానంలో నిలిచింది. కడుపు, నోరు కట్టుకొని తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం. పదేళ్ల వయస్సున్న తెలంగాణ దేశంలోనే నం.1గా నిలిచింది..' అని సీఎం చెప్పారు.

కేసీఆర్ రాజశ్యామల మహాయాగం

నేటి నుంచి మూడ్రోజులపాటు కొనసాగనున్న యాగం
- తెలంగాణ, ఏపీ, కర్ణాటక నుంచి 251 మంది రుత్వికులు

సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సీఎం కేసీఆర్ బుధవారం నుంచి మూడు రోజులపాటు జరిగే రాజశ్యామల మహాయాగంలో పాల్గొంటారు. యాగంలో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ దంపతులు మంగళవారంరాత్రి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకకు చెందిన 251 మంది రుత్వికులతో యాగం ప్రారంభం అవుతుంది. మూడ్రోజులపాటు జరిగే యాగంలో ఓవైపు పాల్గొంటూనే మరోవైపు సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలకు కూడా హాజరవుతారు. ఇప్పటికే యాగశాలను నిర్మించగా గణపతి పూజతో బుధవారం యాగం ప్రారంభం అవుతుంది. విశాఖ శారదపీఠం ఫణిశశాంక శర్మ ఆధ్వర్యంలో యాగం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పూర్ణాహుతితో యాగం పరిసమాప్తం కానుంది. మూడోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని, హ్యాట్రిక్ సీఎంగా అయ్యేందుకు ఎలాంటి అటంకాలు ఎదురుకాకుండా ఉండాలని యాగం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

నెలలోగా అడిషనల్ టీవోఆర్ అందజేయండి
యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుపై కేంద్రానికి ఎన్జీటీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన అడిషనల్ టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీవోఆర్)ను నెలలోగా జారీచేయాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్(చెన్నై) ఆదేశించింది. తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ విద్యుదుత్పత్తి కేంద్రానికి 2017, జూన్ 26న కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పర్యావరణ అనుమతులు జారీచేసింది. అయితే విదేశీబొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి పర్యావరణ అనుమతులు పొంది స్వదేశీ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ గతంలో కొందరు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో మారిన టెక్నాలజీకి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన అదనపుచర్యలను నిర్దేశిస్తూ తెలంగాణ జెన్‌కోకు అదనపు టీవోఆర్‌ను జారీచేయాలని అప్పట్లో ఎన్జీటీ పర్యావరణ శాఖను ఆదేశించింది. మళ్లీ కొత్తగా పర్యావరణ అనుమతులు పొందాలని జెన్‌కోకు సూచించింది. ఆలోగా అత్యవసర పనులు మాత్రమే కొనసాగించాలని, యంత్ర పరికరాలను బిగించడం, విద్యుదుత్పత్తిని ప్రారంభించడం వంటి చర్యలు చేపట్టరాదని పేర్కొంది. పర్యావరణ మంత్రిత్వశాఖ అదనపు టీవోఆర్‌ను జారీ చేయకపోవడంతో ఇటీవల ఎన్జీటీని జెన్‌కో ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్.. నెలరోజుల్లో అడిషనల్ టీవోఆర్‌ను అందజేయాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హింసను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్
ఎంపీపై హత్యాయత్నం హేయం: మంత్రి సింగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఓటమి భయం పట్టుకున్న కాంగ్రెస్ నేతలు నైరాశ్యంలోకి వెళ్లారని, అందుకే హింసను ప్రోత్సహిస్తూ రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా తీరును మార్చుకోవాలని హితవు చెప్పారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత గత 10 ఏళ్లలో ఎక్కడా హింసకు తావివ్వలేదని.. అవహేళనలు, అవమానాలు, కవ్వింపులు జరిగినా సంయమనం పాటించినట్లు చెప్పారు. దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి మీద హత్యాయత్నం హేయమైన, అనాగరిక చర్య అని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలోని 14 స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాగం, రావుల, పి.చంద్ర శేఖర్, ఎర్ర శేఖర్‌ల రాకతో జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూరిందని అన్నారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలలోనే నేతలకు న్యాయం జరుగుతుందని తెలుసుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌లో ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కారని, పారాచూట్ నేతలకు టికెట్లిచ్చారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో సర్వే చేస్తున్న సునీల్ కనుగోలు 'కొనుగోలు'గా మారారని ఎద్దేవా చేశారు.

చూసుకుందాం.. దమ్ముంటే రా

▶ మొదటి పేజీ తరువాయి

బీమాతో ఆదుకుంటాం'అని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ రాకతో కామారెడ్డి రూపురేఖలే మారిపోతాయన్నారు. కామారెడ్డి ప్రాంతానికి గోదావరి జలాలు తెచ్చి ఈ ప్రాంత ప్రజల కాళ్లు కడుగుతామన్నారు. ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. 'కామారెడ్డిలో కేసీఆర్ గెలిస్తే ఎవరు చూసుకుంటరని కొందరు అంటున్నరు. ఇక్కడ ప్రత్యేక అధికారిని పెడతం. ఆయన పర్యవేక్షణలో అన్నీ జరుగుతయి. ఈ ప్రాంతానికి చెందిన ఆర్డీవో ముత్యంరెడ్డి గజ్వేల్‌లో ప్రత్యేకాధికారిగా పనిచేసి అక్కడి ప్రజలకు ఎన్నో సేవలు చేశారు. అవసరమైతే ఆయన్నే ఇక్కడ పెట్టుకుని పాలన సాగించుకుంటాం. నాది పక్క నియోజకవర్గం సిరిసిల్ల.. నేను వారం, పదిరోజులకోసారి వస్తూపోతూనే ఉంట. ఇక మీదట కామారెడ్డిలో ఆగుత. ఇక్కడి ప్రజల కష్టాలను నేనే తీరుస్తా'అని కేటీఆర్ అన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్ కూడా ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని పనులు చూస్తారని తెలిపారు. గంప గోవర్ధన్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో శ్రమించారని, ఇంకా సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేటలా అభివృద్ధి జరగాలంటే సీఎం పోటీ చేయాలని గంప గోవర్ధన్ సీఎంను కోరడంతో పోటీకి సిద్ధమయ్యాడన్నారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో ఎక్కడ పోటీ చేసినా కేసీఆర్ విజయం సాధిస్తారని, ఇక్కడ పోటీ చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు.



కామారెడ్డిలో మంత్రి కేటీఆర్ సభకు హాజరైన ప్రజలు

వాళ్లకు ఓటేసి కష్టాలు పడదామా?

కాంగ్రెస్‌కు 11 సార్లు అధికారం ఇస్తే వాళ్లు చేసిందేమి లేదని, ఇప్పుడు ఏదో చేస్తా అంటే ఎవరు నమ్మాలని కేటీఆర్ ప్రశ్నించారు. మూడు గంటల కరెంటు ఇస్తామని రేవంత్‌రెడ్డి, రైతుబంధు వద్దని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, వాళ్లకు ఓటేసి కష్టాలు పడదామా అని అన్నారు. సభలో విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షిస్తాం....

కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త చంద్రశేఖర్ రెడ్డి సస్పెన్షన్‌పై మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... పార్టీ సీనియర్ నాయకుడు తిర్మల్‌రెడ్డిపై దౌర్జన్యం చేసినందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. పార్టీ నాయకుడైనా, కార్యకర్త అయినా సరే తప్పు చేస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

నా ఫోన్ కూడా లక్ష్యంగా చేసుకున్నారు

ప్రభుత్వ అండదండలు కలిగిన కొందరు తన ఫోన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆపిల్ సంస్థ నుంచి తనకు కూడా మెసేజ్ వచ్చిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ ద్వారా తెలిపారు. అయితే ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదన్నారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసు కొని బీజేపీ ఎంతటి నీచానికైనా దిగజారుతుందన్నారు.

ఓర్వలేకే ప్రతిపక్షాలు నీచ రాజకీయం



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో విష్ణువర్ధన్‌రెడ్డి, నాగం, మంత్రి గంగుల తదితరులు

- హత్యారాజకీయాలు, హింసాత్మకచర్యలను ఉపేక్షించం: కేసీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన మాజీమంత్రి నాగం, మాజీ ఎమ్మెల్యే విష్ణు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని, అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ద్వారానే ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి, కొల్లాపూర్ నేత రాంపుల్లారెడ్డి, కరీంనగర్ కాంగ్రెస్ నేత కొత్త జైపాల్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం జరగ్గా, దేవుడి దయతో బతికి బయటపడ్డారని కేసీఆర్ అన్నారు. తెలంగాణలో ఎప్పుడూ ఇలాంటి హేయమైన రాజకీయాలు లేవని, హింసకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. తెలంగాణ అనేక రంగాల్లో అద్భుత ఫలితాలు సాధిస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు.

నాగం చేరికతో పెరిగిన బీఆర్ఎస్ బలం

నాటి తెలంగాణ ఉద్యమంలో జైలుకు కూడా వెళ్లిన మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్ పార్టీ బలం మరింత పెరిగిందని కేసీఆర్ అన్నారు. పాలమూరులో ఉన్న పద్నాలుగు అసెంబ్లీ సీట్లు గెలవడం ఖాయమైందని పేర్కొన్నారు. త్వరలో నాగం ఇంటికి వెళ్లి మరోమారు ఆయన అనుచరులతో భేటీ అవుతానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబసభ్యుడి లాంటి వాడన్నారు. విష్ణు తండ్రి పి.జనార్దన్‌రెడ్డితో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన రాజకీయ భవిష్యత్తు తన బాధ్యత అని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలవి చిల్లర రాజకీయాలు

- ఓ ఎంపీ కత్తిపోట్లకు గురైతే అనుచిత వ్యాఖ్యలు తగదు: మంత్రి హరీశ్‌రావు
- అలాంటి పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరిక
- కొత్త ప్రభాకర్‌రెడ్డికి పరామర్శ



రాంగోపాల్‌పేట (హైదరాబాద్): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కత్తిదాడికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉంటే ప్రతిపక్ష నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి వచ్చి వైద్యులతో మాట్లాడి ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయనతో కొద్దిసేపు ముచ్చటించి ధైర్యం చెప్పారు. అనంతరం హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. కత్తితో పొడవడంతో కత్తి 3 అంగుళాలు లోపలికి వెళ్లగా 4 చోట్ల చిన్నపేగుకు గాయమైందన్నారు. 15 సెం.మీ. చిన్న పేగును తొలగించి, మూడున్నర గంటలపాటు వైద్యులు శస్త్ర చికిత్స చేశారని చెప్పారు. ఇటువంటి సమయంలో సీనియర్ నాయకులు కూడా దీన్ని అపహాస్యం చేసేలా కోడి కత్తి అంటూ మాట్లాడటం దురదృష్టకరమన్నారు. దివాళాకోరు రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వ్యక్తులను నిర్మూలించి రాజకీయాలు చేయాలనుకోవడం తెలంగాణలో ఎప్పుడూ లేదని, తాము అధికారంలో ఉన్న ఏ రోజూ పగతో వ్యవహరించలేదన్నారు. పగతో రాజకీయాలు చేస్తే గతంలో హౌజింగ్ స్కీముల్లో స్కాములు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఓటుకు నోటుకు కేసులో దొరికిన వాళ్లు ఎప్పుడో జైలుకు వెళ్లేవారని చెప్పారు. రాష్ట్రంలో ఏదోరకంగా అల్లర్లు చేయాలని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రతిపక్ష నాయకులు చూస్తున్నారని, ప్రజలు వీటిని గమనించాలని సూచించారు. ప్రచారంలో ఉన్న అభ్యర్థులపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయని, అభ్యర్థులకు భద్రత పెంచాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఈ కేసులో కుట్రకోణం రెండు మూడు రోజుల్లో బయటకు వస్తుందని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించిన వారిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మరో నాలుగు రోజులు ఐసీయూలో

మరో నాలుగు రోజుల పాటు ప్రభాకర్‌రెడ్డిని ఐసీయూలోనే ఉంచి చికిత్స అందించాల్సి ఉంటుందని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి హెడ్ డాక్టర్ విజయ్‌కుమార్, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు ప్రసాద్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఆయన స్పృహలోనే ఉన్నాడని, మరో మూడు నాలుగు రోజులు గడిస్తేనే ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందో లేదో చెప్పగలమన్నారు.

ఎంపీకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితేంటి: భట్టి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పాలనలో ఎంపీలకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యుడికే సరైన భద్రత ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంటే అసలు రాష్ట్రంలో శాంతిభద్రతలున్నాయా అనే అనుమానం కలుగుతోందని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దుబ్బాక ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని, అదే సమయంలో అధికార పార్టీ దుబ్బాక బంద్‌కు పిలుపునివ్వడాన్ని కూడా తాము ఖండిస్తున్నామని తెలిపారు. 'దర్యాప్తు సంస్థలను, పోలీసులను మీ దగ్గర పెట్టుకుని దాడికి నిరసనగా బంద్ చేస్తున్నట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉంది. బంద్ దేని కోసం.. ఎవరిపై బంద్ చేస్తున్నారు? మీ పాలనపై మీరే బంద్ చేసుకుంటున్నారా.. బంద్ పేరుతో బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారా'అని ప్రశ్నించారు. నిందితుడిని పట్టుకున్న తర్వాత ఇందుకు సంబంధించిన నిజానిజాలను విచారించి ప్రజలకు తెలియజేయాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యతను విస్మరించి ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేయడం తగదని ఆ ప్రకటనలో భట్టి హితవు పలికారు. దాడి ఘటనపై విచారణ జరిపి నిజానిజా లను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ భౌతిక దాడులను ప్రోత్సహించదని స్పష్టం చేశారు.

తెలంగాణ మోడల్ దేశానికి దిక్సూచి

▶ మొదటి పేజీ తరువాయి

ఆహ్వానం మేరకు వెళ్లిన కవిత 'ఎక్స్‌ప్లోరింగ్ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్: ది తెలంగాణ మోడల్' అనే అంశంపై జరిగిన సదస్సులో తెలంగాణ మోడల్‌పై కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ మోడల్ కేవలం ఆర్థిక గణాంకాలు మాత్రమే కాదని, మారిన తెలంగాణ జీవన స్థితిగతులకు అవి అద్దం పడతాయని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం పాటిస్తూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ముందుకు వెళ్తోందన్నారు.

మహిళా రిజర్వేషన్ల చట్టం పోస్ట్ డేటెడ్ చెక్కు

పార్లమెంటు ఆమోదించిన తర్వాత కూడా మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావడం లేదని కవిత ఆక్షేపించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు పోస్ట్ డేటెడ్ చెక్కు లాంటిదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించిందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నుంచే చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్లు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. కేంద్రానికి చిత్తశుద్ధి లేదని, అన్ని పార్టీలు డిమాండ్ చేసినా ఓబీసీ కోటా కూడా కల్పించలేదని కవిత తప్పుబట్టారు.

నవ తెలంగాణలో సమూల సంస్కరణలు

సుదీర్ఘ కాలంపాటు సాగిన ప్రత్యేక తెలంగాణ పోరాటం కేసీఆర్ ప్రవేశం తర్వాత కీలక మలుపులు తిరిగి లక్ష్యాన్ని సాధించిందని కవిత పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని 10 జిల్లాల్లో 9 వెనుకబడిన జిల్లాలు ఉండేవని, రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉండేదని ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సమూలమైన సంస్కరణల ద్వారా పూర్తిగా ఆ పరిస్థితులను మార్చివేశారని స్పష్టం చేశారు. తలసరి ఆదాయం పెరుగుదలలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మించి దూసుకువెళ్తోందని, అందరికీ సమాన సంపద విధానాన్ని కేసీఆర్ అవలంబిస్తున్నారన్నారు. తెలంగాణలో వ్యవసాయం పండుగలా మారిందని, ధరణి పోర్టల్ ద్వారా భూరికార్డులను కంప్యూటరీకరణ చేపట్టి విప్లవాత్మక మార్పుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కవిత వెల్లడించారు. రికార్డు సమయంలోనే ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంను పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో తెలంగాణ ఉందని చెప్పారు. యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి బహుళజాతి కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేశాయన్నారు. వెనుకబడిన వర్గాల వారి విద్యకు అత్యంత ప్రాధాన్యతతో పాటు మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నామని కవిత చెప్పారు.

క్లుప్తంగా...

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు

ప్రభాకర్‌రెడ్డిని పొడిచింది ఆ పార్టీ వారే: కోమటిరెడ్డి



జడ్చర్ల: మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను రూ.4.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి అప్పుల కుప్పగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన జడ్చర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఎకరాకు రూ.15 లక్షలతో పాటు డబుల్ బెడ్రూం ఇల్లు, అదనంగా మరో లక్ష ఇచ్చారని, కానీ ఉదండాపూర్ నిర్వాసితులకు ఎకరాకు రూ.6 లక్షలు ఇచ్చారని విమర్శించారు. జడ్చర్ల సభలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కేసీఆర్‌ను కోరిన కోరికలు విని తాము నవ్వుకున్నామన్నారు. బస్సు కిరాయి లేని మంత్రి జగదీశ్‌రెడ్డి రూ.10 వేల కోట్లకు పడగలెత్తాడంటే అవినీతిని బేరీజు వేసుకోవాలని సూచించారు. దళితబంధు, బీసీబంధు, రైతుబంధు అమలు చేయాలని తాము కోరితే.. ఆపాలని తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. సర్వేల ఆధారంగా టికెట్లు ఇచ్చామని, సోదరుడిని హత్య చేసిన వ్యక్తిని బీఆర్‌ఎస్‌లో చేర్చుకోవడం అంటే ఆ పార్టీకి పోయేకాలం వచ్చినట్లేనని ఎర్ర శేఖర్‌నుద్దేశించి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. జడ్చర్లలో అనిరుధ్‌రెడ్డి గెలుపు సునాయాసమని చెప్పారు.

బీఆర్‌ఎస్ ఒత్తిడిలో ఎన్నికల యంత్రాంగం

- సీఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎన్నికల యంత్రాంగం బీఆర్‌ఎస్ పార్టీ ఒత్తిడి మేరకు పనిచేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వెల్లడించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రగతిభవన్‌లో బీఫారాల పంపిణీ గురించి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై తాము ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే కనీసం జిల్లా ఎన్నికల అధికారి నుంచి నోటీసులు కూడా జారీ చేయలేదన్నారు. సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా, ఎలాంటి సంబంధం లేని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ నుంచి వివరణ తీసుకుని సంతృప్తి చెందామంటూ ఎన్నికల సంఘం తమకు సమాచారమివ్వడం ఏ మేరకు సమంజసమని నిరంజన్ ప్రశ్నించారు.

అధికారం వస్తే మంచి గుర్తింపు

మెట్టు సాయికి రేవంత్ భరోసా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఫిషర్‌మెన్ సెల్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గోషామహల్ అసెంబ్లీ టికెట్‌ను ఆశించి భంగపడిన సాయికుమార్‌కు రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని మత్స్యకార సామాజిక వర్గానికి తగిన బాధ్యతలు అప్పజెబుతామని కూడా రేవంత్ భరోసా ఇచ్చారు. ఇప్పటికే మెట్టు సాయితో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్‌లు సమావేశమయ్యారు. టికెట్ ఇవ్వకపోవడానికి గల కారణాలను ఆయనకు వివరించి.. గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతారావు గెలుపునకు సహకరించాలని కోరారు.

హ్యాకింగ్‌లకు భయపడేది లేదు: రేవంత్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: తమ ఫోన్లను అక్రమంగా హ్యాక్ చేయడం హక్కులకు భంగం కలిగించడమేనని, ఇలాంటి చర్యలతో తాము భయపడేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. తుదిశ్వాస వరకు తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తామని చెప్పారు. ఐఫోన్లలోని సమాచారంపై దాడి జరిగే అవకాశముందని యాపిల్ కంపెనీ నుంచి వచ్చిందంటూ ఓ మెసేజ్‌ను రేవంత్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎలాంటి పరిణామాలు జరిగినా తెలంగాణ ప్రజల కోసం రాజీలేని తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డిపై ఈడీ విచారణ జరపాలి: విజయ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ సీట్ల అమ్మకాలపై ఈడీ అధికారులకు స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థి కురువ విజయ్‌కుమార్ అన్నారు. సీట్ల అమ్మకాలతో పెద్ద ఎత్తున మనీల్యాండరింగ్‌కు పాల్పడిన రేవంత్‌రెడ్డిపై వెంటనే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు అధికారుల వైఖరిని నిరసిస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై ఈడీ విచారణ జరపకపోతే బీజేపీకి రేవంత్ టచ్‌లో ఉన్నారని భావించాల్సి వస్తుందన్నారు. వారం రోజుల్లోపు ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోతే అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని విజయ్‌కుమార్ తెలిపారు. పటాన్‌చెరువు సీటును రూ.100 కోట్లకు బేరం పెట్టారని, రేవంత్ పేరుపై డీడీలు తీశామని వాటికి సమాధానం చెప్పకుండా పీసీసీ అధ్యక్షుడు ముఖం చాటేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జోక్యం చేసుకుని సమగ్ర దర్యాప్తు సాగించాలన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజా మద్దతు



మంగళవారం కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన పాలమూరు ప్రజాభేరి సభకు హాజరైన ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

జీవితంలో ఎప్పటికీ మరచిపోలేను. తెలంగాణ ప్రజలు ఉద్యమం చేస్తే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్ర ఫలితాలు ప్రజలకు అందుతాయనుకుంటే, పదేళ్లలో ఈ రాష్ట్రంలో ఒక్క కుటుంబానికే లాభం చేకూరింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం. ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తాం. కేసీఆర్ ప్రజల వద్ద ఎంత దోచుకున్నారో అంతా కక్కిస్తాం. ఆ సొమ్మును ప్రజల జేబుల్లో వేస్తాం..' అని రాహుల్ చెప్పారు.

బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటే..

'రాష్ట్రంలోని ప్రజలు బీజేపీకి ఓటేసినా, ఎంఐఎం పార్టీకి వేసినా బీఆర్‌ఎస్‌కు వేసినట్టే. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం కలిసే పని చేస్తున్నాయి. లోక్‌సభలో బిల్లుల విషయంలో బీజేపీకి ఇక్కడి సీఎం పూర్తి మద్దతు ఇచ్చారు. విపక్షాలకు చెందిన అందరు సీఎంలపై సీబీఐ, ఈడీ, విజిలెన్స్ దాడులు జరుగుతాయి. కానీ తెలంగాణ సీఎంపై ఎందుకు దాడులు ఉండవో అందరూ గ్రహించాలి. ఇంకొక వైపు బీజేపీకి ఎక్కడ అవసరమో అక్కడ ఎంఐఎం మద్దతు తెలుపుతుంది. ఈ ముగ్గురి లక్ష్యం కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా చేయడమే. కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను, 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం..' అని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు.

మా బలం పెరగడంతో భయపెడుతున్నారు..

'ప్రస్తుతం ప్రజల తెలంగాణ, దొరల తెలంగాణ మధ్య సమరం నడుస్తోంది. ఒక వైపు సీఎం కేసీఆర్ కుటుంబం, మరోవైపు తెలంగాణ యావత్ సమాజం ఉంది. దొరల తెలంగాణలో ఏం జరుగుతుందో మనకందరికీ తెలుసు. రాష్ట్రంలో దొరల తెలంగాణ కావాలా? ప్రజల తెలంగాణ కావాలా? అన్నది ప్రజలు నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలం పెరిగిపోయింది. దీంతో పార్టీ శ్రేణులపై కుట్రలు చేస్తూ భయపెడుతున్నారు. కానీ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దపులిలా ఎవరికీ భయపడరని నాకు తెలుసు..' అని చెప్పారు.

ధరణితో 20 లక్షల మందికి అన్యాయం..

'కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాల కాలంగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించాయి. నాగార్జునసాగర్, జూరాల, సింగూరు తదితర ప్రాజెక్ట్‌లు కట్టాయి. ఆ ప్రాజెక్టులను చూడండి, ఈ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ చూడండి. ఈ ప్రభుత్వం ప్రజల నుంచి లక్షలాది కోట్లను దోపిడీ చేసింది. బ్యారేజీలు, బ్రిడ్జిలు కూలిపోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పెద్ద మోసం. మా కాంగ్రెస్ ప్రభుత్వం దళితులు, ఆదివాసీలు, గిరిజనులకు భూములు ఇస్తే వాటిని ఇక్కడి సీఎం లాక్కుంటున్నారు. కంప్యూటరైజేషన్ పేరుతో ధరణి పోర్టల్ ద్వారా భూములను లాక్కునే కుట్రకు తెరలేపారు. ధరణి వల్ల తెలంగాగాణలో 20 లక్షల మందికి అన్యాయం జరిగింది. ఒక కుటుంబానికి, మంత్రులు, ఎమ్మెల్యేలకే లాభం చేకూరింది..' అని రాహుల్ ఆరోపించారు.

ప్రజల కలలను నెరవేరుస్తాం..

'తెలంగాణ ప్రజల కలలను కాంగ్రెస్ ముమ్మాటికీ నెరవేరుస్తుంది. కర్ణాటక, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ రాష్ట్రాల్లో మేం అధికారంలోకి వచ్చిన వెంటనే, మొదటి కేబినెట్ సమావేశంలోనే హామీలు అమలు చేశాం. ఇక్కడ కూడా మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తాం. ప్రతి మహిళ ఉచితంగా తెలంగాణ మొత్తం బస్సులో ప్రయాణం చేయొచ్చు. రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు అందజేస్తాం. ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5 లక్షల సాయం చేస్తాం. గృహజ్యోతి స్కీం కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందజేస్తాం. విద్యాభరోసా కింద విద్యార్థుల చదువు కోసం రూ.5 లక్షల కార్డు ఇస్తాం. చేయూత కింద రూ.4,000 పెన్షన్ అందజేస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల బీమా అమలు చేస్తాం..' అని రాహుల్ హామీ ఇచ్చారు. ఈ సభకు తన సోదరి ప్రియాంకా గాంధీ రావాల్సి ఉన్నా.. జ్వరం కారణంగా రాలేకపోయిందని, అందుకే తాను వచ్చానని చెప్పారు. తెలంగాణతో తమది రాజకీయ బంధం కాదని, కుటుంబ అనుబంధమని పేర్కొన్నారు.

మనవళ్లు, బంధువుల కోసమేనా మూడోసారి సీఎం?: రేవంత్



తన మనవళ్లు, బంధువుల కోసమే మూడోసారి అధికారం ఇవ్వాలంటూ సీఎం కేసీఆర్ అడుగుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్ సీఎం అయ్యాక కొడుకు, అల్లుడిని మంత్రులుగా చేశారని, మూడోసారి ముఖ్యమంత్రి అయితే చేనులో పడి ఇష్టారాజ్యంగా మేస్తారని ఆరోపించారు. కాంగ్రెస్ రైతుబంధు ఇవ్వదని ప్రచారం చేస్తున్నారని, అయితే తాము కౌలు రైతులతో సహా ప్రతి ఒక్క రైతుకూ ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థిపై జరిగిన దాడిని చిల్లర పంచాయతీగా అభివర్ణించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 14 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్‌ను కృష్ణానదిలో ముంచాలి: భట్టి



నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో దశాబ్దకాలంగా చుక్క నీరు కూడా అదనంగా ఇవ్వని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కృష్ణానదిలో ముంచాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రజల సంపదను ప్రజలకు పంచడానికి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందని, మన భవిష్యత్ కోసం కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సభలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వి.హన్మంతరావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాహుల్‌కు ఠాక్రే, రేవంత్ స్వాగతం పలికారు. అనంతరం హెలికాప్టర్‌లో రాహుల్ కొల్లాపూర్‌కు బయలుదేరారు.

రాహుల్ పర్యటనలో మార్పు

- నేడు కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్‌లో ప్రచారం
- రేపటి షెడ్యూల్ వాయిదా
- నామినేషన్లు ముగిశాక మళ్లీ రాష్ట్రానికి



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటనలో మార్పులు జరిగాయి. వాస్తవానికి ఈనెల 1, 2 తేదీల్లో ఆయన రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించాల్సి ఉన్నా ఒకరోజు ముందుగానే వచ్చారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం కొల్లాపూర్‌లో జరిగిన పాలమూరు ప్రజాభేరి సభకు ఆయన సోదరి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ హాజరుకావాల్సి ఉంది. రాహుల్ ఢిల్లీలో జరిగే కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశానికి హాజరై బుధవారం మధ్యాహ్నానికి రాష్ట్రానికి రావాల్సి ఉంది. కానీ, ప్రియాంకకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో రాహుల్ సీఈసీ సమావేశాన్ని రద్దు చేసుకుని కొల్లాపూర్ బహిరంగ సభకు హాజరయ్యారు. అనంతరం రాత్రికి హైదరాబాద్‌లో బస చేశారు. బుధవారం కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్ పట్టణాల్లో రాహుల్ ప్రచారం నిర్వహించనున్నారు. తొలుత కల్వకుర్తి సభలో పాల్గొని, ఆ తర్వాత జడ్చర్లలో జరిగే కార్నర్ మీటింగ్‌కు హాజరవుతారు. అక్కడి నుంచి షాద్‌నగర్‌లో పాదయాత్ర చేసి అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌కు హాజరవుతారు. తర్వాత ఢిల్లీకి తిరుగుపయనమవుతారు. కాగా, రాష్ట్రంలో ముందుగా నిర్ణయించిన 2వ తేదీ షెడ్యూల్‌ను రాహుల్ వాయిదా వేసుకున్నారు. మూడో తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ ప్రక్రియ ముగిశాక మరో మారు రాహుల్ రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు చెప్పాయి.

రాహుల్ పర్యటన ముగిశాకే జాబితా

రేపు లేదా ఎల్లుండి అభ్యర్థుల ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా కసరత్తు పెండింగ్‌లో పడింది. మంగళవారం ఈ కసరత్తు పూర్తవుతుందని భావించినప్పటికీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాజస్తాన్ వ్యవహారాల్లో బిజీగా ఉండటం, ప్రియాంకగాంధీకి అస్వస్థత కారణంగా ఆమెకు బదులుగా కొల్లాపూర్ బహిరంగ సభకు రాహుల్‌గాంధీ హాజరుకావడంతో జాబితాపై ఎలాంటి చర్చలు జరగలేదు. బుధవారం రాహుల్‌గాంధీ తన పర్యటన ముగించుకొని ఢిల్లీకి తిరిగొచ్చాకే ఈ జాబితాను ఖరారు చేస్తారని ఏఐసీసీ వర్గాల సమాచారం. బుధవారం రాత్రి లేదా గురువారం తుది చర్చలు జరుగుతాయని, అనంతరం గురువారం రాత్రి లేదా శుక్రవారం జాబితా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈలోగానే కమ్యూనిస్టులతో సీట్ల సర్దుబాటు అంశంపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కాగా బుధవారం బీజేపీ పార్లమెంటరీ బోర్డు భేటీ జరుగుతోంది. ఈ భేటీలోనూ అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చలు జరగనున్నాయి. కాగా, బీజేపీ జాబితా వచ్చేంతవరకు తుది జాబితాను ప్రకటించకుండా వ్యూహాత్మకంగానే కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్న చర్చ సైతం జరుగుతోంది.

టీడీపీ కండువాతో కాంగ్రెస్ ప్రచారం

- ఖమ్మం టీడీపీ కార్యాలయానికి వెళ్లిన తుమ్మల... ఎన్టీఆర్ నిబద్ధతను కొనసాగిస్తానని వెల్లడి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో అడుగుపెట్టారు. టీడీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం చంద్రబాబుకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించగా, వారి ఆహ్వానం మేరకు తుమ్మల టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు జై తుమ్మల అంటూ నినదిస్తూ కాంగ్రెస్ కండువా కప్పుకుని ఉన్న ఆయనకు టీడీపీ కండువా వేశారు. టీడీపీ పార్టీ జెండాలతో కార్యాలయంలోకి స్వాగతం పలికారు. అనంతరం తుమ్మల కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని ఈ స్థాయికి తెచ్చిన భవనం ఇదని చెప్పారు. భవిష్యత్‌లోనూ ఎన్టీఆర్ క్రమశిక్షణ, నిబద్ధతను కొనసాగిస్తానని తెలిపారు. చంద్రబాబు తాత్కాలిక బెయిల్‌పై బయటకు వచ్చిన సందర్భంగా సంతోషంలో భాగస్వామ్యం కావాలని ఇక్కడికి వచ్చానన్నారు. ఇదే కేరింతలతో 30 రోజుల పాటు తన కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని టీడీపీ శ్రేణులను కోరారు. ఏ పార్టీలోకి వెళ్లినా టీడీపీని బతికించాలని తపన పడిన నేతలు తన గెలుపునకు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. తుమ్మల వెంట మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ కార్పొరేటర్ రావూరి కరుణ, కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, మిక్కిలినేని నరేంద్ర ఉన్నారు.

అధిష్టానం పునరాలోచన చేయాలి



ఇబ్రహీంపట్నం: ప్రజా జీవితంలో నిమగ్నమై పని చేస్తున్న తనకు కాంగ్రెస్ అధిష్టానం బీ ఫాం ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తన అనుచరులు, పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురయ్యారు. రాజకీయం తనకు దైవకార్యమని... ప్రజలే దేవుళ్లు అని నమ్మేవాడినన్నారు. కుళ్లు, కుట్రలు, కుతంత్రాలు తనకు తెలియవని పేర్కొన్నారు. పార్టీ టికెట్ దక్కకపోవడం ఆవేదనకు గురి చేసిందన్నారు. ఇప్పటికైనా అధిష్టానం పునారాలోచన చేసి బీ ఫాం ఇవ్వాలని అభ్యర్థించారు.

ఫైబర్ ఇన్.. షుగర్ ఔట్!

- ఆహారంలో తగిన పీచు పదార్థాలుంటే చక్కెర వ్యాధి నియంత్రణలోకి..
- 'స్టార్' అధ్యయనం వెల్లడి.. 'ఇండియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ ప్రాక్టీస్'లో ప్రచురితం

సాక్షి, హైదరాబాద్: ఆహారంలో పీచు పదార్థాలను సరిపడా తీసుకొనే వారిలో మధుమేహ వ్యాధి నియంత్రణ సులభమని తాజా అధ్యయనం తేల్చింది. సర్వే ఫర్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫైబర్ రిచ్ న్యూట్రిషన్ డ్రింక్(స్టార్) పేరిట నిర్వ హించిన అధ్యయనం ఫలితాలు తాజాగా ఇండియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ ప్రాక్టీస్‌లో ప్రచురితమయ్యాయి.

అతిగా తిండికి చెక్...

మధుమేహం బాధితులు కార్బోహైడ్రేట్లు, చక్కెరల వినియోగాన్ని తగ్గించడమే కాకుండా వారి ఆహారంలో పీచుపదార్థాలు పెంచుకోవడం కూడా అవసరమే. ఆహారంలో పీచుపదార్థాలను భాగం చేసుకుంటే అది అతిగా తినడాన్ని నివారిస్తుంది. అలాగే జీర్ణక్రియ సమయంలో పేగుల నుంచి రక్తంలోకి చక్కెర శోషణ రేటును తగ్గించేందుకు సహాయపడుతుంది. తద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయిని తగ్గిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని తాజా అధ్యయనం నిర్ధారించింది. ఈ అధ్యయనం కోసం టైప్–2 మధుమేహంతో బాధపడుతున్న 3,042 మంది వ్యక్తులను ఫైబర్ తీసుకున్న/ తీసుకోని వారిగా విభజించి 3 నెలలపాటు వారి రక్తంలో చక్కెర స్థాయిలను పరిశీలించారు. ఆహారంలో తగినన్ని పీచుపదార్థాలు తీసుకున్న వారిలో హెచ్‌బీఏ1సీ స్థాయిలు 8.04 నుంచి 7.32కి తగ్గడంతో పాటు 3 నెలల వ్యవధిలో సుమారు 3 కిలోల మేర బరువు తగ్గారు. అలాగే 83% మంది తిన్నాక చాలా సేపటి వరకు పొట్ట నిండుగా ఉన్న అనుభూతి పొందారని సర్వే వెల్లడించింది. అలాగే 93% మందిలో చురుకుదనం పెరిగినట్లు అధ్యయ నం గుర్తించింది. తగినంత ఫైబర్ తీసుకోని రోగు ల్లో ఎటువంటి మెరుగుదల నమోదు కాలేదని సర్వే గుర్తించింది. దేశంలో మధుమేహం ఉన్నవారు రోజుకు తీసుకోవాల్సిన కనీస ఫైబర్ స్థాయి 25 గ్రాములుకాగా తీసుకుంటున్న కనీస స్థాయి 15 గ్రాములుగానే ఉంటోందని అధ్యయనం వెల్లడించింది.

రేవంత్‌వి దురహంకార వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీలో మూడు పిల్లర్లు కుంగిపోవడంపై ఈఎన్సీ మురళీధర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దురహంకారపూరిత వ్యాఖ్యలు చేశారని, తక్షణమే తెలంగాణ ఇంజనీర్లకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాం ప్రసాద్‌రెడ్డి, తన్నీరు వెంకటేశం డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి నోటి దురుసుతనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతాంగానికి సాగు, తాగునీరు అందిస్తున్న ఇంజనీర్లను కించపరచడం భావ్యమా? అని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇంజనీర్లను అవమానపరుస్తూ వ్యాఖ్యలు, పోస్టులు వారిని మానసికంగా కుంగిపోయేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్లపాలైన నిరుద్యోగులు

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం కేటాయించాల్సి ఉన్నా తెలంగాణలో అలా జరగడం లేదని, కేసీఆర్ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్ల పాలయ్యారని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడు తూ కేజీ టూ పీజీ అని మోసం చేశారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో చేతులెత్తేశారని తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వలేకపోతున్నారని,స్కూళ్లలో డ్రాపవుట్లు పెరిగాయని వివరించారు.

అమెరికాలో ఖమ్మం యువకుడిపై హత్యాయత్నం

- జిమ్ నుంచి వస్తుండగా కత్తితో దాడి చేసిన దుండగుడు
- తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



ఖమ్మంక్రైం: అమెరికాలోని చికాగోకు ఉన్నత విద్య నిమిత్తం వెళ్లిన ఓ యువకుడిపై గుర్తుతెలియని దుండగుడు హత్యాయత్నం చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఖమ్మంలోని బుర్హాన్‌పురంలో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుచ్చా రామ్మూర్తి కుమారుడు వరుణ్ చికాగోలో ఉంటూ ఎంఎస్ చదువుతున్నాడు. ఈ నెల 29న జిమ్ నుంచి బయటకు వస్తున్న వరుణ్‌పై అకస్మాత్తుగా ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన వరుణ్ రక్తపు మడుగులో పడిపోగా స్థానికుల సమాచారంతో పోలీసులు వచ్చి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. అమెరికాలో నివసిస్తున్న వారి బంధువు సాయివర్ధన్ ఫోన్ చేసి వరుణ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. నిందితుడు ఆండ్రేడ్ జోర్డాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, తాము అమెరికా వెళ్లేందుకు సహకరించాలని మంత్రి పువ్వాడ అజయ్‌ను కోరినట్లు రామ్మూర్తి తెలిపారు.

గోండ్లు, లంబాడీల మధ్య వైరం పెంచుతారా?

కాంగ్రెస్ టికెట్ల కేటాయింపుపై గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధుల ఆగ్రహం

పంజగుట్ట (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపుతో గోండ్లు, లంబాడీల మధ్య వైరం మరింత పెరిగేలా ఉందని గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్, ఏఐసీసీ ఆదివాసీ ప్రతినిధి డాక్టర్ రవి నాయక్, జేఏసీ ప్రతినిధి అశోక్ రాథోడ్‌లు మాట్లాడారు. లంబాడీలపై రేవంత్‌రెడ్డి పెంచుకున్న కక్ష ఆయనకు తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 లక్షల జనాభా ఉన్న లంబాడీలకు 3 స్థానాలు ప్రకటించి, 4 లక్షల జనాభా ఉన్న గోండ్లు, కోయలకు మిగిలినవి కేటాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డి పొద్దున పార్టీలో చేరితే రాత్రికి ఆయన పేరు లిస్టులో ఉంటుందని, ఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్న బెల్లయ్య నాయక్, రాములు నాయక్, బలరాం నాయక్‌లకు మాత్రం టికెట్లు దక్కవని విమర్శించారు.

కాంగ్రెస్-సీపీఎం పొత్తు చిత్తు!

▶ మొదటి పేజీ తరువాయి

జత కట్టాలని సీపీఐ, సీపీఎం నిర్ణయించుకున్నాయి. అందుకు కాంగ్రెస్ కూడా సముఖత వ్యక్తం చేసింది. మొదట్లో సీపీఐ, సీపీఎం చెరో 5 స్థానాలు కాంగ్రెస్‌ను కోరగా ఆ తర్వాత జరిగిన చర్చల్లో మూడు చొప్పున సీట్లు ఇవ్వాలని అడిగాయి. చివరకు ఆ సంఖ్య రెండేసి స్థానాల వద్దకు చేరుకుంది. సీపీఐ కొత్తగూడెం, మునుగోడు అడగ్గా సీపీఎం మిర్యాలగూడతోపాటు భద్రాచలం లేదా పాలేరు స్థానాలను కోరింది. కానీ కాంగ్రెస్ మాత్రం వారు కోరిన స్థానాల్లో మార్పులు చేసింది. సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు, సీపీఎంకు మిర్యాలగూడ, వైరా ఇస్తామని ప్రతిపాదించినట్లు లెఫ్ట్ వర్గాలు తెలిపాయి. చివరకు సీపీఎంకు వైరా స్థానం కేటాయించే విషయంలో కాంగ్రెస్ పేచీ పెట్టింది. ఆ స్థానం ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో మిర్యాలగూడ, వైరా స్థానాలు ఇస్తేనే పొత్తు ఉంటుందని సీపీఎం తేల్చిచెప్పింది.

సీపీఐ దారెటు?

సీపీఐతో పొత్తు విషయంలో కాంగ్రెస్ ఇప్పటివరకు ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఆ పార్టీకి కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగినా ఇప్పటివరకు కాంగ్రెస్ అధికారిక ప్రకటన చేయకపోవడంపై సీపీఐ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒంటరి పోరుకు వెళ్లాలని సీపీఎం నిర్ణయించగా సీపీఐ మాత్రం ఎటూ తేల్చుకోలేకపోతుంది. కాంగ్రెస్‌తో ఎలాగైనా కలిసి ముందుకు సాగాల్సిందేనని, అసెంబ్లీలో అడుగు పెట్టాల్సిందేనని సీపీఐకి చెందిన ఒక కీలక నేత పట్టుబడుతున్నట్లు సమాచారం.

'లెఫ్ట్'ఉమ్మడి పోరు యోచన...

ఒకవేళ సీపీఐతోనూ కాంగ్రెస్ పొత్తు కుదరకుంటే లెఫ్ట్ పార్టీలు ఉమ్మడిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ మేరకు లెఫ్ట్ పార్టీల ఉమ్మడి సమావేశం నేడు లేదా రేపు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సైతం బుధవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోనుందని చెబుతున్నారు. లెఫ్ట్ పార్టీలు ఉమ్మడి పోరుకు దిగితే 30 సీట్లలో పోటీకి అవకాశం ఉన్నట్లు ఆయా వర్గాలు చెబుతున్నాయి.



అవగాహన చేసుకోకుండానే ఒకదాన్ని విశ్వసించమని
ఒత్తిడి చేయడం రాజకీయం అవుతుంది గానీ, ఆధ్యాత్మికం,
బౌద్ధికం కాజాలదు.
– బౌద్ధ ధర్మం

ఫోకస్

సాక్షి
బుధవారం, 1 నవంబర్ 2023

దివ్యమైన పతకాల పంట

భారతీయ క్రీడా రంగానికి ఇది కనివిని ఎరుగని సీజన్. ఇటీవలే ఏషియన్ గేమ్స్‌లో పతకాల శతకం సాధించిన భారత్ తాజాగా ఏషియన్ పారా గేమ్స్‌లోనూ శతాధిక పతకాలను చేజిక్కించుకుంది. మునుపెన్నడూ లేని విధంగా ఆసియా పారా క్రీడోత్సవాల్లోనూ శతాధిక పతకాలు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంబరాలు జరుపుకొనే మరో సందర్భం అందించింది. విధి క్రూరంగా వ్యవహరించినా, ఆత్మస్థైర్యం కోల్పోకుండా ముందుకు సాగితే విజయానికి ఆకాశమే హద్దు అనడానికి తాజా ఆసియా పారా క్రీడోత్సవాల్లో పాల్గొన్న మన 303 మంది ఆటగాళ్ళ విజయగాథలే ఉదాహరణ. ఈ పారా గేమ్స్‌లో భారత్ అరడజను ప్రపంచ రికార్డులు, 13 ఏషియన్ రికార్డులు నెలకొల్పింది. క్రీడల్లోనూ భారత్ బలంగా ఎదుగుతున్న క్రమానికి ఇది మరో మచ్చుతునక. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్య దేశంగా నిలవాలని ఆశిస్తున్న భారత్‌కు ఈ విజయాలు అతి పెద్ద ఉత్ప్రేరకాలు.

ఈసారి ఆసియా క్రీడోత్సవాల్లో భారత బృందం నినాదం 'ఇస్ బార్ సౌ పార్'. అలా వంద పతకాల లక్ష్యాన్ని దాటడమే ఈసారి లక్ష్యమనే నినాదంతో ముందుకు దూకిన భారత్ 107 పతకాలతో ఆ గోల్ సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సాగిన ఏషియాడ్‌తో పాటు, ఆ వెంటనే అదే వేదికగా సాగిన ఏషియన్ పారా గేమ్స్‌లోనూ భారత్ 111 పతకాలతో మరోసారి ఈ శతాధిక విన్యాసం చేయడం విశేషం. ఏషియన్ గేమ్స్‌లో మనవాళ్ళు కనివిని ఎరుగని రీతిలో పతకాల సాధన చేయడంతో, అందరి దృష్టీ ఈ పారా అథ్లెట్ల మీదకు మళ్ళింది. మొత్తం 191 మంది పురుష అథ్లెట్లు, 112 మంది స్త్రీ అథ్లెట్లు 17 క్రీడా విభాగాల్లో మన దేశం పక్షాన ఈ క్రీడా సంరంభంలో పాల్గొన్నారు. మునుపెన్నడూ పారా క్రీడోత్సవాల్లో లేని విధంగా 29 స్వర్ణాలు, 31 రజతాలు, 51 కాంస్యాలు దేశానికి తెచ్చిపెట్టారు. పతకాల పట్టికలో చైనా, ఇరాన్, జపాన్, దక్షిణ కొరియా తర్వాత అయిదో స్థానంలో మన దేశాన్ని నిలిపారు.

నిజానికి, భారత క్రీడా వ్యవస్థలో పారా క్రీడల పట్ల దీర్ఘకాలికంగా ఉదాసీనత నెలకొంది. ఉదాహరణకు, 2008 నాటి బీజింగ్ పారాలింపిక్స్‌లో మనం అయిదుగురు అథ్లెట్లనే పంపాం. రిక్తహస్తాలతో ఇంటిదారి పట్టాం. అయితే, ఎనిమిదేళ్ళ క్రితం రియోలోని క్రీడాసంరంభంలో 19 మంది భారతీయ పారా ఒలింపియన్లు పాల్గొని, 2 స్వర్ణాలు సహా మొత్తం 4 పతకాలు ఇంటికి తెచ్చారు. అక్కడ నుంచి పరిస్థితులు క్రమంగా మారాయి. రెండేళ్ళ క్రితం టోక్యో పారాలింపిక్స్‌లో మనవాళ్ళు 5 స్వర్ణాలు సహా 19 మెడల్స్ గెలిచారు. అలా పారా అథ్లెట్లకూ, క్రీడలకూ ప్రాచుర్యం విస్తరించింది. ఏషియన్ పారా గేమ్స్‌లోనూ 2018లో భారత్ 72 పతకాలు గెల్చి, తొమ్మిదో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. అదే ఈసారి హాంగ్‌జౌలో మనవాళ్ళు ఏకంగా 111 పతకాలు సాధించి, అయిదో స్థానానికి ఎగబాకారు. రానున్న ప్యారిస్ పారాలింపిక్స్ పట్ల ఆశలు పెంచారు. చైనా గెల్చిన 521 పతకాలతో పోలిస్తే, మన సాధన చిన్నదే కావచ్చు. అయితే, దేశంలో అథ్లెట్లతో పాటు పారా అథ్లెట్లూ పెరుగుతూ, క్రీడాంగణాన్ని వెలిగిస్తున్న వైనం మాత్రం అవిస్మరణీయం.


ఈ పారా – అథ్లెట్ల భారత బృందం సాధించిన 111 పతకాలకూ వెనుక 111 స్ఫూర్తి కథనాలున్నాయి. చేతులు లేకపోతేనేం, విలువిద్యలో దిట్ట అయిన కశ్మీర్‌కు చెందిన 16 ఏళ్ళ శీతల్ దేవి తన పాదాలతోనే బాణాన్ని సంధించి, లక్ష్యాన్ని ఛేదించి, పతకం సాధించిన తీరు వైరల్ అయింది. నిరాశలో కూరుకున్న కోట్లమందికి ఆమె సరికొత్త స్ఫూర్తి ప్రదాత. అలాగే, ఒకప్పుడు రెజ్లర్‌గా ఎదుగుతూ, రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు పోగొట్టుకున్న సుమిత్ అంతిల్ మరో ఉదాహరణ. జీవితంలో పూర్తిగా నిస్పృహలో జారిపోయిన ఆ ఆటగాడు కన్నతల్లి ప్రోత్సాహంతో, అప్పటి దాకా విననైనా వినని పారా క్రీడల్లోకి దిగారు. ఇవాళ జావెలిన్ త్రోయర్‌గా పారాలింపిక్స్‌కు వెళ్ళారు. ఏషియన్ ఛాంపియన్‌గా ఎదిగారు. తాజా క్రీడోత్సవాల్లో తన ప్రపంచ రికార్డును తానే మెరుగుపరుచుకున్నారు. సోదరుడి వివాహంలో కరెంట్ షాక్‌తో చేతులు రెండూ కోల్పోయిన పారా స్విమ్మర్ సుయశ్ నారాయణ్ జాధవ్, కుడి మోచేయి లేని పరుగుల వీరుడు దిలీప్, నడుము కింది భాగం చచ్చుబడినా తొణకని కనోయింగ్ వీరుడు ప్రాచీ యాదవ్... ఇలా ఎన్నెన్నో ఉదాహరణలు.

పారా క్రీడల విషయంలో గతంలో పరిస్థితి వేరు. దేశంలో పారా క్రీడలకు పెద్ద తలకాయ అయిన భారత పారా ఒలింపిక్ కమిటీ అనేక వివాదాల్లో చిక్కుకుంది. 2015లో అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ సస్పెండ్ చేసింది. ఆ పైన 2019లో జాతీయ క్రీడా నియమావళిని ఉల్లంఘించారంటూ, సంఘం గుర్తింపును క్రీడా శాఖ రద్దు చేసింది. ఏడాది తర్వాత పునరుద్ధరించింది. అంతర్గత కుమ్ములాటలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం లాంటి ఆరోపణలు సరేసరి. అన్ని అవరోధాల మధ్య కూడా ఆటగాళ్ళు పట్టుదలగా ముందుకు వచ్చారు. ఒకప్పుడు నిధులు, శిక్షణ కొరవడిన దశ నుంచి పరిస్థితి మారింది. ప్రత్యేక అవసరాలున్న ఆటగాళ్ళకు నిధులు, శిక్షణనివ్వడంలో శ్రద్ధ ఫలిస్తోంది.

భారత క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన పలు కేంద్రాల్లో భారత పారా అథ్లెట్లకు మునుపటి కన్నా కొంత మెరుగైన శిక్షణ లభిస్తోంది. విదేశీ పర్యటనలతో వారికి క్రీడా ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు. ఆటగాళ్ళ దీక్షకు తల్లితండ్రులు, కోచ్‌ల ప్రోత్సాహం తోడై పతకాల పంట పండిస్తోంది. పారా స్పోర్ట్స్ అంటే ఎవరికీ పెద్దగా తెలియని రోజుల నుంచి దివ్యాంగులు పలువురు క్రీడల్ని ఓ కెరీర్‌గా ఎంచుకొనే రోజులకు వచ్చాం. అయితే, ఇది చాలదు. వసతుల్లో, అవకాశాల్లో సాధారణ ఆటగాళ్ళతో పాటు దివ్యాంగులకూ సమప్రాధాన్యమివ్వాలి. దేశంలోని దివ్యాంగ క్రీడాకారుల్లోని ప్రతిభాపాటవాలు బయటకు తేవాలి. 9 నెలల్లో రానున్న ప్యారిస్ పారాలింపిక్స్‌కి అది చేయగలిగితే మేలు!

కుల నిర్మూలన ఇలాగేనా?

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

ఆర్ఎస్ఎస్ నాయకులు కుల నిర్మూలన గురించి మాట్లాడటం మంచిదే. అదే సమయంలో దానికి గల మార్గాలను కూడా వారు వివరించాలి. ప్రస్తుత మాంసాహారం వర్సెస్ శాకాహారం వివాదం కులతత్వంతో కూడుకున్నది. ఇది కుల నిర్మూలనకు సహాయం చేయకపోగా, పౌర సమాజంలో, విశ్వవిద్యాలయాల్లో కులతత్వాన్ని ప్రోత్సహిస్తుంది. వివాహం, గౌరవప్రదమైన కులాంతర భోజనాలు అనే ఈ రెండు సామాజిక వ్యవస్థలు తీవ్రమైన కుల నిర్మూలనా శక్తిని కలిగి ఉన్నాయి. అందుకే తాము హిందువులని ఆర్ఎస్ఎస్ భావించే అన్ని కులాలకూ దేవాలయాలలో అర్చకత్వ హక్కులు కల్పించాలి. దేశం, సమాజం, కుటుంబం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మంచిదని ప్రచారం చేయడం ద్వారా కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి.

జాతీయ స్థాయిలో కుల గణనను డిమాండ్ చేస్తూ, ద్విజ ఆధిపత్యం కలిగిన సమాజంలో తమ చారిత్రక స్థానం పట్ల స్పృహను ప్రదర్శిస్తూ, తమ సంఖ్య గురించి శూద్ర/ఓబీసీలు చైతన్యాన్ని చూపుతున్న నేపథ్యంలో– ఎట్టకేలకు, ఆర్ఎస్ఎస్ బహిరంగ వేదికలపై కుల నిర్మూలన గురించి మాట్లాడుతోంది. కుల నిర్మూలన కోసం దత్తాత్రేయ హోసబలే, ఇతర నాయకులు దళితులు, శూద్రులకు ఆలయ ప్రవేశాన్ని, నీటి హక్కులను గురించి ప్రస్తావిస్తున్నారు. ఈ రెండు అంశాలూ కాలం చెల్లినవి మాత్రమే కాదు, ఇవి సామాజిక వివక్షను తొలగించే అవకాశం లేదు.

రెండు సామాజిక వ్యవస్థల శక్తి

మాంసాహారం వర్సెస్ శాకాహారం వివాదం కులతత్వంతో కూడుకున్నది. ఇది కుల నిర్మూలనకు సహాయం చేయకపోగా, పౌర సమాజంలో, విశ్వవిద్యాలయాల వంటి ప్రభుత్వ సంస్థలలో కుల తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది ఆహార సాంస్కృతిక ఘర్షణలకు దారి తీస్తుంది. కులాల మధ్య విభజితమైన ఆహార సంస్కృతి కూడా కులాంతర వివాహాలకు అడ్డుగోడగా నిలుస్తోంది.

వివాహం, గౌరవప్రదమైన కులాంతర భోజనాలు అనే ఈ రెండు సామాజిక వ్యవస్థలు తీవ్రమైన కుల నిర్మూలనా శక్తిని కలిగి ఉన్నాయి. వివాహం, ఆహార సాంస్కృతిక కండిషనింగ్ అనేవి, సామాజిక బంధాలను ఏకం చేయగలవు లేదా విభజించగలవు కాబట్టి వాటిని నేను ఉద్దేశపూర్వకంగానే శక్తి అని పిలుస్తాను. కుల వివాహ వ్యవస్థ, సామాజికంగా వేర్పాటుతో కూడిన ఆహార సాంస్కృతిక పరంపర అనేవి వేయి సంవత్సరాలుగా దేశంలో కుల అంతరాలను కొనసాగించాయి. కుల కేంద్రకమైన వివాహ వ్యవస్థ అనేది వ్యక్తుల డీఎన్ఏను కుల ప్రాతిపదికన విభజించడానికి ఉద్దేశించబడింది.

గత వందేళ్ల ఆర్ఎస్ఎస్ ఉనికిని చూసినట్లయితే, కుల నిర్మూలన కోసం కులాంతర వివాహాలను అది ప్రోత్సహిస్తుందనడానికి వారి రచనల్లో గానీ, నాయకుల ప్రసంగాల్లో గానీ ఎలాంటి ఆధారాలు లేవు. కులాంతర వివాహం వివిధ వృత్తులు కలిగిన రెండు వేరు వేరు వర్గాల మధ్య రక్త సంబంధాలను మార్పిడి చేస్తుందని డా. బి.ఆర్ అంబేడ్కర్ సూచించారు. ఇది ఇద్దరు భాగస్వాముల కులాన్ని బలహీనపరచడమే కాకుండా, వారి సంతానపు మానసిక, శారీరక సామర్థ్యాలను మెరుగుపరుస్తుంది. బహుశా అలాంటి కులాంతర వివాహాన్ని రుజువు చేయడానికి ఆయన సవితా అంబేడ్కర్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం నుండి వచ్చారు. సాధారణంగా పాశ్చాత్య సంస్కృతితో మాంసాహారం తినే దళితుడు, భారతీయ వాతావరణంలో మాత్రమే పెరిగిన బ్రాహ్మణ స్త్రీ తమ వైవాహిక జీవితంలో ఎలాంటి సర్దుబాట్లు చేసుకున్నారు అనే సమాచారం మన వద్ద లేదు. అంబేడ్కర్, సవిత తమ ఆహారాన్ని పూర్తి శాకాహారంగా గానీ, మిశ్రమ ఆహారంగా గానీ మార్చుకుని ఉండొచ్చు. లేదా ఎదుటివారి ఆహార ఎంపికను మరొకరు గౌరవించి ఉండొచ్చు.



ప్రస్తుత వ్యవస్థలో కులాంతర వివాహం

అన్ని కులాలకు చెందిన భారతీయ యువత ఉన్నత విద్యను అభ్యసిస్తున్నందున కులాంతర వివాహాల పరిధి పెరుగుతోంది. అవి జరుగుతున్నాయి కూడా. కానీ కులాంతర వివాహాలను సాధారణంగా తల్లిదండ్రులు అంగీకరించరు. ఎందుకంటే ఇది సామాజిక కళంకాన్ని తీసుకొస్తుంది. అనేక సందర్భాల్లో, ముఖ్యంగా ఒక భాగస్వామి దళితుడు, మరొకరు దళితేతరులు అయినప్పుడు అలాంటి వివాహితులను చంపడం ఇప్పుడు పెద్ద సమస్య అయిపోయింది.

అధికారంలో ఉన్న బీజేపీకి మార్గదర్శకంగానూ, భారతదేశంలోని అతిపెద్ద సామాజిక సంస్థగానూ ఉన్న ఆర్ఎస్ఎస్ ఈ సమస్యతో ఎలా వ్యవహరిస్తుందో సమాజానికి తెలియదు. ఈ సంస్థ నాయకులు సనాతన ధర్మం లేదా హిందూ సంప్రదాయం గురించి నిరంతరం మాట్లాడుతుంటారు. కులాంతర వివాహాలు సనాతన ధర్మంలో లేక హిందూ సంప్రదాయంలో భాగమేనా అన్నది వాళ్లు స్పష్టం చేయాలి. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి కుల నిర్మూలన ఒక క్లిష్టమైన యత్నం. కుల నిర్మూలన గురించి మాట్లాడటం మంచిదే. అదే సమయంలో దానికి గల మార్గాలను, సాధనాలను వివరించాలి.

కులాలు, మాంసాహారం, శుద్ధ శాకాహారులు

కుల వ్యవస్థ భారతీయుల మధ్య భోజనాన్ని ప్రధాన సమస్యగా మార్చింది. శతాబ్దాలుగా దేశంలోని వివిధ కులాల ప్రజలు పక్క పక్కనే కూర్చుని భోంచేయడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఆధునిక రెస్టారెంట్ వ్యవస్థలు కుల రహితంగా తినే వీలును కల్పించాయి. కానీ గ్రామాల్లో ఇప్పటికీ ఇది పెద్ద సమస్య. అనేక పాఠశాలల్లో దళితులు వండిన ఆహారాన్ని దళితేతరులు తినడం లేదు. ఈ పరంపరకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ స్పష్టమైన వైఖరిని తీసుకోలేదు.

శాకాహారం, మాంసాహారం అనే సమస్య ప్రస్తుతం చాలా ఐఐటీలు, ఇతర కేంద్ర విద్యా సంస్థల్లో తీవ్రమైన సమస్యగా మారింది. కొంతమంది కేంద్ర మంత్రులు ఆర్ఎస్ఎస్ శాకాహార సంస్కృతిలో భాగమయ్యారు. పైగా వారు పూర్తి శాకాహార మెనూని అవలంబించాలని ఆయా సంస్థలను కోరుతున్నారు. కేంద్ర విద్యాసంస్థల్లో, విశ్వవిద్యాలయాలలో శాకాహారం మాత్రమే అందించాలని ఆదేశాలను పంపిన మొదటి విద్యా మంత్రి స్మృతి ఇరానీ. ముంబై ఐఐటీతో సహా ఇతర ఐఐటీల అధిపతులు శాకాహారం, మాంసాహారం తినేవారికి వేర్వేరు వసతి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటన్నింటికీ కారణం సనాతన ధర్మాచరణకు చెందిన శాకాహార భావజాలమే.

ముస్లింలను, క్రైస్తవులను విడిచిపెట్టండి... శూద్రులు, దళితులు, ఆదివాసీలు భారతదేశంలో ప్రధానంగా మాంసాన్ని, లభ్యత ఆధారంగా శాకాహారాన్ని తినడం ద్వారా జీవిస్తున్నారు. కానీ పండుగ సందర్భాలలో వారికి ఇష్టమైనది మాంసాహారమే. ఆహార సాంస్కృతిక పరంపరలో స్పష్టమైన కుల వర్ణ విభజన ఉంది. ఆర్ఎస్ఎస్ తన స్వచ్ఛమైన శాకాహార సంస్కృతిని వదులుకుంటుందా? బహిరంగ, వ్యక్తిగత ప్రదేశాలలో ప్రజలు తమకు నచ్చిన ఆహారాన్ని తినడం గురించి ఏ వైఖరిని తీసుకుంటుంది? హిందూ లేదా హిందూత్వ ఆహార సంస్కృతి ఏమిటి? ఇది స్వచ్ఛమైన శాకాహారమా లేదా వ్యక్తిగత ఎంపిక ఆధారంగా మిశ్రమ ఆహారమా?

వ్యక్తిగత ప్రాధాన్యాల ఆధారంగా ఆహార సంస్కృతిని ప్రజాస్వామ్యీకరించడం కుల నిర్మూలన చర్యల్లో ఒకటి. కానీ ఆర్ఎస్ఎస్ నాయకులు కుటుంబాల ఆహార స్వేచ్ఛ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఉదాహరణకు దక్షిణ భారతదేశంలో శూద్రులు, దళితులు, ఆదివాసీలందరూ మాంసాహారాన్ని తింటుంటారు. బ్రాహ్మణులు, వైశ్యులు కులపరంగా శాకాహారులు. వారి పిల్లలకు అలాగే తినేలా శిక్షణ ఇస్తారు. ఈ పద్ధతులను ప్రస్తావించకుండా ఆర్ఎస్ఎస్ కులాన్ని ఎలా నిర్మూలిస్తుంది?

కుల నిర్మూలనకు దశలవారీగా ఉపయోగపడే నాలుగు సామాజిక సాధనాలను నేను గుర్తించాను. వాటి గురించి ఈ సంస్థ మౌనంగా ఉంది. 1) తాము హిందువులని ఆర్ఎస్ఎస్ భావించే అన్ని కులాలకు దేవాలయాలలో అర్చకత్వ హక్కులు కల్పించాలి. దళితులు, ఆదివాసీలు, శూద్రులతో సహా అన్ని కులాల కోసం వాటిల్లో ప్రవేశానికి హక్కు కల్పించేలా ధార్మిక పాఠశాలలను, కళాశాలలను తెరవాలి. 2) చర్మశుద్ధి నుండి కుండల తయారీ వరకు అన్ని వృత్తుల గౌరవం పెరిగేలా బోధనా సామగ్రిని రూపొందించాలి. 3) దేశం, సమాజం, కుటుంబం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మంచిదని ప్రచారం చేయడం ద్వారా కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. 4) మాంసాహారం, శాకాహారంతో సంబంధం లేకుండా ఇతరుల ఆహార ఎంపికను గౌరవిస్తూ కలిసి భోంచేసేలా చూడాలి.

ఢిల్లీలో జరిగిన జీ20 సదస్సుతో సహా, శుద్ధ శాకాహారమే హిందూ లేదా భారతీయ ఆహార సంస్కృతిగా జరుగుతున్న ప్రచారాన్ని నిలిపివేయాలి. కుల నిర్మూలన గురించి ఆర్ఎస్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ అంశాలపై తన వైఖరిని స్పష్టంగా తెలియ జేయాలి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సమాచారం గాలికి?



81 కోట్ల మంది భారతీయుల కోవిడ్ సమాచారం అతిక్రమణకు గురైనట్టు తెలుస్తోంది. డార్క్ వెబ్‌లో పెట్టిన డాటాలో పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డ్ నంబర్లు లాంటి సమాచారం ఉంది.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

సాహో అఫ్గానిస్తాన్!



2023 ప్రపంచ కప్ చరిత్ర రాసినప్పుడు (ఆట ఇంకా పూర్తి కాలేదనుకోండి), అఫ్గానిస్తాన్ ఒక పూర్తి అధ్యాయానికి అర్హురాలు. ఇండియా ఆట అంతా క్లాస్‌గా ఉంటే, అఫ్గాన్లు మాత్రం హృదయంతో ఆడారు (చాలా నైపుణ్యంతో కూడా).

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఆ హక్కు ఉందా?



ఇజ్రాయిల్‌కు యూఎస్ ఏటా 3.8 బిలియన్ డాలర్లు అందిస్తోంది. బైడెన్ ప్రభుత్వం, కాంగ్రెస్ ఒకటి స్పష్టం చేయాలి. ఇజ్రాయిల్‌కు తనను తాను రక్షించుకునే, హమాస్‌ను నాశనం చేసే హక్కు ఉంది. కానీ గాజాలోని వేలాదిమంది అమాయకులను చంపడానికి యూఎస్ డాలర్లను వాడే హక్కు లేదు.

– బెర్నీ శాండర్స్, అమెరికా నాయకుడు

ముందే వెలుగు



1996. ఎట్టకేలకు మా నాన్నను నాకోసం ఒక హీరో హోండా స్ప్లెండర్ కొనడానికి ఒప్పించాను. ఆ 46 వేల కోసం ఆయన తన బీమా పాలసీని సరెండర్ చేసినట్టున్నారు. ఇవ్వాళ ఈ స్ప్లెండర్ (ఫొటో షేర్ చేశారు)ను మాతో 15 ఏళ్లుగా ఉన్న మా డ్రైవర్ రవీందర్ కోసం బుక్ చేశాను. దీపావళి మనకే కాదు, మన కోసం పనిచేసేవాళ్లకు కూడా!

– దీపక్ కృష్ణమూర్తి, వైద్యుడు

తేడా లేదు!



ఈ యుద్ధంతో ఒకటి మరింత స్పష్టంగా అర్థమవుతోంది. అధికారిక ప్రజాస్వామ్యాల్లోని ప్రజలు కూడా నిరంకుశ దేశాల్లోని ప్రజల్లా అంతే బ్రెయిన్ వాష్‌కు గురయ్యి, ఏ విమర్శనాత్మక ఆలోచన లేని వాళ్లుగా ఉండగలరు.

– సి ఎంగుయెన్, ఫెలో

ఓటు హక్కు కోసం మహిళా పోరాటం

అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో 1913 లో స్త్రీల ఓటు హక్కు కోసం పెద్ద ఊరేగింపు జరిగింది. మహిళల ఓటు హక్కు ఉద్యమకారిణి ఇనెజ్ మిల్హాలండ్ ఊరేగింపునకు నాయకత్వం వహించారు. తెల్లటి పొడవు అంగవస్త్రం, టోపీ ధరించి, గుర్రంపై స్వారీ చేస్తూ జనాలను ఆకర్షించారు. మహిళా ఓటు హక్కు ఉద్యమకారిణి, ఆంగ్ల వనిత ఎమ్మెలైన్ పంఖుర్స్ట్ నుంచి స్ఫూర్తి పొందారు. న్యూయార్క్ నగరంలో పిల్లల, స్త్రీల, కార్మిక హక్కుల కోసం పనిచేశారు. 1916లో అమెరికా అంతటా మహిళల ఓటు హక్కు కోసం ప్రచారం చేశారు. కాలిఫోర్నియా రాష్ట్రం, లాస్ ఏంజిల్స్‌లో ఉపన్యసిస్తూ కుప్పకూలారు. తీవ్ర రక్తహీనతతో మరణించారు. తన ఘాటయిన పదజాల ఉపన్యాసాలతో ఇనెజ్ అమెరికా మహిళల ఓటు హక్కు ఉద్యమ గుర్తుగా మారారు.



ఇనెజ్ మిల్హాలండ్

ఎమ్మెలైన్ పంఖుర్స్ట్ బ్రిటన్ మహిళల ఓటు హక్కు ఉద్యమ నాయకురాలు. 'చేతలే, మాటలు కాద'న్న నినాదంతో 1903లో మహిళల సామాజిక, రాజకీయ సంఘం (డబ్ల్యు.ఎస్.పి.యు.)ను స్థాపించారు. ఈ సంస్థ స్త్రీల ఓటు హక్కుకు తీవ్రంగా పోరాడింది. సమరశీల పోరాట ఎత్తుగడలతో డబ్ల్యు.ఎస్.పి.యు. ప్రసిద్ధి గాంచింది. 'స్త్రీల జీవితాలు అధ్వాన్నంగా ఉన్నాయి. వారి పరిస్థితులు, మా ఉద్యమ అవసర కారణాల వైపు ప్రభుత్వ దృష్టిని మరల్చడానికి చట్ట ధిక్కరణ కూడా మా బాధ్యత' అని ఎమ్మెలైన్ తమ తీవ్ర తిరుగుబాటు చర్యలను సమర్థించుకునేవారు. 1918లో పాక్షిక విజయాన్ని సాధించారు. ప్రభుత్వం 30 ఏళ్లు నిండిన స్థానిక ప్రభుత్వ సభ్యురాళ్లకు, సభ్యుల భార్యలకు ఓటు హక్కునిచ్చింది. 1928లో ఎమ్మెలైన్ క్యాన్సర్‌తో మరణించిన తర్వాత బ్రిటిష్ స్త్రీలకు సంపూర్ణ ఓటు హక్కు లభించింది.

మరొక అమెరికా మహిళా ఓటు హక్కు ఉద్యమకారిణి ఆలిస్ పాల్ 1917లో 7 నెలల జైలు శిక్ష అనుభవించారు. మహిళల ఓటు హక్కు కోసం రాజధాని వాషింగ్టన్ శ్వేతసౌధం వద్ద శాంతియుతంగా ధర్నాచేయడమే ఆమె చేసిన నేరం. ఆమె తల్లి నేషనల్ అమెరికన్ ఉమన్ సఫ్రేజ్ (ఓటు హక్కు) అసోసియేషన్ సభ్యురాలు. తల్లి ద్వారా ఆలిస్ మహిళల ఓటు హక్కు ఉద్యమ నాయకురాలయ్యారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఆర్థికశాస్త్రం)లో సామాజిక, ఆర్థిక శాస్త్రాల అధ్యయనానికి లండన్ వెళ్లారు. అక్కడ స్త్రీల ఓటు హక్కు ఉద్యమంలో చేరారు. ఆ ఉద్యమ నిరసనలు, ఊరేగింపుల్లో క్రమం తప్పక పాల్గొనేవారు. అక్కడ మరొక మహిళా హక్కుల అమెరికా ఉద్యమకారిణి లూసి బరన్స్‌తో పరిచయమైంది. లూసితో కలిసి అమెరికాకు వచ్చారు. 'నేషనల్ ఉమెన్స్ పార్టీ'ని స్థాపించారు. ఆలిస్ కృషి ఫలితంగా మహిళల ఓటు హక్కు ఉద్యమం విజయం సాధించింది. 1878లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణను 1920లో అమెరికా ప్రభుత్వం 19వ రాజ్యాంగ సవరణగా ఆమోదించింది. స్త్రీలకు ఓటు హక్కు లభించింది. తర్వాత ఆలిస్ స్త్రీల సమాన హక్కుల కోసం 'లింగ వివక్షతో అమెరికా కాని, రాష్ట్ర ప్రభుత్వాలు కాని స్త్రీలకు సమాన హక్కులను నిరాకరించరాదు, కుదించరాదన్న' ఆశయంతో తీవ్రంగా పోరాడారు. సమాన హక్కుల కోసం రాజ్యాంగ సవరణ జరుగుతుండగానే '1964 పౌర హక్కుల చట్టం' సవరణ ద్వారా మహిళల రక్షణ హక్కును సాధించారు.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
మొబైల్: 94902 04545

కాంగ్రెస్‌కు కర్ణాటక విద్యుత్ షాక్!

అభిప్రాయం



బుద్దా మురళి

సాధారణంగా ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రంలోని అంశాలే ఎన్నికల్లో ప్రధాన ప్రచార అంశాలుగా మారతాయి. ఐతే ఈసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక ప్రధాన అంశంగా మారింది. కర్ణాటక రైతులు తెలంగాణ జిల్లాల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. 'కర్ణాటకలో కాంగ్రెస్ రైతులను మోసం చేసింది. మాలా మీరూ మోసపోకండి' అని కర్ణాటక రైతులు కొడంగల్‌లో ప్రదర్శన, గద్వాల్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అదే సమయంలో బీఆర్ఎస్ నాయకులు సైతం తమ ఎన్నికల ప్రచారంలో కర్ణాటక విద్యుత్ సంక్షోభం, రైతుల నిరసన గురించి చెబుతున్నారు. కర్ణాటక రైతులు ఏదో ఎన్నికల కోసం చేపట్టిన నిరసనలు కావు ఇవి. కర్ణాటకలో విద్యుత్ సంక్షోభం నిజంగానే సీరియస్‌గా ఉంది. రైతులు ఓ మొసలిని విద్యుత్ కార్యాలయంలో వదిలి తమ నిరసనను ప్రదర్శించారు.

ఇప్పుడే కాదు ఆరు నెలల నుంచి తెలంగాణలో కర్ణాటకే ప్రధాన అంశంగా మారింది. ఆరు నెలల క్రితం కర్ణాటకను కాంగ్రెస్ తెలంగాణలో ప్రచార అంశంగా మార్చి, రాజకీయంగా కొంత ప్రయోజనం పొందింది. తీరా ఎన్నికల ముంగిట నిలిచే సమయానికి ఈ పరిణామాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారాయి.

మునుగోడు ఉప ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్‌కు తెలంగాణలో బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నట్టుగా విస్తృతంగా ప్రచారం జరిగింది. దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో అధికారంలోకి వచ్చేది మేమే అన్నట్టుగా బీజేపీ ప్రచారం సాగింది. దానికి తగ్గట్టు కాంగ్రెస్ నేతలు కొందరు బీజేపీలో చేరారు. పీసీసీ రేస్‌లో ఉన్నాం, సీఎం రేస్‌లో ఉన్నాం అని చెప్పుకొన్న కోమటిరెడ్డి బ్రదర్స్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరడంతో బీజేపీ హైప్ మరింత పెరిగింది.

మునుగోడు ఎన్నికలను తెరాస నాయకత్వం సీరియస్‌గా తీసుకోవడంతో అక్కడ బీజేపీ ఓడింది. దీంతో బీజేపీ హైప్ గాలి బుడగ అని తేలి పోయింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ వారిలో ఒక్కసారిగా ఉత్సాహం పెరిగింది. కర్ణాటక తరహాలో తెలంగాణలో అధికారం లోకి వచ్చేస్తాం అని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. కర్ణాటకలో కాంగ్రెస్ 'ఐదు గ్యారంటీ'లతో అధికారంలోకి వస్తే తెలంగాణ కాంగ్రెస్ దాదాపు ఈ హామీలకు మరోటి కలిపి 'ఆరు గ్యారంటీ'లతో అధికారంలోకి వస్తాం అని ప్రకటించింది. ఇక్కడి వరకు కర్ణాటక రాజకీయ పరిణామాలు తెలంగాణలో కాంగ్రెస్‌కు బాగా ఉపయోగపడ్డాయి. కాంగ్రెస్‌కు మంచి ప్రచారాన్ని తెచ్చి పెట్టాయి. తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత కర్ణాటక పరిణామాలు తెలంగాణలో కూడా కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారాయి. విద్యుత్ సంక్షోభం కర్ణాటకలో అధికార పక్షాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇదంతా గతంలో పాలించిన బీజేపీ తప్పు అని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వాపోతున్నారు. విద్యుత్ సంక్షోభంలో కర్ణాటక కూరుకు పోయి, కర్ణాటక రైతులు ఆందోళన బాట పట్టగానే తెలంగాణ కాంగ్రెస్ కర్ణాటక జపం వదిలేసింది. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు కర్ణాటక రైతుల ఉద్యమం, కర్ణాటకలో విద్యుత్ సంక్షోభం గురించి తెలంగాణలో ప్రస్తావిస్తున్నారు. కర్ణాటక కాంగ్రెస్ నాయకులు శివకుమార్ తెలంగాణలో కాంగ్రెస్ తరఫున ప్రచారంలో పాల్గొంటూ 'మేం కర్ణాటకలో ఐదు గంటల కరెంట్ ఇస్తున్నాం. అధికారంలోకి వస్తే ఇక్కడా ఇస్తాం' అని హామీ ఇచ్చారు. తాము ఇప్పటికే 24 గంటలు కరెంట్ ఇస్తుంటే 5 గంటలు కరెంట్ ఇస్తామంటారేమిటి అని బీఆర్ఎస్ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు.



పార్టీలతో సంబంధం లేకుండా కర్ణాటక రైతులు ఆందోళన చేస్తున్నారు. కర్ణాటకకు చెందిన దాదాపు రెండు వందల మంది రైతులు కొడంగల్ వచ్చి కాంగ్రెస్‌ను నమ్మవద్దని ప్రదర్శన చేశారు. స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు వారితో ఘర్షణ పడ్డారు. 'ఐదు గంటల పాటు విద్యుత్ అన్నారు అదీ రావడం లేదు, పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ ఇస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు ఇవ్వరు' అంటూ కర్ణాటక రైతు వచ్చీ రాని తెలుగులో కర్ణాటక ప్రభుత్వాన్ని నిలదీస్తున్న వీడియో బాగా వైరల్ అయింది.

ఆరు నెలల క్రితం కర్ణాటక ఫలితాలు తెలంగాణ కాంగ్రెస్‌కు ఉత్సాహాన్ని ఇస్తే... తీరా ఎన్నికల ముందు తల పట్టుకునేట్టు చేశాయి. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ఇస్తే ఏ హామీ సక్రమంగా అమలు కావడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రసాభాసగా మారింది. ఢిల్లీలో ఇది బాగా అమలు అవుతోంది. అధికారం లోకి వచ్చిన ఆరు నెలల లోపే కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకతను తెచ్చి పెట్టుకొంది. ప్రధానంగా రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకత తెలంగాణలో కాంగ్రెస్‌ను దెబ్బ తీయడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టే అవకాశం ఉంది.

వ్యాసకర్త ప్రధాన సమాచార కమిషనర్, తెలంగాణ

దేవుని మార్గం

ఒకసారి యాజ్ఞవల్క్య మహర్షి వేద మంత్రాలను శిష్యులకి బోధిస్తున్నారు. శిష్యులు కూడా గురువు చెబుతున్న మంత్రాలను శ్రద్ధగా నేర్చుకుంటూ గురువు గారి స్వరంతో తమ స్వరం కలుపుతూ వల్లె వేస్తున్నారు. 'ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి వస్తువు లోనూ ఈశ్వరుని చూడగలగాలి. మనకు కావలసినవన్నీ ఈశ్వరుడే సమకూర్చాడు. వాటిని త్యాగబుద్ధితో అనుభవిస్తూ ఆనందంగా జీవించాలి. ఈ విశ్వమంతా ఈశ్వరుని ఆజ్ఞ ప్రకారమే కదులుతోంది. మనిషి, మృగం, చెట్టు, పుట్ట, ఆడ, మగ, చిన్న, పెద్ద అన్ని ప్రాణుల్లోనూ భగవంతుని చూడగల సాధకుడే పరమాత్మను తెలుసుకోగలడు' అని గురువుగారు అన్నారు. అప్పుడు ఓ శిష్యుడు త్యాగంతో అంటే సర్వ సంగ పరిత్యాగం చేసి ధ్యానంలో కూర్చుని ఆత్మని పరమాత్మలో లీనం చెయ్యాలనేగా అర్థం? అటువంటి సామర్థ్యం అందరికీ ఉంటుందా? లేని వారికి మరేదైనా భగవంతుని చేరే మార్గం ఉందా?' అని ప్రశ్నించాడు.



జ్యోతిర్మయం

'ఆత్మను పరమాత్మలో లీనం చేసే సామర్థ్యం అందరికీ ఉండదు. మహాత్ములు, పరిపక్వమైన జ్ఞానం కలవారు సృష్టి అణువు అణువులో దైవాన్ని చూడగలరు. అంత వైరాగ్యాన్ని పొందలేనివారు పుణ్య కార్యాలు చేస్తూ భగవంతుని చేరడానికి ప్రయత్నించాలి. పూజలు, వ్రతాలు, దాన ధర్మాలు, అతిథి సేవ, భూత సేవ వంటివి చేస్తూ జ్ఞాన మార్గంలో నడిచేవారు నూరేళ్లు ఆనందంగా జీవిస్తార'ని గురువుగారు సమాధానం చెప్పారు.

ఇది చాలా గొప్ప విషయం. అందరూ చేయగలిగే కర్మలే ఇవి. ఈ పూజలు, దాన ధర్మాలు, అతిథి సేవ వంటివి నిర్మలమైన మనసుతో, నిస్వార్థంగా చేయాలి. అప్పుడే భగవంతుని చేరగలం. మంచి మార్గంలో నడవడమే భగవంతుని చేరడమంటే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చవితి రా.10.40 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** రోహిణి ఉ.6.09 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.11.54 నుండి 1.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.22 నుండి 12.08 వరకు, **అమృత ఘడియలు:** రా.9.44 నుండి 11.22 వరకు. ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.02, **సూర్యాస్తమయం:** 5.27.

మీ అభిమానం మరువలేను: చంద్రబాబు



సాక్షి, రాజమహేంద్ర వరం/సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'నేను కష్టం లో ఉన్నప్పుడు 52 రోజుల పాటు తెలుగు ప్రజలు రోడ్ల పైకి వచ్చి సంఘీభావం తెలిపారు.. పూజలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు నాపై చూపిన అభిమానాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోను. నేను చేసిన అభివృద్ధితో ఫలాలు పొందిన వారందరూ చూపిన అభిమానంతో నా జీవితం ధన్యమైంది. ఇలాంటి అనుభూతి ఏ నాయకుడికీ దక్కదు. 45 ఏళ్ల నా రాజకీయ ప్రస్థానంలో ఎలాంటి తప్పు చేయలేదు.. చేయను.. చేయబోను'అని ప్రతిపక్ష నేత చంద్రబాబు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. మంగళవారం ఆయనకు హైకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి జైలు బయట మాట్లాడారు. తను అరెస్టును ఖండించిన బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. తన అరెస్టును ఖండిస్తూ సంపూర్ణ మద్దతు తెలిపిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. కాగా విడుదలకు ముందు జైల్లో చంద్రబాబుతో ఆయన తనయుడు నారా లోకేశ్, కోడలు నారా బ్రాహ్మణి ములాఖత్ అయ్యారు. విజయవాడ వరకు ఎలా వెళ్దాం? ఏం చేద్దాం? అనే అంశాలపై చర్చించినట్లు తెలిసింది. బాబు తాత్కాలిక బెయిల్ కాపీలను తీసుకుని లోపలికి వెళ్లిన లాయర్లు జైల్లో బెయిల్‌కు అవసరమైన ఫార్మాలిటీస్ అన్ని పూర్తి చేశారు. అనంతరం ఆయనను బయటకు తీసుకొచ్చారు. జైలు రెండో గేటు వద్దకు రాగానే చంద్రబాబు తన మనవడు దేవాన్ష్‌ను ముద్దాడారు. నందమూరి బాలకృష్ణ, టీడీపీ ముఖ్య నేతలను ఆలింగనం చేసుకున్నారు. అనంతరం వారంతా రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరారు. కాగా మధ్యంతర బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు తొలి రోజే హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. రాజకీయ ర్యాలీలు, ప్రసంగాలు చేయొద్దని హైకోర్టు చెప్పినా పట్టించుకోలేదు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మైక్ అందుకున్నారు. తనకు సంఘీభావం తెలిపిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నిజం గెలిచి కాదు.. కంటి ఆపరేషన్‌కే బెయిల్

- నాలుగు వారాల తర్వాత చంద్రబాబు మళ్లీ జైలుకెళ్లాల్సిందే
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసం హైకోర్టు నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇస్తే.. టీడీపీ నేతలు న్యాయం గెలిచిందంటూ హంగామా చేయటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నిజం, సత్యం, ధర్మం గెలిచి చంద్రబాబు బయటకు రాలేదనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. మంగళవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు గతంలో ఒక కంటికి ఆపరేషన్ చేయించుకున్నారని.. మరో కంటికి కూడా ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పడంతో మానవతా దృక్పథంతో కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందని వివరించారు. అందువల్ల చంద్రబాబు ఆపరేషన్ చేయించుకొని.. 4 వారాల తర్వాత మళ్లీ జైలులో సరెండర్ కావాల్సిందేనన్నారు. ఎక్కడైతే ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభించారో.. అక్కడే టీడీపీ జెండాను చంద్రబాబు పీకేశారన్నారు. తెలంగాణలో టీడీపీ దుకాణం మూతపడిందని.. అక్కడ ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జ్ఞానేశ్వర్‌కు జ్ఞానోదయమై రాజీనామా చేశారని చెప్పారు. ఏపీలో కూడా ఎన్నికల ముందో, ఆ తర్వాతో టీడీపీ జెండా పీకేయటం ఖాయమన్నారు.

మీడియాతో మాట్లాడొద్దు

చంద్రబాబుకు హైకోర్టు అదనపు షరతులు
- ర్యాలీల్లో పాల్గొనకూడదు.. ఇంటర్వ్యూలు ఇవ్వొద్దు
- కేసు గురించి బహిరంగంగా మాట్లాడొద్దని ఆదేశాలు



సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ సీఎం చంద్రబాబుకు మానవతా దృక్పథం, ఆరోగ్య సమస్యల దృష్ట్యా తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. చంద్రబాబుకు అదనపు షరతులు విధించింది. సీఐడీ అనుబంధ పిటిషన్‌పై తీర్పు వెలువడేంత వరకు ఆయన మీడియాతో మాట్లాడకూడదని ఆదేశించింది. ర్యాలీల్లో పాల్గొనకూడదని, ఈ కేసు గురించి బహిరంగంగా కూడా మాట్లాడవద్దని చంద్రబాబును ఆదేశించింది. చంద్రబాబుకు హైకోర్టు తాత్కాలిక బెయిల్ ఇస్తూ న్యాయమూర్తి జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. మరిన్ని అదనపు షరతులు విధించాలని కోరారు. ఆ షరతులేమిటో లిఖితపూర్వకంగా ఇవ్వాలని న్యాయమూర్తి చెప్పారు. దీంతో సీఐడీ ఓ అనుబంధ పిటిషన్ రూపంలో వాటిని కోర్టు ముందుంచింది. ఈ అనుబంధ పిటిషన్‌పై లంచ్‌మోషన్ రూపంలో విచారించాలని సీఐడీ న్యాయవాదులు కోరారు. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు సుముఖత వ్యక్తం చేయలేదు. చంద్రబాబుకు నోటీసులు జారీ చేసి వారి వాదనలు విన్న తరువాత నిర్ణయం చెబుతానన్నారు. ఉదయం మద్యం కుంభకోణంలో చంద్రబాబుకు లంచ్‌మోషన్ ఇచ్చి తమకు ఇవ్వకపోవడం ఎంతమాత్రం సరికాదని సీఐడీ న్యాయవాదులు చెప్పారు. దీంతో న్యాయమూర్తి లంచ్‌మోషన్‌కు అనుమతినిచ్చారు.

మధ్యాహ్నం అతికష్టం మీద సీఐడీ అనుబంధ పిటిషన్ విచారణకు వచ్చింది. సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానంద, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆరోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్ మంజూరులో సుప్రీంకోర్టు నిర్దేశించిన షరతులను చంద్రబాబుకు వర్తింపజేయాలని సుధాకర్‌రెడ్డి కోరారు. రాజకీయ ర్యాలీలు, రాజకీయ ప్రసంగాలు, ఇతర రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా చంద్రబాబును ఆదేశించాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ముందు మాట్లాడకుండా నిరోధించాలన్నారు. వైద్య చికిత్సకు మాత్రమే పరిమితమయ్యేలా చూడాలన్నారు. కేసుల విషయంలో ఆయనకు, ఇతర నిందితులకు సంబంధించి ఎలాంటి ఇంటర్వ్యూలు ఇవ్వకుండా కూడా ఆదేశాలు జారీ చేయాలన్నారు. చంద్రబాబు వెంటే ఉండి, ప్రతి రోజూ ఆయన కార్యకలాపాలను కోర్టుకు నివేదించేందుకు ఇద్దరు డీఎస్పీలను అనుమతించాలని కోరారు. దీనిపై చంద్రబాబు కౌంటర్ దాఖలు చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటానని న్యాయమూర్తి తెలిపారు. దీనికి సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. చంద్రబాబు బయటకు వచ్చి ర్యాలీలు తీసి రాద్ధాంతం చేసిన తరువాత అదనపు షరతులు విధిస్తే ప్రయోజనం ఉండదన్నారు. అదనపు షరతులు తాము సృష్టించినవి కావన్నారు. మీరు (న్యాయమూర్తి) చంద్రబాబుకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో సత్యేంద్రజైన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించారని, ఆ తీర్పులోనే సుప్రీం కోర్టు పలు షరతులను విధించిందని తెలిపారు. ఆ తీర్పు ఆధారంగా చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇచ్చినప్పుడు అదే తీర్పులోని షరతులను కూడా విధించాలన్నారు. తీర్పులో ఏం రాయాలో మీరు కోర్టును శాసించలేరని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తాను శాసించడం లేదని, తీర్పు పూర్తి పాఠాన్ని వర్తింపజేయాలని మాత్రమే కోరుతున్నానని సుధాకర్‌రెడ్డి చెప్పారు. 'అలా అయితే నిన్ననే (సోమవారం) వాదనల సందర్భంగా షరతులు చెప్పి ఉండాల్సింది. నేను అప్పుడు వాటిని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండేది.'అని న్యాయమూర్తి అన్నారు. 'మీరు వారికి అనుకూలంగా తీర్పునిస్తారని ముందే అనుకునేందుకు నేనేమైనా జ్యోతిష్యుడి వద్దకు వెళ్లానా? మీరు ఉత్తర్వులు జారీ చేసిన తరువాతే కదా ఎలాంటి షరతులు విధించారో మాకు తెలిసింది. అలాంటప్పుడు ముందే మేం ఎలా షరతుల గురించి చెప్పగలం'అని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పులో ఏ భాగాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నది తన విచక్షణాధికారానికి సంబంధించినదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అందరూ అనుసరించాల్సిందేనని, అలా చేయని పక్షంలో అదనపు షరతుల కోసం తాము దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయాలని సుధాకర్‌రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇస్తూ తానిచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే, సుప్రీం కోర్టుకు వెళ్లొచ్చని న్యాయమూర్తి చెప్పగా.. తాము ఆ పని కచ్చితంగా చేస్తామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. చంద్రబాబు తరఫు న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ, కేసు గురించి కాక మిగిలిన రాజకీయాల గురించి మీడియాతో మాట్లాడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, కొద్దిసేపటి తర్వాత ఉత్తర్వులు జారీ చేస్తానని చెప్పారు. అనంతరం అదనపు షరతులు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ అనుబంధ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబును ఆదేశించారు. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

కంటి వైద్యం కోసం కండీషన్లతో బెయిల్

▶ మొదటి పేజీ తరువాయి

సంతృప్తి మేరకు రూ.లక్షతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. సొంత ఖర్చులతో తనకు నచ్చిన ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు చంద్రబాబుకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. తిరిగి లొంగిపోయే సమయంలో తనకు వైద్యులు అందించిన చికిత్స, ఏ ఆసుపత్రిలో చికిత్స పొందారు.. తదితర వివరాలను సీల్డ్ కవర్‌లో రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు అందచేయాలని చెప్పింది. ఈ సీల్డ్ కవర్‌ను అలాగే ఏసీబీ కోర్టు ముందుంచాలని జైలు సూపరింటెండెంట్‌ను, నవంబర్ 28 సాయంత్రం 5 గంటలలోపు జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలని చంద్రబాబును ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వాస్తవాలు తెలిసిన ఏ వ్యక్తిని కూడా ఆ వివరాలు కోర్టుకు, సంబంధిత అథారిటీకి తెలియచేయకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించడం గానీ, భయపెట్టడం గానీ, ప్రలోభాలకు గురి చేయడం గానీ చేయరాదని హైకోర్టు తన 16 పేజీల ఉత్తర్వుల్లో చంద్రబాబును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జున రావు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తాత్కాలిక బెయిల్ కోసం అనుబంధ పిటిషన్‌పై సోమవారం జరిగిన విచారణలో చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్.. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ మల్లికార్జునరావు మంగళవారానికి తన నిర్ణయాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు వెలువరించారు. ఇదిలా ఉండగా, స్కిల్ కుంభకోణం కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన ప్రధాన బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి తదుపరి విచారణను నవంబర్ 10వ తేదీకి వాయిదా వేశారు. తాత్కాలిక బెయిల్ ఉత్తర్వుల సారాంశం ఇలా ఉంది.

ఈ వయస్సులో వృద్ధాప్య సమస్యలు మామూలే

- అందుబాటులో ఉన్న ఆధారాలను బట్టి 2023 జూన్ 21 నుంచి 6 నెలల్లో కుడి కంటికి కాటరాక్ట్ శస్త్ర చికిత్స చేయించుకోవాలని చంద్రబాబుకు వైద్యులు సిఫారసు చేశారు. దూరదృష్టి కలిగిన ఓ వ్యక్తి కేవలం కాటరాక్ట్ శస్త్ర చికిత్స చేయించుకునేందుకు మాత్రమే బెయిల్ కోరతారని అనుకోవడం అహేతుకమని ఈ కోర్టు భావిస్తోంది.
- ఒకవేళ అదే నిజం అయితే తాత్కాలిక బెయిల్ దాఖలు చేసేందుకు 2023 అక్టోబర్ 25 వరకు చంద్రబాబు వేచి చూడాల్సిన అవసరం ఉండేది కాదు. చంద్రబాబు వయసును ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంటోంది. ఈ వయసులో వృద్ధాప్య సమస్యలు రావడం మామూలే.
- డాక్టర్ శ్రీనివాసరావు తన రెండో నివేదికలో ఎక్కడా కూడా చంద్రబాబుకు కంటి శస్త్ర చికిత్స అవసరం లేదని చెప్పలేదు. అందువల్ల అదనపు అడ్వొకేట్ జనరల్ సూచించినట్లు చంద్రబాబును మెడికల్ బోర్డు ఎదుట హాజరు కావాలని ఒత్తిడి చేయాల్సిన అవసరం ఈ కోర్టుకు కనిపించడం లేదు. చంద్రబాబు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది కింది కోర్టు నుంచి గానీ, హైకోర్టు నుంచి గానీ బెయిల్ కోరేందుకు ఎంత మాత్రం అడ్డంకి కాదు.
- అనారోగ్య సమస్యల కారణంతో తాత్కాలిక బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు ముందుందన్నది ఎవరి వాదనా కాదు. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించేంత వరకు ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపరాదన్న అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి వాదనను ఆమోదించలేకున్నాం.

కంటికి శస్త్ర చికిత్స అవసరమే

- ఓ వ్యక్తిపై వచ్చిన నేరారోపణల తీవ్రత కంటే అతని ఆరోగ్యం, క్షేమాన్నే ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది. దర్యాప్తులో భాగంగా కస్టడీ విధించడం శిక్షాత్మకం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవడం ముఖ్యం. ప్రతి వ్యక్తికి కూడా సంపూర్ణ, సమగ్ర వైద్య సాయం పొందే స్వతఃసిద్ధ హక్కు ఉంటుంది. కస్టడీలో ఉన్న వ్యక్తులు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే.. వారికి తగిన, సమర్థవంతమైన వైద్య చికిత్స అందించేందుకు అనుమతివ్వడం తప్పనిసరి అని ఈ కోర్టు విశ్వసిస్తోంది.
- ఓ వ్యక్తి జీవితం ప్రమాదంలో ఉన్నప్పుడు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే విషయంలో కోర్టు తనకున్న విచక్షణాధికారాన్ని కొన్ని పరిస్థితులకు లోబడి పరిమితం చేయడం సాధ్యం కాదు. చంద్రబాబుకు శస్త్రచికిత్స అవసరం లేదని ఏ వైద్య నివేదికలు కూడా చెప్పడం లేదు. చంద్రబాబు కొన్ని అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వారికి వైద్య సాయం అందించడం తప్పనిసరి. ముఖ్యంగా కుడి కంటికి శస్త్ర చికిత్స చేయించుకోవడం అవసరమని ఈ కోర్టు భావిస్తోంది.

న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకోలేరు

- ఈ కోర్టు అభిప్రాయం ప్రకారం, న్యాయ ప్రక్రియ నుంచి చంద్రబాబు తప్పించుకుంటారనేందుకు చిన్నపాటి అవకాశం కూడా కనిపించడం లేదు. విదేశాలకు పారిపోయే అవకాశం కూడా లేదు. వైద్య సాయం అవసరమైన వ్యక్తికి తక్షణమే సమర్థవంతమైన సమగ్ర చికిత్సను అందించాల్సిన అవసరం ఉందని ఈ కోర్టు దృఢంగా నమ్ముతోంది.
- బాధాకరమైన చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటూ, ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్లకుండా, కేవలం శస్త్ర చికిత్స చేయించుకునేందుకు వీలుగా మాత్రమే ఈ కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తోంది.
- అందుకే గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న ఆసుపత్రిలో ఇప్పుడు కూడా శస్త్ర చికిత్స చేయించుకునేందుకు అనుమతి ఇవ్వడం సహేతుకమని ఈ కోర్టు భావిస్తోంది.

చికిత్స తర్వాత చంద్రబాబు జైలుకు వెళ్లక తప్పదు

- చంద్రబాబు జైలు నుంచి వస్తున్నది రోగిగానా.. వీరయోధుడిగానా!
- టీడీపీ తీరుపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ఎద్దేవా



సాక్షి, అమరావతి: ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసిన కేసులో రిమాండ్‌పై జైల్లో ఉన్న చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసమే కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇస్తే విజయోత్సవాలు, ర్యాలీలు ఎందుకు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబు కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలను నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సజ్జల మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు రోగిగా జైలు నుంచి బయటకు వస్తున్నారా లేక ఏదైనా యుద్ధంలో గెలిచి వీర యోధుడిగా వస్తున్నాడనుకుంటున్నారా అని ఎద్దేవా చేశారు. కంటి చికిత్స కోసం నాలుగు వారాల మధ్యంతర బెయిల్‌పై చంద్రబాబు బయటకు వస్తున్నారని.. చికిత్స తర్వాత ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోవాల్సిందేనన్నారు. ఈ మాత్రానికే రాజమండ్రి నుంచి రోడ్ షో నిర్వహించడానికి, సంబరాలు చేసుకోవడానికి సిగ్గుండాలని టీడీపీ నేతలకు చురకలంటించారు. చంద్రబాబు జైలుకెళ్లడంతో ప్రజల్లో పెద్దఎత్తున సానుభూతి వస్తుందని టీడీపీ నేతలు ఆశపడ్డారని.. తీరా పరిస్థితి చూసి భంగపడ్డారంటూ సజ్జల వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రజల్లో ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో చర్మవ్యాధులే ప్రాణాంతకమైనట్టు చూపుతూ చంద్రబాబుకు ఆరోగ్యం క్షీణిస్తోందంటూ టీడీపీ సానుభూతి డ్రామాలకు తెరతీసిందన్నారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకొస్తున్నారా నిజం గెలిచిందనడానికి అని నిలదీశారు.

అందరూ నీ తండ్రిలా ఉంటారనుకుంటే ఎలా!

చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నన్ని రోజులూ ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు చేసిన విషప్రచారం అంతాఇంతా కాదని సజ్జల గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారంటూ లోకేశ్ చౌకబారు మాటలు మాట్లాడారన్నారు. 'అందరూ నీ తండ్రిలా ఉంటారనుకుంటే ఎలా'అని లోకేశ్‌పై మండిపడ్డారు. ఆదినుంచీ వ్యవస్థల్ని మేనేజ్ చేయడానికి విష సర్పాలను పెంచి పోషించిందే చంద్రబాబు అని మండిపడ్డారు.



ఇదెక్కడి 'రోగం'?

- చంద్రబాబుకు షరతులతో తాత్కాలిక బెయిల్.. అదీ కంటి ఆపరేషన్ కోసం
- స్కిల్ స్కామ్ కేసు యథాతథమే... చేసిన నేరం అలాగే ఉంది
- నిజం గెలిచిందంటూ స్వాతంత్ర్య సమర యోధుడిలా ఊరేగింపులా?
- తన కోసం జనం తండోపతండాలుగా వచ్చినట్లు హడావుడి
- ముందుగానే కార్యకర్తల సమీకరణ.. రూట్ షెడ్యూల్ విడుదల



రాజమండ్రి జైలు నుంచి ర్యాలీగా వెళ్తూ అభివాదం చేస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: రోగానికి చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తానంటూ కాళ్లావేళ్లా పడి ఎలాగోలా బయటపడ్డ ఓ వృద్ధ నేత విజయోత్సవాలు నిర్వహించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది! స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబుకు అనారోగ్య కారణాలతో న్యాయస్థానం షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ ఇస్తే నిజం గెలిచిందంటూ టీడీపీ నేతలు నిస్సిగ్గుగా బుకాయించడం విస్తుగొలుపుతోంది! 70 ఏళ్లు పైబడిన ఓ వృద్ధ నేత, రిమాండ్ ఖైదీకి కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు మానవతా దృక్పథంతో హైకోర్టు షరతులతో తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. సహజంగా జైల్లో ఉండే ఏ ఖైదీకైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే, అత్యవసరంగా సర్జరీ లాంటివి నిర్వహించాల్సి వస్తే న్యాయస్థానం కొన్ని షరతులతో బెయిల్ ఇస్తుంది. ఇప్పుడు కూడా అదే తరహాలో హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చింది. అంతేకానీ ఆయనేమీ శుద్ధపూసగా భావించి క్లీన్ చిట్ ఇవ్వలేదు. చంద్రబాబుపై స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసు ఇంకా అలాగే ఉంది. అమరావతి ఇన్నర్ రింగు రోడ్డు కుంభకోణం, అసైన్డ్ భూముల దోపిడీ, ఫైబర్‌నెట్ స్కామ్, అక్రమంగా మద్యం డిస్టిలరీలకు లైసెన్సులు ఇచ్చిన కేసులు న్యాయస్థానాల్లో అలాగే ఉన్నాయి. ఏ కేసులోనూ చంద్రబాబు నేరం చేయలేదని కోర్టు తీర్పు చెప్పలేదు. అయినా సరే చంద్రబాబు, ఆయన బృందం నిజం గెలిచిందంటూ ఊరేగింపులు నిర్వహిస్తూ స్వాతంత్ర్య పోరాటం చేసి జైలు నుంచి విడుదలైనట్లుగా రాద్ధాంతం చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు. ఆపరేషన్ చేయించుకున్నాక నవంబర్ 28వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు మళ్లీ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని కోర్టు స్పష్టంగా చంద్రబాబును ఆదేశించింది. అలాంటప్పుడు ఇందులో నిజం ఎక్కడ గెలిచిందో, ఎలా గెలిచిందో అర్థంకాక సామాన్య ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కార్యకర్తలను తరలించి హడావుడి

అనారోగ్య సమస్యలున్న ఖైదీలకు అత్యంత సాధారణంగా న్యాయస్థానాలు ఇచ్చే బెయిల్‌ను తమ విజయంగా టీడీపీ నేతలు అభివర్ణిస్తుండడంపై సోషల్ మీడియాలో సెటైర్లు వెల్లువెత్తుతున్నాయి. షరతులతో తాత్కాలిక బెయిల్ వస్తుందని ముందే తెలియడంతో రాజమహేంద్రవరానికి టీడీపీ కార్యకర్తలను పెద్దఎత్తున తరలించారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ చేరుకునే వరకు హడావుడి చేసేలా టీడీపీ ముందే ప్రణాళిక రూపొందించింది. జాతీయ రహదారి మీదుగా చంద్రబాబు ఏ ప్రాంతానికి ఏ సమయంలో వస్తారో రూట్ మ్యాప్, షెడ్యూల్ కూడా ఆ పార్టీ విడుదల చేసింది. ప్రతిచోటకూ కార్యకర్తలు, నాయకులు రావాలంటూ పార్టీ కార్యాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు సమాచారం ఇచ్చింది. ఇతర జిల్లాల నుంచి కూడా కార్యకర్తలను తీసుకువచ్చారు. కాన్వాయ్‌ను నెమ్మదిగా పోనిస్తూ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఆయన్ను చూసేందుకు ఎగబడుతున్నారని ప్రచారం హోరెత్తించారు. వాస్తవానికి చంద్రబాబును చూడడానికి సాధారణ ప్రజలు ఏమాత్రం ఆసక్తి చూపలేదు.

ప్రతిపక్ష ఎంపీల ఐఫోన్ల హ్యాకింగ్!

రాజకీయ కాక



- జాబితాలో ఖర్గే, థరూర్, మొయిత్రా, ఏచూరి
- కేజ్రీవాల్ ఓఎస్డీ, రాహుల్ గాంధీ సన్నిహితులు కూడా
- ఇది కచ్చితంగా మోదీ సర్కారు నిర్వాకమే
- ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన విపక్ష పార్టీలు
- అవాస్తవాలంటూ తోసిపుచ్చిన కేంద్రం
- లోతుగా దర్యాప్తు జరిపిస్తాం: కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- నకిలీ అలర్టులు అయ్యిండొచ్చు
- ఇలా 150 దేశాల్లో వచ్చాయంటూ యాపిల్ సంస్థ వివరణ

ప్రభుత్వ దన్నుతో మీ ఐఫోన్ల హ్యాకింగ్ యత్నమంటూ విపక్ష ఎంపీల ఫోన్లకు యాపిల్ అలర్ట్‌లు

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోరు తారస్థాయికి చేరిన వేళ విపక్ష నేతల ఫోన్ల హ్యాకింగ్ వార్తలు దేశవ్యాప్తంగా పెను రాజకీయ సంచలనానికి దారితీశాయి. కాంగ్రెస్ మొదలుకుని పలు విపక్షాల ఎంపీలు తదితరుల ఐఫోన్లకు దాని తయారీ సంస్థ యాపిల్ నుంచి మంగళవారం వచ్చిన హ్యాకింగ్ అలర్టులు తీవ్ర కలకలం రేపాయి. 'ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేస్తున్న హ్యాకర్లు మీ ఐఫోన్లను నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు' అంటూ వచ్చిన హెచ్చరిక నోటిఫికేషన్లు సంచలనం సృష్టించాయి. ఇది కచ్చితంగా కేంద్రంలోని మోదీ సర్కారు పనేనంటూ విపక్ష నేతలు భగ్గుమన్నారు. గతంలో పెగసెస్ సాఫ్ట్‌వేర్‌తో తమపై గూఢచర్యం చేసిన బీజేపీ, ఎన్నికల వేళ మరోసారి ఇలాంటి చౌకబారు చర్యలకు దిగిందంటూ దుయ్యబట్టారు. ఈ ఆరోపణలను కేంద్రం తీవ్రంగా ఖండించింది. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించి వాస్తవాలు వెలుగులోకి తెస్తామని ప్రకటించింది. మరోవైపు ఈ కలకలం నేపథ్యంలో, తమ నోటిఫికేషన్లలో కొన్ని ఫేక్ అలర్టులు కూడా ఉండొచ్చంటూ యాపిల్ స్పందించింది. భారత్‌లోనేగాక 150 దేశాల్లో పలువురు యూజర్లకు ఇలాంటి అలర్టులు వచ్చాయని పేర్కొంది. అయితే ఈ అలర్టులకు దారితీసిన కారణాలను బయట పెట్టేందుకు నిరాకరించింది.

నా ఫోన్ తీసుకోండి: రాహుల్



ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. విపక్ష నేతల ఐఫోన్ల హ్యాకింగ్ కచ్చితంగా మోదీ సర్కారు పనేనంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. 'మేం భయపడేది లేదు. మా ఫోన్లను ఎంతగా హాకింగ్ చేసుకుంటారో చేసుకోండి. మీకు కావాలంటే చెప్పండి, నా ఫోన్ కూడా ఇస్తా' అంటూ విరుచుకుపడ్డారు. పారిశ్రామికవేత్త గౌతం అదానీయే ప్రస్తుతం దేశాన్ని రిమోట్ కంట్రోల్‌తో నడుపుతున్నారని ఆరోపించారు. 'ఇప్పుడు దేశంలో అదానీయే నంబర్ వన్. తర్వాతి స్థానాల్లో మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. మోదీ ఆత్మ అదానీ దగ్గరుంది. అందుకే అదానీని ఎవరైనా ఒక్క మాటన్నా వెంటనే నిఘా వర్గాలు రంగంలోకి దిగుతున్నాయి.

దుయ్యబట్టిన విపక్ష నేతలు

ఈ ఉదంతంలో కేంద్రప్రభుత్వ పాత్ర కచ్చితంగా ఉందంటూ విపక్ష నేతలు ఆరోపించారు. తమ ఫోన్లలో అభ్యంతరకర సమాచారాన్ని చొప్పించి అందుకు తమను బాధ్యులను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, శివసేన ఎంపీ ప్రియాంకా చతుర్వేది ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ అంశాన్ని తక్షణం లోక్‌సభ హక్కుల కమిటీకి నివేదించాలని డిమాండ్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మహిళా ఎంపీ మహువా మొయిత్రా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛ, గోప్యతలపై ఇలాంటి దాడి దారుణమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తదితర విపక్ష నేతలను విచారణ పేరుతో వేధించడం, తాజాగా వారి ఫోన్ల హ్యాకింగ్‌కు ప్రయత్నించడం మోదీ సర్కారు అభద్రతా భావానికి సూచనలని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆరోపించారు.

లోతుగా దర్యాప్తు: ఐటీ మంత్రి వైష్ణవ్

విపక్ష నేతల ఆరోపణలను కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొట్టిపారేశారు. మోదీ నాయకత్వంలో దేశ ప్రగతిని చూసి ఓర్వలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే ఈ ఉదంతంపై కూలంకషంగా దర్యాప్తు జరిపించి నోటిఫికేషన్ల వ్యవహారాన్ని నిగ్గుదేలుస్తామని ప్రకటించారు. 'పూర్తి పారదర్శకంగా సరైన సమాచారాన్ని అందజేయడం ద్వారా విచారణలో మాతో కలిసి రావాల్సిందిగా యాపిల్‌ను కోరాం. ముఖ్యంగా ప్రభుత్వ దన్నుతో హ్యాకింగ్ జరగవచ్చని ఏ ఆధారంతో చెప్పారో వివరించాలని సూచించాం. ఇది పూర్తిగా సాంకేతికపరమైన దర్యాప్తు. కనుక కంప్యూటర్ సెక్యూరిటీ సంబంధిత అంశాలకు బాధ్యత వహించే జాతీయ నోడల్ ఏజెన్సీ సెర్ట్-ఇన్ దీన్ని చేపడుతుంది.' అని మంత్రి ప్రకటించారు. ఇలాంటి నోటిఫికేషన్లు 150కి పైగా దేశాల్లోని ఐఫోన్ యూజర్లకు వచ్చాయని ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ గుర్తు చేశారు.

అలర్టులు అందుకున్న నేతలు..

మల్లికార్జున ఖర్గే, శశి థరూర్, పవన్ ఖేరా, కె.సి.వేణుగోపాల్, సుప్రియా శ్రీనేత్, టి.ఎస్.సింగ్‌దేవ్, భూపీందర్ సింగ్ హుడా, రాహుల్ గాంధీ సహాయకులు, మహువా మొయిత్రా (టీఎంసీ), సీతారాం ఏచూరి (సీపీఎం), ప్రియాంకా చతుర్వేది (శివసేన-యూబీటీ), రాఘవ్ ఛద్దా (ఆప్), అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), సమీర్ సరణ్ (ఓఆర్ఎఫ్ అధ్యక్షుడు), సిద్దార్థ్ వరదరాజన్ (ద వైర్ వ్యవస్థాపక ఎడిటర్), ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఓఎస్డీ తదితరులు

యాపిల్ అలర్టులో ఏముందంటే...

'ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేసే హాకర్లు మీ ఐఫోన్‌ను టార్గెట్ చేసుకుని ఉండొచ్చని యాపిల్ అనుమానిస్తోంది. బహుశా మీ హోదా, మీరు చేస్తున్న పనుల వల్ల మీరు వ్యక్తిగతంగా వారి లక్ష్యంగా మారి ఉండొచ్చు. ఇలాంటి ప్రభుత్వ ఆధ్వర్యంలోని హాకర్లు మీ ఫోన్‌ను హాక్ చేసి తమ అధీనంలోకి తీసుకుంటే అందులోని సున్నితమైన డేటా, సమాచారంతో పాటు కెమెరా, మైక్రోఫోన్ వారి చేతిలోకి వెళ్లిపోతాయి. ఇది ఫేక్ హెచ్చరికే అయ్యుండే ఆస్కారమూ లేకపోలేదు. కానీ దయచేసి దీన్ని సీరియస్‌గా తీసుకోండి'

అర్ధరాత్రి రోడ్డుపై ప్రాణభయంతో పరుగులు..

బెంగళూరు: ఓ వ్యక్తి ప్రాణభయంతో పరుగులు తీస్తుండగా వెనుకే ఓ స్కార్పియో వాహనం అతడిని తరుముతోంది. చివరికి అతడిని బలంగా ఢీకొట్టి అంతే వేగంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితుడు ఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరు నగరంలోని పులకేశి నగర్‌లో అక్టోబర్ 18వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో అందరూ చూస్తుండగానే జరిగిన దారుణమిది. మృతుడిని అస్గర్‌గా గుర్తించిన పోలీసులు, సాధారణ రోడ్డు ప్రమాద కేసుగా భావించారు. అయితే, మృతుడి స్నేహితుడిచ్చిన సమాచారంతో దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు అఫ్రీన్, అతడి వెంట ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. డబ్బు వివాదం కారణంగానే తామీ పనికి పూనుకున్నట్లు వారు అంగీకరించారు. దీంతో ముగ్గురిపైనా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. అస్గర్ సెకండ్ హ్యాండ్ కార్ డీలర్ కాగా, అతడి వద్ద అఫ్రీన్ కారు కొనుగోలు చేశాడు. దీనికి సంబంధించి అతడు అస్గర్‌కు రూ.4 లక్షలు బకాయి పడ్డాడు. దీనిపై ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. అస్గర్ తనపై దాడి చేశాడంటూ అఫ్రీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు వెనక్కి తీసుకోవాలని అస్గర్ కోరగా అఫ్రీన్ నిరాకరిస్తున్నాడు. ఘటన జరిగిన రాత్రి మాట్లాడుకుందాం రమ్మని అస్గర్‌ను అఫ్రీన్ పిలిచాడు. చెప్పినచోటుకు రాగానే ప్లాన్ ప్రకారం అతడిని కారుతో ఢీకొట్టి, చంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఈ ఘటన ఆ సాంతం వీడియో తీశాడని పోలీసులు చెప్పారు.

పారిస్ రైలులో బెదిరింపులు.. పోలీసు కాల్పులు

పారిస్: ఫ్రాన్సు రాజధాని పారిస్‌లో హిజాబ్ ధరించిన ఓ మహిళ(38) రైలులో ప్రయాణికులను బెదిరింపులకు గురిచేసింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపి ఆమెను గాయపరిచారు. దక్షిణ పారిస్‌లోని 13వ డిస్ట్రిక్ట్ గుండా వెళ్తున్న సబర్బన్ రైలులో ఓ మహిళ 'అల్లాహు అక్బర్' అని అరుస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తోందంటూ పోలీసులకు సమాచారం అందింది. ఉగ్రవాద వ్యతిరేక దళం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని, సదరు మహిళను పలుమార్లు హెచ్చరించారు. తనను తాను పేల్చేసుకుంటానంటూ బెదిరించింది. దీంతో పోలీసులు ఆమెపైకి కాల్పులు జరిపారు. గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఆమె 2021లోనూ భద్రతా అధికారులను ఇలాగే బెదిరింపులకు గురిచేసిందన్నారు. ఈ సంఘటన తర్వాత మానసిక ఆరోగ్య కారణాలతో కొన్ని రోజులపాటు నిర్బంధంలో ఉంచామన్నారు. తాజా ఘటనపై దర్యాప్తు చేపట్టామన్నారు. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధంతో ఫ్రాన్సులో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ చోటుచేసుకున్న ఈ ఘటనపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

సారా అబ్దుల్లాతో సచిన్ పైలట్ విడాకులు

జైపూర్: భార్య సారా అబ్దుల్లాతో విడాకులు తీసుకున్నట్లు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్(46) మొదటిసారిగా వెల్లడించారు. మంగళవారం టోంక్ స్థానానికి ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు. భార్య వివరాలు తెలిపే కాలమ్‌లో ఆయన 'డైవోర్స్‌డ్' అని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా కూతురు సారా అబ్దుల్లా. సారా, సచిన్‌లు 2004లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఆరన్, విహాన్ అనే కొడుకులున్నారు. ఇద్దరూ తన వద్దే ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా, అయిదేళ్లలో పైలట్ ఆస్తులు రెట్టింపైనట్లు కూడా అఫిడవిట్‌ను బట్టి తెలుస్తోంది. 2018లో ఆయన ఆస్తుల విలువ రూ.3.8 కోట్లు కాగా, 2023లో రూ.7.5 కోట్లకు చేరాయి.



గాజా స్ట్రిప్‌లోని రఫాలో ఇజ్రాయెల్ దాడుల్లో నేలమట్టమైన భవన శిథిలాల వద్ద విచార వదనంతో బాలిక

గాజాపై నిప్పుల వాన

దెయిర్ అల్ బలా (గాజా): ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల తీవ్రతకు గాజా అల్లాడుతోంది. మంగళవారం ఇజ్రాయెల్ క్షిపణుల ధాటికి వందలాది నివాసాలు నేలమట్టమయ్యాయి. ఒక్క రోజే ఏకంగా 300 'లక్ష్యాలను' ఛేదించినట్టు సైన్యం ప్రకటించింది. ముఖ్యంగా శరణార్థుల ఆవాస ప్రాంతంలోని కనీసం ఆరు అపార్ట్‌మెంట్లను ఇజ్రాయెల్ రాకెట్లు కుప్పకూల్చాయి. ఈ దారుణంలో భారీగా జన నష్టం జరిగిందని హమాస్ ఆరోపించింది. మృతుల సంఖ్యపై ఇప్పటిదాకా స్పష్టత రాకున్నా వందల మంది చనిపోయి ఉంటారని చెబుతున్నారు. శిథిలాల దిబ్బల్లో తమవారి కోసం వెదుకుతున్న దృశ్యాలు కలచివేస్తున్నాయి. వీడియో ఫుటేజీల్లో రక్తమోడుతున్న ఇద్దరు బాలలను కొందరు యువకులు భుజాలపై వేసుకుని తీసుకొస్తూ కన్పించారు. మరోవైపు నుంచి ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు ఉత్తర గాజాపై శతఘ్నుల వర్షం కురిపిస్తున్నాయి. అక్కడి హమాస్ ఉగ్రవాద సంస్థ తాలూకు భూగర్భ నిర్మాణాలపై ప్రత్యక్ష దాడులకు దిగింది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య పలుచోట్ల పెద్దపెట్టున కాల్పులు జరుగుతున్నాయి. ఉత్తర గాజాలో ఇంకా లక్షల మంది పాలస్తీనియన్లు చిక్కిపోయి ఉన్న నేపథ్యంలో ప్రాణ నష్టం ఏ స్థాయికి పెరుగుతుందోనంటూ సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయినా హమాస్‌ను నిర్మూలించేదాకా కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. ఐరాస సహాయక సంస్థలకు చెందిన 64 మంది సిబ్బంది ఇప్పటిదాకా దాడులకు బలయ్యారు. ఇంత తక్కువ సమయంలో ఇంతమంది తమ సిబ్బంది మరణించడం ప్రపంచంలో ఇప్పటిదాకా ఏ పోరులోనూ జరగలేదని ఐరాస అధికార ప్రతినిధి వాపోయారు. ఇప్పటిదాకా పోరుకు బలైన పాలస్తీనియన్ల సంఖ్య 9,000 దాటినట్టు తెలుస్తోంది.

సైనికురాలి విడుదల

హమాస్ చెర నుంచి ఒరీ మెగిదీష్ అనే తమ సైనికురాలిని విజయవంతంగా విడిపించుకున్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) ప్రకటించింది. ఆమెను అక్టోబర్ 7న మెరుపు దాడి సందర్భంగా ఉగ్రవాదులు అపహరించినట్టు వివరించింది. ఆమె తన కుటుంబ సభ్యులతో ఉన్న తాజా ఫొటోను ప్రధాని కార్యాలయం సోషల్ మీడియాలో షేర్ చేసింది. హమాస్ చెరలో ఇంకా 240 మందికి పైగా బందీగా ఉన్నట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

సముద్రమార్గంలో సాయం: సైప్రస్

అత్యవసరాలకు కూడా దిక్కు లేక అల్లాడుతున్న గాజావాసులను ఆదుకునేందుకు సైప్రస్ ముందుకొచ్చింది. ఐరోపా సమాఖ్య, మధ్య ప్రాచ్య దేశాలు సహకరిస్తే సముద్రమార్గ నడువా(సీ కారిడార్) ఏర్పాటు చేసి నిత్యావసరాలను గాజాకు చేరవేస్తామని ప్రకటించింది.

హమాస్ అగ్ర నేత హతం!

మంగళవారం వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్ అగ్ర నేత సలేహ్ అల్ అరౌరీ నివాసాన్ని నేలమట్టం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దాడిలో అతను కూడా మరణించి ఉంటాడని భావిస్తున్నారు. అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ భారీ మెరుపుదాడికి పథక రచన చేసిన హమాస్ ఉత్తర డివిజన్ కమాండర్ నసీమ్ అబు అజీనా కూడా తమ యుద్ధ విమానాల దాడిలో హతమైనట్టు సైన్యం పేర్కొంది.

యువత కోసం 'మై భారత్'

- ప్రారంభించిన ప్రధాని మోదీ
- అమృత్ మహోత్సవ్ స్మారక్, అమృత్ వాటికలకు శంకుస్థాపన

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2021 మార్చి 12న ప్రారంభమై రెండేళ్లపాటు సాగిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమం మంగళవారం ముగిసింది. నా మట్టి-నా దేశం(మేరీ మాటీ-మేరా దేశ్)లో దేశవ్యాప్తంగా సేకరించిన మట్టితో ఢిల్లీకి చేరిన కలశాల్లోని మట్టిని ప్రధాని మోదీ కర్తవ్యపథ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో అమృత్ కలశ్‌లో నింపారు. ఆ మట్టితో నుదుటన తిలకం దిద్దుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మంత్రి యువత కోసం 'మై భారత్'అనే సామాజిక వేదికను ప్రారంభించారు. అమృత్ మహోత్సవ్ స్మారక్, అమృత్ వాటికలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి, అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోదీ, ఇతర నేతలు, ఆహూతులతో కలిసి 'పంచ్ ప్రాణ్' ప్రతిజ్ఞ చేశారు. మేరా యువ భారత్ (మై భారత్) స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. ఇది యువత సారథ్యంలో జరిగే అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించడానికి, యువత తోడ్పాటునందిస్తుందని కేంద్ర సాంస్కృతిక శాఖ తెలిపింది. అమృత్ మహోత్సవ్ స్మారక్, అమృత్ వాటిక శంకుస్థాపన తర్వాత, ప్రతిపాదిత నిర్మాణాల డిజిటల్ వెర్షన్‌ను ప్రదర్శించే చిన్న వీడియో అక్కడ ప్రదర్శించారు. అమృత్ వాటిక 12 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని, నాలుగు నుంచి ఆరు నెలల్లో పూర్తవుతుందని అధికారులు చెప్పారు.



అమృత్ కలశ్‌లోని మట్టితో నుదుట తిలకం దిద్దుకుంటున్న మోదీ. చిత్రంలో మంత్రులు మీనాక్షి లేఖీ, మేఘ్వాల్, నిశిత్, అమిత్ షా

బుజ్జగింపు రాజకీయాలే పురోగతికి అడ్డంకి

కెవాడియా: దేశ అభివృద్ధి ప్రయాణంలో బుజ్జగింపు రాజకీయాలే అతిపెద్ద అవరోధంగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సానుకూల రాజకీయాలను మాని, స్వార్థపూరిత లక్ష్యాల కోసం దేశ ఐక్యతతో సైతం రాజీపడే చాలా పెద్ద రాజకీయ వర్గంపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. గడిచిన తొమ్మిదేళ్లలో దేశం పలు వైపుల నుంచి అనేక అంతర్గత సవాళ్లను ఎదుర్కొందని చెప్పారు. కానీ, మన భద్రతా బలగాల కృషి ఫలితంగా మన శత్రువులు గతంలో మాదిరిగా సఫలీకృతం కాలేకపోయారని ప్రధాని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని నర్మదా జిల్లా కెవాడియాలో ఐక్యతా విగ్రహం వద్ద ప్రధాని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినంగా కూడా పాటిస్తారు. దేశానికి వచ్చే 25 ఏళ్లు అత్యంత ముఖ్యమైనవని ప్రధాని అన్నారు. పటేల్ నుంచి స్ఫూర్తి పొందుతూ దేశాన్ని సంపన్నంగా, అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. 'మన అభివృద్ధి ప్రయాణంలో అతి పెద్ద అడ్డంకి బుజ్జగింపు రాజకీయాలు. ఇలాంటి రాజకీయాలు నెరిపేవారు ఉగ్రవాదాన్ని, దాని భయానక, రాక్షస రూపాన్ని ఎన్నడూ చూడలేరు. దేశంలో అనేక దశాబ్దాలపాటు చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు సాక్ష్యం'అని ప్రధాని అన్నారు. 'ఇలాంటివారు ఉగ్రవాద కార్యకలాపాలపై దర్యాప్తును నిర్లక్ష్యం చేస్తారు. దేశ వ్యతిరేక శక్తులపై ఉదాసీనంగా ఉంటారు. బుజ్జగింపు మనస్తత్వం చాలా ప్రమాదకరమైంది. ఉగ్రవాదులను సైతం రక్షిస్తుంది. ఇటువంటి వైఖరితో ఏ సమాజానికీ, ఏ దేశానికీ ఎప్పటికీ ప్రయోజనం ఉండదు'అని ప్రధాని అన్నారు.

సూపర్ అణుబాంబు!

- 'హిరోషిమా'కంటే 24 రెట్లు శక్తిమంతం
- త్వరలో తయారు చేస్తాం: అమెరికా

వాషింగ్టన్: అటు ఏడాదిన్నర దాటినా ఆగని రష్యా-ఉక్రెయిన్ యుద్ధం. ఇటు తాజాగా పాలస్తీనా-హమాస్ పోరు. ఇంకోవైపు భయపెడుతున్న చైనా-తైవాన్ తదితర ఉద్రిక్తతలు. ఈ సమస్యలన్నీ చాలవన్నట్టు దేశాల మధ్య అణ్వాయుధ పోటీని మరింత పెంచే దిశగా అమెరికా అడుగులు వేస్తోంది. అత్యంత శక్తిమంతమైన సూపర్ అణు బాంబును తయారు చేయనున్నట్టు మంగళవారం ప్రకటించింది! అది రెండో ప్రపంచ యుద్ధం చివర్లో జపాన్‌లోని హిరోషిమాపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు కంటే ఏకంగా 24 రెట్లు శక్తిమంతంగా ఉండనుందని వెల్లడించింది! 1945 ఆగస్టులో హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన అణుబాంబులు లెక్కలేనంత జన నష్టానికి దారితీయడం తెలిసిందే. ఆ విధ్వంసాన్ని తలచుకుని జపాన్ ఇప్పటికీ వణికిపోతుంటుంది. హిరోషిమాపై వేసిన అణుబాంబు 15 కిలో టన్నుల శక్తిని, నాగసాకిపై పడ్డ బాంబు 23 కిలో టన్నుల శక్తిని విడుదల చేశాయి. ఇప్పుడు తయారు చేయనున్న అణుబాంబు ఏకంగా 360 కిలో టన్నుల శక్తిని వెలువరిస్తుందని చెబుతున్నారు! బి61 న్యూక్లియర్ గ్రావిటీ బాంబును ఆధునీకరించి రూపొందిస్తున్న ఈ బాంబును బి61-13గా పిలుస్తున్నారు. దీని తయారీకి అమెరికా కాంగ్రెస్ అనుమతి లభించాల్సి ఉంది. అంతేగాక తమ అమ్ములపొదిలో ఉన్న అణ్వాయుధాలను 2030 కల్లా 1,000కి పెంచనున్నట్టు కూడా అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది.

చైనా, పాక్ సరిహద్దుల్లో ఎస్-400 క్షిపణుల మోహరింపు

న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) మూడు స్క్వాడ్రన్ల ఎస్-400 క్షిపణులను మోహరించింది. రష్యా నుంచి ఇంకా రెండు స్క్వాడ్రన్ల ఎస్-400 క్షిపణి వ్యవస్థలను అందుకునే విషయంలో తుది చర్చలు జరుపుతున్నట్లు ఐఏఎఫ్ తెలిపింది. ఇప్పటికే అందిన మూడు స్క్వాడ్రన్లు కీలక ప్రాంతాల్లో విధుల్లో ఉన్నాయని తెలిపింది. ఒక యూనిట్‌ను చైనా, పాకిస్తాన్‌లకు కలిపి, మరో రెండు యూనిట్లు చైనా, పాకిస్తాన్‌లకు వేర్వేరుగా సరిహద్దుల్లో ఉన్నాయని రక్షణ వర్గాలు ఏఎన్ఐకి వివరించాయి. మిగతా రెండు స్క్వాడ్రన్ల బట్వాడా ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఆలస్యమవుతోందని వివరించింది. ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు మిగతా ఎస్-400 క్షిపణి వ్యవస్థలను అందజేసేదీ లేనిదీ రష్యా స్పష్టం చేయలేదని తెలిపింది. దీనిపై త్వరలోనే ఆ దేశంతో చర్చలు జరుపుతామని వెల్లడించింది. అయితే, భారత్ కోసం తయారు చేసిన ఈ వ్యవస్థలను ఉక్రెయిన్‌పై రష్యన్లు వినియోగించుకుంటున్నట్లు తెలిసిందని ఆ వర్గాలు అంచనా వేశాయి. అయితే, దీనిని రష్యా ధ్రువీకరించలేదు. 2018-19లో ఎస్-400 క్షిపణి వ్యవస్థల కోసం రష్యాతో రూ.35 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు గుర్తు చేసింది. మరో పరిణామంలో, ప్రాజెక్టు కుషాలో భాగంగా లాంగ్ రేంజ్ సర్ఫేస్ ఎయిర్ మిస్సైల్ వ్యవస్థ(ఎల్ఆర్‌సామ్)ల కొనుగోలుకు రక్షణ శాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ క్షిపణులు 400 కిలోమీటర్ల పరిధిలోని శత్రు విమానాలు, మిస్సైళ్లను ధ్వంసం చేయగలవు.

మణిపూర్‌లో అలజడి

పోలీసు అధికారి కాల్చివేత

ఇంఫాల్: మణిపూర్‌లో రెండు జాతుల మధ్య వైరం సమసిపోయి సాధారణ పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో కలకలం రేగింది. మంగళవారం తెంగ్నోపాల్ జిల్లాలోని మోరే పట్టణంలో సరిహద్దు భద్రతా బలగాలు నిర్మిస్తున్న ఓ హెలీప్యాడ్‌ను పర్యవేక్షించడానికి వచ్చిన మోరే సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్(ఎస్‌డీపీఓ) చింగ్థమ్ ఆనంద్‌పై గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో అధికారి ప్రాణాలు కోల్పోయారు. మయన్మార్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో కుకీ తెగ వ్యక్తుల ప్రాబల్యం ఎక్కువ. పోలీసు అధికారి హత్యతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన జరిగిన ప్రాంతంలోనే గతంలో కొన్ని నెలల పాటు కుకీ, మైతేయ్ జాతుల మధ్య తీవ్ర ఘర్షణలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసు అధికారి హత్యతో కాల్పులకు తెగబడిన వ్యక్తిని పట్టుకునేందుకు భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. 'గాయాన్ని బట్టి చూస్తే అది స్నైపర్ రైఫిల్‌తో కాల్చినట్లు తెలుస్తోంది. బుల్లెట్ దూసుకొచ్చిన మార్గం జనావాసాల మధ్యలో ఉంది. వెంటనే బలగాలను జనావాసాల్లోకి పంపితే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఆ పని చేయలేకపోయాం' అని ఘటనపై పోలీసు ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

బీడ్ నగరంలో కర్ఫ్యూ

- ఇంటర్నెట్ సేవలు బంద్
- జిల్లాలో 55 మంది అరెస్ట్

ముంబై/ ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలో ప్రత్యేక కోటా డిమాండ్‌తో మరాఠాలు చేపట్టిన నిరసనలతో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. సోమవారం బీడ్ జిల్లాలో ఇద్దరు ఎన్సీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే ఇళ్లు, కార్యాలయాలపై ఆందోళనకారులు దాడులకు పాల్పడి, నిప్పంటించిన విషయం తెలిసిందే. పలు ప్రాంతాల్లో రహదారులపై బైటాయించారు. ఈ ఘటనల నేపథ్యంలో అధికార యంత్రాంగం అదనంగా పోలీసు బలగాలను మోహరించింది. మరాఠ్వాడా ప్రాంతంలోని కొందరు రాజకీయ నేతలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ పెంచింది. సోమవారం సాయంత్రం సుమారు వెయ్యి మంది ఆందోళనకారులు బీడ్ డిపోలోని 53 బస్సుల అద్దాలు, సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారు. వాటికి నిప్పుపెట్టేందుకు కూడా ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు రూ.70 లక్షల మేర నష్టం కలిగించారన్నారు. సోమవారం రాత్రి, మంగళవారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పోలీసు అధికారులు తెలిపారు. సోమవారం దాడుల్లో పాల్గొని, ఆస్తులకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 12 కేసులు నమోదు చేసి, 55 మందిని అరెస్ట్ చేసినట్లు బీడ్ ఎస్పీ నందకుమార్ ఠాకూర్ చెప్పారు. వేర్వేరు హింసాత్మక పాల్పడిన 300 మందిని గుర్తించామన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో ముందు జాగ్రత్తగా దుకాణాలను మూయించివేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. బీడ్ నగరంలో కర్ఫ్యూ విధిస్తూ కలెక్టర్ దీపా ముధోల్ ముండే మంగళవారం సాయంత్రం ఆదేశాలిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల వెంట, తాలూకా ప్రధాన కార్యాలయాలు, కలెక్టర్ ఆఫీసుకు అయిదు కిలోమీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు. నగరంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశామన్నారు. ధారాశివ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనూ అధికారులు కర్ఫ్యూ అమలు చేస్తున్నారు. మంగళవారం పుణే నగరంలో ముంబై- బెంగళూరు హైవేపై కొందరు ఆందోళనకారులు టైర్లను కాల్చారు.

మరాఠాలకు కుణ్బి సర్టిఫికెట్ల జారీ

మరాఠాలకు ప్రత్యేక కోటా కల్పించాలంటూ వెల్లువెత్తిన ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘా లపై చర్యలు ప్రారంభించింది. మరాఠ్వాడా ప్రాంతంలో మరాఠాలకు కుణ్బి కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియపై ఏర్పాటైన హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ షిండే కమిటీ అందించిన ప్రాథమిక నివేదికను మంగళవారం రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈ మేరకు కుణ్బి కుల ధ్రువీకరణ పత్రాల జారీ మొదలైందని కూడా ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. వ్యవసాయమే వృత్తిగా ఉన్న కుణ్బి కులాన్ని మహారాష్ట్రలో ఇతర వెనుకబడిన కులాల(ఓబీసీ) కేటగిరీలో చేర్చారు. విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరికి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మరాఠాలు విద్యాపరంగా, సామాజికంగా ఎంతమేరకు వెనుకబడి ఉన్నారనే విషయమై ఓబీసీ కమిషన్‌తో అంచనా వేయించాలని కూడా మంగళవారం సీఎం ఏక్‌నాథ్ షిండే అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ విషయంలో న్యాయపరమైన అంశాలపై సూచనలిచ్చేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయనుంది.

ఇస్రో చీఫ్‌కు రాజ్యోత్సవ అవార్డు

సోమనాథ్ సహా 68 మందికి ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు: ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ సహా 68 మందికి కర్ణాటక ప్రభుత్వం మంగళవారం రాజ్యోత్సవ అవార్డులను ప్రకటించింది. తమతమ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారిని రాష్ట్రంలో రెండో అతిపెద్ద పౌర పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపింది. నవంబర్ ఒకటో తేదీన 68వ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అవార్డుతో సన్మానించనున్నట్లు వివరించింది. ఎంపికైన వారిలో 13 మంది మహిళలు, 54 మంది పురుషులు ఉన్నారు. గ్రహీతలకు పురస్కారం కింద రూ.5 లక్షల నగదు, 25 గ్రాములు బంగారు పతకం అందజేస్తారు.


ఉగ్రమూకల కాల్పుల్లో నేలకొరిగిన కానిస్టేబుల్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో వరుసగా మూడో రోజూ ఉగ్రమూకలు రెచ్చిపోయాయి. బారాముల్లా జిల్లా పట్టన్ ఏరియాలో క్రాల్‌పొరకు చెందిన హెడ్ కానిస్టేబుల్ గులాం మహ్మద్ దార్‌పై మంగళవారం ఉదయం ఆయన ఇంటి వద్దే ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. తీవ్రంగా గాయపడిన దార్ ఆస్పత్రిలో కన్నుమూశారని అధికారులు తెలిపారు.



చేయి వదలకు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ఎస్ కాలనీలో భవన నిర్మాణ పనుల వద్ద ఓ కార్యకర్త చేయి పట్టుకొని కిందకు దిగుతున్న దృశ్యం



దాదాపు అన్ని దేశాల్లో వేతనాల పెంపుపై ప్రకటనలు

ఓటర్లను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల పాట్లు	ఆకర్షణీయమైన హామీలు..అమ్ముల పొదిలో తాయిలాలు	థాయ్‌లాండ్‌లో రైతుబంధు తరహా హామీ

టర్కీలో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన ప్రధాన పార్టీలు

అర్జెంటీనాలో రాష్ట్రాల పునర్విభజన అంశం తెరపైకి

ఏ దేశమేగినా... ఎన్నికల తీరు ఒకటే..!

గాసిప్ టైమ్

సీఎం పోస్టు తప్ప ఏదైనా ఓకే..!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓ సీనియర్ ఎమ్మెల్యే అభ్యర్థి అన్ని పార్టీలు తిరిగిండు. తాజాగా 'కారు'లో సీటు కోసం పోటీ పడ్డాడు. ఇటీవల మీ పార్టీలో చేరతానంటూ అధినాయకులను కలిసిండు. నాకే ప్రజల మద్దతు ఉంది... అయినప్పటికీ బీఫారంలూ ఇచ్చేశారు కాబట్టి తగ్గుతాను అన్నాడు. కాకపోతే తనకు ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి, కుమారుడికి కార్పొరేషన్ పోస్టు, కోడలికి జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలనే డిమాండ్ పెట్టిండు. దీంతో అవాక్కయిన అధిష్టానం పెద్దలు కుదరదని స్పష్టం చేయడంతో.. చివరికి మరోమెట్టు దిగాడు. కనీసం ఎన్నికల ఖర్చులు భరిస్తే గెలిచి మీ పార్టీలో చేరతానని విన్నవించుకున్నాడు. ఈ షరతుల జాబితా ఉమ్మడి కరీంనగర్ రాజకీయ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారింది.

పాప్ కార్న్



సునీల్‌రెడ్డి



వినయ్‌రెడ్డి

అలా వచ్చారు.. ఇలా టికెట్ కొట్టారు!

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు ఇటీవల పార్టీలోకి అలా వచ్చి, ఇలా టికెట్లు సాధించారు. బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి గత జూలై 20న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సెప్టెంబర్ 8న చేరారు. గత ఎన్నికల్లో సునీల్‌రెడ్డి బీఎస్పీ, వినయ్‌రెడ్డి బీజేపీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఇటీవలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వీరిద్దరూ మొదటి జాబితాలోనే టికెట్లు దక్కించుకోవడం , పక్కపక్క నియోజకవర్గాల వారే కావడం గమనార్హం.

వినిపిస్తోందా.. మూడో స్వరం

వివక్ష లేని జీవితం, సామాజిక భద్రత కావాలంటున్న ట్రాన్స్‌జెండర్‌లు

అస్తిత్వాన్ని చాటుకొనేందుకే ఎన్నికల బరిలోకి...

ప్రజాస్వామ్య సౌధమైన శాసనసభలో మూడో స్వరం వినిపించేందుకు ట్రాన్స్‌జెండర్లు ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. వరంగల్ తూర్పు సెగ్మెంట్ నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు రామన్నపేటకు చెందిన చిత్రపు పుష్పిత లయకు తాజాగా అవకాశం లభించగా, గత ఎన్నికల్లో గోషామహల్ నుంచి బీఎల్ఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రముఖి కూడా ఈసారి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక ట్రాన్స్‌జెండర్‌లతో పాటు ప్రజల్లో ఓటు అవగాహనకు రాష్ట్ర ఎన్నికల ప్రచార కర్తగా వరంగల్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ లైలాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమించింది. ఆమె తమ కమ్యూనిటీ వారు ఓటు నమోదు చేసుకునేందుకు అవగాహన కలిగిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్/హైదరాబాద్

రాష్ట్రంలో సుమారు 50 వేల మందికి పైగా ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థలు అంచనా వేస్తున్నాయి. కానీ ఓటర్లుగా నమోదైన వారి సంఖ్య మాత్రం చాలా తక్కువగా ఉంది. ట్రాన్స్‌జెండర్ల పట్ల సమాజం నుంచి ఎదురయ్యే వివక్ష, అవమానాలు, వేధింపుల కారణంగానే చాలామంది 'మగవారు'గానే మనుగడ కొనసాగిస్తున్నట్టు ఆయా సంస్థలు చెబుతున్నాయి. అన్ని జీవన సమూహాల్లాగే ట్రాన్స్‌జెండర్లు కూడా స్వేచ్ఛాయుతమైన జీవనాన్ని కొనసాగించే హక్కును కలిగి ఉన్నట్లు గతంలో వెలువరించిన సుప్రీంకోర్టు తీర్పు వారికి గొప్ప ఆత్మస్థైర్యాన్ని కలిగించింది. మరోవైపు వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, హక్కులసంఘాల నుంచి వారికి సంపూర్ణమైన మద్దతు, అండదండలు లభించాయి. దీంతో ట్రాన్స్‌జెండర్లు సంఘటితమయ్యారు. తమ ఉనికిని బలంగా చాటుకొనేందుకు ఎన్నికలను ఒక అస్త్రంగా మలుచుకున్నారు. తీవ్రమైన వివక్ష, అణచివేతకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్‌ల అస్తిత్వాన్ని చాటుకొనేందుకు, ఆకాంక్షలనువెల్లడించేందుకు చట్టసభలను వేదికగా చేసుకోవాలని భావిస్తున్నట్లు చిత్రపు పుష్పిత లయ, చంద్రముఖి చెబుతున్నారు.



ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా చంద్రముఖి

ట్రాన్స్‌జెండర్ల అస్తిత్వాన్ని చాటుకొనేందుకు మరోసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు మువ్వల చంద్రముఖి వెల్లడించారు. భరతనాట్య కళాకారిణి. వ్యాఖ్యాత, సినీనటి అయిన చంద్రముఖి దశాబ్దకాలంగా ట్రాన్స్‌జెండర్స్ హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రజాస్వామ్య సౌధంలో మూడోస్వరాన్ని వినిపించేందుకే 2018లో ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధిగా, బీఎల్ఎఫ్ అభ్యర్థిగా గోషామహల్ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆమెకు 1125 ఓట్లు లభించాయి. ఈ సారి మాత్రం స్వతంత్ర అభ్యర్థిగా నిలబడాలనుకుంటున్నట్లు చెప్పారు. ఏ నియోజకవర్గం నుంచి అనేది ఇంకా నిర్ణయించుకోలేదన్నారు.



బీఎస్పీ కార్యకర్త నుంచి అభ్యర్థిగా చిత్రపు పుష్పిత లయ ప్రస్థానం

వరంగల్ రామన్నపేటకు చెందిన చిత్రపు పుష్పిత లయ బీఎస్పీ పార్టీ కార్యకర్తగా ఢిల్లీలో ఐదేళ్లు పనిచేశారు. ఆ తర్వాత డాక్టర్ అంబేడ్కర్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలిగా పనిచేశారు. రెండేళ్ల నుంచి వరంగల్ తూర్పు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు ట్రాన్స్‌జెండర్ల తరఫున తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎన్నికల ప్రచారకర్తగా లైలా..

మహబూబాబాద్ జిల్లాలోని అన్నారం గ్రామానికి చెందిన లైలా అలియాస్ ఓరుగంటి లక్ష్మణ్ డిగ్రీ చదువుకునే రోజుల్లో హిజ్రావైపు మళ్లారు. పూర్తిస్థాయి ట్రాన్స్‌జెండర్‌గా మారి డబుల్ పీజీ కూడా చేశారు. 20 ఏళ్ల నుంచి మ్యారీ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ప్రాజెక్టులో హెల్త్ వర్కర్‌గా పనిచేస్తూ వరంగల్‌లో ఉంటున్నారు. రాష్ట్ర హిజ్రాల వెల్ఫేర్ సంఘం సభ్యురాలుగా కూడా ఎన్నికయ్యారు. వారి కమ్యూనిటీ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో కృషి చేస్తున్నారు. ఈమె సేవలను గుర్తించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ ఏడాది సెప్టెంబర్ 19వ తేదీన ఎన్నికల ప్రచారకర్త (అంబాసిడర్)గా నియమించడం విశేషం.

జంగ్ తెలంగాణ

ఎన్నికలవే.. ఎరలవే!

మేకల కళ్యాణ్ చక్రవర్తి

'ఎప్పుడొచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా లేదా..' అనే సినిమా డైలాగ్ తరహాలో ఎలాంటి హామీలిచ్చామన్నది కాదు.. తమకు అనుకూలంగా బ్యాలెట్ బాక్సులు నిండాయా..లేదా? అధికారం చేపడతామా..లేదా?.. ఎన్నికలు ఎక్కడ, ఎప్పుడు జరిగినా రాజకీయ పార్టీల టార్గెట్ ఇదే. నగదుతో పాటు చీరలు, సెల్‌ఫోన్లు, కుక్కర్ల లాంటి వస్తువుల పంపిణీతో ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు ప్రయత్నించడం.. ముఖ్యంగా అధికారంలోకి వస్తే అది చేస్తాం..ఇది చేస్తాం.. అంటూ హామీలు గుప్పించడం. ప్రపంచవ్యాప్తంగా పార్టీలది ఇదే బాట. తెలంగాణ అయినా, భారత్‌లో అయినా, పర్యాటక ప్రేమికుల స్వర్గధామం థాయిలాండ్ అయినా, భూకంపాల పుట్టినిల్లు టర్కీ అయినా.. ఎక్కడైనా ఓటర్ల కోసం తాయిలాలే. మన దేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా పార్టీలు ఇస్తున్న హామీల తరహాలోనే.. గతంలో ప్రపంచంలోని పలు దేశాల ఎన్నికల్లోనూ పార్టీలు అనేక రకాల హామీలను గుప్పించి ఓట్లు సంపాదించే ప్రయత్నం చేయడం గమనార్హం. అయితే కొన్ని దేశాల్లో ప్రజాకర్షక హామీలతో పాటు పలు ఆర్థిక, సామాజిక, రక్షణ రంగాలకు సంబంధించిన అంశాలు కూడా అక్కడి ఓటర్లను ప్రభావితం చేయడం ఆసక్తి కలిగించే అంశం. కాగా, ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఎన్నికలు జరిగిన టర్కీ, అర్జెంటీనా, పోలండ్, థాయ్‌లాండ్ దేశాల్లో స్థానిక ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లకు ఎలాంటి తాయిలాలు ప్రకటించాయో ఓసారి చూద్దాం.

పోలండ్‌లో హక్కుల అంశాలు!

1989లో కమ్యూనిస్టు పాలన ముగిసిన తర్వాత పోలండ్‌లో మొదటిసారి ఈ ఏడాది అక్టోబర్‌లో పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఇక్కడ అధికార లా అండ్ జస్టిస్ పార్టీ (పీఐఎస్) మిత్రపక్షాలు, సెంటర్ రైట్ సివిక్ ప్లాట్‌ఫామ్ (పీవో)లు హోరాహోరీ తలపడ్డాయి. ఇక్కడి ఎన్నికలు రక్షణ రంగం, వలసలు, యూరోపియన్ యూనియన్ పాత్ర, మహిళలు, స్వలింగ సంపర్కుల హక్కులు, ద్రవ్యోల్బణం లాంటి అంశాలపై జరిగాయి. చిన్నారులు, వృద్ధులకు ఉచితంగా ఔషధాలను ఇస్తామని, 1989 కంటే ముందు కట్టిన అపార్ట్‌మెంట్లను ఆధునీకరిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాలను పెంచుతామని, కనీస వేతనాన్ని 6,450 జ్లోటీలకు పెంచుతామనే హామీలనిచ్చాయి.

థాయ్‌లాండ్‌లో ఆర్థిక లబ్ధిపై దృష్టి!

ప్రపంచ పర్యాటక కేంద్రమైన థాయ్‌లాండ్‌లో ఈ ఏడాది మేలో సాధారణ ఎన్నికలు జరిగాయి. ఇక్కడి ప్రధాన రాజకీయ పార్టీలయిన ఫ్యూ థాయ్ పార్టీ, మూవ్ ఫార్వార్డ్ పార్టీ, యునైటెడ్ థాయ్ నేషన్ పార్టీ, పలాంగ్ ప్రచారత్ పార్టీ, భుంజయ్‌థాయ్ పార్టీ, డెమొక్రాట్ పార్టీలు ఓట్ల వేటలో భాగంగా పలు హామీలు అక్కడి ప్రజలకు ఇచ్చాయి. ఎక్కువగా ఆర్థిక లబ్ధి చేకూర్చే కార్యక్రమాలపైనే దృష్టి పెట్టాయి. డిజిటల్ వ్యాలెట్ల ద్వారా 16 ఏళ్లు నిండిన వారికి రూ.10వేల బాత్‌లను ఇస్తామని, దినసరి కనీస వేతనాలను 337 బాత్‌ల నుంచి 600 బాత్‌లకు పెంచుతామని, రుణాలపై మూడేళ్ల మారటోరియం ప్రకటిస్తామని, ప్రతి ఉపాధ్యాయునికి, విద్యార్థికి టాబ్లెట్ కంప్యూటర్ ఇస్తామని, వృద్ధాప్య భృతి నెలకు 3వేల బాత్‌లు చేస్తామని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, 1జీబీ ఇంటర్నెట్ ఉచితంగా ఇస్తామని, వ్యవసాయ కుటుంబాలకు 30వేల బాత్‌లు సాయం చేస్తామని, వరి పండించే రైతాంగానికి రయ్ (అర ఎకరానికి కొంచెం ఎక్కువ)కి 2వేల బాత్ ఇస్తామని ప్రకటించాయి.

ఆర్థిక వ్యవస్థ పటిష్టతపై అర్జెంటీనా

అర్జెంటీనాలో అధ్యక్షుడితో పాటు 22 ప్రావిన్సుల గవర్నర్లు, 130 డిప్యూటీ గవర్నర్లు, 24 సెనేటర్ స్థానాలకు ఈ ఏడాది అక్టోబర్ 22న ఎన్నికలు జరిగాయి. ఈ దేశంలో బహుళ పార్టీ వ్యవస్థ ఉన్నా.. ది యూనియన్ పోర్‌లా పాత్రియా (యూపీ), జుంటోస్ పార్ కాంబియో (జేఎక్స్‌సీ), లా లిబర్టాడ్ అవాంజా (ఎల్ఎల్ఏ) కూటముల మధ్య పోటీ జరిగింది. దేశంలో జరుగుతున్న నేరాలు, డ్రగ్ ట్రాఫికింగ్‌లను అరికట్టేందుకు భద్రత పెంపు, పన్నుల తగ్గింపు, రాష్ట్రాల పరిధుల తగ్గింపు (మన రాష్ట్రంలో జరిగిన జిల్లాల పునర్విభజన తరహాలో), నిరుద్యోగ బీమా, ప్రభుత్వ కంపెనీల ప్రైవేటీకరణ, సామాజిక అంశాలపై ఖర్చు తగ్గింపు, వాణిజ్య రంగంలో నిబంధనల సరళీకరణ, చైనాతో సంబంధాల కటీఫ్, అమెరికన్ డాలర్‌తో పోటీ పడేలా ఆర్థిక వ్యవస్థ రూపకల్పన లాంటి అంశాలు ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు ప్రచారాస్త్రాలుగా ఉపయోగపడ్డాయి.

టర్కీలో 'టెర్రర్'

తీవ్రవాదంతో కునారిల్లుతోన్న టర్కీలో జరిగిన ఎన్నికల్లో కూడా రాజకీయ పార్టీలు ప్రధానంగా ఈ అంశంపైనే దృష్టి సారించి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ, ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో సంభవించిన భూకంపాల కేంద్రంగానే ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఇక్కడి ప్రధాన పార్టీలు సిరియా శరణార్థులను కూడా ఎన్నికల బూచిగా వాడుకున్నారు. రష్యా మధ్యవర్తిత్వంతో సిరియాతో చర్చలు జరుపుతామని ప్రస్తుత అధ్యక్షుడు ఎర్డోగాన్ అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. భూకంపాల నుంచి ఉపశమనం పొందేందుకు గాను ఈశాన్య టర్కీలోని ప్రజలకు 20 ఏళ్ల కాలపరిమితితో ఇంటి రుణాలు ఇప్పిస్తామని, రెండేళ్ల తర్వాత ఈ రుణాలు చెల్లించేలా చేస్తామని చెప్పాయి. మొత్తం ఆరున్నర లక్షల ఇళ్లను ప్రభుత్వమే కట్టి ఇస్తుందని, ఇందులో 3.19 లక్షలను ఏడాదిలోగా పూర్తి చేస్తామని పార్టీలు హామీలిచ్చాయి.

'కొయ్యబొమ్మ'కు ప్రాణం పోసేదెప్పుడు?

తెలంగాణ కళలకు కాణాచి. చేతివృత్తులు, హస్తకళలకు పెట్టింది పేరు. అలాంటి కళల్లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన నిర్మల్ కొయ్యబొమ్మలు ఇప్పటికీ ప్రత్యేకత చాటుకుంటున్నాయి. దాదాపు 450ఏళ్లుగా నకాషీ కుటుంబాలు ఈ కళను నమ్ముకొని బతుకుతున్నాయి. కాలక్రమంలో పాలకుల పట్టింపు లేక ఈ కళ కనుమరుగయ్యే దశకు చేరుకుంటోంది. కొయ్యబొమ్మ తయారయ్యే 'పొనికి' చెట్ల పెంపకాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వెరసి కర్రకు కరువు ఏర్పడడం వల్ల కళాకారులకు పని ఉండడం లేదు. ఈ క్రమంలో చాలావరకు నకాషీ కుటుంబాలు ఇతర రంగాల్లో ఉపాధి వెతుక్కుంటున్నారు. ఇలాగే సాగితే రానున్న తరంలో కళ అంతరించి పోతుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

నిర్మల్

'పొనికి' లేక..

కొయ్య బొమ్మల తయారీలో అసలైన ముడిపదార్థం పొనికి కర్ర. మృదువుగా ఉండే పొనిక చెట్టు కర్రతోనే ఈ బొమ్మలను చేయడం ప్రత్యేకత. ఒకప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ అడవుల్లో పొనికి చెట్లు విపరీతంగా ఉండేవి. కాలక్రమంలో అడవులతోపాటు పొనికి చెట్లు కూడా అంతరించి పోతున్నాయి. బొమ్మల తయారీకి కావాల్సిన కర్రను కళాకారులు అటవీశాఖ కలప డిపోల నుంచి సేకరిస్తున్నారు. ఈ కర్రకు కొరత ఏర్పడడంతో బొమ్మలు చేసేవాళ్లకు పని ఉండడం లేదు. మూడునెలల క్రితం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న వరుణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని పొనికి వనాన్ని ప్రారంభించారు. అందులో మొక్కల పెంపకం చేపట్టారు. కానీ అవి చేతికొచ్చి కొయ్యబొమ్మగా మారేందుకు సమయం పడుతుంది.

చేతివృత్తులకు చేయూత ఎక్కడ.. హస్తకళలపై పట్టింపేది?

ఏడాదికేడాది తగ్గుతున్న కళాకారులు.. పట్టించుకోవాలని వినతులు

కనీసం పింఛన్ లేదు..

నిర్మల్ జిల్లా కేంద్రంలో 1955లో కొయ్యబొమ్మల పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేశారు. కొయ్యబొమ్మను నమ్ముకొని ఒకప్పుడు రెండు వందల కుటుంబాల ఉండేవి. ఇప్పుడు 50లోపే కుటుంబాలు బొమ్మలను తయారు చేస్తున్నాయి. అందులోనూ నేటితరమంతా వివిధ రంగాల్లో ఉపాధి, ఉద్యోగాలు చూసుకున్నారు. ఇప్పుడు పనిచేస్తున్న కళాకారులంతా ఎప్పుడో 25–30ఏళ్ల నుంచి చేస్తున్నవారే. వారికి కనీసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం, పింఛన్ లభించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించిన షెడ్డు తప్ప ప్రత్యేకంగా ఎలాంటి సాయం అందడంలేదు. 'మా చేతులతో చేసుకున్న బొమ్మలు పెట్టే అన్నం తప్ప.. ఇప్పటిదాకా ప్రత్యేకంగా రూపాయి అందడం లేదు..' అని సీనియర్ కళాకారులు వాపోతున్నారు. తమ జీవితాల్లోనే ఎలాంటి ఎదుగుదల లేదని, ఇక అలాంటప్పుడు తమ పిల్లలు ఈ కళను ఎలా కొనసాగిస్తారని ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.



'సాక్షి పీపుల్స్ మేనిఫెస్టో'లో పాల్గొన్న నకాషీ కళాకారులు

జీవితమంతా బొమ్మలతోనే..

35ఏళ్లుగా కొయ్యబొమ్మల తయారీలోనే ఉన్నా. మా పూర్వీకుల నుంచి ఇదే ఉపాధి. కానీ పొనికి కర్ర కొరతతో చాలామందికి పనిలేకుండా పోతోంది. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో మా పిల్లలు ఇటువైపు రావడం లేదు.

–పెంటయ్య, నకాషీ కళాకారుడు

కళాకారులు కోరుతున్నవి..

- బొమ్మల తయారీకి కావాల్సినంత పొనికి కర్ర లభించేలా చూడాలి.
- ప్రతీ కళాకార కుటుంబం ఆరోగ్యభద్రతకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా హెల్త్‌కార్డులివ్వాలి.
- సబ్సిడీ కింద రుణాలు ఇప్పించాలి.
- కళాకారులకు ప్రత్యేకంగా పింఛన్ ఇవ్వాలి.
- ప్రతీ కళాకారుడి కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇల్లు ఇవ్వాలి.
- కళను మెరుగుపర్చేలా ఆరునెలలకు ఒకసారి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి.
- మార్కెటింగ్ పెంచడానికి ప్రభుత్వపరంగా మరింత ప్రచారం పెంచి, ప్రోత్సాహం ఇవ్వాలి.

ఏ గుర్తు గుర్తుంచుకోవాలె రామక్క?!

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో ''గురుతును, గురుతుంచుకో రామక్క...! కారును గురుతుంచుకో రామక్క!'' అన్న పాటను విడుదల చేసింది. ''కారు కళాకారులు'' బహిరంగసభలు, సోషల్ మీడియా వేదికగా ఈ పాటకు బాగా ప్రచారం కల్పించారు. ట్యూన్ బాగుందని భావించిన కొందరు కాంగ్రెస్ నాయకులు తొలుత టీఆర్ఎస్ వైఫల్యాలతో కూడిన పాటను ఇదే బాణీతో వదిలారు. ఇపుడు మరో అడుగు ముందుకేసి ''గురుతును, గురుతుంచుకో రామక్క...! చెయ్యిని గురుతుంచుకో రామక్క!'' అన్న పాటను రికార్డ్ చేసి రిలీజ్ చేశారు. దీంతో ఈ పాట విన్నాక ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు. ఒకే కంటెంట్‌తో వస్తున్న పాటలు విన్నాక.. ఏ గుర్తు గుర్తుంచుకోవాలె రామక్క? అని ప్రశ్నిస్తున్నారు.

బీఆర్ఎస్ కాంగ్రెస్ ఒకేతీరుగా

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

సారాంశం
సరికొండ చలపతి



పులిటీషియన్లు.. కొంగబావలు

అడవిలో పులి వేటకు బయలుదేరింది. కొంతకాలంగా ఆ అడవిలో దానిదే రాజ్యం. ఎంత కావాలంటే అంత ఆహారం. రోజుకో జంతువు విందు. అందుకే తాపీగా లేచి ఒళ్లు విరుచుకుని అడవి మీద పడింది. మాంచి ఆకలి మీద ఉందేమో కాసింత పెద్ద జంతువునే వేటాడేసి.. ఆరగించడం మొదలుపెట్టింది. పులికైనా పొలిటీషియన్ కైనా ఎంత తిన్నా ఆకలి అలాగే ఉంటుందని.. ఓ పెద్ద రైటర్ ఏనాడో చెప్పాడు. దొరికిన జంతువును ఆబగా తింటూండేసరికి దాని ఎముక గొంతులో ఇరుక్కుంది. దీంతో విలవిల్లాడిన పులి దాన్ని బయటకు తీయాలని అన్ని జంతువులను బతిమాలింది. కొని పులి అరాచకంపై కోపంతో.. మరికొన్ని భయంతో మావల్ల కాదనేశాయి. ఇంతలో ఓ కొంగ దాని కంటపడింది. కొంగ బావను ఎలాగైనా ఒప్పించాలని.. దానితో మాటలు కలిపి..తన బాధను చెప్పింది. ముందు కొంగ కూడా ససేమిరా అంది. అయితే పులి కొంగకు ఆశలు పెట్టింది. తాయిలాలు చూపింది. అచ్చం ఎలక్షన్ టైమ్‌లో మన నాయకులలాగా.. ' ఇల్లు ఇస్తాం, పొలం ఇస్తాం, పింఛన్ పెంచుతాం. గ్యాస్‌ధర తగ్గిస్తాం.. ఈసారి ఓటేసి గట్టెక్కించండి...''... అలా కొంగ బావకు రకరకాల ఆశలు పెట్టింది. దానితో కొంగ ఐసైపోయింది. మన ఓటరు లాగా. ' ఆహా.. చిన్న సాయానికే బతుకు మారిపోతుందే..' అనుకుంది.

తన పొడుగాటి ముక్కు పులి నోట్లో తల పెట్టి ఎముక చులాగ్గా లాగి పారేసింది. పులి ఊపిరి పీల్చుకుని కొంగకు థ్యాంక్స్ చెప్పి బయలుదేరింది. అలా వెళుతున్న పులికి దాని బాసలు గుర్తుచేసింది. తొందరగా పని కానివ్వు అన్నట్టుగా. తర్వాత రెండు మూడు నెలలు గడిచాయి. పులి జాడలేదు. ఇచ్చిన మాట జాడలేదు. ఎలాగోలా పులిని వెతికి పట్టుకుని '..నీ మాటేమైంది..' అని కొంగ అడిగింది. ' .. చూద్దాం అదే పనిలో ఉన్నా..' అని పులి అక్కడ నుంచి జారుకుంది. అలా నెలలు గడుస్తున్నాయి. ఉలకదు పలకదు. అచ్చం మన ప్రజాప్రతినిధిలా. ఓసారి పులి ఎదురైతే కొంగ గాట్టిగా నిలేసింది. '..ఎంతో మేలు చేస్తానన్నావ్ నీ పని అయిపోయాక తప్పించుకుపోతున్నావ్....' అని.

దానికి పులి చిద్విలాసంగా..'' నేను నీకు మేలు ఎప్పుడో చేసేసాను.. నా నోట్లో నీ తల పెట్టినప్పుడు వదిలేశా.. అంతకన్నా మేలు ఏముంటుంది..' అని తాపీగా నడుచుకుంటూ పోయింది.

కొంగబావ అవాక్కయ్యింది. ఎన్ని ప్రలోభాలు.. ఎన్ని మాటలు.. ఎన్ని మోసాలు అని తిట్టుకుంది. అది మనిషి కాదు కనుక దానికిది కొత్త.. మనకైతే ప్రతి ఐదేళ్లకోసారి అనుభవానికి వస్తూనే ఉంటుంది.

ఎలక్షన్ వచ్చింది...పులిటీషియన్లను ఇప్పుడు ఓటర్లే కాపాడాలి.

ఎవరు మనవాళ్లు, ఎవరు విపక్షం, కొంగబావలలాగా ఎవరిని మచ్చిక చేసుకోవాలి, ఏమివ్వాలి? ఎంత ఇవ్వాలి? ఏమిస్తామని ప్రలోభ పెట్టాలి..ఇలా ఎన్నో లెక్కలు..

.. ఇస్తే ఓటేసేవారెవరు? తీసుకుని మరీ వేరేవాళ్లకు వేసేదెవరన్న ఈ అంశంపైనే అమెరికాకు చెందిన మిషిగన్, కాలిఫోర్నియా యూనివర్సిటీల పొలిటికల్ స్టడీస్ ప్రొఫెసర్లు.. ఆగ్నేయాసియా దేశాల్లో విస్తృతమైన అధ్యయనం చేశారు. ఓట్ల కొనుగోళ్ల విషయంలో ఉన్న కొన్ని రకాల అభిప్రాయాలు తప్పు అని తేల్చారు. అభ్యర్థులు, ఓటర్ల మనోభావాలు ఎలా ఉంటాయన్నది విశ్లేషించారు.

ఇది క్లైంటెలిజమ్!

ఓటర్లను ప్రలోభపెట్టడానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డబ్బులు, వివిధ రకాల వస్తువులు, బహుమతులు పంచడమే క్లైంటెలిజమ్. పేద దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇది సాధారణమే. దీనివల్ల అధికారం కొందరు రాజకీయ నేతలకే పరిమితమైపోతుంది. సిద్ధాంతపరమైన, సామాజిక ప్రయోజనకర అంశాలు పక్కనపడి.. వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధానమైపోతాయి. దానితో అభివృద్ధి కుంటుపడుతుంది.

తాయిలాలకు ఓట్లు రాలుతాయా?

డబ్బులు, బహుమతులు తీసుకున్నవారంతా ఓటేస్తారా? ఏదైనా తీసుకున్నప్పుడు, మరొకటి తిరిగిచ్చి రుణం తీర్చుకోవాలన్న సంప్రదాయం వర్కౌట్ అవుతుందన్న దానిపైనే తాయిలాలు తయారయ్యాయి... దీనిపై చేసిన సర్వేలో ..

ఓటర్లు డబ్బులు, బహుమతులను తీసుకున్నా కూడా తమకు ఓటేయరేమోనని లేక ఓటేయడానికే రారేమోనని చాలా మంది అభ్యర్థులు భావిస్తున్నట్టు పేర్కొంది. కొందరు ఓటర్లు కూడా డబ్బు తీసుకున్నాక వేరేవారికి ఓటేయడం పట్ల పెద్దగా ఇబ్బంది పడాల్సిందేమీ లేదని భావిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఇందుకోసమేనేమో.. డబ్బులు తీసుకున్న ఓటర్లతో ఒట్టు పెట్టించుకోవడం, గుళ్లకు తీసుకెళ్లి ప్రమాణాలు చేయించడం, కుల సంఘాలు, అసోసియేషన్లలో ప్రమాణాలు చేయించడం వంటివి మన నేతలు చేస్తుంటారు.

ఓట్లు అమ్ముకోవడం తప్పా?

ఓట్లు కొనడం, అమ్ముకోవడం తప్పు అనే ప్రచారం ఉన్నా.. ఆ భావన అటు నేతల్లో, ఇటు ఓటర్లలోనూ కనబడటం లేదని అధ్యయనం పేర్కొంది. గెలవడానికి ఎంతెంత ఇచ్చాం, ఏమేం పంచామనేది నేతలు బహిరంగంగానే చెప్తున్నారని.. 'వాళ్లు ఇస్తున్నారు. మేం తీసుకుంటున్నాం..' అని చెప్పడానికి ఓటర్లు కూడా పెద్దగా ఇబ్బంది పడటం లేదని వెల్లడించింది. అందుకే ఓటేయడానికి డబ్బులు తీసుకోవద్దంటూ జరిగే ప్రచారానికి పెద్దగా ఫలితం ఉండటం లేదని స్పష్టం చేసింది.

వ్యతిరేకులపై ప్రభావం అంతంతే..

తమపై వ్యతిరేకత ఉన్నవారికి డబ్బులు, బహుమతులు ఇచ్చినా తమకు అనుకూలంగా ఓటేయరన్న విషయం రాజకీయ నాయకులకు తెలుసని అధ్యయనం పేర్కొంది. తమకు అనుకూలమైన వారిని అలాగే కొనసాగించుకునేందుకు, తటస్థంగా ఉన్నవారిని తమవైపు తిప్పుకొనేందుకు మాత్రమే డబ్బులు పంచుతారని తేల్చింది. తమ వెంట నిలిచిన కార్యకర్తలకు ఏదో ప్రయోజనం కల్పించామన్న భావన కోసం, తమను నాయకుడిగా గుర్తించేందుకు వారికి డబ్బు, బహుమతులు ఇస్తుంటారని వివరించింది.

.. అనుచరులకు కాంట్రాక్టులు, పదవులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం, కొన్నిసార్లు నేరుగానే డబ్బు సాయం చేయడం వంటివీ ఇందుకే.. ఇక ఇప్పుడు రాజకీయంగా తటస్థంగా ఉండే వారు తక్కువే. కానీ ఆ కొద్దిశాతం ఓట్లతోనే గెలుపోటములు మారిపోయే పరిస్థితులు ఎక్కువ. ఇక్కడే 'పంపకాల' ప్రయోజనం మరింత ఎక్కువన్నమాట.

ప్రలోభాలకు లొంగవద్దనే ప్రచారాలతో ప్రయోజనమెంత?

డబ్బు తీసుకుని ఓటేయడాన్ని నిరుత్సాహపరిచేందుకు ఎన్నికల కమిషన్, స్వచ్ఛంద సంస్థలు ప్రచారం చేస్తుంటాయి. ఇందులో ఓటేసేందుకు ఎలాంటి డబ్బు, బహుమతులు తీసుకోవద్దనేది ఒకటైతే.. డబ్బు తీసుకోండి, కానీ మీకు నచ్చినవారికే ఓటేయండి అన్నది రెండో రకం ప్రచారం. నిజానికి రెండో రకం ప్రచారం వల్ల ఓటర్లు డబ్బులు తీసుకున్నా.. తమకు నచ్చిన, సమర్థుడైన నేతకే ఓటేస్తారన్న అభిప్రాయం ఉంటుంది. కానీ ఇది తప్పు అని అధ్యయనం తేల్చింది. ఏమీ తీసుకోవద్దు, ఓటును అమ్ముకోవద్దన్న ప్రచారంతోనే కొంత ప్రయోజనం ఉంటోందని పేర్కొంది. ఏమీ తీసుకోనివారిలో ఎలాంటి బెరుకు ఉండదని, నచ్చినవారికి ఓటేస్తారని తెలిపింది. అయితే పంచే డబ్బు/బహుమతి విలువ ఎక్కువగా ఉన్నప్పుడు ఓటర్లు తీసుకోకుండా ఉండలేకపోతున్నారని స్పష్టం చేసింది. ఇక.. 'డబ్బు తీసుకోండి. నచ్చినవారికే ఓటేయండి' అన్న ప్రచారం.. ఓట్ల కొనుగోలు, ప్రలోభాలను మరింతగా పెంచుతోందని అధ్యయనం స్పష్టం చేసింది. దీని వల్ల ఓటర్లు డబ్బు/బహుమతులు తీసుకోవడంలో మొహమాటాన్ని పక్కన పెట్టేస్తున్నారని, ఓట్ల కొనుగోళ్లకు ప్రయత్నించే నేతలకు పని సులువు అవుతోందని పేర్కొంది. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లాక.. 'డబ్బులు తీసుకున్నప్పుడు ఓటేయకపోతే ఎలా..?' అన్న మీమాంసతో డబ్బులిచ్చిన అభ్యర్థికే ఓటేస్తున్నారని తెలిపింది.

పొలిటికల్ 'మన్మథుడు'!

కొందరు రాజకీయ నేతల విన్యాసాలు.. చేష్టలు 'మన్మథుడు' సినిమాలోని కొన్ని రోల్స్..డైలాగులతో పోల్చుతుండటంతో అబ్బురపడుతున్నాడు ఓటరు. అదెలాగంటే...

కేసీఆర్

రాజకీయ యవనిక మీద ఓ సమ్మోహన శక్తి కేసీఆర్. అంటే మన్మథుడే కదా. ఆయనతో సన్నివేశం...

సోనాలీబెంద్రేలా పెదవులు బిగబట్టి పట్టుదలగా మేనిఫెస్టో రూపొందిస్తోంది కాంగ్రెస్. 'రేపు చూసుకుందువుగానీలేమ్మా' తండ్రిలా ప్రేమగా చెప్పాడు మాణిక్‌రావు ఠాక్రే.

''లేదు నాన్నా... రేపటి గెలుపు చాలా ఇంపార్టెంట్ నాన్నా'' అంటూ మేనిఫెస్టో రాసేసి, విడుదల చేసేసి, కాస్త బాత్‌రూమ్ వరకు వెళ్లింది.

ఇదేసందుగా... కేసీఆర్ తన మేనిఫెస్టో వెల్లడించేస్తున్నాడు.

''పింఛన్లు... కాంగ్రెస్ మీద ఓ వెయ్యి ఎక్కువ.

సిలెండరు... కాంగ్రెస్ కంటే ఓ వంద తక్కువ''

అంటూ... చివర్న ఓ యాడ్ క్యాప్షన్ కూడా ఇచ్చాడు. అదీ...

''యాడ్ సిలెండర్ టు యువర్ లైఫ్!''

ఇక్కడ సోనాలీబెంద్రేలా సైలెంటవ్వలేదు సరికదా..''మోసం..దగా... అన్నీ మావే కాపీ'' అంటూ ఆక్రోశించింది కాంగ్రెస్.

కమ్యూనిస్టులు

ఘంటసాల గొంతు 'పార్థాయ ప్రతిబోధితా...' అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో ఉద్బోధ అద్భుతంగా వినిపిస్తుండగా...

''చూడయ్యా మూర్తీ... ఈ బూర్జువా పార్టీలను నమ్మనేకూడదయా. తమకే సపోర్టివ్వమంటూ కారువాళ్లు మునుగోడు టైమ్‌లో గోడు వెళ్లబోసుకుంటారా... తీరా మెయినెలక్షన్ టైమ్‌లో మోసం చేసిపోతారు. ఇక కాంగ్రెసంటావా.. 'సీట్లు అక్కడిస్తాం, ఇక్కడిస్తాం..అన్నిస్తాం, ఇన్నిస్తాం..' అంటూ చర్చల మీద చర్చలు సాగిస్తుంటారుగానీ ఎటూ తేల్చరూ..తెమల్చరు. ఎప్పటికీ తేల్చరు. అందుకే... ఈ పార్టీలకూ, కరెంటు వైర్లకూ ఎంత దూరంలో ఉంటే అంత మంచిది. వాళ్లతో పొత్తు అంటావేంటయా. మనం 'ఎర్ర'టివాళ్లం కాస్తా... తెల్లబోవాల్సిందే'' స్వానుభవంతో హీరో స్టైల్లో చెప్పారు.

బండి సంజయ్

సినిమాలో ప్రియురాలు యాక్సిడెంట్‌తో దూరమైనట్టే..తానెంతగానో ప్రేమించి, తనదనుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని యాక్సిడెంటల్‌గా కోల్పోవాల్సి వచ్చింది. రెండోసారి ప్రేమలోలా..దక్కుతుందనుకున్న కేంద్రమంత్రి పదవీ దక్కలేదు. ఈ నేపథ్యంలో వినిపిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ పాట ఇది...

''చెలియా, సఖియా... ఒంటరిని చేయకే.
గెలుపూ... గెలుపూ... చేజారిపోవకే.
నిను చేరేదాకా... ఆగదు నా కేకా''...

అందరూ పొలిటికల్ మన్మథులే. అంతులేని సమ్మోహన శక్తులే.

''మావాడు ఎవ్వరి వెంటాపడడు. అందరూ వాడి వెంట పడాల్సిందే'' అంటూ ఏ పార్టీ అభిమానులు వారి వారి పార్టీల గురించి గొప్పలు చెప్పుకోవచ్చు.

కానీ... ఎట్టకేలకు ఏ మన్మథుడు ఓటరు మనసు గెలుచుకుంటాడన్నది ఎన్నికల వెండితెరపై త్వరలోనే తేలిపోతుంది.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్



ఎగ్జిట్ పోల్స్‌పై ఈసీ నిషేధం

- నవంబర్ 7 నుంచి 30వ తేదీ వరకు అమలు
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి నవంబర్ 30న సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించింది. చివరగా నవంబర్ 30న సాయంత్రం 6.30 గంటల వరకు తెలంగాణ సహా అయిదు రాష్ట్రాల్లో అన్ని దశల ఎన్నికలు ముగిసేలోగా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించినా, ప్రచురించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఎగ్జిట్ పోల్స్‌ను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రచురణ, ప్రసారం చేయకూడదని స్పష్టం చేసింది. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తమ ఆదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులకు సూచించింది. అలాగే మీడియా రంగాలకు సైతం తెలియజేయాలని తెలిపింది. నాగాలాండ్‌లో జరుగనున్న ఒక ఉపఎన్నిక నేపథ్యంలో అక్కడ కూడా ఇవే ఉత్తర్వులు అమలవుతాయని కూడా ఈసీ పేర్కొంది. ఉత్తర్వులను ఎవరు ఉల్లంఘించినా ఎలక్టోరల్ చట్టం ప్రకారం రెండేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయని హెచ్చరించింది.

దోపిడీ సొత్తు పంపకాలపై 'జై, వీరు' మధ్య పోరు

దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్‌లపై సీఎం చౌహాన్ వ్యంగ్యాస్త్రాలు

భోపాల్: మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్‌ల మధ్య విభేదాలు లేవని, వారు షోలే సినిమాలో జై, వీరు లాంటి వారంటూ ఆ పార్టీ నేత రణదీప్ సూర్జేవాల్ చేసిన వ్యాఖ్యలపై సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇద్దరు నేతలు ఢిల్లీకి వెళ్లారన్న వార్తాలపై ఆయన స్పందిస్తూ...'వీరిద్దరూ గతంలో సీఎంలుగా పనిచేసిన సమయంలో రాష్ట్రాన్ని దోపిడీకి అడ్డాగా మార్చేశారు. ఆ సొత్తును ఎలా పంచుకోవాలి? అధికారంలోకి వస్తే ఎవరి వాటా ఎంతెంత? అనే విషయంలో భేదాభిప్రాయాలు రావడం వల్లే కాంగ్రెస్ హై కమాండ్ వారికి కబురు పంపించింది. ఇందులో ఢిల్లీ పెద్దలకు కూడా ప్రమేయం ఉంది'అని అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు గాను టికెట్ల పంపిణీపై కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న దిగ్విజయ్, కమల్‌నాథ్‌ల మధ్య విభేదాలు పొడసూపాయన్న వార్తలు ఇటీవల చక్కర్లు కొట్టాయి.



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పెంపుడు శునకమిది. మంగళవారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద రాహుల్‌కు ముందు వెళుతోందిలా

మధ్యప్రదేశ్ అసెంబ్లీ బరిలో 3,832 మంది

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీలోని 230 సీట్లకు గాను నవంబర్ 17వ తేదీన జరగనున్న ఎన్నికల బరిలో మొత్తం 3,832 మంది బరిలో నిలిచారని అధికారులు తెలిపారు. అక్టోబర్ 21న మొదలైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ సోమవారంతో ముగిసిందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) అనుపమ్ రాజన్ తెలిపారు. ఆఖరు రోజున 2,489 మంది అభ్యర్థులు 2,811 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారని చెప్పారు. నామినేషన్ల ఉప సంహరణకు నవంబర్ 2వ తేదీ వరకు గడువుందన్నారు.

టోంక్ స్థానానికి సచిన్ పైలట్ నామినేషన్



జైపూర్: రాజస్తాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మంగళవారం టోంక్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు. ముందుగా భూతేశ్వర్ ఆలయంలో పూజలు చేసిన పైలట్ బడా కువాన్ నుంచి టోంక్ నగరం లోని పటేల్ చౌక్‌కు ర్యాలీగా తరలి వెళ్లారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 6 ఆఖరు తేదీ కాగా, టోంక్‌లో బీజేపీ తన అభ్యర్థిని ఖరారు చేయలేదు. 2018 ఎన్నికల్లో టోంక్‌లో సచిన్ పైలట్ బీజేపీకి చెందిన యూనుస్ ఖాన్‌పై 54 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25న ఓటింగ్ జరగనున్న విషయం తెలిసిందే.

ఓటు లేదు గానీ.. శరణార్థులే కీలకం

మిజోరంలో వారి చుట్టూ రాజకీయం

- ఎన్నికల ప్రచారానికీ కేంద్ర బిందువు
- తమకే లాభిస్తుందంటున్న మిజో నేషనల్ ఫ్రంట్
- బెడిసికొడుతుందంటున్న విపక్షాలు



అది మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు దాదాపు 25 కిలోమీటర్ల దూరంలోని పునరావాస ప్రాంతం. ఒక 52 ఏళ్ల మహిళ. పేరు థాంగ్‌తెయ్. చెక్క పాత్రలో బియ్యం కడుగుతోంది. మరోవైపు పిల్లల అల్లరిని అదుపు చేయలేక ఆపసోపాలు పడుతోంది. వెనకాలే ఉన్న వెదురు గుడిసె ఐదు నెలలుగా వారి ఆవాసం. రాష్ట్రంలో హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారంతో గానీ, నవంబర్ 7న జరగబోయే పోలింగ్‌తో గానీ తనకు నిమిత్తమే లేదన్నట్టుగా పనిలో మునిగిపోయిందామె. ఏ రోజుకారోజు తిండీ, నీరూ దొరికితే అంతే చాలనుకుంటోంది. అది వాస్తవం. ఎందుకంటే ఆమెకు ఓటు లేదు. ఆమెకే కాదు, అలాంటి తాత్కాలిక వెదురు గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్న కనీసం 35 వేల పైచిలుకు మందికి ఓటు లేదు. ఎందుకంటే వారంతా మయన్మార్‌లో సైనిక కుట్ర అనంతరం చెలరేగిన హింస బారి నుంచి ప్రాణాలతో తప్పించుకుని ఇల్లూ వాకిలీ విడిచి పొట్ట చేతపట్టుకుని భారత్‌కు వచ్చిన శరణార్థులు. వీళ్లే కాదు, మణిపూర్ హింసాకాండకు జడిసి వలస వచ్చిన వేలాది మంది కుకీ గిరిజనులు దాదాపు అలాంటి పరిస్థితుల్లోనే మిజోరంలో పలుచోట్ల కాలం వెళ్లదీస్తున్నారు. వీళ్లెవరికీ ఓటు లేదు.

కానీ... ఓటు హక్కు కూడా లేని ఈ శరణార్థులే ఈసారి మిజోరంలో అతి పెద్ద ఎన్నికల అంశంగా మారిపోయారు! ఒకరకంగా ఫలితాలను నిర్దేశించే స్థాయిలో ఉన్నారు...!!

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో పోలింగ్‌కు వారం రోజులే ఉంది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)తో పాటు విపక్ష కాంగ్రెస్, జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎస్) మొత్తం 40 స్థానాలకూ పోటీ చేస్తున్నాయి. బీజేపీ కూడా 23 సీట్లలో బరిలో దిగింది. ఇప్పుడు పార్టీల దృష్టి శరణార్థుల సమస్యపైనే కేంద్రీకృతమైంది. విడిగా ఏ పార్టీ ఏం చెబుతున్నా అదే వాటన్నింటికీ, ముఖ్యంగా బీజేపీ మినహా మిగతా మూడు ప్రధాన పార్టీలకూ ప్రధానాంశంగా మారిపోయిందన్నది వాస్తవం. అందుకే ఈ విషయంలో అధికార ఎంఎన్ఎఫ్ ముందుగానే రంగంలోకి దిగింది. శరణార్థులను అక్కున చేర్చుకోవడమే గాక వారికి వీలైనన్ని సదుపాయాలు కల్పిస్తూ మిజోల మది దోచుకునే ప్రయత్నంలో పడింది. మిజో జాతీయవాదానికి పరిరక్షకులం తాము మాత్రమేనని ఎంఎన్ఎఫ్ చీఫ్, సీఎం జోరాం తంగా బాహాటంగా ప్రకటించారు. ఇది ఎన్నికల్లో తమకు ఎంతగానో కలిసొస్తుందని కూడా మీడియా సాక్షిగా చెప్పుకున్నారాయన!

జోరాం తంగా ఓట్ల రాజకీయం

- మయన్మార్ నుంచి వచ్చిన శరణార్థులంతా ప్రధానంగా చిన్ గిరిజన తెగకు చెందినవారు.
- వారితోనూ, మణిపూర్‌లోని కుకీ తెగతోనూ మిజోలకు అనాది కాలం నుంచీ అతి సన్నిహితమైన సాంస్కృతిక, సామాజిక, తెగలపరమైన బంధాలున్నాయి.
- అందుకే కేంద్రం నిర్దేశాలను పక్కన పెట్టి చిన్ శరణార్థులకు జోరాం సర్కారు ఆశ్రయమిచ్చింది. వారిని వెనక్కు పంపాలన్న ఆదేశాలను తోసిరాజంది.
- కనీసం చిన్ తెగ వారి వేలిముద్రలు తదితరాలు సేకరించాలన్న కేంద్రం ఆదేశాలనులెక్కచేయలేదు.
- అంతేకాదు, ప్రధాని నరేంద్ర మోదీ గనక మిజోరంలో ఎన్నికల ప్రచారానికి వస్తే ఆయనతో కలిసి వేదిక పంచుకునే సమస్యే లేదని సీఎం తంగా ఏకంగా బీబీసీ ఇంటర్వ్యూలోనే కుండబద్దలు కొట్టారు.
- తద్వారా, తోటి గిరిజన సమూహం కోసం కేంద్రాన్నే ఎదిరించిన ఇమేజీతో మిజో ఓటర్ల మనసు దోచే ప్రయత్నాల్లో పడ్డారు.
- అయితే కేంద్రంలోని అధికార ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉండటం ఎంఎన్ఎఫ్‌కు పెద్ద అవరోధంగా మారింది. దీన్ని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది.
- దీనికి విరుగుడుగా బీజేపీపై తంగా ఒంటికాలిపై లేస్తున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోకుండా జాగ్రత్త పడ్డారు.
- మణిపూర్‌లో బీజేపీయే అధికారంలో ఉందన్న విషయాన్ని తంగా పదేపదే తన ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు.
- అక్కడ కుకీ, మెయితీ తెగల ఘర్షణను ఉద్దేశపూర్వకంగానే ఉపేక్షించి కుకీలకు అన్యాయం చేసిందని ఆరోపిస్తున్నారు.

విపక్షాలదీ అదే బాట...

- శరణార్థుల విషయంలో ఎంఎన్ఎఫ్‌కు మైలేజీ రాకుండా చూసేందుకు కాంగ్రెస్, జెడ్‌పీఎం యథాశక్తి ప్రయత్నాల్లో పడ్డాయి..
- కేంద్రంలోనూ, మణిపూర్‌లోనూ బీజేపీయే అధికారంలో ఉన్నా కుకీల ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్న ఆ పార్టీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో ఎంఎన్ఎఫ్ భాగస్వామిగా కొనసాగుతుండటాన్ని ఓటర్లు అసహ్యించుకుంటున్నారని అవి అంటున్నాయి.
- తమ రాష్ట్రంలో ఆశ్రయం పొందిన చిన్, కుకీ తెగలవాళ్లంతా సోదర సమానులని జెడ్‌పీఎం అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి లుడుహొమా చెబుతున్నారు.
- ఎవరేం చెప్పినా చిన్, కుకీ తెగలకు ఆశ్రయమిచ్చిన తీరు ఎంఎన్ఎఫ్‌కు ఎంతో కొంత లాభించేలానే కన్పిస్తోందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.
- అయితే శరణార్థులను తంగా సర్కారు మరీ నెత్తిన పెట్టుకుంటోందన్న అసంతృప్తి స్థానికుల్లో క్రమంగా ప్రబలుతోంది. ఇది దానికి కాస్త చేటు చేసే ఆస్కారమూ లేదన్న అభిప్రాయముంది.

ఆపన్నులే ఆసరా...

తంగా సర్కారు ఏం చెబుతున్నా చిన్ శరణార్థుల పరిస్థితి అంత మెరుగ్గా ఏమీ లేదు. వారి ఆవాసాల్లో కరెంటు, తాగునీరు వంటి సదుపాయాలేవీ లేవు. స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు, చర్చి సంస్థలు అందించే బియ్యం తదితరాలతోనే నెట్టుకొస్తున్నారు. మగవాళ్లంతా పొలాల్లో పనులకు వెళ్తూ రోజుకు రూ.500 కళ్లజూస్తున్నారు. కానీ వారానికి రెండు రోజులకు మించి పని దొరక్క అవస్థ పడుతున్నారు. మయన్మార్‌లో ఏమాత్రం శాంతియుత వాతావరణం నెలకొన్నా తిరిగి వెళ్లిపోతామని చెబుతున్నారు. మణిపూర్ శరణార్థుల ఆవాసాల్లో జోరాం సర్కారు కరెంటు, తాగునీటి వంటి సదుపాయాలు కల్పించింది.

సంఖ్యల్లో శరణార్థులు..	
చిన్ తెగకు చెందిన వారు (మయన్మార్)	33,500 మంది
కుకీ తెగకు చెందిన వారు (మణిపూర్)	13,500 మంది
మిజోరంలో ఎప్పట్నుంచి ఉంటున్నారు	
చిన్ తెగవారు	ఏడాది పైగా
కుకీలు	ఆర్నెల్లుగా

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 1 । నవంబర్ । 2023



ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా మంగళవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు జ్ఞాపిక అందచేస్తున్న వీసీ రవీందర్

సేవా తత్పరుడు.. సీతయ్య గుప్తా..

మీకు తెలుసా?



ఒక సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించిన సీతయ్య గుప్తా నగర అభివృద్ధికి అసామాన్య కృషి చేశారు. రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో ఆయన సేవలు అజరామరం. ఆంధ్ర మహాసభ, స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన స్వాతంత్రోద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారు. హైదరాబాద్ సంస్థానం విముక్తి సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొన్నారు. మరోవైపు వర్తక రంగంలో వ్యాపారుల సంక్షేమానికి పాటుపడ్డారు. ఎమ్మెల్యేగా, అంచనాల సంఘాల సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీలో ముఖ్య నేతగా ఎంతో పేరు తెచ్చుకున్నారు. రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడకు చెందిన సీతయ్య గుప్తా తన 16వ ఏట ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి ఉస్మాన్‌గంజ్‌లోని ఒక వ్యాపారి వద్ద ఉద్యోగంలో చేరారు. క్రమంగా వ్యాపారంపై పట్టు పెంచుకున్నారు. ఈ సమయంలో మాడపాటి హనుమంతరావుతో కలిసి ఉస్మాన్‌గంజ్ ధర్మశాల నిర్మాణానికి కృషి చేశారు. 1938 ఏప్రిల్ 16న ధూల్‌పేట మత ఘర్షణలకు వ్యతిరేకంగా 'ఆర్యసమాజ్ సత్యాగ్రహ' ఉద్యమంలో పాల్గొన్నారు. 1957లో జరిగిన సాధారణ ఎన్నికలు ఆయన ప్రస్థానంలో మైలురాయి. అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి సలహాపై ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 1962 ఎన్నికల్లో బేగంబజార్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1963లో సీఎల్‌పీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంచనాల సంఘం సభ్యుడిగా పనిచేశారు. ఆయన జీవితంలో రాజకీయం ఒక భాగమైతే సేవ అసలు లక్ష్యం. అనేక ధార్మిక సంస్థలు స్థాపించి తర్వాత తరాలకు సేవలందించేలా ఏర్పాట్లు చేశారు. ఆర్య వైశ్యుల అభ్యున్నతికి సంస్థల స్థాపనతో పాటు, వాసవి సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. వైశ్యుల సంక్షేమానికి నిరంతరం శ్రమించిన ఆయన జులై, 1939లో పీల్‌ఖానాలో వైశ్య హాస్టల్ ప్రారంభించారు. కాచిగూడలో నిర్మించిన అతిపెద్ద వైశ్య హాస్టల్ నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. 1997లో ఆయన కన్నుమూశారు. హైదరాబాద్ నగర రాజకీయ, సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసిన సీతయ్య గుప్తా.. నగర చరిత్రలో ఓ సువర్ణాధ్యాయం.

– సాక్షి, సిటీబ్యూరో





మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరిన జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డిని అభినందిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్.

ఆన్‌లైన్ తాయిలాలు!

ఓటర్లకు గూగుల్, ఫోన్ పే



- యూపీఐ యాప్‌లతో నగదు బదిలీలు
- బూత్ స్థాయిలో క్యాష్ కో- ఆర్డినేటర్ల ఏర్పాటు
- చిన్న మొత్తాల నగదు లావాదేవీలపై కొరవడిన నిఘా
- అధికారులకు చిక్కకుండా లీడర్ల కొత్త ఎత్తుగడ
- పోలీసులు హెచ్చరిస్తే ఆర్‌బీఐ నిబంధనల పేరిట బ్యాంకర్ల దాటవేత

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలలో నగదు సరఫరా, పంపిణీపై పోలీసుల నిఘా పెరగడంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. నగదు జోలికి వెళ్లకుండా ఆన్‌లైన్ పేమెంట్స్‌తో పనులు చక్కబెట్టేస్తున్నారు. రోడ్ షోలు, సభలు, సమావేశాలలో క్షేత్ర స్థాయిలో ఓటర్లను ఎలాగైతే ఆకర్షిస్తున్నారో.. అంతకు రెట్టింపు స్థాయిలో ఆన్‌లైన్ చెల్లింపులతో కట్టిపడేస్తున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుల తనిఖీలకు చిక్కకుండా తక్కువ టైమ్‌లో, ఎక్కువ మందికి చేరువయ్యే అవకాశం ఉండటంతో యూపీఐ యాప్‌ల మార్గం పట్టారు.

కాలనీల వారీగా లెక్కలు..

ఆన్‌లైన్ పేమెంట్లు చేసేందుకు కాలనీల వారీగా ఎమ్మెల్యే అభ్యర్థులు క్యాష్ కో-ఆర్డినేటర్లను నియమించుకున్నారు. రూ.లక్షకు మించకుండా క్యాష్ కో-ఆర్డినేటర్ల ద్వారా ఏజెంట్లు నెట్‌వర్క్‌కు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ అవుతున్నాయి. జిల్లా నుంచి గ్రామస్థాయి లీడర్లు చైన్ సిస్టంతో పనిచేస్తున్నాయి. ఒక్కో ఏజెంట్ దాదాపు వంద మందికి పైగా ఓటర్లను సమీకరిస్తున్నారు. నియోజకవర్గాలలో నిర్వహించే సభలు, సమావేశాలకు ఓటర్లను తరలిస్తున్నారు. వీరంతా ఓటర్లతో నేరుగా కాంటాక్ట్ అవుతున్నారు. సభలు, సమావేశాలకు వస్తున్న కార్యకర్తలకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా నగదు బదిలీ చేస్తున్నారు.

పెద్ద అమౌంట్లపైనే నిఘా..

రూ.10 లక్షలు, అంతకంటే ఎక్కువ లావాదేవీలు జరిపే బ్యాంకు ఖాతాలపై మాత్రమే బ్యాంకర్లు దృష్టి సారించారు. ఆయా అనుమానాస్పద లావాదేవీల వివరాలను మాత్రమే వారు పోలీసుల దృష్టికి తీసుకొస్తున్నారని, చిన్న మొత్తంలో జరిగే యూపీఐ లావాదేవీల సమాచారం పోలీసులకు ఇవ్వడం లేదని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఒకవేళ పోలీసులే ఆయా లావాదేవీలను గుర్తించి, బ్యాంకు ఖాతాల వివరాలను ఇవ్వాలని కోరితే.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల సాకుతో దాటవేత సమాధానాలు చెబుతున్నారని చెప్పారు. వాస్తవానికి యూపీఐ లావాదేవీలపై నిఘా పెట్టేందుకు బ్యాంకర్లు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయలేదని విమర్శించారు.

బ్యాంకర్లు, ఐటీ దృష్టి పెట్టాలి..

గత ఆరేడు నెలలుగా ఎలాంటి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాలలో ఒక్కసారిగా రూ.20-50 వేల వరకు నగదు జమ అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా ఖాతాలపై బ్యాంకు అధికారులకు సమాచారం ఉంటుంది కానీ బ్యాంకర్లు పోలీసులకు సమాచారం అందిండచం లేదు. వాస్తవానికి ఆయా ఖాతాల లావాదేవీలను బ్యాంకర్లు, ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు దృష్టిసారించాలి. నగదు చేరాల్సిన చోటికి ఎప్పుడో చేరిపోయిందని, ప్రస్తుతం పోలీసుల తనిఖీలలో పట్టుబడుతున్న నగదులో 60 శాతానికి పైగా డబ్బు సామాన్యులదే ఉంటుందని ఓ అధికారి తెలిపారు. అందుకే డిస్ట్రిక్ట్ గ్రివెన్స్ సెల్ అధికారులు ఒకట్రెండు రోజుల్లోనే సీజ్ చేసిన నగదు యజమానులు సంబంధిత ఆధారాలు చూపిస్తే వెంటనే రిలీజ్ చేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికలలో ఈ ప్రక్రియ నెలకు పైగానే జరిగేదని గుర్తు చేశారు.




పోస్టల్‌లో పంపించేందుకు కొత్త ఓటరు కార్డులను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఓటరుస్లిప్‌లలో పార్టీ గుర్తులుండొద్దు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి మేరకు రాజకీయ పార్టీలు ఇతర పార్టీల పాలసీలు, కార్యక్రమాలు, గత రికార్డులు, పనులను విమర్శించరాదన్నారు. ప్రచారానికి సంబంధించి సువిధ యాప్ ద్వారా ముందస్తు అనుమతి పొందాలన్నారు. సభలకు ఎవరైనా ఆటంకాలు కల్పిస్తే పోలీసుల సహాయం పొందాలన్నారు. రాజకీయ నాయకులు పంపిణీ చేసే ఓటరు స్లిప్‌లలో ఎటువంటి సింబల్ గానీ, పార్టీ గుర్తు గానీ ఉండకూడదన్నారు. కులాలు, మతాల వారీగా ఓట్లు అడగరాదని.. కుల,మత,భాషలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయరాదన్నారు. ఇతర పార్టీల వారి పోస్టర్లను తొలగించరాదన్నారు. నామినేషన్లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు.

ఈవీఎంల తీరుపై అవగాహన..

జిల్లాలోని 15 నియోజకవర్గాల ఆర్‌ఓల ఫోన్‌నెంబర్లు అందజేయాలని రాజకీయపార్టీల ప్రతినిధులు కోరారు. పొలిటికల్ ఏజెంట్లకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించాలని కోరగా సుముఖత వ్యక్తం చేశారు.గోడల మీద పెయింటింగ్‌లు తొలగించడం లేదని ఫిర్యాదు చేయగా, ఎక్కడో కచ్చితంగా తెలియజేస్తే వెంటనే తొలగిస్తారని చెప్పడంతోపాటు ఒక ప్రదేశం వివరాలు తెలియజేయగా అప్పటికప్పుడే ఫ్లయింగ్‌స్క్వాడ్స్‌కు ఫోన్ చేశారు. వెంటనే వాటిని తొలగిస్తున్న దృశ్యాల్ని సీసీటీవీ ద్వారా చూపించారు.

ఒక్కరోజే 15వేల అర్జీలు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరగనున్నందున పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. జిల్లా ఓటర్లు 45 లక్షలకు మించి పెరగనున్నట్లు చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్లకు అవకాశం ఉందని, తొలుత ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసి.. తర్వాత సంతకంతో కూడిన పత్రాలను సంబంధిత ఆర్‌ఓ కార్యాలయంలో భౌతికంగా అందజేయాల్సి ఉంటుందన్నారు. ఆర్‌ఓ కార్యాలయాల్లో దృశ్యాల్ని రికార్డు చేసేందుకు వీడియోచిత్రీకరణతోపాటు 360 డిగ్రీస్‌తో సీసీకెమెరాలుంటాయన్నారు. నామినేషన్ సందర్భంగా ఆర్‌ఓ గదిలోకి ఐదుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. వందమీటర్ల దూరం వరకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తయిందని, మరో దఫా శిక్షణ జరగనుందన్నారు. నిఘాకు తగినన్ని టీమ్స్ పనిచేస్తాయన్నారు. అక్టోబర్ 31 వరకు ఓటరు నమోదుకు, చిరునామా మార్పులకు దరఖాస్తు చేసుకున్న వారితో కూడిన తుది జాబితా నవంబర్ 10వ తేదీన వెలువడుతుందన్నారు.

కొత్తగా ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు

- 3 నుంచి రంగంలోకి వ్యయ పరిశీలకులు
- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

ఎప్పటికప్పుడు పరిష్కారం..

ఓటరు తుది జాబితా వెలువడ్డాక ఓటరు నమోదు కోసం ఇప్పటి వరకు 1,35,756 దరఖాస్తులందాయన్నారు. సోమవారం ఒక్కరోజే 15 వేలు అందాయన్నారు. చిరునామా మార్పుల కోసం 1,00,332 దరఖాస్తులందాయని, అన్నింటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం నవంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వ్యయ పరిశీలకుల నిఘా

నవంబర్ 3వ తేదీ నుంచి పార్టీలు, అభ్యర్థుల మీద ఎన్నికల వ్యయ పరిశీలకుల నిఘా ఉంటుందన్నారు. 9 నుంచి సాధారణ పరిశీలకులు పనిచేస్తారని తెలిపారు.

ఇంటింటికీ స్టిక్కర్..

జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు ఈసారి కొత్తగా ఇంటింటికి స్టిక్కర్ కాంపైన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌ఓ) ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరుగా గర్వపడుతున్నాను (ప్రౌడ్ టు బి ఎ ఓటర్) అనే స్టిక్కర్ అంటిస్తున్నారని తెలిపారు. దీంతో పాటు నవంబర్ 10 నుంచి 25వ తేదీ వరకు ఇంట్లో ఎంత మంది ఓటర్లున్నారో వారి వివరాలు పోలింగ్ కేంద్రం చిరునామా, జాబితాలో పార్టు, సీరియల్ నెంబర్ తదితర వివరాలతో కూడిన ఓటరు స్లిప్‌లు అందిస్తామని తెలిపారు. తద్వారా సులభంగా పోలింగ్ కేంద్రానికి చేరుకోగలరన్నారు. వాటిపై ఫొటో ఉండదని, అది ఓటు వేసేందుకు గుర్తింపు కార్డుగా పనికి రాదని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ఎన్నికలు) శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబా నీ దయ




సాధారణంగానే నిత్యం భక్తులతో రద్దీగా ఉండే పహాడీషరీఫ్‌లోని చారిత్రక నేపథ్యం కలిగిన బాబా షర్ఫుద్దీన్ దర్గా వద్ద ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నేతల సందడి నెలకొంటుంది. అసెంబ్లీ, పార్లమెంట్, మున్సిపాలిటీ ఏ తరహా ఎన్నికలు వచ్చినా ఆయా పార్టీల నాయకులు దర్గాను దర్శించుకొని పూలు, చాదర్ సమర్పించి విజయం చేకూరాలని బాబాను ప్రార్థిస్తారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే ఎంతో పేరు గడించిన దర్గా కావడంతో సెంటిమెంట్‌గా గత ఎన్నికల సమయంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌లు తలపై బుట్టలో పూలు, చాదర్ తీసుకెళ్లి బాబాకు సమర్పించారు.


– పహాడీషరీఫ్

చూస్తోంది.. షాడో రిజిస్టర్



బంజారాహిల్స్: అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలన చేస్తున్న అధికారులు ఆయా ఖర్చులను నియోజకవర్గాల వారీగా షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. ఈ లెక్కల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని గణించనున్నట్లు వ్యయ నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో తాము ఖర్చు చేసే డబ్బులను ఎవరు చూస్తున్నారులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. షాడో రిజిస్టర్ నిర్వహణ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అకౌంటింగ్ బృందాలు ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పరిశీలన చేయాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. ఒకప్పుడు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 15 రోజులకోసారి సమర్పించే రికార్డులను పరిశీలకులు తనిఖీ చేసేవారు. ఇందుకు భిన్నంగా ప్రస్తుతం షాడో రిజిస్టర్ లెక్కలతో అభ్యర్థి వ్యయాన్ని సరి చూసుకోనున్నారు. దీంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రతీ పైసాకు లెక్కలు చూపాల్సిన అవసరం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే వ్యయం అంతా ఆయా రాజకీయ పార్టీల పరిధిలోకి రానుంది. అభ్యర్థుల ప్రకటన అనంతరం ప్రచారంతో పాటు ఇతర ఖర్చుల మొత్తం అభ్యర్థుల ఖర్చుల్లోకి వెళ్లనున్నాయి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు.

తలసాని హ్యాట్రిక్ కొట్టేనా?



సనత్‌నగర్ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థీ ఇంతవరకు హ్యాట్రిక్ రికార్డును కైవసం చేసుకున్న చరిత్ర లేదు. మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ వరుసగా ఆ విజయాలను నమోదు చేసుకున్న పరిస్థితులు ఉత్పన్నం కాలేదు. 1978లో సనత్‌నగర్ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటివరకు మొత్తం 11 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1992, 1994లో వరుసగా రెండుసార్లు ఇక్కడి నుంచి మర్రి శశిధర్‌రెడ్డి గెలుపొందగా 1999 ఎన్నికల్లో శ్రీపతిరాజేశ్వర్ గెలుపొందడంతో శశిధర్‌రెడ్డికి హ్యాట్రిక్ దూరమైంది. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో సైతం మర్రి శశిధర్‌రెడ్డి రెండు సార్లు వరుస విజయాలను నమోదు చేసుకోగా 2014లో ఆయన పరాజయం పాలవడంతో మరోసారి హ్యాట్రిక్ మిస్ అయ్యింది. ఇక 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలుపొంది మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు.

– సనత్‌నగర్

మామ కోసం కోడళ్లొచ్చారు!



సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల చరిత్రలో వరుసగా మూడుసార్లు విజయం సాధించినవారు లేరు. ఇక్కడి నుంచి ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థిగా తీగుళ్ల పద్మారావు గౌడ్ పోటీ చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకుని 'సికింద్రాబాద్ సెంటిమెంట్'కు చెక్ పెట్టాలనే లక్ష్యంతో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి 'కుటుంబ సభ్యుల సెంటిమెంట్'ను ప్రవేశపెట్టారు. ఆయనకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు కుటుంబ సభ్యులు ప్రచార రంగంలోకి దిగారు. కుమారులు కిషోర్‌కుమార్, కిరణ్‌కుమార్, రామేశ్వర్, త్రినేత్ర, కోడళ్లు శ్వేత, రోజా, శిల్ప, తేజస్విని ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. నలుగురు కుమారులతో పాటు కోడళ్ల ఎన్నికల ప్రచారం సెంటర్ ఆఫ్ ఎంట్రాక్షన్‌గా నిలుస్తోంది. పద్మారావు హ్యాట్రిక్ గెలుపు ఖాయమని కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

– చిలకలగూడ



పద్మారావు కోడళ్లు (వృత్తంలో)

45 ఏళ్లు.. ఇద్దరే ఎమ్మెల్యేలు


అక్బరుద్దీన్ ఒవైసీ

రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాలలో ఓటర్లు ఒకట్రెండు పర్యాయాలకే ఎమ్మెల్యేలను మారుస్తూ తీర్పునిస్తుండగా. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. నియోజకవర్గం ఏర్పడి 45 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు కేవలం ఇద్దరే ఎమ్మెల్యేలుగా ఉండడం గమనార్హం. అమానుల్లా ఖాన్ 1978 నుంచి 1999 వరకు ఏకంగా 22 ఏళ్ల పాటు ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగారు. 1978లో ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగి కాంగ్రెస్ (ఆర్)అభ్యర్థి ఎం.బాలయ్యపై 1,333 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1983లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి బీజేపీ అభ్యర్థి ఆలె నరేంద్రపై 3,581 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1985లోనూ స్వతంత్ర అభ్యర్థిగానే మరో స్వతంత్ర అభ్యర్థి జి.కృష్ణపై 3009 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1989లో మజ్లీస్ పార్టీ తరపున పోటీ చేసిన అమానుల్లాఖాన్ టీడీపీ అభ్యర్థి పి.బ్రహ్మానందచారిపై 78,147 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. 1994లో తాను స్థాపించిన ఎంబీటీ తరపున బరిలోకి దిగి ఎంఐఎం అభ్యర్థి యూసుఫ్ బిన్ అబ్దుల్ ఖాదర్‌పై 35,710 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తర్వాత జరిగిన 1999 ఎన్నికల్లో ఆయన తొలిసారిగా చాంద్రాయణగుట్ట ప్రస్తుత ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేతిలో 11,920 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కాగా.. 1999 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా అక్బరుద్దీన్ ఒవైసీ గత అమానుల్లాఖాన్ రికార్డును అధిగమించారు. అమానుల్లా ఖాన్ 22 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగగా.. అక్బరుద్దీన్ ఒవైసీ 24 ఏళ్లు పూర్తి చేసుకొని.. ఈసారి కూడా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

– చాంద్రాయణగుట్ట


అమానుల్లా ఖాన్

ఎన్నికల వేళ.. ఎక్సైజ్ అధికారుల దూకుడు

- అక్రమ మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలపై కొరడా
- రూ.కోటీ 30 లక్షల విలువైన నల్లబెల్లం స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల వేళ ఎక్సైజ్ పోలీసులు అక్రమ మద్యం అమ్మకాలు, గుడుంబా తయారీ కేంద్రాలు, విక్రయాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్ల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ పోలీసులు..మంగళవారం ఒక్కరోజే సుమారుగా రూ.కోటీ 30 లక్షల విలువైన నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకొని రికార్డు సృష్టించారు. ఇంత పెద్ద మొత్తంలో నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు. ఎక్సైజ్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్యల ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.రవీందర్‌రావు ఎస్‌టీఎఫ్, మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.అరుణ్‌కుమార్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సరూర్‌నగర్ ఏఈఎస్ హన్మంతరావు, హయత్‌నగర్ సిఐ టి.లక్ష్మన్ గౌడ్, డిటిఎఫ్ సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు హన్మంత్, యాదయ్య, వెంకన్నలు దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన బెల్లాన్ని (రెండు చోట్ల దాడులు నిర్వహించి) సుమారు 30 టన్నుల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించినప్పుడు తమకు రెండు చోట్ల నుంచి నల్లబెల్లం వస్తుందని గుడుంబా తయారీదారులు పోలీసుల విచారణలో తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ రెండు కోల్డ్‌స్టోరేజీలపై దాడులు నిర్వహించారు.

ఈ నేపథ్యంలోనే పోలీసులు మంగళవారం రెండుచోట్ల (హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైష్ణవి కోల్డ్ స్టోరేజ్ నుంచి 8 టన్నుల నల్లబెల్లం), (ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవూరి అగ్రో కోల్డ్ స్టోరేజ్ నుంచి 22 టన్నుల నల్లబెల్లం) ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు కోటి 30 లక్షల ఉంటుందని అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యాన్ని అమ్మినా, గుడుంబా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య హెచ్చరించారు. తాము స్వాధీనం చేసుకున్న బెల్లం మలక్‌పేట్ గంజ్, సాయిబాబా ట్రేడర్స్‌కు సంబంధించిందని తేలిందని, దీనిపై విచారణ చేపట్టామని ఆయన తెలిపారు.

గుడుంబా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు: చంద్రయ్య

రెండు వారాల్లో లక్షా 64 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రాష్ట్రంలో 40వేలకుపైగా బెల్ట్ షాపులు ఉండగా ఇప్పటి వరకు రాష్ట్రంలోని దాదాపు 1500 బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. రెండు వారాలుగా ఆబ్కారీ శాఖ అధికారులు దాడులు నిర్వహించి 16,700 లీటర్లు గుడుంబా స్వాధీనం చేసుకొని 2,755 కేసులు నమోదు చేసి 972 మందిని అరెస్టు చేశారు. వీటితో పాటు 1000 లీటర్లకుపైగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకొని 90కి పైగా కేసులు నమోదు చేసి 30 మందిని అరెస్టు చేశారు. లక్షా 64 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 980 కేసులు నమోదు చేసి 61 మందిని అరెస్టు చేసి అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.

అవగాహనతో టీబీ నివారణ సాధ్యమే



సమావేశంలో మాట్లాడుతున్న వికాస్

రాంగోపాల్‌పేట్: టీబీ వ్యాధిపై ప్రజల్లో పూర్తిగా అవగాహన లేకపోవడంతో రోగుల సంఖ్య పెరుగుతుందని టీబీ అలర్ట్ ఇండియా సీఈవో వికాస్ అన్నారు. సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని రాయల్ రివే హోటల్‌లో టీబీ అలర్ట్ ఇండియ ఆధ్వర్యంలో టీబీ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, కమ్యూనిటీ లీడర్లు తదితరులతో అవగాహన, వారి అనుభవాలను పంచుకునేందుకు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు రమేష్, రాజు, కాశీంలతో కలిసి ఆయన మాట్లాడారు. గతేడాది నుంచి ప్రభుత్వ సంస్థలతో కలిసి టీబీ అలర్ట్ ఇండియ తెలంగాణలో టీబీ అంబాసిడర్లతో ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దగ్గు, తెమడ, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల లాంటి లక్షణాలుంటే వెంటనే టీబీ పరీక్షల చేయించుకునేలా వారిని ఒప్పించాలన్నారు. 6 నెలల పాటు సరైన మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా టీబీ అంబాసిడర్లకు ఎదురైన సంఘటనల గురించి సదస్సు దృష్టికి తీసుకుని వచ్చారు.

అవయవదానంతో ఆరుగురికి ఊపిరి



అవయవదానం చేసిన హనుమాన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: తను శ్వాసను వదలి పెట్టి..మరో ఆరుగురికి ఊపిరి ఊదాడు. తను తనువు చాలిస్తూ ఐదు కుటుంబాల్లో వెలుగులు నింపాడు. కొండంత కొడుకును పోగొట్టుకున్న తల్లిదండ్రులు..ఇంటికి పెద్ద దిక్కుగా ఉండే భర్తను కోల్పోయిన భార్య పెద్ద మనసుతో తీసుకున్న ఆ నిర్ణయం ఆరుగురి ప్రాణాలు నిలబెట్టింది. బ్రెయిన్‌డెడ్‌కు గురైన ఓ వ్యక్తి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో ఆరుగురు వ్యక్తులకు ప్రాణం పోసేందుకు సికింద్రాబాద్ కిమ్స్ డాక్టర్లు సిద్ధమవుతున్నారు. వివరాలలోకి వెళితే ఏపీలోని నెల్లూరు పట్టణం గౌతంనగర్ ప్రాంతానికి చెందిన అనంతరెడ్డి, సంపూర్ణమ్మల కుమారుడు హనుమాన్‌రెడ్డి (46) హైదరాబాద్‌లో వ్యాపారం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భార్య విజయారెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 29వ తేదీన తీవ్రమైన తలనొప్పి రావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. రోగిని పరిశీలించిన వైద్యులు తలలో బ్లడ్ క్లాట్స్ అయ్యాయని గుర్తించారు. అతని ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు మూడు రోజుల పాటు శ్రమించినా మంగళవారం ఉదయం బ్రెయిన్ డెడ్‌కు గురి కాగా ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. కిమ్స్‌లోని అవయవదాన సమన్వయకర్తలు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానం ఆవశ్యకతను వివరించారు. ఆయన మరణించినా మరికొంత మంది ప్రాణాలు నిలబెడతారని వారు వివరించారు. దీంతో కొండంత దుఃఖాన్ని దిగమింగుకుంటూనే తల్లిదండ్రులు, భార్యా, కుమారులు ఓ గొప్ప కార్యానికి అంగీకారం తెలిపారు. దీంతో వైద్యులు ఆయన రెండు కిడ్నీలు, లంగ్స్, లివర్, రెండు కార్నియాలను సేకరించి వారికి అప్పగించారు. వీటిని జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకుని దాతల కోసం ఎదురు చూస్తున్న వారికి అందిస్తామని జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవాలు



- 'రన్ ఫర్ యూనిటీ'ని నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే
- రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ ఐక్యత దినోత్సవంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ ర్యాలీ'లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ ఏకే శ్రీవాస్తవ, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ రాథోడ్, సికింద్రాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్,ఇతర సీనియర్ అధికారులు, క్రీడాకారులు , పౌర రక్షణ సిబ్బంది, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సమావేశమైన రైల్వే సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రజా జీవితంలో సమగ్రత,నిబద్ధతను పెంపొందించడానికి, అవినీతి నియంత్రణకు రన్‌ఫర్ యూనిటీ వంటి ర్యాలీలు దోహదం చేస్తాయన్నారు. అవినీతిని శూన్య స్థాయికి తీసుకురావడానికి,దక్షిణ మధ్య రైల్వే నిబద్ధతను చాటుకోవడానికి ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు.

ఏసీబీకి చిక్కిన గచ్చిబౌలి ఏడీఈ

లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం



ఏసీబీకి పట్టుబడ్డ గచ్చిబౌలి ఏడీఈ రాము

గచ్చిబౌలి: లంచం తీసుకుంటూ గచ్చిబౌలి సబ్ ఇంజనీర్, ఏడీఈ ఏసీబీకి చిక్కారు. ఏడీఈ అందె రాముతో పాటు సబ్ ఇంజనీర్ వీరమల్ల సోమనాథ్‌ను ఈ మేరకు అరెస్ట్ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ నానక్‌రాంగూడకు చెందిన రాకేష్ సింగ్ రెండు విద్యుత్ మీటర్లు బిగించేందుకు రూ.70 వేలకు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ బి.సందీప్ కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడని చెప్పారు. సందీప్ కుమార్ రెండు మీటర్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేశారన్నారు. దరఖాస్తును గచ్చిబౌలి ఏఈకి పంపగా ఎస్టిమేట్ వేసి తిరిగి ఏడీఈకి పంపారని పేర్కొన్నారు. ఏఈకి ఫైల్ పంపాలని కాంట్రాక్టర్ సందీప్ ఏడీఈని కలువగా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.20 వేలు ఇస్తాననడంతో ఒప్పుకున్నాడు. కాంట్రాక్టర్ మంగళవారం సాయంత్రం ఏడీఈ ఆఫీస్‌లో సబ్ ఇంజనీర్ సోమనాథ్‌కు రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏడీఈ రాము వద్ద రూ.1,51,380 లెక్కలేని నగదు లభించిందన్నారు. కార్యాలయంతో పాటు హబ్సిగూడలోని ఆయన ఇంటిపై ఏసీబీ దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇద్దరిని అరెస్ట్‌చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు బీఆర్‌ఎస్‌లో చేరుతా: గొట్టిముక్కల

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. ఈమేరకు ఆయన మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటించారు. సీఎం కేసీఆర్ సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు. 42 ఏళ్లుగా కాంగ్రెస్‌కు సేవ చేసినా తగిన ఫలితం దక్కలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి చిత్తారమ్మ ఆలయం నుంచి కార్యకర్తలతో సాయంత్రం 3 గంటలకు భారీ ర్యాలీతో ప్రగతి భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరతామని తెలిపారు.

నా ఫేస్‌బుక్ అకౌంట్‌ను హ్యాక్ చేశారు: రాణిరుద్రమ

హిమాయత్‌నగర్: తన ఫేస్‌బుక్ పేజీ హ్యాక్ అయిందని సిరిసిల్ల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి, పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీసులను కలిసి ఆమె రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పాస్‌పోర్టు కార్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న పాస్‌పోర్టు కార్యాలయ ఉద్యోగులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఉద్యోగులందరి చేత సమగ్రత ప్రతిజ్ఞను చేయించారు. అలాగే ఈ ఏడాది థీమ్ అయిన 'సే నో టు కరప్షన్, కమిట్ టు ది నేషన్' గురించి వివరించారు. ఎక్కడా అవినీతికి చోటు లేకుండా ప్రజల కోసం పనిచేయాలని ఆయన సూచించారు. అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాలస్తీనాపై దాడులు ఆపండి

పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హిమాయత్‌నగర్: పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ ముప్పేట దాడులను వెంటనే ఆపి, ప్రజల మాన ప్రాణాల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హిమాయత్‌నగర్ సత్యనారాయణ భవన్‌లో ఎఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'పాలస్తీనాలో శాంతి పునరుద్ధరణ స్థాపనకు సంఘీభావం, ఎన్నికలలో కార్మికుల పాత్ర' అనే అంశాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అమెరికా ప్రోద్బలం, సహకారంతో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులతో గాజాలో పరిస్థితులు దారుణంగా మారాయన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరిగినా ఆయా దేశాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయి..అభివృద్ధికి ఆమడ దూరమవుతాయని విచారం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితిలో భారతదేశం ఓటు వేయకుండా ఉండే విధానాన్ని చూస్తుంటే అమెరికా సామ్రాజ్యవాదానికి భారతదేశం తొత్తుగా మారిందని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యం.డి.యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రేంపావని, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.యస్.బోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఏసురత్నం,వలీ ఉల్లా ఖాద్రి, ధరేంద్ర (ఎఐవైఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓల కార్యాలయాలు 33

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 3వ తేదీ నుంచి అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ల పర్వం ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల(ఆర్‌ఓ) కార్యాలయాల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ ప్రకటించారు.

వివరాలిలా ఉన్నాయి.

నియోజకవర్గం	ఆర్‌ఓ కార్యాలయం
ముషీరాబాద్	ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం, లోయర్ ట్యాంక్‌బండ్
మలక్‌పేట	జీహెచ్‌ఎంసీ డీసీ కార్యాలయం, నల్గొండ క్రాస్‌రోడ్స్ దగ్గర
అంబర్‌పేట	అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం.
ఖైరతాబాద్	జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం, ఖైరతాబాద్
జూబ్లీహిల్స్	షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం
సనత్‌నగర్	జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం
నాంపల్లి	ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం
కార్వాన్	గోల్కొండ తహసీల్దార్ కార్యాలయం, లంగర్‌హౌస్
గోషామహల్	జీహెచ్‌ఎంసీ కార్యాలయం, ఆబిడ్స్
చార్మినార్	జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, మొఘల్‌పురా
చాంద్రాయణగుట్ట	బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం, ఇంజన్‌బౌలి
యాకుత్‌పురా	సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం, చంపాపేట
బహదూర్‌పురా	బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం
సికింద్రాబాద్	జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం
కంటోన్మెంట్	కంటోన్మెంట్‌బోర్డు కార్యాలయం (కోర్టు హౌస్‌కాంపౌండ్)

ప్రముఖ సంఘసేవకుడు డాక్టర్ స్వామి అల్వాల్ మృతి



డాక్టర్ స్వామి అల్వాల్ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

నల్లకుంట: ప్రముఖ సంఘసేవకుడు, గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్(80) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. దీంతో నల్లకుంటలో విషాద ఛాయలు నెలకొన్నాయి. స్వామి అల్వాల్ పార్థివ దేహాన్ని నల్లకుంట సంజయ్‌నగర్ అంబేడ్కర్ శతాబ్ది భవన్‌లో ప్రజా సంఘాల నేతలు, స్థానిక ప్రజల సందర్శనార్థం ఉంచారు. స్థానిక కార్పొరేటర్ అమృత, సైకిలాబ్ బాబు, సీపీఎం అంబర్‌పేట జోనల్ కార్యదర్శి మహేందర్‌తో పాటు పలువురు ప్రజాసంఘాల నేతలు మంగళవారం దివంగత స్వామి అల్వాల్ పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైకిలాబ్ బాబు మాట్లాడుతూ.. సంత్ గాడ్గేబాబా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల స్ఫూర్తితో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. సీపీఎం అంబర్‌పేట జోనల్ కార్యదర్శి మహేందర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ప్రముఖ అంబేడ్కర్ వాది గోసుల విజయ్ కుమార్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు,

పక్కాగా నిబంధనల అమలు..

- ఐదుగురికే అనుమతి
- నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు
- నేర నిరూపణ అయిన అభ్యర్థులు ఆ వివరాలు పొందుపర్చాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఖైరతాబాద్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే

బంజారాహిల్స్: నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతిస్తామని ఖైరతాబాద్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే అన్నారు. నియోజక వర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి మంగళవారం ఖైరతాబాద్‌లోని నియోజక వర్గ ఎన్నికల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు వేయవచ్చన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని, ఏదైనా సమస్య, సందేహాలు ఉంటే ఎన్నికల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థి వాహనంతో పాటు మరో రెండు వాహనాలు మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఓసీలు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ. 5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

జత చేయాల్సినవి ఇవీ..

- నామినేషన్ పత్రంతో పాటు ఫారం-26, ఫారం-2(బి) జతపర్చాల్సి ఉంటుంది.
- అలాగే నో డ్యూస్ సర్టిఫికెట్ జతపర్చాల్సి ఉంటుంది.
- ప్రమాణం చేసే సర్టిఫికెట్‌ను కూడా నామినేషన్ పత్రంతో జతపర్చాలి.
- సర్టిఫైడ్ ఎక్స్‌ట్రాక్ట్ పత్రాలు తప్పనిసరి.
- గుర్తింపు పొందిన పార్టీలు అయితే ఫారం-ఏ, ఫారం-బి జతపర్చాల్సి ఉంటుంది.
- అభ్యర్థి రెండు ఫొటోలు, రెండు సెంటీమీటర్లు-2.5 సెంటీమీటర్ల సైజులో ఉండాలి.
- అఫిడవిట్‌లో ఖాళీలు ఉంచకూడదు.
- అఫిడవిట్‌ను నోటరీ చేయించాలి.
- అభ్యర్థి జైలు శిక్ష అనుభవించి ఉంటే, నేర నిరూపణ అయి ఉంటే ఆ వివరాలు డిక్లేర్ చేయాలి.
- ప్రపోజల్ చేసే ఓటరు తప్పనిసరిగా నియోజక వర్గానికి చెందిన వారై ఉండాలి.
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థికి ఒక ప్రపోజల్ సరిపోతుంది.
- మిగతా అభ్యర్థులు పది మంది ప్రపోజల్స్ చేయాల్సి ఉంటుంది.
- ఉద్యోగం నుంచి తొలగించబడ్డ ప్రభుత్వ ఉద్యోగి పోటీ చేయాలి అనుకుంటే సదరు ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించబడ్డాడో తప్పనిసరిగా సంబంధిత పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన రిజిస్టర్‌ను నామినేషన్ రోజు అందజేయడం జరుగుతుంది.
- అభ్యర్థి ఖర్చులన్నీ కొత్తగా తెరిచే బ్యాంకు అకౌంట్ నుంచే లావాదేవీలు జరపాల్సి ఉంటుంది.
- నామినేషన్ వేసే సమయంలో సీసీ కెమెరాల నిఘాలో వీడియోగ్రఫీ చేస్తారు.
- ఎవరు ముందు వస్తే వారి నామినేషన్లు తీసుకుంటారు.
- స్క్రూటినీ జరిగిన రోజున గుర్తు కూడా కేటాయిస్తూ అదే రోజు నోటీసులు కూడా ఇస్తారు.

సేవ చేసేందుకే పోటీ చేస్తున్నా

మహ్మద్ అజహరుద్దీన్



అజహరుద్దీన్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

రహమత్‌నగర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. హబీబ్ ఫాతీమా నగర్ ఫేజ్2 బస్తీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు జాఫర్ హుస్సేన్ తన అనుచరులతో కలిసి అజహరుద్దీన్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండా మరోసారి ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు జాఫర్ హుస్సేన్ సొంత పార్టీలోకి తిరిగి చేరడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడిన వారు తిరిగి రావాలని పిలుపునిచ్చారు. తన గెలుపు కోసం ఒక నెల కష్టపడితే ఐదేళ్లు సేవలందిస్తానని తెలిపారు. అనంతరం ఆయన బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. నగర కాంగ్రెస్ నాయకుడు భవాని శంకర్, సుల్తాన్, ఇబ్రహీం, గ్యారనాగరాజు, జేపి జ్ఞానేశ్వర్, మోసిన్, కేశవులు, అండాలు, సుందర్, మాలాకీ, రాంబాబు, యాదగిరి, దూడల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బంజారాహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన ఇద్దరు సీనియర్ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డివిజన్‌కు చెందిన జలాలుద్దీన్, ఉదయ్‌నగర్‌కు చెందిన నజీర్ ఇద్దరూ తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరగా ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో వీరి సేవలు వినియోగించుకుంటామని వీరి రాకతో కాంగ్రెస్ మరింత బలోపేతమైందని ఆమె పేర్కొన్నారు.

సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న సురేందర్ యాదవ్

వెంగళరావునగర్ : కాంగ్రెస్ పార్టీ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ యాదవ్ మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. అంతకు ముందు జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం సురేందర్ యాదవ్ కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్టుగా ప్రకటించి బీఆర్ఎస్ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ యాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిన తమ నేత విష్ణువర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వనందుకే కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, డివిజన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా తమ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

గెలిపిస్తే గుండెల్లో పెట్టి చూసుకుంటా



మాట్లాడుతున్న దానం నాగేందర్

ఫిలింనగర్: నెల రోజుల పాటు నిర్విరామంగా పని చేయండి, ఆ తర్వాత మిమ్మల్ని నా గుండెల్లో పెట్టి చూసుకుంటా అంటూ ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ కార్యకర్తలకు, నేతలకు సూచించారు. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం లేక్ వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పది రోజులు ఇంటింటికి తిరిగి పార్టీ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలన్నారు. ఎవరెవరు పని చేస్తున్నారో లేదో తనకు తెలిసిపోతుందన్నారు. ఈ ఎన్నికల్లో మీరే పోటీ చేస్తున్నారనే భావనతో పని చేయాలని, కేసీఆర్ గెలిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని లేకపోతే మన కష్టాలు మనమే తెచ్చుకున్నవారం అవుతామన్నారు. ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలే తన బలమని, బూత్ స్థాయిలో తిరుగుతూ ప్రతి ఒక్కరిని కలిసి వారి సమస్యలు నోట్ చేసుకోవాలని అవసరమైతే పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని లేని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దుష్ప్రచారం చేసే అవకాశం ఉందని డబ్బులు విచ్చలవిడిగా పంచుతారని వారిపట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు తాను ఓపికగా ఉన్నానని ఎవరైనా కార్యకర్తను ప్రతిపక్షాలు ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. కార్యకర్తలు తమ బాధ్యతలను విజయవంతంగా నిర్వహించినప్పుడే గెలుపు సాధ్యమన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో 12 వేల మందికి సంక్షేమ పథకాలు అందాయని వారందరినీ ప్రత్యక్షంగా కలిసి వారితోనే ప్రచారం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఇన్‌చార్జి దామోదర్ కోలేటి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, మామిడి నర్సింగ్‌రావు, మంగళారపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

50 వేల మెజార్టీతో దానం గెలుపు ఖాయం

బంజారాహిల్స్: బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందని ఖైరతాబాద్ నియోజక వర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి, తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ తమకు ఇచ్చిన బాధ్యతలను సిన్సియర్‌గా చేయాలని అప్పుడే పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారన్నారు. కార్యకర్తల పనితీరుపై పార్టీకి ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందుతుందన్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తుంటే అభ్యర్థి దానం నాగేందర్‌కు 50 వేలకుపైగా మెజార్టీ ఖాయంగా కనిపిస్తుందన్నారు. నియోజక వర్గంలో పోటీ ప్రతిపక్షాలతో లేదని డివిజన్ల మధ్య బీఆర్ఎస్ మెజార్టీపైనే ఉందన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో లీడింగ్ మెజార్టీ తీసుకురావాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. దానం గెలిస్తే మంత్రి అవుతాడని ఇక్కడి కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళతో మాట్లాడుతున్న దానం నాగేందర్

పంజగుట్ట: బీఆర్ఎస్ చేసిన సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటు వేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రేమ్‌నగర్, ఆనంద్‌నగర్ కాలనీ, చింతల్‌బస్తీల్లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. డిసెంబర్ 5 తర్వాత అన్ని పథకాలు తిరిగి అమలవుతాయన్నారు. కాంగ్రెస్ ఎన్ని గ్యారంటీలు ఇచ్చినా ప్రజలు నమ్మరని, రాష్ట్రంలో మరోమారు బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేస్తేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. మరే ప్రభుత్వం వచ్చినా ప్రజా సంక్షేమం జరగదని మూడోసారి కూడా కేసీఆర్‌నే ముఖ్యమంత్రి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నివాళి



ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ పోచమ్మ గుడి వద్దనున్న ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు శివ గౌడ్, కొండల్ రావు, బక్కు యాదవ్, బాబా గౌడ్, మహేశ్వర్ గౌడ్ నర్సమ్మ, హేమ, సుకన్య, మాధవి, రాకేష్, పవన్ పటేల్, చింటు యాదవ్, విజయ్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. - సాక్షి, సిటీబ్యూరో

బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శిగా విజయరాజు



నియామక పత్రం తీసుకుంటున్న విజయరాజు

పంజగుట్ట: బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శిగా బట్టు విజయరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బీసీ సమాజ్ రాష్ట్ర కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు సంగెం సూర్యారావు చేతులమీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోని బీసీలను ఐక్యం చేసి బీసీ రాజ్యాధికారమే ధ్యేయంగా పని చేస్తానని విజయరాజు పేర్కొన్నారు.

లంబాడా ఉపతెగలను ఆదుకోండి



మాట్లాడుతున్న రఘు నాయక్

హిమాయత్‌నగర్: లంబాడాల ఉప కులమైన దాడి లంబాడాల డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని దాడి లంబాడా హక్కుల సాధన సమితి(డీఎల్ హెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రుణావత్ రఘు నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. దాడి లంబాడాలు రాష్ట్రంలో ఆరు లక్షల జనాభా ఉందన్నారు. తమకు ఎస్టీ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ లంబాడా ఉప తెగలైన దాడి, డాలియా, సనార్, గోర్, బట్‌లు ఒక్క శాతం కూడా అక్షరాస్యత లేకపోవడంతో దీనస్థితిలో జీవనం గడుపుతున్నారన్నారు. దాడి, డాలియాల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. లంబాడా ఉపతెగల జీవన స్థితిపై అధ్యయనం చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. తమ డిమాండ్లపై రాజకీయ పార్టీలు హామీ ఇవ్వకపోతే రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో దాడి డాలియా లంబాడాల ఆధ్వర్యంలో ప్రతి నియోజక వర్గంలో 50 మందితో సామూహికంగా నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అయుర్వేద మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డి...

వెంగళరావునగర్ : చిన్నారులకు వచ్చే రోగాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ అయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. జాతీయ ఆయుర్వేద వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో బాలరోగ విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు కలిగే జబ్బులపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. చలికాలం పిల్లలపై ప్రభావం చూపే రోగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి ఆయుర్వేద మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, బాలరోగ శాఖ ప్రతినిధి డాక్టర్ పి.యశోద, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ సులోచన, డాక్టర్ సృజన, డాక్టర్ అనురాగ్, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్మికులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు ..

పంజగుట్ట: స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ జీహెచ్ఎంసీ ఆటో టిప్పర్స్, రిక్షా కార్మికుల జేఏసీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ ఇ.సూరన్న, వ్యవస్థాపక చైర్మన్ ఎమ్.వీరేష్, కన్వీనర్ బి.రామాంజనేయులు మాట్లాడుతూ .. తాము ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించి తరలిస్తుంటామని, ఎప్పుడూ చెత్తలో ఉండడంవల్ల తమ సంపాదనలో సగం ఆసుపత్రులకే ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హెల్త్‌కార్డులు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు. 2015లో ఇచ్చిన స్వచ్ఛ ఆటో, టిప్పర్‌ల మెయింటెనెన్స్ కార్మికులకు భారంగా మారిందని, వెంటనే వాటిస్థానాల్లో కొత్త వాహనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఇంటింటికీ చెత్తను తరలించేందుకు రూ.150 నుండి రూ. 200 ఇచ్చేలా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపి, మీసాల నర్సింహ, బాలు, రంగనాయకులు, సి.నర్సింహ, కిష్టప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ఎనలేనివి



వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీఎస్ఎస్‌పీ కమాండెంట్ మురళీకృష్ణ



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వెంగళరావునగర్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర సమరయోధుడే కాకుండా స్వాతంత్రం అనంతరం సంస్థానాలను దేశంలో విలీనం చేసిన గొప్ప నాయకుడని టీఎస్ఎస్‌పీ కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ అడిషనల్ కమాండెంట్ నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ రామదాసు, సత్యనారాయణ, రంగారెడ్డి, జవహర్‌లాల్, నర్సింహరాజు, ఆర్ఐలు ధర్మారావు, సాంబయ్య, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పటేల్ జయంతి సందర్భంగా విద్యార్థుల రక్తదానం

హిమాయత్‌నగర్: దేశ మొదటి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్య కమిటీ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వంద మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నాగేశ్వర్ రావు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్ : స్వీట్ షాపు నుంచి బయటికి వచ్చిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌కు చెందిన భజరంగ్ బాటి మధురానగర్ సమీపంలోని కేకే టవర్స్ వద్ద స్వీట్‌షాపు నిర్వహిస్తున్నాడు. రాజస్థాన్‌లోని దజార్ ప్రాంతానికి చెందిన తన బావమరిది ఆకాశ్‌ను 15 రోజుల క్రితం నగరానికి తీసుకువచ్చాడు. ప్రతిరోజు తన వెంట స్వీట్ షాప్‌కు తీసుకెళ్లేవాడు. ఈనెల 30న సాయంత్రం ఎదురుగా ఉన్న మరో స్వీట్‌షాపు వద్ద బాత్రూంకు వెళుతున్నానని చెప్పి బయటికి వచ్చిన అతను తిరిగి రాలేదు. దాంతో భజరంగ్ బాటి అతడి కోసం గాలింపు చేపట్టినా ఫలితం కనిపించకపోవడంతో మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్టేట్‌హోం నుంచి యువతి అదృశ్యం



మల్లీశ్వరి(ఫైల్)

వెంగళరావునగర్ : స్టేట్‌హోంలో ఆశ్రయం పొందుతున్న యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మల్లీశ్వరీ అనే యువతి గత కొంతకాలంగా మధురానగర్ డివిజన్ పరిధిలోని స్టేట్‌హోంలో ఉంటూ సమీపంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతోంది. కాగా కడప జిల్లాకు చెందిన ప్రవీణ్ అనే యువకుడితో ఇన్‌స్టాగ్రాంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి తన గది నుంచి బాత్రూం కిటికీలోనుంచి దూకి పారిపోయింది. తాను ప్రవీణ్ అనే యువకుడిని ప్రేమించానని, అతనితో పాటు వెళుతున్నట్లు ఉత్తరంలో పేర్కొంది. స్టేట్‌హోం ఇన్‌చార్జి ముంతాజ్‌బేగం ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సినీ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ సభ్యులపై కేసు నమోదు

బంజారాహిల్స్: తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ కాట్రగడ్డ సుధాకర్‌పై దాడి చేసిన వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. తనను చంపేస్తారంటూ హెచ్చరించడమే కాకుండా తన కారుపై రాళ్లు వేసి ధ్వంసం చేశారంటూ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే యూనియన్‌కు చెందిన మాజీ ఉపాధ్యక్షుడు జి. హరినాథ్, ఆర్. వెంకటేశ్వరరావు, రాందాస్ ధన్‌రాజ్, పాలేటి శ్రీనివాసరావు, డీవీ. రామకృష్ణ, వి. బాలమోహన్, ఎం. వెంకట చందు, దాసరి బాలకృష్ణ తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ నెల 30న కమలాపురి కాలనీలోని తన ఇంటి వద్దకు వచ్చిన వారు తనను చంపుతానంటూ బెదిరించారని మద్యం మత్తులో తనను కిడ్నాప్ చేసేందుకు యత్నించారని వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారంటూ రూ.42 లక్షల స్వాహా

హిమాయత్‌నగర్: మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావని బెదిరించి సైబర్ నేరగాళ్లు ఓ మహిళ నుంచి రూ.42 లక్షలు కాజేశారు. సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..నిషేధిత పదార్థాలను తైవాన్ దేశానికి ఎగుమతి చేస్తున్నారంటూ నగరానికి చెందిన ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, రూ. 50 లక్షల వరకు లావాదేవీలు జరిగాయన్నారు. తాము ముంబై అంధేరీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని, సెంట్రల్ ఫైనాన్స్ విభాగం అధికారులు నోటీసులు ఇస్తారని భయపెట్టారు. ఆ డబ్బును తాము చెప్పిన విధంగా ఆన్‌లైన్ ద్వారా పంపిస్తే, వెరిఫై చేసిన అనంతరం అరగంటలో డబ్బులను తిరిగి పంపిస్తామని నమ్మించారు. దీంతో సదరు మహిళ వారు చెప్పిన విధంగా రూ.42 లక్షలను బదిలీ చేసింది. వారు డబ్బులు తిరిగి బదిలీ చేయలేదు, వారి నంబర్లు పనిచేయకపోవడంతో బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

క్లుప్తంగా...

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



శ్రీనగర్‌కాలనీ: ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకోవాలని సామాజిక కార్యకర్త, విద్యుత్ అధికారి క్లెం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్‌నగర్ వెంచర్-3లోని పార్కులో ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్యశాల సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 200మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో కళ్యాణ్‌నగర్ వెంచర్-3 అసోషియేషన్ సెక్రటరీ ప్రభాకరరావు, డాక్టర్ పి.రాజేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కవితారాథోడ్, డాక్టర్ నర్సింహా, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ఫీజులను వెంటనే తగ్గించాలి

లిబర్టీ: డిగ్రీ విద్యార్థుల ఫీజులను వెంటనే తగ్గించాలని దళిత బహుజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర శాఖ కోఆర్డినేటర్ ఇటిక్యాల గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సమైక్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో విద్యార్థుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

రచన జర్నలిజం కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

హిమాయత్‌నగర్: నారాయణగూడ కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లోని రచన జర్నలిజం కళాశాలలో వివిధ జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.ఉమామహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రచన జర్నలిజం కళాశాల, రెగ్యులర్, కరస్పాండెన్స్ విధానం ద్వారా జర్నలిజంలో పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పీజీ డిప్లమా కోర్సులో చేరడానికి ఏదైనా డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు పదోతరగతి పాసైనవారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు కోసం రూ.200 లడిడిని రచన జర్నలిజం కళాశాల, హైదరాబాద్, పేరు రచన జర్నలిజం కళాశాల, కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ క్యాంపస్, దీపక్ థియేటర్ పక్కవీధి, నారాయణగూడ, హైదరాబాద్ 500 029 చిరునామాకు పంపాలన్నారు. అప్లికేషన్లు పొందడానికి నవంబర్ 25 చివరి తేదీ అని, మరిన్ని వివరాల కోసం 040-23261335, 9959640797 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

హిమాయత్‌నగర్: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు విజయవంతంగా ముగిసినట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా వలీ ఉల్లా ఖాద్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా, టి.వెంకటేశ్వర్లు, టి.సత్య ప్రసాద్, బిజ్జ శ్రీనివాసులు, చావాండ్ల యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా కె. ధర్మేంద్ర, సహాయ కార్యదర్శులుగా నానబాల రామక్రిష్ణ, లింగం రవి, కనుకుంట్ల శంకర్, కోశాధికారిగా పేరబోయిన మహేందర్, ఆఫీస్ బేరర్స్, ఆహ్వానితులుగా కొండల్, శ్రీమాన్‌లతో పాటు 65మందిని కౌన్సిల్ సభ్యులుగా, 25మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

రూ. 4 లక్షల నగదు పట్టివేత

రహమత్‌నగర్ : బోరబండ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. డీఐ భూపాల్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోరబండ స్టేషన్ పరిధిలోని మోతీనగర్ చౌరస్తాలో మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు శ్రీరాంనగర్‌కు చెందిన మహ్మద్ ఇసాక్ అనే యువకుడు చెందిన బైక్‌ను ఆపి సోదా చేయగా అందులో రూ. 4 లక్షలు లభ్యమయ్యాయి. సరైన ఆధారాలు లేకపోవడంతో డబ్బును స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రహమత్‌నగర్ : బోరబండ డివిజన్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. డీఐ భూపాల్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హెచ్ఎఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఫయాజ్(29)ఒరిస్సాకు చెందిన సరోజ్ కుమార్‌దాస్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన పోలీసులు విజేత టాకీస్ సమీపంలో వారిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 1700 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

డీసీఎం ఢీకొని జీహెచ్ఎంసీ కార్మికులకు గాయాలు

వెంగళరావునగర్ : చెత్తను అన్‌లోడ్ చేస్తున్న కార్మికులను చెత్త తీసుకువచ్చిన డీసీఎం ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ డంపింగ్ యార్డు (ట్రాన్స్‌ఫర్ స్టేషన్)లో మంగళవారం ఉదయం రంగన్న-లక్ష్మి దంపతులు ఆటోలో తెచ్చిన చెత్తను డంపింగ్ చేస్తున్నారు. అదే సమయంలో చెత్తను తీసుకువచ్చిన డీసీఎం డ్రైవర్ రివర్స్ తీయడంతో వెనక ఉన్న రంగన్న, లక్ష్మిలకు గాయాలయ్యాయి.

క్లుప్తంగా...

మోసపూరిత హామీలపై అప్రమత్తంగా ఉండాలి

- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక గూటి పక్షులే: డా.కె.లక్ష్మణ్
- కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని బీజేపీ ఖండిస్తోంది



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇస్తున్న మోసపూరిత హామీలపై రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ ఎంపీ, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ సూచించారు. బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఒక్కసారి మోదీ పాలన చూడాలని... వారసత్వ రాజకీయాలు లేకుండా, అవినీతికి, దళారీలకు అవకాశమే లేకుండా కేంద్రంలో మోదీ అందించిన పాలన రాష్ట్రంలో చూడాలని ప్రజలకు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన లక్ష్మణ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకేగూటి పక్షులని... ఈ రెండు పార్టీల పాలన తెలంగాణ ప్రజలు చూశారన్నారు. బీజేపీ పాలన చూసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీసీ నేతను ముఖ్యమంత్రి చేస్తానన్న బీజేపీ గురించి ఆలోచించాలన్నారు. కాగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఎంపీ సమాధానమిస్తూ, వివేక్ వెంకటస్వామి పార్టీలోనే ఉంటారని.. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఆయన చక్కటి మేనిఫెస్టో ఇచ్చారని తెలిపారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, పవన్ కళ్యాణ్ విదేశీ పర్యటనలో ఉన్నారని.. ఆయన వచ్చాక కార్యాచరణ ప్రకటిస్తామని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

నా ఫేస్‌బుక్ పేజీ హ్యాక్.. ఇన్‌స్టాగ్రామ్ డిలీట్: రుద్రమ

సాక్షి, హైదరాబాద్: తన పేరుతో (రాణీరుద్రమరెడ్డి) ఉన్న ఫేస్‌బుక్ పేజీ హ్యాకింగ్‌కు గురైందని, అదే పేరుతో ఉన్న తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేశారని బీజేపీ అధికార ప్రతినిధి, సిరిసిల్ల అభ్యర్థి రాణీరుద్రమ తెలిపారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐటీ హబ్ కేంద్రంగా విపక్షాల నాయకులు, కార్యకర్తలపై ఈ విధంగా దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను సిరిసిల్లలో కేటీఆర్ దుర్మార్గాలను సామాజిక మాధ్యమాల ద్వారా బయటి ప్రపంచానికి వెల్లడించకుండా చేయడానికే తన ఖాతాలను హ్యాక్ చేశారన్నారు.

నేడు బీజేపీ మలి జాబితా!

భేటీ కానున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ

- తెలంగాణ జాబితాపై పూర్తయిన కసరత్తు
- జేపీ నడ్డాతో జాబితాపై చర్చించిన కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఉత్కంఠకు తెరలేపిన బీజేపీ మలి జాబితాపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరుగనున్న పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో మిగిలిన 66 మంది తెలంగాణ అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కీలక నాయకులు సిద్ధం చేసిన జాబితాకు పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆమోద ముద్ర వేయనుంది. ఇప్పటికే జనసేనతో పొత్తులు సహా తుది జాబితాపై బీజేపీ పెద్ద ఎత్తున కసరత్తు చేసింది. కాగా మంగళవారం తుది జాబితాపై కిషన్‌రెడ్డి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిగిలిన స్థానాల్లో అభ్యర్థులపై సమీక్షతో పాటు జనసేనతో పొత్తుకు సంబంధించిన అంశాలపై నడ్డాతో కిషన్‌రెడ్డి చర్చించారని సమాచారం.

66 స్థానాలపై వడపోత

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఇప్పటికే ఒకసారి భేటీ అయిన సీఈసీ రెండు జాబితాల్లో కలిపి 53 మంది అభ్యర్థిత్వాన్ని ఆమోదం వేసింది. తొలి జాబితాలో 52 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించిన తర్వాత కొన్నిచోట్ల అసంతృప్తి బయటపడింది. రెండో జాబితాలో మహబూబ్‌నగర్ నుంచి ఏపీ మిథున్‌రెడ్డి పేరును బీజేపీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే మిగతా 66 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో కొన్నిచోట్ల భిన్నాభిప్రాయాల నేపథ్యంలో... గత వారం ఢిల్లీ, హైదరాబాద్ వేదికగా రాష్ట్ర నాయకత్వం పలుమార్లు భేటీ అయి అభ్యర్థుల వడపోతను పూర్తి చేసింది. అక్కడ వచ్చిన తుది నిర్ణయాల మేరకు పోటీదారుల జాబితాను సీఈసీకి నివేదించనుంది.

నేటి సీఈసీ సమావేశానికి మోదీ, అమిత్ షా

బుధవారం జేపీ నడ్డా అధ్యక్షతన జరిగే సీఈసీ సమావేశానికి పార్టీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా సహా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, ఇతర సభ్యులు హాజరుకానున్నారు. వీరితో పాటు తెలంగాణ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్ కుమార్, తరుణ్ ఛుగ్, సునీల్ భన్సల్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎన్నికల ఇంఛార్జ్ ప్రకాశ్ జవదేకర్‌లు కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం జరుగనున్న ఈ భేటీ అనంతరం తెలంగాణ మలి జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం ఏ క్షణమైనా విడుదల చేయనుంది.

ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తున్నాం

- పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల ర్యాలీ



పాలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ జాత్యహంకార దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలస్తీనాకు ఎలాంటి ఉనికి లేకుండా చేయడం అత్యంత బాధాకరమని, ప్రపంచ దేశాలు ఈ సంఘటనపై స్పందించాలని వారు కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, న్యూడెమాక్రసీ, లిబరేషన్ తదితర వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభ జరిగింది. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యదర్శి పోటు రంగారావు, న్యూడెమాక్రసీ నాయకులు వేములపల్లి వెంకటరాములు, సీపీఎం నాయకుడు ఎండీ అబ్బాస్, సీపీఐ జాతీయ నాయకుడు అజీజ్‌పాషా తదితరులు పాల్గొని ప్రసంగించారు. రంగారావు మాట్లాడుతూ అమెరికా మద్దతుతోనే ఇజ్రాయెల్ ఈ దురాక్రమణకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో వేలమంది విగతజీవులుగా మారుతున్నారని వెంకటరాములు ఆవేదన చెందారు. అబ్బాస్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజల హక్కులను కాలరాయడానికే ఇజ్రాయెల్ దాడులు చేస్తోందన్నారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి అంబేడ్కర్ కళాశాల వరకు పాలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి. నర్సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కె.గోవర్ధన్, మురహరి, జానకిరాములు, గాదగోని రవి, బాలమల్లేశం, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల బదిలీలు సమీక్షించండి

బీజేపీ నేత శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. హైదరాబాద్ నగర పరిధిలో పోలీసు అధికారుల బదిలీలు జరిగిన తీరును సమీక్షించాలని నగర పోలీస్ కమిషనర్‌కు బీజేపీ ఈసీ వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికార బీఆర్ఎస్ పార్టీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం నాయకులు కోరుకున్నట్టు బదిలీలు జరిగాయని సీపీకి పంపించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ప్రతిని తెలంగాణ (సీఈవో), ఢిల్లీలోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మర్రి శశిధర్‌రెడ్డి పంపించారు.

'రజాకార్'తో శాంతిభద్రతలకు భంగం

- చరిత్రను వక్రీకరించి మతతత్వ కోణంలో సినిమాను తీశారు
- ఎన్నికల సంఘం కమిటీ ముందు రావి నారాయణరెడ్డి మనవరాలు వాదనలు

సాక్షి, హైదరాబాద్: చరిత్రను వక్రీకరిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా తీసిన రజాకార్ సినిమాను అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడుదల చేసేందుకు అనుమతించరాదని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి మనవరాలు రావి ప్రతిభారెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మత విద్వేషాలు సృష్టించరాదని ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని 5వ నిబంధన చెబుతోందని గుర్తుచేశారు. అందువల్ల భువనగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుడూరు నారాయణరెడ్డి నిర్మించిన ఈ సినిమాపై ఎన్నికల కోడ్ కింద చర్యలు తీసుకొనే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందన్నారు. ఆమె ఫిర్యాదుపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధాన అధికారి లోకేశ్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ విచారణ చేపట్టింది. ఈ విచారణకు హాజరైన ప్రతిభారెడ్డి ఈ మేరకు తన వాదనలు వినిపించారు. సినిమాలో వాడిన బతుకమ్మ పాట తెలంగాణ మహిళల మనోభావాలను కించపరిచేలా ఉందన్నారు. కాగా, సినిమా విషయంలో త్వరలో ఎన్నికల సంఘం నిర్ణయాన్ని తెలియజేస్తామని కమిటీ హామీ ఇచ్చిందని ప్రతిభారెడ్డి మీడియాకు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- గురుకుల కళాశాల ప్రిన్సిపాలే కారణమన్న బంధువులు
- ఐదు గంటలపాటు ఆందోళన.. ఉద్రిక్తత



వసుధ (ఫైల్)



ఎక్లార కళాశాలలో ఆందోళన చేస్తున్న వసుధ బంధువులు

మద్నూర్ (జుక్కల్): గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం బంధువుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్తంగా మారింది. విద్యార్థిని మృతికి ప్రిన్సిపాల్ కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో బిచ్కుంద మండలం మానేపూర్‌కు చెందిన దాసరి వసుధ (17) ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఆమె హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళాశాలకు తిరిగి వెళ్లిన తెల్లారే వసుధ ఆత్మహత్యకు పాల్పడటంతో వసుధ తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేశారు.

కాలేజీకి వచ్చిన మరునాడే

దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన వసుధను సోమవారం ఆమె తల్లి అంజవ్వ, మేనమామ మోహన్ కళాశాలలో దింపేసి వెళ్లిపోయారు. ఆ రాత్రి వసుధ భోజనం చేయలేదని, మంగళవారం ఆరోగ్యం బాగాలేదని ప్రార్థనకు రాకుండా హాస్టల్ గదిలోనే ఉండి పోయిందని తోటి విద్యార్థినులు చెప్పారు. తర్వాత వసుధ తరగతి గదికి కూడా రాకపోవడంతో కళాశాల సిబ్బంది హాస్టల్ గదికి వెళ్లి చూశారు. వసుధ చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు కనపడడంతో తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వసుధ మృతికి కళాశాల ప్రిన్సిపాల్ సవిత, సిబ్బందే కారణమంటూ బంధువులు పెద్ద సంఖ్యలో కళాశాలకు చేరుకున్నారు. హాస్టల్ గదుల తలుపులు, కిటికీ అద్దాలను పగలగొట్టి ఐదు గంటలపాటు ఆందోళన చేశారు. పరిస్థితిని గమనించిన పోలీసులు ప్రిన్సిపాల్, సిబ్బందిని ఒక గదిలో ఉంచి గడియ పెట్టి కాపలా ఉన్నారు. బంధువులు తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆ గదిపై చల్లే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ క్రిష్ణలపై పడింది. పోలీసు సిబ్బంది నిలువరించడంతో ప్రమాదం తప్పింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై క్రిష్టారెడ్డి తెలిపారు.

మార్కుల కోసం కాలేజీ టార్చర్..

▶ మొదటి పేజీ తరువాయి

వెంటనే అతన్ని సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంట్లో లభించిన సూసైడ్ నోట్‌లో 'మంచి మార్కులు తెచ్చుకోవాలని టీచర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఒత్తిడి, టార్చర్ చేస్తున్నారు. సారీ అమ్మా నాన్న, తమ్ముడు.. దయచేసి ఎవరూ నారాయణ కళాశాలలో చేరొద్దు. ఇదే నా జీవితంలో చివరి రోజు. దయచేసి విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దు. నా తమ్ముడిని మంచి కళాశాలలో చేర్పించండి. అతని భవిష్యత్తు బావుండాలని కోరుకుంటున్నా. చివరగా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు క్షమాపణలు' అని లేఖలో రాశాడు. దీంతో నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి బంధువులు, స్థానికులు, ఏబీవీపీ నాయకులు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

సిద్దిపేట సీపీ, ఏసీపీలను బదిలీ చేయాలి

- సీఈవోకు బీజేపీ నేత, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: అధికార బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతూ బీజేపీపట్ల పక్షపాత వైఖరిని అవలంబిస్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్, ఏసీపీలపై కఠినచర్యలను తీసుకొని వారిని అక్కడి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా కేంద్ర బలగాలను దింపాలని కోరారు. మంగళవారం ఈ మేరకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. గతంలోనే సిద్దిపేట పోలీసుల పక్షపాత తీరుపై సీఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. బీజేపీ కార్యకర్తలపై దాడులకు సంబంధించి సీపీ దృష్టికి తెచ్చినా ఏ చర్యా తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఆ పార్టీ నాయకులు అవకాశంగా తీసుకుని బీజేపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేశారని సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ దాడితో బీజేపీకి ఎలాంటి సంబంధంలేదని స్పష్టంచేశారు. తనకు సెక్యూరిటీ పెంచాలని గతంలోనే డీజీపీని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు.

నగర వార్తలు

పోటాపోటీగా టీపీజీఎల్



గోల్కొండ: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సెమీ ఫైనల్‌కు చేరుకుంది. సోమ, మంగళవారాల్లో జరిగిన క్వాటర్ ఫైనల్ పోటాపోటీగా జరిగాయి. ఉత్కంఠభరితంగా జరిగిన క్వాటర్ ఫైనల్స్‌లో ఎంవైకే స్ట్రైకర్స్, ఆర్య వారియర్స్, లహరి లాయన్స్, టీమ్ టీ ఆఫ్ సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

జలమండలిలో ఏక్తా దివస్

సాక్షి,సిటీబ్యూరో: జలమండలిలో ఏక్తా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎండీ దానకిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉన్నతాధికారులు, ఉద్యోగులతో దేశ సమగ్రత, ఐక్యత ముఖ్యమని, అందుకోసం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని సమైక్యంగా ఉంచడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. దేశ సమగ్రత, భద్రతకు ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా కృష్ణ, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, టీవీ శ్రీధర్ పాల్గొన్నారు.

గవర్నర్ సహకారం.. విష్ణువచనకు బంగారం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జెనటిక్స్ (జన్యుశాస్త్రం) విభాగంలో అత్యధిక మార్కులు సాధించి బంగారు పతకం సాధించేల టాప్ ర్యాంక్ తెచ్చుకున్న విష్ణువచన పోరాడి ఎమ్మెస్సీలో బంగారు పతకాన్ని అందుకుంది. ఓయూలో పీజీ విద్యార్థులకు స్పాన్సర్ (దాతలు) ద్వారా బంగారు పతకాలను అందజేస్తారు. జెనటిక్స్ విభాగానికి స్పాన్సర్ లేనందున టాపర్‌గా నిలిచిన విష్ణువచనకు బంగారు పతకం లభించలేదు. ఎంతో కష్టపడి అధిక మార్కులు తెచ్చుకున్న గోల్డ్ మెడల్ దక్కలేదని దిన పత్రికల్లో కథనాలు రావడంతో గవర్నర్ తమిళ్ సై స్పందించి భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లాను సంప్రదించి ఓయూ జెనటిక్స్ విభాగానికి బంగారు పతకాన్ని స్పాన్సర్ చేయించింది. ఓయూలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా విష్ణువచన బంగారు పతకాన్ని అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మీడియాకు కృతజ్ఞతలు తెలిపింది.

బీజేపీని ఓడించేందుకు ప్రత్యామ్నాయ కృషి

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా



మాట్లాడుతున్న రాజా, వేదికపై చాడ వెంకట్‌రెడ్డి, సాంబశివరావు, పల్లావెంకట్‌రెడ్డి

నాగోలు: దేశంలో బీజేపీని ఓడించేందుకు రాజకీయ ప్రత్యామ్నాయ నిర్మాణానికి సీపీఐ, వామపక్షాలు, ఇతర ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, దేశంలో పెద్దదైన లౌకిక పార్టీ కాంగ్రెస్ కూడా ఆలోచించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. నవ చేతన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న ప్రజాపక్షం దినపత్రిక ఐదో వార్షికోత్సవాలను నాగోలు బండ్లగూడలోని ప్రజాపక్షం ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు డి.రాజా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశాన్ని వినాశకరమైన విధానాల నుంచి రక్షించాలంటే మితవాద, ఫాసిస్టు బీజేపీ, దాని మిత్ర పక్షాలను ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో ప్రభుత్వం తీవ్రమైన అవినీతి ఆరోపణలో కూరుకుపోయినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నదని, ఇక్కడ శ్రామిక ప్రజల కనీసావరాలను తీర్చే లౌకిక, ప్రజాతంత్ర ప్రభుత్వం ఏర్పడాలన్నారు. ఇటీవల ఆర్ఎస్ఎస్ సంఘ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ సంస్కృతిక మార్క్సిజం పేరుతో విమర్శలు గుప్పించారని దీన్ని బట్టి కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు ఉద్యమాలను ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోందన్నారు.

పాలస్తీనాపై మోదీ విరుద్ధ వైఖరి..

మహాత్మా గాంధీ కాలం నుంచి పాలస్తీనాను భారత దేశం సమర్థిస్తున్నదని, కాని మోదీ హయాంలో ఇందుకు విరుద్ధమైన వైఖరిని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్నదని రాజా మండిపడ్డారు. ఇటీవల పాలస్తీనాలో కాల్పుల విరమణ చేయాలని ఐక్యరాజ్య సమితిలో జరిగిన ఓటింగ్ భారత్ దేశం దూరంగా ఉండడమే ఇందుకు నిదర్శనమన్నారు. మోదీ మితవాద ఫాసిస్టు రాజకీయ నాయకుడు అని, ఈ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంటు ఎన్నికలలో గద్దె దించడమే లక్ష్యంగా పోరాడుతామన్నారు. గౌరవ అతిథులుగా మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రజా పక్షం ఎడిటర్ కె. శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్‌కు 'మిధాని' భద్రతా బాధ్యతలు



ఎం.నందన్‌కు సెక్యూరిటీ కీని అందజేస్తున్న ఎస్.కె.ఝూ

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని మిశ్రు దాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) సంస్థ మంగళవారం మిధాని భద్రతా బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కి అప్పగించడం జరిగిందని మిధాని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఝూ అన్నారు. ఈ సందర్భంగా మిధాని ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ వేడుకల సందర్భంగా మిధాని సెరిమోనియల్ సెక్యూరిటీ కీని సింబాలిక్‌గా సీఐఎస్ఎఫ్ డీఐజీ ఎం.నందన్‌కు ఎస్.కె.ఝూ అందజేసి మాట్లాడారు. పరిశ్రమ భద్రతా సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకొని మిధాని తన భద్రతా బాధ్యతను సీఐఎస్ఎఫ్‌కు అవగాహన ఒప్పంద కింద అందజేయడం జరిగిందన్నారు. మిధాని డిఫెన్స్ ఫోర్సెస్, అటామిక్, సెక్టార్ స్పేస్, ఎయిర్, రైల్వేస్ తదితర వాటి కోసం సున్నితమైన సూపర్ అల్లాయ్ ఉత్పత్తులను తయారు చేస్తుందన్నారు. ఇటీవల మిధాని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ఏకైక కంపెనీగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.గౌరీ శంకర రావు, ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ టి. ముత్తు కుమార్, హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఎ.రామకృష్ణా రావు, సీఐఎస్ఎఫ్ గ్రూపు కమాండెంట్ ప్రణీత్ చంద్ర, సీనియర్ కమాండెంట్ మనీష్ సింగ్ పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ'లో ఐడీపీ2.0 పునరుద్ధరణ

రాయదుర్గం: అందరికీ సులభంగా డేటా యాక్సెస్‌ని ప్రారంభించడానికి గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) ఇండియా డేటా పోర్టల్ (ఐడీపీ) 2.0ని పునరుద్ధరించిన పోర్టల్‌ను ప్రారంభించారు. సాంకేతికంగా ఉన్నతమైన ఐడీపీ 2.0ని ఐఎస్‌బీలోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(బీఐపీపీ) ఆధ్వర్యంలో ప్రారంభించారు. దేశంలో సాక్ష్యం-ఆధారిత విధాన రూపకల్పన ను ప్రోత్సహించడానికి ఓపెన్ సోర్స్ పర్యావరణ వ్యవస్థలో భాగమైన ప్రయత్నం యొక్క ఫలితమే ఈ పోర్టల్.ఈ ఐడీపీ 2.0 పోర్టల్ ప్రత్యేకంగా జర్నలిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు, విధాన నిర్ణేతలు, ఇతర వాటాదారులను సమాచారం, డేటా, జ్ఞానాన్ని యాక్సెస్ చేయడానికి పరస్పర చర్య చేయడానికి, దృశ్యమానం చేయడానికి మరింత సన్నద్ధం చేయడానికి రూపొందించబడింది. ఈ పోర్టల్ యొక్క ఒక రకమైన 'విజువలైజేషన్స్ ఫస్ట్ అప్రోచ్' 3,400 కంటే ఎక్కువ సూచికల విస్తృత శ్రేణిని సజావుగా యాక్సెస్ చేయడానికి వినియోగదారులకు అధికారం ఇస్తుంది. ఈ సూచికలు 25 విభిన్న డొమైన్లలో విస్తరించి ఉన్న 120 డేటాసెట్‌ల రిపోజిటరీ నుంచి తీసుకోబడ్డాయి. వీటిలో వాతావరణం, వాణిజ్యం, నేరం, ఆర్థిక వ్యవస్థ, విద్య, ఆర్థిక చేరిక, మత్స్య, పశుపోషణ, ఆహారం, వ్యవసాయం, అటవీ, వన్యప్రాణులు, సాధారణ, సామాజిక-ఆర్థిక యూనియన్ బడ్జెట్ ఉన్నాయి. రాబోయే కాలంలో డేటాసెట్ నిరంతరం విస్తరించబడుతుంది. ఈ సందర్భంగా భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్విని ఛత్రే మోడరేట్ చేయగా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి నిపుణులు, ఇతర అధికారులతో తమ ఆలోచనలను పంచుకునేలా చేశారు.

ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్‌లో అపూర్వ విజయాలు



చిన్నారి క్రీడాకారుల సందడి

గచ్చిబౌలి: ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్ పోటీలలో అపూర్వ విజయాలు దక్కాయి. ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్‌లో ఆరో రోజు ఉత్తేజకరమైన బాస్కెట్, ఫుట్‌బాల్ పోటీలు అలరించాయి. అండర్-12 బాలుర ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెరిడియన్ స్కూల్‌తో జరిగిన థ్రిల్లింగ్ టై బ్రేకర్ తర్వాత కానరీ స్కూల్ విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్‌లో కాంస్య పతక విజేత అభిషేక్ జినుగు ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్ అండర్-11 బాలురు సింగిల్స్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఫిట్జీ వరల్డ్ స్కూల్ కు చెందిన షేక్ మహ్మద్ ఇషాన్, రూపక్ చౌదరి వెలగపూడి స్వర్ణం, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ రితేష్ కోగ్రా, క్రిష్ దేవరపల్లి రజతం సాధించారు. పోలవరపు మోరేశ్వర్, ప్రణవ్ హిమ్మిష్‌యరాసు దిజిలో స్కూల్ నుంచి అండర్-13 బాలుర డబుల్స్‌లో కాంస్యం సాధించారు. గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియంలోని జరిగిన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. బాలుర అండర్-12లో సింధూ ఇంటర్నేషనల్ స్కూల్ స్వర్ణం, రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ రజతం, సాంక్టామారియా స్కూల్ కాంస్య పతకాలు సాధించాయి. అండర్-12 బాలుర విభాగం లో కానరీ స్కూల్, మెరిడియన్ స్కూల్ మధ్య హోరాహోరీ పోటీ పడ్డాయి. ఇక్కడ థ్రిల్లింగ్ టై బ్రేకర్ ద్వారా కానరీ విజేతగా నిలిచింది,. ఇండస్ స్కూల్ అండర్-10 బాలుర ఫుట్‌బాల్ మ్యాచ్ విజేతగా నిలిచింది.

ప్రచారానికి సై

- ఎత్తులు పైఎత్తులతో పార్టీల వ్యూహాలు
- మేడ్చల్ జిల్లాలో జోరు పెంచిన బీఆర్ఎస్
- నేడు మల్కాజిగిరిలో మంత్రి హరీష్ ఎన్నికల సభ
- జాతీయ నేతలతో ప్రచారానికి కాంగ్రెస్ సన్నద్ధం
- టికెట్ల వేటలో నిమగ్నమైన బీజేపీ ఆశావహులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కాగా.. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ స్థానాల్లో మాత్రం అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఈ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదలకు గురువారం ముహూర్తం ఖరారు చేసింది. టికెట్లు దక్కించుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారంలో వ్యూహ ప్రతి వ్యూహాలతో దూసుకుపోతున్నారు.

టికెట్ తమకే వస్తుందని..

బీజేపీ అభ్యర్థులు ఎవరనేది ఇంకా తేలకపోవటంతో.. ఆశావహులు తాము నమ్ముకున్న పార్టీ పెద్దల ఆశీస్సులతో టికెట్ పొందటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సీటు కచ్చితంగా వస్తుందని భావిస్తున్న కొందరు నాయకులు మాత్రం వివిధ పద్ధతుల్లో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వార్డు, బస్తీ సమావేశాలు, గ్రూపు మీటింగ్‌ల పేరుతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను ఆలింగనం చేసుకుంటున్నారు. టికెట్ తనకే వస్తుందని భరోసా కల్పిస్తూ.. ముందుకు సాగుతున్నారు. టికెట్ ఖరారైన కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాత్రం తన కున్న విస్తృత సంబంధాలతో ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు.

సిట్టింగుల్లో హుషార్..

ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే టికెట్ దక్కించుకున్న బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు మాత్రం తమ ప్రచారంలో జోరు పెంచుతున్నారు. పైగా మొదటి విడత ఆశీర్వాద ఎన్నికల సభలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ మేడ్చల్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో పాల్గొని.. పార్టీ కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. నగర శివారు మేడ్చల్ జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చి ప్రజలను మచ్చిక చేసుకునే ప్రయత్నం సీఎం కేసీఆర్ చేశారు. అయితే .. ఈ సభలో సీఎం 17 నిమిషాలు మాత్రమే ప్రసంగించటంతో.. సభకు హాజరైన కొంత నిరుత్సాహానికి గురయ్యారు. ఆ తర్వాత నుంచి మేడ్చల్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి మాత్రం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

మల్కాజిగిరిలో నేడు హరీష్‌రావు పర్యటన..

మల్కాజిగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అనుచరులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఎన్నికల ప్రచార సభల్లో భాగంగా మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి హరీష్‌రావు పర్యటించనున్నారు. కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద, కూకట్‌పల్లిలో అభ్యర్థి మాధవరం కృష్ణారావు తమదైన శైలిలో ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు.

కాంగ్రెస్‌లో మైనంపల్లి జోష్..

జిల్లాలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని కేడర్ వరకు తీసుకెళ్లి జోష్ నింపటంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచనల మేరకు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ముందుండి నడిపిస్తున్నారు. కుత్బుల్లాపూర్‌లో అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి, ఉప్పల్‌లో అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచార జోరును పెంచారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ కార్యకర్తల సమావేశాలతో ప్రజల వద్దకు వెళ్తున్నారు. త్వరలో జాతీయ, రాష్ట్ర నేతలతో ఎన్నికల సభల నిర్వహణకు కాంగ్రెస్ అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

కమిటీ నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వివాదాస్పద భూమికి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేసిన అంశంపై కమిటీ అందజేసిన నివేదికను పరిశీలించి ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను నవంబర్ 14కు వాయిదా వేస్తున్నామని, అప్పటిలోగా చర్యలు వివరాలు చెప్పాలని ఆదేశించింది. శాంతి అగర్వాల్ కొనుగోలు చేసిన దాదాపు 5 వేల గజాల స్థలానికి తప్పుడు పత్రాలు సమర్పించిన వారికి అప్పటి హైదరాబాద్ కలెక్టర్ నవీన్ మిట్టల్ కమిటీ ఎన్‌వోసీ ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ శాంతి 2011లో హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎన్‌వోసీ రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. అలాగే నవీన్ మిట్టల్, జాయింట్ కలెక్టర్ వి.వి.దుర్గాదాస్, తహసీల్దార్లు మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తీర్పుపై 2017లో ప్రైవేటు వ్యక్తులతో పాటు అధికారులు కూడా అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది హరీందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఎన్‌వోసీ జారీ అంశంపై నియమించిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం కమిటీ నివేదిక పరిశీలించి ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ విచారణను వాయిదా వేసింది.





* వీగనిజాలు

ఏం తింటున్నాం.. ఎలా ఉంటున్నాం..
జంతువులను బాధిస్తూ పర్యావరణాన్ని దెబ్బతీస్తూ
మన ఆరోగ్యానికి మనమే హాని చేసుకుంటూ బతికేస్తున్నామా..?!
'జంతువులనే కాదు, జంతు ఆధారిత ఉత్పత్తుల నుంచి కూడా
దూరంగా ఉందాం..' అంటూ వరల్డ్ వీగన్ డే సందర్భంగా
వీగన్ ప్రేమికులు చెప్పే మాటలు అందరూ అనుసరించదగినవి, ఆచరణలో పెట్టాల్సినవి...

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వీగన్... లైఫ్‌స్టయిల్ మారెన్!

దుఃఖాన్ని పిండుకు తాగుతున్నాం



శాకాహారం తీసుకోవడం వల్ల మన ఆరోగ్యమే కాదు, పర్యావరణానికీ ఎంతో మేలు జరుగుతుంది. నేను యానిమల్ లవర్‌ని, యాక్టివిస్ట్‌ని. జంతువులను బాధించడానికి మనకు ఎలాంటి హక్కుల్లేవు. చాలామంది మాంసాహారం రుచి మీదనే దృష్టి పెడతారు. తరతరాలుగా ఇది అలాగే వస్తోంది. మనం తినడానికే అవి పుట్టాయని మనుషుల ఒక క్రూరమైన ఆలోచన. పాల పరిశ్రమ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతి పెద్ద క్రూరమైన ప్రక్రియ. పాల రూపంలో వేరే జీవి బాధని గ్లాసులో పోసుకొని తాగుతున్నాం అనిపిస్తుంది. ఒక గ్లాసు పాలతో తల్లి–బిడ్డను వేరు చేస్తున్నాం. పాలు తాగుతున్న బిడ్డ మూతి కట్టి, ఆ తల్లి పాలు పిండుకుంటున్నాం. ఇవన్నీ గమనించి 13 ఏళ్లుగా వీగన్ డైట్‌కి మారిపోయాను. ఈ ప్రకృతిలో ప్రతి జీవికీ బతికే హక్కు ఉంది. జంతువుల సంఖ్య అదుపు చేయాలంటే మనం వాటిని చంపుకు తినాలి అనే మనస్తత్వం పెరిగింది. అదే జంతుజాలాన్ని నాశనం చేస్తుంది. కోళ్లకు, ఆవులకు, గేదెలకు కృత్రిమ ఇంజక్షన్లు ఇస్తారు. ఏదైనా తప్పుగా తింటే అది మన ఆరోగ్యంపైనే చెడు ప్రభావం చూపుతుంది. అందుకే ఇవన్నీ గమనించి మనమంతా వీగన్‌కి మారిపోవాల్సిందే. ఈ రోజుల్లో ఇది అత్యవసరం కూడా.

– ప్రతిమా సాగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్

సాధు స్వభావానికి..



మొదట్లో మనిషి ఆహారానికి మొక్కల మీదే ఆధారపడేవాడు. ఇప్పుడంతా ఏది కరెక్ట్‌గా తినాలి, ఏది తినకూడదు అనేదానిపై చాలా అనుమానాలు ఉంటున్నాయి. నా చిన్నప్పటి నుంచి మా ఇంట్లో మాంసాహారానికి ఏ మాత్రం ప్రాముఖ్యం లేదు. ఇప్పుడైతే అస్సలు తీసుకోం. శాకాహారానికి సైడ్‌ఎఫెక్ట్స్ ఏమీ ఉండవు. ఆరోగ్యం బాగో లేకపోతే ముందు నాన్‌వెజ్ తీసుకోవద్దు అని చెబుతారు. కానీ, శాకాహారం విషయంలో అలా ఉండదు. జంతువులకు కూడా మనలాగే కొన్ని ఎమోషన్స్ ఉంటాయి. దూడ పాలు తాగాక అవి మిగిలిన పాలు తీసుకోవడం వరకు పర్లేదు. కానీ, జంతువులను బాధించి, వాటినుంచి మనం ఆహారం పొందుతున్నాం. జంతువుల మీద క్రూరత్వాన్ని చూపుతున్నాం. అదెలాగంటే ఒక జంతువును చూస్తే దానిని కొట్టాలనే ఆలోచనకే వెళుతున్నాడు మనిషి. శాకాహారం మాత్రమే తీసుకుంటే మనిషి సాధు స్వభావిగా ఉంటాడు. దీనిని మనం అర్థం చేసుకోవాలి. సమాజంలో క్రూరత్వాన్ని దూరం చేయాలంటే మన ఆహారపు అలవాట్లలో మార్పు రావాలి. వాహనసదుపాయాలు ఏవీ లేని రోజుల్లో రవాణాకు జంతువులను ఉపయోగించేవారు. ఇప్పుడు అలా లేదు. అలాగే మనలో కూడా మార్పు రావాలి.

– స్టెల్లా మరేజ్, గంధంగూడ, నార్సింగ్, హైదరాబాద్

హింసను తెలుసుకొని..



నేను వీగన్‌గా మారి మూడేళ్లు అయ్యింది. అన్ని డెయిరీ, పౌల్ట్రీ కంపెనీలలో జరుగుతున్న హింసను తెలుసుకొని వీగన్‌గా మారిపోయాను. క్యాల్షియం కావాలంటే పాలు తాగాలంటారు. వీటి బదులు నువ్వులు తీసుకోవచ్చు. చికెన్, మీట్‌లో చెడు కొలెస్ట్రాల్ ఉంటుంది. వాటి గ్రోత్‌కి ఇచ్చే ఇంజక్షన్స్ వల్ల భవిష్యత్తులో క్యాన్సర్లు రావచ్చు. హార్మోనల్ సమస్యలు కూడా రావచ్చు. వీగన్ ఫుడ్ వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ముఖ్యంగా ఆర్థ్రైటిస్ సమస్య తగ్గుతుంది. వీగన్ అని విని ఇదేదో పాశ్చాత్యులు తీసుకునేది, మనది కాదు అనుకోకూడదు. కానీ, ప్రాచీనకాలం నుంచి మనం చేస్తున్నదే. దీని వల్ల మన ఆరోగ్యమే కాదు, పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.

– హర్షిత వెంపటి, ఉప్పల్, హైదరాబాద్

యవ్వనంగా ఉండచ్చు



వీగన్ ఆహారం తీసుకోవడం వల్ల జంతువులను బాధించడం తగ్గించవచ్చు. మనం ఆరోగ్యంగా, యవ్వనంగా ఉండవచ్చు. పర్యావరణానికి మేలు జరుగుతుంది. విదేశీయులు కూడా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వీగన్ డైట్‌కు మారిపోతున్నారు. ప్రకృతి మనకు ఎన్నింటినో ఫ్రీగా ఇచ్చింది. మనం వాటిని రక్షించుకోకుండా పాడు చేస్తున్నాం. జంతువులంటే ఇష్టపడేవారు, ఆరోగ్యాన్ని, ప్రకృతిని కాపాడుకోవాలనుకునేవారు వీగన్‌కి మారిపోవడం ఎంతో మంచిది. నేను పదేళ్లుగా వీగన్ డైట్ తీసుకుంటాను. వీగన్ కెఫేని కూడా రన్ చేస్తున్నాను. పాలు, జంతు ఆధారిత ఉత్పత్తులేవీ లేకుండా వర్క్‌షాప్స్ ద్వారా అవగాహన తీసుకువస్తుంటాం.

– సిమి, సిమిస్ వరల్డ్
ప్రగతి నగర్, హైదరాబాద్

ఒక్కరాత్రిలో మారిపోయాను



మూడేళ్లుగా వీగనిజానికి మారిపోయాను. నేను మా కుక్క గాయపడటం చూశాను. అది కొన్ని రోజులు పాటు ఎంత బాధపడిందో దగ్గరగా చూశాను. కోడి, మేక బాధ కూడా అంతే కదా! ఆ ఆలోచన వచ్చి ఒక్క రాత్రిలో వీగన్‌కి మారిపోయాను. జంతువుల పాలు తీసుకోవడం కూడా మానేశాను. ఆన్‌లైన్‌లో వీగన్ డైట్ ప్లాన్ చూశాను. అందులో న్యూట్రిషన్ సాయం కూడా తీసుకోవచ్చు. మన శరీరానికి ఎలాంటి ఆహారం అనువైనది, ఎంత అవసరం అనేది ఎక్స్‌పర్ట్ సలహా తీసుకున్నాను. మన చుట్టూ ఉండే పర్యావరణం బాగుండాలంటే ముఖ్యంగా మనలో మార్పు రావాలి.

– పంచ్, వీగన్ యాక్టివిస్ట్

యూత్ పల్స్

ఇవిగివిగో... అవిగవిగో!

● క్రియేటర్ ఫ్రెండ్లీ టూల్స్

డిజిటల్ క్రియేటర్‌లు నిలువ నీరులా, గోడకు కొట్టిన మేకులా ఉండకూడదు అనే స్పృహతో యువ క్రియేటర్‌లు ఎప్పటికప్పుడు కొత్త టాపిక్స్‌పైనే కాదు టూల్స్ గురించి కూడా అవగాహన చేసుకుంటున్నారు. క్రియేటర్–ఫ్రెండ్లీ టూల్స్‌కు సంబంధించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల అప్‌డేట్స్‌ను వేగంగా అందిపుచ్చుకుంటున్నారు. కంటెంట్ మేకింగ్‌లో మరింత క్రియేటివిటీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు....

రెండు నెలల క్రితం 'మీ షార్ట్స్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకు వెళ్లండి' అంటూ యూట్యూబ్ కొత్త క్రియేషన్ టూల్స్‌ను తీసుకు వచ్చింది. అందులో ఒకటి కొలాబ్. ఈ టూల్‌తో సైడ్–బై–సైడ్ ఫార్మట్‌లో 'షార్ట్'ను రికార్డ్ చేయవచ్చు. క్రియేటర్‌లు తమకు నచ్చిన వాటిని ఎంపిక చేసుకోవడానికి మల్టిపుల్ లే ఔట్ ఆప్షన్‌లు ఉంటాయి.

గత నెలలో జరిగిన 'మేడ్ ఆన్ యూట్యూబ్' కార్యక్రమంలో క్రియేటర్స్‌కు ఉపకరించే కొత్త టూల్స్‌ను ప్రకటించింది కంపెనీ.

'క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్‌కు కొత్త టూల్స్ తీసుకురానున్నాం. క్లిష్టం అనుకునే వాటిని సులభతరం, అసాధ్యం అనుకున్న వాటిని సాధ్యం చేసే టూల్స్ ఇవి. క్రియేటివ్ పవర్‌కు దగ్గర కావడానికి ఉపకరిస్తాయి' అన్నాడు యూ ట్యూబ్ సీయీవో నీల్ మోహన్.

యూ ట్యూబ్ ప్రకటించిన కొన్ని టూల్స్....

డ్రీమ్ స్క్రీన్

యూట్యూబ్ షార్ట్స్ కోసం రూపొందించిన న్యూ జెనరేటివ్ ఫీచర్ ఇది. దీని ద్వారా తమ షార్ట్స్‌కు ఏఐ జనరేటెడ్ వీడియో లేదా ఇమేజ్ బ్యాక్‌గ్రౌండ్ యాడ్ చేయడానికి వీలవుతుంది. పెద్దగా కష్టపడనక్కర్లేకుండానే ప్రాంప్ట్ ఇస్తే సరిపోతుంది. 'డ్రీమ్ స్క్రీన్' ద్వారా క్రియేటర్‌లు తమ షార్ట్స్‌కు న్యూ సెట్టింగ్స్ జనరేట్ చేయవచ్చు.


యూట్యూబ్ క్రియేట్

వీడియోలు క్రియేట్ చేయడానికి షేర్ చేయడానికి ఉపకరిస్తుంది. యూట్యూబ్ క్రియేట్ యాప్ ద్వారా ఖచ్చితత్వం, నాణ్యతతో కూడిన ఎడిటింగ్, ట్రిమ్మింగ్, ఆటోమేటిక్ కాప్షనింగ్, వాయిస్ వోవర్, యాక్సెస్ టు లైబ్రరీ ఆఫ్ ఫిల్టర్స్, ఎఫెక్ట్స్, ట్రాన్సిషన్స్, రాయల్టీ–ఫ్రీ మ్యూజిక్... మొదలైనవి క్రియేటర్‌లకు ఉపయోగపడతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే కాంప్లెక్స్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌తో పని లేకుండానే ప్రేక్షకులను ఆకట్టుకునేలా వీడియోలను సులభంగా క్రియేట్ చేయవచ్చు.

తాజాగా ఫోర్బ్స్ ఇండియా 'డిజిటల్ స్టార్స్ జాబితాలో చోటు సంపాదించింది 24 సంవత్సరాల ఆకాంక్ష మోంగ. కన్సల్టెన్సీ జాబ్‌ను వదిలేసి ఫుల్‌టైమ్ ట్రావెలర్‌గా మారింది. పుణెకు చెందిన ఆకాంక్ష ట్రావెల్ అండ్ ఫొటోగ్రఫీ విభాగంలో మంచి పేరు తెచ్చుకుంది. 'కంటెంట్‌ను ప్రేక్షకులకు వేగంగా చేరువ చేయడానికి సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విషయం లో ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తెలుసుకోవాలి' అంటుంది ఆకాంక్ష.



ఆకాంక్ష



క్రియేటర్‌ల నోట 'హిట్ లైక్ అండ్ సబ్‌స్క్రైబ్' అనే మాట తరచుగా వినిపిస్తుంటుంది. ప్రస్తుతం దీన్ని ఫీచర్‌గా మలచనున్నారు. 'హిట్ లైక్ అండ్ సబ్‌స్క్రైబ్' వినిపిస్తున్నప్పుడు ఈ బటన్‌లను సింక్‌లోని విజువల్ క్యూతో హైలైట్ చేస్తుంది.

ఏఐ ఇన్‌సైట్స్

యూట్యూబ్‌లో ప్రేక్షకులు చూస్తున్న కంటెంట్ ఆధారంగా వీడియో ఐడియాలను తయారు చేసుకోవడానికి వీలవుతుంది.

అలౌడ్

ఆటోమేటిక్ డబ్బింగ్ టూల్ ద్వారా కంటెంట్‌ను ఎక్కువ భాషల్లో క్రియేట్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్ కూడా క్రియేటర్‌లను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌తో ముందుకు వస్తోంది. వాటిలో ఒకటి క్రియేటర్‌లు 'రీల్స్'లో టాప్ ట్రెండింగ్ సాంగ్స్ గురించి తెలుసుకునే అవకాశం. ఆ ఆడియోనూ ఎన్నిసార్లు ఉపయోగించారో తెలుసుకోవచ్చు. సేవ్ చేసి అవసరమైన సందర్భంలో వాడుకోవచ్చు. ట్రెండింగ్ టాపిక్స్ ఏమిటో కూడా తెలుసుకోవచ్చు.

'ప్రస్తుతం పాపులర్ ఏమిటి?' అనేది తెలుసుకోవడానికి కొత్త డెడికేటెడ్ సెక్షన్ క్రియేటర్‌లకు ఉపకరిస్తుంది' అని చెబుతుంది కంపెనీ.

'రీల్స్'ను ఎడిట్ చేయడాన్ని సులభతరం చేయడానికి వీడియో క్లిప్‌లు, ఆడియో, స్టిక్కర్స్, టెక్ట్స్‌ను ఒకేచోటుకు తీసుకువచ్చింది. తమ కంటెంట్ పెర్ఫార్మెన్స్ గురించి తెలుసుకోవడానికి కొత్తగా తీసుకువచ్చిన 'రీల్స్ ఇన్‌సైట్స్'తో యాక్సెస్ కావచ్చు. ఇన్‌స్టాగ్రామ్ కొత్తగా యాడ్ చేసిన 'టోటల్ వాచ్ టైమ్' మెట్రిక్, 'యావరేజ్ టైమ్' మెట్రిక్‌తో క్రియేటర్‌లు యాక్సెస్ కావచ్చు. రీల్స్‌లో 'స్ట్రాంగర్ హుక్' క్రియేట్ చేసి వీడియోను ఆకట్టుకునేలా చేయడానికి ఇది ఉపకరిస్తుంది.

అయినను...

టెక్నాలజీ మాత్రమే సర్వస్వం, విజయ సోపానం అనుకోవడం లేదు యువ క్రియేటర్‌లు. 'టెక్నాలజీ అంటే టూల్స్ మాత్రమే కాదు క్రియేటర్ పనితీరు. ప్రత్యేకత. సృజనాత్మకత' అనే విషయంపై అవగాహన ఉన్న యువ క్రియేటర్‌లు నేల విడిచి సాము చేయడం లేదు. కంటెంట్, టెక్నాలజీని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు.

టిప్స్

హోమ్‌మేడ్ ఎరువు

- గ్లాసు నీటిలో గుప్పెడు బియ్యం. స్పూను వంటసోడా వేసి కలపాలి. తరువాత అర టీస్పూను వెనిగర్ కూడా కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోయాలి. జీవం కోల్పోయిన మొక్కలపై ఈ ద్రావణాన్ని చిలకరిస్తే.. మొక్కలు పచ్చగా కళకళలాడతాయి.
- ఉల్లిపాయ ముక్కలను నానబెట్టిన నీటిని మొక్కలకు పోస్తే మొక్కలకు మంచి ఎరువుగా పనిచేస్తుంది. వెనిగర్ కలిపిన నీళ్లు, సోయాబీన్ నీళ్లు, బీరు కలిపిన నీళ్లు కూడా మొక్కలకు బలాన్ని అందించి చక్కగా పెరిగేలా చేస్తాయి.
- కప్పు వేడినీటిలో స్పూను పంచదార, స్పూను వంట సోడా, స్పూను వెనిగర్ వేసి కలపాలి. కప్పు మీద మూత పెట్టి ఉంచాలి. 48 గంటల తరువాత ఈ నీటిని మొక్కలకు పోస్తే వేళ్లకు బలం అంది మొక్కలు చక్కగా పెరుగుతాయి.



న్యూస్‌మేకర్ శీతల్‌దేవి

జీవితానికి ఒక గురువు

'జీవితంలో ఎదురయ్యే చిన్నాచితకా కష్టాల గురించి
ఇక మీదట నేను యాగీ చేయను.
తల్లీ నువ్వొక గురువువి' అని ట్వీట్ చేశాడు ఆనంద్ మహీంద్ర,
పారా ఆర్చర్ శీతల్ దేవి గురించి.
అంతే కాదు తమ సంస్థ నుంచి కోరిన కారు తీసుకోమన్నాడు.
రెండు చేతులూ లేకపోయినా విలువిద్య అభ్యసించి
ఆసియా పారాగేమ్స్‌లో స్వర్ణాలు సాధించిన
కశ్మీర్ అమ్మాయి శీతల్‌దేవి జీవితాన్ని ఎలా ఎదుర్కొనాలో
తన పట్టుదలతో చూపించింది.
ఆమె జీవితం ఒక ఆదర్శమైతే
ఆమె నేర్పిన పాఠం సాకులు చెప్పేవారికి గుణపాఠం.



శీతల్ దేవి







2021లో బెంగళూరుకు చెందిన 'బీయింగ్ యు' అనే సంస్థ శీతల్‌కు ప్రోస్థెటిక్ చేతులు పెట్టించడానికి ఏర్పాట్లు చేసింది. 'ప్రోస్థెటిక్ చేతులు పెడితే నువ్వు చేసే మొదటి పని ఏమిటి?' అని అడిగితే 'గాజులు వేసుకుంటా' అని టక్కున సమాధానం చెప్పింది శీతల్. నిజానికి ఆ అలంకరణకు తప్పితే మిగిలిన అన్ని పనులకు, తన జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి శీతల్‌కు తన ఆత్మవిశ్వాసం చాలు. అందుకే ఆమె ప్రోస్థెటిక్ చేతులను పెద్దగా ఉపయోగించదు. దాదాపు పెట్టుకోదనే చెప్పాలి. 'నేనెలా ఉన్నానో అలాగే ఉంటాను' అంటుంది శీతల్. ఈ ధైర్యం ఎంతమందికి ఉంది?

రికార్డులు తిరగరాసింది

ఇటీవల చైనాలో ముగిసిన 'ఆసియన్ పారా గేమ్స్' (దివ్యాంగుల క్రీడలు)లో విలువిద్యలో రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించి రికార్డు సృష్టించింది శీతల్ దేవి. 16 ఏళ్ల వయసులో ఇలా మన దేశం నుంచి విలువిద్య లో రెండు స్వర్ణాలు సాధించిన క్రీడాకారులు లేరు. అది ఒక పెద్ద విశేషం అయితే అంత కన్నా పెద్ద విశేషం శీతల్‌కు రెండుచేతులూ లేకపోవడం. అయినా సరే కుడికాలితో విల్లు ఎత్తి, కుడి భుజంతో నారి సారించి, 50 మీటర్ల దూరంలో ఉండే లక్ష్యాన్ని గురి చూసి బాణం వదిలిందంటే కచ్చితంగా లక్ష్యాన్ని ఛేదించాల్సిందే. అర్జునుడు రెండు చేతులతో బాణాలు సంధిస్తాడు కాబట్టి సవ్యసాచి అన్నారు. శీతల్‌కు చేతులు లేకపోయినా రెండు కాళ్లతో బాణాలు సంధిస్తే ఏమని పిలవాలో. 'నవ్యసాచి' అనాలేమో!

జీవితం గొప్పది

'జీవితంలో నువ్వు ఫలానాది ఎందుకు సాధించలేదు, జీవితం అంటే ఎందుకు ఆసక్తి కోల్పోయావు, జీవితాన్ని ఎందుకు వృథా చేస్తున్నావు' అని ఎవరినైనా అడిగితే సవాలక్ష వంకలు చెబుతారు, అడ్డంకులొచ్చాయంటారు, కష్టాలు వచ్చాయంటారు, రోజువారి జీవితంలో వచ్చే చిన్నాచితకా సమస్యలకు చికాకు పడిపోతుంటారు, జీవితం నుంచి దూరంగా వ్యసనాల్లోకి పారిపోవాలనుకుంటారు... కాని శీతల్‌ను చూస్తే ఆ అమ్మాయికి మించిన కష్టమా? అయినా కూడా ఆ అమ్మాయి సాధించలేదా? మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా అదే అన్నాడు శీతల్‌ను చూసి– 'తల్లీ.. నిన్ను చూశాక జీవితం విలువ తెలిసింది' అని! ఆమెకు కారు ఆఫర్ చేశాడు.

కశ్మీర్ అమ్మాయి

శీతల్ దిగువ మధ్యతరగతి కశ్మీర్ అమ్మాయి. వీళ్లది కిష్టవర్ జిల్లా లియోధర్ గ్రామం. తండ్రి మాన్ సింగ్ రైతు, తల్లి శక్తిదేవి కాసిన్ని గొర్రెలను సాకుతుంటుంది. వీరి పెద్ద కూతురు శీతల్. చిన్న కూతురు శివాని. శీతల్‌కు పుట్టుకతో చేతులు ఏర్పడలేదు. ఇలాంటి స్థితిని వైద్యపరిభాషలో 'ఫాకొమెలియా' అంటారు. అయితే శీతల్ నిరాశలో కుంగిపోలేదు. తల్లిదండ్రులు ఆమెను బేలగా పెంచలేదు. శీతల్ తనకు లేని చేతుల లోటును కాళ్లతో పూడ్చడానికి ప్రయత్నించేది. ఆమెకు చేతులు లేకపోవడం వల్ల మిగిలిన శరీరం అంతా మరింత సూక్ష్మంగా, దృఢంగా తయారయ్యింది. రెండు చేతులూ లేకపోయినా శీతల్ చెట్లు ఎక్కి ఆడుకునేదంటే ఆశ్చర్యం. స్కూల్లో కూడా కాళ్లతోనే నోట్స్ రాసుకోవడం, ఫోన్‌ను ఉపయోగించడం నేర్చుకుంది. జీవితం అలాగే సాగిపోయేదేమో కాని కరోనా లాక్‌డౌన్ వల్ల ఇంటర్‌నెట్‌లో తనలాంటి దివ్యాంగులకు సాయం చేసే సంస్థ– బీయింగ్ యు గురించి తెలిసింది. ఆ సంస్థకు చెందిన ప్రీతి రాయ్.. శీతల్‌లోని క్రీడాకారిణిని గుర్తించింది. దివ్యాంగుల క్రీడల పోటీల్లో ఆమె ప్రతిభ చూపగలదని గ్రహించి, తన సంస్థ స్పాన్సర్‌షిప్ కింద కశ్మీర్‌లోని కత్రాలో దివ్యాంగుల క్రీడా శిక్షణా కేంద్రానికి పంపింది. ఆగస్టు 2022 నుంచి మాత్రమే శీతల్ విలువిద్య సాధన మొదలెట్టింది. 2023 అక్టోబర్ నాటికి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ఇంతకన్నా విజయం ఉందా?

'నాకు ఎలాగైనా సాధించాలని ఉండేది. అందుకు ఏమిటి మార్గం అని మా కోచ్‌ను అడిగాను. కష్టపడాలి అన్నాడు. కష్టపడ్డాను. చాలా చాలా కష్టపడ్డాను' అంటుంది శీతల్.

అడ్డదారుల్లో వెళితే విజయం ఉండొచ్చు లేకపోవచ్చు. కాని కష్టపడితే? గెలుపు తథ్యం. శీతల్‌ను చూసి మన జీవితాల్లో లక్ష్యాన్ని గురి చూద్దాం.



జపాన్‌పై భారత మహిళల విజయం

రాంచీలో జరుగుతున్న మహిళల హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు మరో విజయాన్ని అందుకుంది. టోర్నీలో ఇది భారత్‌కు వరుసగా నాలుగో గెలుపు కావడం విశేషం. మంగళవారం హోరాహోరీగా జరిగిన పోరులో భారత్ 2-1 గోల్స్ తేడాతో జపాన్‌ను ఓడించింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ 31వ నిమిషంలో ఫీల్డ్ గోల్ సాధించగా... 47వ నిమిషంలో సంగీత కుమారి పెనాల్టీని గోల్‌గా మలచింది. జపాన్‌కు లభించిన పెనాల్టీని సద్వినియోగం చేసుకుంటూ 37వ నిమిషంలో ఉరాటా కానా గోల్ నమోదు చేసింది. భారత సీనియర్ ప్లేయర్ వందన కటారియాకు ఇది 300వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఈ సందర్భంగా హాకీ ఇండియా ఆమెను ఘనంగా సన్మానించింది. టోర్నీలో థాయిలాండ్, మలేసియా, చైనా, జపాన్‌లను ఓడించి భారత్ నేడు జరిగే మ్యాచ్‌లో కొరియాతో తలపడుతుంది.

నేడు సచిన్ విగ్రహావిష్కరణ



ముంబై: ప్రతిష్టాత్మక వాంఖెడె మైదానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ విగ్రహం ఏర్పాటు కానుంది. బుధవారం జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. సచిన్ స్టాండ్ పక్కనే దీనిని ఏర్పాటు చేయనుండగా...ఆఫ్ సైడ్‌లో షాట్ ఆడుతున్న చిత్రాన్ని ఈ విగ్రహం కోసం ఎంచుకున్నారు. అహ్మదాబాద్‌కు చెందిన ప్రమోద్ కాంబ్లే దీనిని రూపొందించారు. స్వయంగా సచిన్‌తో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బీసీసీఐ కార్యదర్శి జై షా తదితరులు దీనికి హాజరవుతారు. తన సొంత మైదానమైన ముంబై వాంఖెడె స్టేడియంలోనే 2011 వన్డే వరల్డ్ కప్ ట్రోఫీ అందుకున్న సచిన్... తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్‌ను ఇక్కడే నవంబర్ 16, 2013న ఆడాడు.

శ్రేయస్‌పైనే దృష్టి



ముంబై: వరల్డ్‌కప్‌లో వరుసగా ఏడో విజయంపై దృష్టి పెట్టిన భారత జట్టు తమ సన్నాహకాలకు పదును పెట్టింది. మ్యాచ్‌కు రెండు రోజుల ముందు సోమవారం టీమ్ సాధన కొనసాగింది. 'ఆప్షనల్ ప్రాక్టీస్' కావడంతో రోహిత్, కోహ్లి, గిల్ దీనికి హాజరు కాలేదు. అయితే జట్టులోని ఇతర ప్రధాన ఆటగాళ్లంతా నెట్స్‌లో శ్రమించారు. కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ సుదీర్ఘ సమయం పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా... జడేజా, అశ్విన్, శార్దుల్ కూడా తమ బౌలింగ్‌కు పదును పెట్టారు. అయితే అన్నింటికంటే కీలక సెషన్ మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌దే. ఆశించిన స్థాయిలో ఈ టోర్నీలో రాణించలేకపోతున్న అయ్యర్ పదే పదే షార్ట్ పిచ్ బంతులకు అవుటవుతూ తన బలహీనతను బయట పెట్టుకుంటున్నాడు. దీనిని సరిదిద్దే క్రమంలో అయ్యర్ ప్రాక్టీస్ సాగింది. ఆరంభంలో స్థానిక నెట్ బౌలర్లు అతనికి బౌలింగ్ చేయగా... ఆ తర్వాత టీమ్ త్రో డౌన్ స్పెషలిస్ట్ రాఘవేంద్ర అతనికి పెద్ద సంఖ్యలో షార్ట్ పిచ్ బంతులు విసిరాడు. అయ్యర్ సాధనను పర్యవేక్షించిన హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అతడికి తగిన సూచనలిస్తూ లోపాలు సరిదిద్దే ప్రయత్నం చేశారు. ముంబైకే చెందిన శ్రేయస్ సొంత మైదానంలో జరిగే మ్యాచ్‌లో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు.

పాకిస్తాన్ విజయం

- 7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు
- టోర్నీలో బంగ్లా ఖేల్ ఖతం
- పాక్‌ను గెలిపించిన అఫ్రిది, ఫఖర్



వికెట్ తీసిన అఫ్రిదికి షకీల్, బాబర్ అభినందన

కోల్‌కతా: ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ఎట్టకేలకు మరో విజయం సాధించింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత ఆ జట్టు ఖాతాలో గెలుపు చేరింది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో పాక్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. బంగ్లాకు ఇది ఆరో పరాజయం కాగా...తాజా ఫలితంతో సెమీస్ అవకాశాలు కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా బంగ్లా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 45.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. మహ్ముదుల్లా (70 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్), లిటన్ దాస్ (64 బంతుల్లో 45; 6 ఫోర్లు), షకీబ్ అల్ హసన్ (64 బంతుల్లో 43; 4 ఫోర్లు) రాణించారు. షాహీన్ అఫ్రిది 3 కీలక వికెట్లతో బంగ్లాను దెబ్బ తీశాడు. అనంతరం పాక్ 32.3 ఓవర్లలో 3 వికెట్లకు 205 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫఖర్ జమాన్ (74 బంతుల్లో 81; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (69 బంతుల్లో 68; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 21.1 ఓవర్లలో 160 పరుగులు జోడించి విజయానికి పునాది వేశారు. దాంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మరో 17.3 ఓవర్లు మిగిలి ఉండగానే అలవోకగా లక్ష్యం చేరిన పాక్ టోర్నీలో తమ ఆశలు నిలబెట్టుకుంది. వరుసగా భారత్, ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్, దక్షిణాఫ్రికా చేతుల్లో ఓడిన తర్వాత పాకిస్తాన్‌కు ఈ విజయం దక్కింది.

స్కోరు వివరాలు: బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (ఎల్బీ) (బి) షాహీన్ 0; దాస్ (సి) సల్మాన్ (బి) ఇఫ్తికార్ 45; నజ్ముల్ (సి) ఉసామా (బి) షాహీన్ 4; ముష్ఫికర్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 5; మహ్ముదుల్లా (బి) షాహీన్ 56; షకీబ్ (సి) సల్మాన్ (బి) రవూఫ్ 43; తౌహీద్ (సి) ఇఫ్తికార్ (బి) ఉసామా 7; మిరాజ్ (బి) వసీమ్ 25; తస్కిన్ (బి) వసీమ్ 6; ముస్తఫిజుర్ (బి) వసీమ్ 3; షరీఫుల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (45.1 ఓవర్లలో ఆలౌట్) 204. **వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-23, 4-102, 5-130, 6-140, 7-185, 8-200, 9-201, 10-204. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 9-1-23-3, ఇఫ్తికార్ 10-0-44-1, రవూఫ్ 8-0-36-2, వసీమ్ 8.1-1-31-3, ఉసామా 10-0-66-1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (ఎల్బీ) (బి) మిరాజ్ 68; ఫఖర్ (సి) తౌహీద్ (బి) మిరాజ్ 81; బాబర్ (సి) మహ్ముదుల్లా (బి) మిరాజ్ 9; రిజ్వాన్ (నాటౌట్) 26; ఇఫ్తికార్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (32.3 ఓవర్లలో 3 వికెట్లకు) 205. **వికెట్ల పతనం:** 1-128, 2-160, 3-169. **బౌలింగ్:** తస్కిన్ 6-1-36-0, షరీఫుల్ 4-1-25-0, మిరాజ్ 9-0-60-3, ముస్తఫిజుర్ 7-0-47-0, షకీబ్ 5.3-0-30-0, నజ్ముల్ 1-0-5-0.



ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా
వేదిక: పుణే
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
పాకిస్తాన్	7	3	4	6	-0.024
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

'నేనెప్పుడూ అనుకోలేదు'

రికార్డు పరుగులు, సెంచరీలపై కోహ్లి



న్యూఢిల్లీ: క్రికెట్ కెరీర్‌లో ఈ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడు అనుకోలేదని భారత స్టార్ విరాట్ కోహ్లి అన్నాడు. ఈ వన్డే ప్రపంచకప్‌లో 48వ సెంచరీతో భారత గ్రేటెస్ట్ బ్యాటింగ్ దిగ్గజం సచిన్ (49) సరసన నిలిచేందుకు చేరువైన కోహ్లి తన తారాస్థాయి బ్యాటింగ్ ప్రదర్శనపై స్పందిస్తూ... 'క్రికెట్ గురించే మాట్లాడితే... ఇంతలా రాణిస్తానని, ఇన్ని మైలురాళ్లు అధిగమిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. దేవుడి కృప వల్లే ఎక్కడో ఉన్న నేను ఇక్కడి దాకా వచ్చాను. నా ఆటతీరు, నిలకడ కొనసాగుతున్నాయి. సెంచరీలు చేయాలని, వేల కొద్దీ పరుగులు సాధించాలని కలలైతే కనేవాణ్ని. కానీ అవన్నీ ఇలా ఒక్కొక్కటిగా సాకారమవుతాయని అనుకోలేదు. నిజం చెప్పాలంటే క్రికెట్‌లో ఇవి ఇలా జరుగుతాయని, పయనం ఇలా సాగుతుందని ఎవరూ ప్రణాళికలు వేసుకోరు' అని అన్నాడు. ఈ 12 ఏళ్లలో టన్నుల కొద్దీ పరుగులు చేయడం చాలా ఆనందంగా ఉందన్నాడు. ఒక దశలో తన ప్రొఫెషనల్ క్రికెట్‌లోని లోపాల్ని గుర్తించడం... వెంటనే ఆటకు తగిన జీవనశైలి, క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్లే అంతా మంచి జరిగిందని విరాట్ చెప్పుకొచ్చాడు. 'నా దృష్టంతా జట్టుపైనే ఉంటుంది. టీమిండియా విజయాల కోసం నా ప్రదర్శన బాగుండాలని, క్లిష్ట సమయంలోనూ జట్టును గట్టెక్కించాలన్నదే నా లక్ష్యం. అందుకే జీవనశైలి (సంపూర్ణ ఫిట్‌నెస్ కోసం)ని మార్చుకున్నాను. కఠినమైన క్రమశిక్షణ తప్పదని భావించాను. ఆట ఎప్పుడు మన కృషినే గుర్తిస్తుంది. నిజాయితీగా చెబుతున్నా... నా కెరీర్‌లో నేను బాగా నేర్చుకుంది ఇదే! ఫీల్డులో వంద శాతం అంకితభావంతో ఆడేందుకే కృషి చేస్తా. ఇదంతా కూడా భగవంతుడి ఆశీర్వాదంగా భావిస్తా' అని కోహ్లి వివరించాడు. 2008లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ బ్యాటింగ్ కింగ్... సచిన్ తర్వాత అంతటి క్రేజ్‌ను సంపాదించుకోవడమే కాదు... ఆ మాస్టర్ బ్లాస్టర్ వేర్వేరు ఘనతలను తిరగరాశాడు. ఈ ప్రపంచకప్‌లో ఒక శతకం, మూడు అర్ధసెంచరీలతో అతను ఇప్పటికే 354 పరుగులు చేశాడు. గురువారం శ్రీలంకతో మ్యాచ్ అనంతరం నవంబర్ 5న కోహ్లి పుట్టినరోజు. అదే రోజు దక్షిణాఫ్రికాతో మ్యాచ్ ఉండటంతో శతకోటి భారతీయులంతా ఆ రోజు కింగ్ కోహ్లి శతకం కొట్టాలని కోరుకుంటున్నారు. మరోవైపు కోహ్లి కోసం ఆదివారం బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) ఈడెన్ గార్డెన్స్‌లో ప్రత్యేక వేడుకలకు ఏర్పాట్లు చేస్తోంది. మ్యాచ్‌కు ముందు ఐసీసీ అనుమతితో అందరి ముందు భారీ కేక్‌ను కట్ చేయించాలనేది ప్రతిపాదన. దీంతో పాటు మైదానానికి వచ్చే దాదాపు 70 వేల మంది ప్రేక్షకులకు లోపలికి వెళ్లే సమయంలో 'కోహ్లి మాస్క్'లను అందజేస్తారు. దాంతో స్టేడియమంతా కోహ్లిమయమయ్యే అవకాశం ఉంది.

శ్రియాంక గురికి 13వ బెర్తు



న్యూఢిల్లీ: భారత షూటర్లు పారిస్ ఒలింపిక్స్ లక్ష్యంగా ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నారు. తాజాగా శ్రియాంక సదాంగి ఒలింపిక్స్ బెర్తు సంపాదించింది. కొరియాలోని చాంగ్వాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఆమె మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. పతకం చేజారినా... 'పారిస్' గురి కుదిరింది. ఆమె 440.5 స్కోరుతో నాలుగో స్థానంలో తృప్తిపడింది. ఆమెతో పాటు ఈ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా, ఆషి చౌక్సీ, ఆయుషి పొడెర్‌లు కూడా క్వాలిఫయింగ్ మార్క్ దాటారు. షూటింగ్‌లో భారత్‌కిది 13వ ఒలింపిక్ బెర్తు కావడం విశేషం.

మెస్సీకి 8వ 'బాలన్ డోర్'



పారిస్: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ రికార్డు స్థాయిలో 8వ సారి ప్రతిష్టాత్మక 'బాలన్ డోర్' అవార్డును అందుకున్నాడు. గత ఏడాది ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో కెప్టెన్‌గా అర్జెంటీనాను విజయవంతంగా నడిపించి మెస్సీ టైటిల్ అందించాడు. ఫైనల్లో 2 గోల్స్ సహా టోర్నీలో అతను మొత్తం 7 గోల్స్ సాధించాడు. ఈ నేపథ్యంలో అతని అసాధారణ ప్రదర్శనకు గాను 'బాలన్ డోర్' అవార్డు మరో సారి వరించింది. గతంలో మెస్సీ 2009, 2010, 2011, 2012, 2015, 2019, 2021లలో కూడా దీనిని అందుకున్నాడు. ప్రతీ సీజన్‌లో విశేష ప్రతిభ కనబరిచిన ఫుట్‌బాల్ ఆటగాళ్లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. మహిళల కేటగిరీలో స్పెయిన్‌కు చెందిన ఐటానా బొన్‌మటికి ఈ అవార్డు లభించింది.

హైదరాబాద్‌లో 'రేసింగ్' లేదు!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా నగరంలో జరగాల్సిన రెండు రేసింగ్ పోటీలు రద్దయ్యాయి. ఈ నెల 4, 5 తేదీల్లో నెక్లెస్ రోడ్ వేదికగా ఎఫ్4 ఇండియన్ చాంపియన్‌షిప్, ఇండియన్ రేసింగ్ లీగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే ఎలక్షన్ కమిషన్ నిబంధనలతో వీటిని ఇక్కడ జరపడం లేదని నిర్వాహకులు ప్రకటించారు. ఈ రెండు రేస్‌లను హైదరాబాద్ నుంచి తరలిస్తున్నామని, ప్రకటించిన ఆ రెండు తేదీల్లోనే చెన్నైలో నిర్వహిస్తామని వారు వెల్లడించారు. రేస్‌ల కోసం ఇప్పటికే టికెట్లు కొన్నవారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామన్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌కు స్వర్ణం, కాంస్యం

పనాజీ: జాతీయ క్రీడల్లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు రెండు పతకాలతో మెరిశారు. మహిళల 4x100 మీటర్ల రిలే ఫైనల్లో చెలిమి ప్రత్యూష, భవానీ యాదవ్, మధుకావ్య, జ్యోతి యర్రాజీలతో కూడిన ఏపీ బృందం పోటీని 45.61 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచింది. మహిళల జావెలిన్ త్రోలో బల్లెంను 52.55 మీటర్ల దూరం విసిరి ఏపీకి చెందిన రష్మీ శెట్టి కాంస్యం నెగ్గింది.

సినిమా

కథ సెట్.. కాంబో రిపీట్



● కమల్ హాసన్
● శంకర్
● మణిరత్నం

ఒక హీరో... ఒక డైరెక్టర్...
వీరి కాంబినేషన్‌లో ఓ బ్లాక్‌బస్టర్...
ఇది చాలు... ప్రేక్షకులు ఆ కాంబో రిపీట్ కావాలని కోరుకోవడానికి. అయితే కారణాలేమైనా కొన్ని హిట్ కాంబినేషన్స్ రిపీట్ కావడానికి ఇరవయ్యేళ్లకు పైగా పట్టింది. ఇప్పుడు కథ సెట్ అయింది.. కాంబో రిపీట్ అవుతోంది. రిపీట్ అవుతున్న ఆ హిట్ కాంబినేషన్స్ గురించి తెలుసుకుందాం.



● ఆమిర్ ఖాన్
● సన్నీ డియోల్
● రాజ్‌కుమార్ సంతోషి

బిగిన్ ది బిగిన్

కమల్‌హాసన్ కెరీర్‌లో 'నాయగన్' (1987) బ్లాక్ బస్టర్ ఫిల్మ్. మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం తెలుగులో 'నాయకుడు'గా విడుదలైంది. ఇంతటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ ఇచ్చిన కమల్–మణిరత్నం కాంబోలో మరో సినిమా ప్రకటన రావడానికి మూడు దశాబ్దాలకు పైగా సమయం గడిచిపోయింది. ముప్పైఐదేళ్ల తర్వాత.. అంటే గత ఏడాది నవంబరులో తన పుట్టినరోజు సందర్భంగా మణిరత్నంతో సినిమాను ప్రకటించారు కమల్. మణిరత్నం, కమల్‌హాసన్, ఉదయనిధి స్టాలిన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. నటుడిగా కమల్ కెరీర్‌లో 234వ సినిమాగా తెరకెక్కనుంది. ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని నిర్వహించి, బిగిన్ ది బిగిన్ అంటూ వీడియోను షేర్ చేశారు మేకర్స్. దుల్కర్ సల్మాన్, త్రిష, 'జయం' రవి ఈ చిత్రంలో కీ రోల్స్ చేస్తారని సమాచారం. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. మరోవైపు 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం కూడా కమల్‌హాసన్ కెరీర్‌లో ఓ బ్లాక్‌బస్టర్. ఈ సినిమాకు శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'ఇండియన్' తర్వాత కమల్, శంకర్‌ల కాంబినేషన్‌లో పాతికేళ్లకు 'ఇండియన్ 2' రూపొందుతోంది. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

లక్నో టు లాహోర్

దాదాపు పాతికేళ్ల క్రితం బాలీవుడ్‌లో హీరో సన్నీ డియోల్, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్ అంటే సెన్సేషన్. వీరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'ఘాయల్' (1990) సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఆ ఏడాది బాక్సాఫీస్ టాప్ కలెక్షన్స్ సాధించిన మొదటి ఐదు చిత్రాల్లో 'ఘాయల్'కు చోటు దక్కడం అనేది ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించిన తీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆ తర్వాత 'దామిని' (1993) చిత్రం కోసం సన్నీడియోల్, రాజ్‌కుమార్ సంతోషిలు కలిసి పని చేశారు. కానీ ఇది ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్. మీనాక్షీ శేషాద్రి మెయిన్ లీడ్ రోల్ చేయగా, సన్నీ డియోల్, రిషీ కపూర్, అమ్రిష్ పూరి ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఈ చిత్రం కూడా సూపర్‌హిట్. ఇక ముచ్చటగా మూడోసారి సన్నీ డియోల్, రాజ్‌కుమార్ సంతోషిలు కలిసి చేసిన చిత్రం 'ఘాతక్'. 'దామిని' చిత్రంలో నటించిన సన్నీ డియోల్, మీనాక్షీ చౌదరి, ఓమ్ పురి ఈ సినిమాలో కూడా నటించారు. 1996లో విడుదలైన ఈ చిత్రం సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇలా మూడు వరుస హిట్స్ ఉన్నప్పటికీ ఎందుకో కానీ సన్నీ డియోల్, రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్‌లో ఈ సినిమా తర్వాత మరో సినిమా సెట్స్ పైకి వెళ్లలేదు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. సన్నీ డియోల్, రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్‌లో 'లాహోర్ 1947' అనే చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాను హీరో ఆమిర్ ఖాన్ నిర్మిస్తున్నారు. భారతదేశం, పాకిస్తాన్ విభజన నాటి పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, లక్నో నుంచి లాహోర్‌కు వలస వెళ్లిన ఓ ముస్లిం కుటుంబం కథే ఈ చిత్రం అని టాక్. ఈ చిత్రం 2024లో విడుదల కానుంది. మరోవైపు హీరోగా ఆమిర్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్ కూడా రిపీట్ అయ్యే చాన్సెస్ ఉన్నాయట. ఇదే నిజమైతే... 1994లో వచ్చిన 'అందాజ్ అప్నా అప్నా' తర్వాత ఆమిర్, రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్‌లో వచ్చే చిత్రం ఇదే అవుతుంది. అంటే.. 30 ఏళ్లకు ఆమిర్, రాజ్‌కుమార్ కలిసి సినిమా చేసినట్లవుతుంది.

ఎప్పటికీ హీరోయే!



● జాకీ ష్రాఫ్
● సుభాష్ ఘయ్

జాకీ ష్రాఫ్‌ను 'హీరో'ను చేసింది దర్శకుడు సుభాష్ ఘయ్. జాకీ ష్రాఫ్, సుభాష్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'హీరో' (1983) సూపర్ హిట్‌గా నిలిచింది. హీరోగా జాకీకి ఇదే తొలి సినిమా. 'హీరో' సూపర్‌హిట్ అయినప్పటికీ వీరి కాంబోలో తర్వాతి చిత్రం 'యాదేం' (2001) తెరకెక్కడానికి 18 ఏళ్లు పట్టింది. జాకీ ష్రాఫ్‌తో పాటు హృతిక్ రోషన్ కూడా ఓ లీడ్ రోల్ చేసిన ఈ చిత్రం ఫర్వాలేదనిపించింది. ఇప్పుడు జాకీ ష్రాఫ్ హీరోగా 'వన్స్ ఏ హీరో.. ఆల్వేస్ ఏ హీరో' అంటూ తాజా చిత్రాన్ని ప్రకటించారు సుభాష్.

ఇలా ఇరవై, ముప్పైఏళ్ల తర్వాత రిపీట్ అవుతున్న హీరో–డైరెక్టర్ కాంబినేషన్స్ ఇంకా ఉన్నాయి.

ఆస్కార్ వరకూ వెళ్లాం - అక్కినేని నాగార్జున



''దక్షిణాది చిత్రాలను ఇండియా అంతా ఫాలో అవుతోంది. నాగ్ అశ్విన్ వంటి దర్శకులు సత్తా చాటుతున్నారు. మేం ఆస్కార్ వరకూ వెళ్లాం. ఇండియా జాయ్ వారి గ్రాఫ్ అద్భుతంగా పెరుగుతోంది. గేమింగ్, యానిమేషన్, వీఎఫ్‌ఎక్స్ వంటి వాటి గురించి తెలుసుకోవాలంటే హైదరాబాద్ రండి'' అని అక్కినేని నాగార్జున అన్నారు. ఇండియా జాయ్, ఫ్లయింగ్ మౌంటైన్ కాన్సెప్ట్స్ సమర్పణలో సినిమాటిక్ ఎక్స్‌పో కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సినీ రంగంలోని 24 శాఖలకు చెందిన సరికొత్త సాంకేతికతను అందరికీ తెలియజేసే పరిచయ వేదికగా సినిమాటిక్ ఎక్స్‌పో నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాగార్జున పాల్గొన్నారు. మరో అతిథి డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''హాలీవుడ్‌లాంటి క్వాలిటీతో సినిమాలు ఎందుకు చేయరని అడుగుతుంటారు. కానీ, పదేళ్లుగా అద్భుతమైన క్వాలిటీతో సినిమాలు తీస్తున్నాం. 'కల్కి 2898 ఏడీ'ని పూర్తిగా మేడ్ ఇన్ ఇండియా మూవీలా ఇక్కడి వీఎఫ్‌ఎక్స్ కంపెనీలతోనే చేద్దామని ప్రయత్నించాను'' అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీస్, కామర్స్, ఐటీ డిపార్ట్‌మెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ– ''కొత్తగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు యానిమేషన్, గేమింగ్ ఇండస్ట్రీ అంతగా అభివృద్ధి చెందలేదు. కానీ, ఇప్పుడీ స్థాయికి తీసుకొచ్చాం'' అన్నారు. సినిమాటిక్ కో ఫౌండర్, తెలుగు సినిమాటోగ్రఫీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీజీ విందా తదితరులు పాల్గొన్నారు.

నన్ను నేను చూసుకున్నాను - తరుణ్ భాస్కర్

బ్రహ్మానందం, తరుణ్ భాస్కర్, చైతన్యా రావు, రఘురామ్, రవీంద్ర విజయ్, జీవన్‌కుమార్, విష్ణు, రాగ్ మయూర్ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'కీడా కోలా'. కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నండూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో తరుణ్ భాస్కర్ చెప్పిన విశేషాలు.



● లాక్‌డౌన్ సమయంలో కొందరు విభిన్న రకాలుగా డబ్బులు సంపాదిస్తున్నారని తెలిసి ఆసక్తిగా అనిపించింది. అలా ఆలోచిస్తున్న సమయంలో నా స్నేహితుడు ఒకడు ఏదైనా డ్రింక్‌లో పురుగు ఉన్నట్లయితే, కన్జ్యూమర్ కోర్టులో కేసు వేసి డబ్బులు వసూలు చేయవచ్చని చెప్పాడు. ఈ ప్రయత్నంలో ఏయే ఘటనలు జరుగుతాయో చర్చించుకున్నాం కూడా. ఇదంతా నాకు ఓ క్రైమ్‌లా అనిపించింది. కానీ కామెడీగా కూడా అనిపించింది. అలా 'కీడా కోలా' కథ మొదలైంది. ● నాకు క్రైమ్ కామెడీ జానర్ అంటే చాలా ఇష్టం. ఈ జానర్‌లో 'మనీ మనీ' సినిమా నా ఆల్ టైమ్ ఫేవరెట్. క్రైమ్ జానర్‌లో సినిమా చేయాలన్న నా కల ఓ రకంగా 'కీడా కోలా'తో నిజమైనట్లు అనిపించింది. ఈ సినిమాలో ప్రధానంగా ఎనిమిది పాత్రలు ఉన్నాయి. ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంది. అయితే ఈ ఎనిమిది పాత్రల్లో ఆడియన్స్ ఎవర్ని హీరో చేస్తారో చూడాలని నాతో పాటు ఈ చిత్రం యూనిట్ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. ప్రేక్షకులు ఖర్చు పెట్టినదానికి వారికి వినోదం లభిస్తుందనే నమ్మకం ఉంది. ● ఫిల్మ్‌మేకర్ బాధ్యత అంటేనే నాకు కాస్త భయంగా అనిపించింది. జాతీయ అవార్డు ('పెళ్ళి చూపులు') రాగానే నాకు పెద్ద బరువుగా అనిపించింది. ఆ బరువును కాస్త పక్కన పెడదామనే 'ఈ నగరానికి ఏమైంది?' సినిమా చేశాను. కానీ ఈ సినిమా నాకు ఇంకా బరువును పెంచింది. ● నా దర్శకత్వంలోని సినిమాల్లో నేను నటించిన తొలి సినిమా 'కీడా కోలా'. గతంలో కొన్ని సినిమాల్లో నేను నటించినప్పుడు చిన్న ఇబ్బంది ఫీలయ్యానని అనిపించింది. అయితే ఈ చిత్రంలో నేను చేసిన నాయుడు పాత్రను రైటింగ్ పరంగా, యాక్టింగ్ పరంగా ఫుల్ ఫ్రీడమ్‌తో చేశాను. ఓ విధంగా చెప్పాలంటే నన్ను నేను ఈ పాత్రలో చూసుకున్నానని అనిపించింది. ఇప్పటివరకైతే నాయుడు నా ఫేవరెట్ రోల్. అలాగే మా తాతయ్యగారి స్ఫూర్తితో బ్రహ్మానందంగారి పాత్రను డిజైన్ చేశాను. ఈ పాత్రలో చాలా ఫన్ ఉంటుంది. ఇక ప్రస్తుతం వెంకటేశ్‌గారి కోసం కథ రెడీ చేస్తున్నాను. ఒక ఓటీటీ ప్రాజెక్ట్ కూడా ఉంది.

జరగవు కొన్ని!

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భారత ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నిమ్మల శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథ రెడీ చేసుకుని నిర్మాత కోసం వెతుకున్న తరుణంలో నేనే నిర్మిస్తే ఎలా ఉంటుందని ఆలోచించి, అమ్మానాన్నలకు చెబితే వారు సపోర్ట్ చేశారు. నవీన, అశోక్, హరి.. ఇలా నా మిత్రుల సహకారంతోనే నేను ఇంత దూరం రాగలిగాను. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ఈ సినిమా విజయం సాధించాలని కిరీటి దామరాజు, మౌనిక, సోనియా అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గిడియన్ కట్ట.



● శ్రీరామ్, మౌనిక, జి. సందీప్

థ్రిల్ చేసే విధి



● శ్రీనాథ్, శ్రీకాంత్, రోహిత్ నందా, రంజిత్

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం తెరకెక్కించిన థ్రిల్లర్ ఫిల్మ్ 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రోహిత్ మాట్లాడుతూ–''మమ్మల్ని ప్రోత్సహించిన నిర్మాత 'దిల్' రాజు కుమార్తె హన్షితా రెడ్డిగారికి థ్యాంక్స్. 'విధి' ప్రేక్షకులను అలరిస్తుంది. ఎక్స్‌ఎల్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని థియేటర్‌కు వెళ్తే.. కంటి చూపు లేనివాళ్లు కూడా ఈ సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయొచ్చు'' అన్నారు. ''అనుభవం ఉన్న యాక్టర్‌లా నటించాడు రోహిత్. ఇప్పటివరకు 'విధి' మా సినిమా. నవంబరు 3 నుంచి ఇది ప్రేక్షకుల సినిమా. మమ్మల్ని ప్రోత్సహించిన నిర్మాత రంజిత్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు శ్రీకాంత్, శ్రీనాథ్. ''ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు ఎస్. రంజిత్. ''విధి' కొత్తగా ఉంటుంది'' అన్నారు సంగీతదర్శకుడు శ్రీచరణ్ పాకాల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	238	61
	63,875	19,080

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	12,827	△	39
డోజోన్స్	32,987	△	58
ఎఫ్‌టీఎస్ఈ 100	7,322	▽	6
డాక్స్	14,810	△	94
షాంఘై	3,017	▽	3
నికాయ్	30,856	△	162

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,370
బంగారం (99.5 స్వచ్ఛత)	61,124
వెండి (కిలో)	72,165

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	84.18
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.54	102.89
€	యూరో	ఎస్‌బీఐ	86.79	89.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.45
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.81	54.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.02	61.86
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.29

ఐవోసీ.. లాభాల రికార్డ్

- క్యూ2లో రూ. 12,967 కోట్లు
- షేరుకి రూ. 5 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్‌లో నష్టాలను వీడి దాదాపు రూ. 12,967 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. వెరసి ఒక ఏడాదికి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఆర్జించిన లాభాల్లో సగానికిపైగా తాజా త్రైమాసికంలో సాధించింది. ఇక గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 272 కోట్ల నికర నష్టం ప్రకటించింది. చమురు శుద్ధి మార్జిన్లతోపాటు మార్కెటింగ్ మార్జిన్లు మెరుగుపడటంతో లాభదాయకత పుంజుకుంది. ఈ కాలంలో ముడిచమురు ధరలు క్షీణించినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడం ఇందుకు సహకరించింది. దీంతో పెట్రోలియం ప్రొడక్టుల అమ్మకాల ద్వారా రూ. 17,756 కోట్ల పన్నుకుముందు లాభం సాధించింది. గత క్యూ2లో రూ. 104 కోట్ల నిర్వహణ నష్టం నమోదైంది.

ఆదాయం డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో ఐవోసీ ఆదాయం రూ. 2.28 లక్షల కోట్ల నుంచి రూ. 2.02 లక్షల కోట్లకు క్షీణించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. కాగా.. ఈ ఏడాది తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ఐవోసీ రూ. 26,718 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది 2021–22 ఏడాదికి సాధించిన రికార్డ్ నికర లాభం రూ. 24,184 కోట్లకంటే అధికంకావడం విశేషం! తొలి ఆరు నెలల్లో ఒక్కో బ్యారల్ స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్ఎం) 13.12 డాలర్లుగా నమోదైంది. ఈ కాలంలో ఎగుమతులతో కలిపి మొత్తం 47.65 మిలియన్ టన్నుల పెట్రోలియం ప్రొడక్టులను విక్రయించినట్లు కంపెనీ చైర్మన్ ఎస్ఎం వైద్య వెల్లడించారు. క్యూ2లో ఐవోసీ ఇంధనాల ఉత్పత్తి 16.1 ఎంటీ నుంచి 17.72 ఎంటీకి బలపడ్డాయి.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 90 వద్ద ముగిసింది.


లాభాల్లోంచి నష్టాల్లోకి...

- సెన్సెక్స్ 238 పాయింట్లు డౌన్

ముంబై: ఆరంభ లాభాలను కోల్పోయిన స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఫెడ్ రిజర్వ్ పాలసీ కమిటీ సమావేశానికి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. మిశ్రమ కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పించకలేపోయాయి. బ్యాంకింగ్, ఇంధన, ఆటో, మెటల్, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోయి 63,875 వద్ద నిలిచింది. నిఫ్టీ 61 పాయింట్లు పతనమై 19,080 వద్ద స్థిరపడింది. దీంతో రెండు రోజుల లాభాల తర్వాత సూచీలకు మళ్లీ నష్టాలు వాటిల్లాయి. కమోడిటీ, వినిమయ, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫెడ్ రిజర్వ్ పాలసీ ప్రకటన(బుధవారం రాత్రి), కీలక స్థూల ఆర్థిక డేటా వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



భారత్‌కు కొత్త మ్యాక్‌బుక్ ప్రో



న్యూఢిల్లీ: యాపిల్ కొత్త మ్యాక్‌బుక్ ప్రో ల్యాప్‌టాప్స్, ఎం3 చిప్‌సెట్‌తో కూడిన ఐమ్యాక్ ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్స్ భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల్లో అందుబాటులోకి రానున్నాయి. యాపిల్ ఇండియా స్టోర్, యాపిల్ స్టోర్ యాప్ ద్వారా అక్టోబర్ 30 నుంచే ఆర్డర్లను తీసుకోవడం ప్రారంభం అయింది. నవంబర్ 7 నుంచి డెలివరీలు మొదలు కానున్నాయి. యాపిల్ స్టోర్లు, యాపిల్ అధీకృత రీసెల్లర్స్ వద్ద కూడా ఇవి లభ్యం అవుతాయి. మ్యాక్‌బుక్ ప్రో 14 అంగుళాల ల్యాప్‌టాప్ ధర రూ.1.69 లక్షలు, 16 అంగుళాల వేరియంట్ రూ.2.49 లక్షల నుంచి ప్రారంభం. ఐమ్యాక్ ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్స్ 8–కోర్ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) వేరియంట్ ధర రూ.1.29 లక్షలు, 10–కోర్ జీపీయూ రూ.1.44 లక్షల నుంచి ప్రారంభమవుతుంది.

రిలయన్స్–ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు



ముంబై: రిటైల్ దిగ్గజం రిలయన్స్ రిటైల్, ఎస్‌బీఐ కార్డు చేతులు కలిపాయి. తాజాగా రిలయన్స్ ఎస్‌బీఐ కార్డు పేరిట కో–బ్రాండెడ్ క్రెడిట్ కార్డును ఆవిష్కరించాయి. దీనితో రిలయన్స్ రిటైల్ స్టోర్స్‌లో జరిపే కొనుగోళ్లపై రివార్డు పాయింట్లు, డిస్కౌంట్లు వంటి ప్రయోజనాలు పొందవచ్చని సంస్థ డైరెక్టర్ వి. సుబ్రమణియం తెలిపారు. అటు ఎస్‌బీఐ కార్డు అందించే ప్రత్యేక ఆఫర్లను కూడా అందుకోవచ్చు. వినియోగాన్ని బట్టి రెన్యువల్ ఫీజు నుంచి మినహాయింపు, రిలయన్స్ రిటైల్ వోచర్లు మొదలైనవి ఈ ప్రయోజనాల్లో ఉంటాయి. ఈ కార్డు రెండు వేరియంట్లలో (రిలయన్స్ ఎస్‌బీఐ కార్డు, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డ్ ప్రైమ్) లభిస్తుంది. వార్షిక రెన్యువల్ ఫీజు విషయానికొస్తే ప్రైమ్ కార్డుకి రూ. 2,999 గాను, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డుకి రూ. 499 (పన్నులు అదనం) వర్తిస్తాయి. ప్రైమ్ కార్డుపై ఏటా రూ. 3,00,000 పైగా, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డుపై రూ. 1,00,000 పైగా ఖర్చు చేస్తే రెన్యువల్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తుంది.

ఎయిర్‌టెల్ లాభం డౌన్

క్యూ2లో రూ. 1,341 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం 38 శాతం క్షీణించి రూ. 1,341 కోట్లకు పరిమితమైంది. అయితే రూ. 1,619 కోట్ల అసాధారణ నష్టాన్ని మినహాయిస్తే రూ. 2,960 కోట్ల లాభం నమోదైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,145 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 7 శాతంపైగా పుంజుకుని రూ. 37,044 కోట్లను తాకింది. దేశీ కార్యకలాపాల్లో వృద్ధి ఇందుకు సహకరించింది. దేశీ బిజినెస్ 11 శాతం ఎగసి రూ. 26,995 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో కొత్తగా 7.7 మిలియన్ల 4జీ/5జీ వినియోగదారులు జత కలవగా.. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 190 నుంచి రూ. 203కు మెరుగుపడింది. ఒక్కో కస్టమర్ సగటు డేటా వినియోగం 20 శాతం ఎగసి నెలకు 21.7 జీబీగా నమోదైంది. పోస్ట్‌పెయిడ్ విభాగంలో మిలియన్ కస్టమర్లను జత చేసుకుంది. దీంతో మొత్తం సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 214.6 మిలియన్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు 1.3 శాతం నీరసించి రూ. 914 వద్ద ముగిసింది.

ఎల్అండ్‌టీ లాభం జూమ్

రూ. 3,223 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్అండ్‌టీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం 45 శాతం జంప్‌చేసి రూ. 3,223 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,229 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 43,501 కోట్ల నుంచి రూ. 52,157 కోట్లకు ఎగసింది. కాగా.. ఈ ఏడాది తొలి ఆరు నెలల(ఏప్రిల్–సెప్టెంబర్) కాలంలో మొత్తం రూ. 1,54,672 కోట్ల విలువైన కాంట్రాక్టులు పొందినట్లు కంపెనీ సీఎఫ్‌వో ఆర్.శంకర్ రామన్ వెల్లడించారు. ఇది 65 శాతం వృద్ధికాగా.. దీనిలో 56 శాతం అధికంగా రూ. 87,333 కోట్ల విలువైన అంతర్జాతీయ ఆర్డర్లు లభించినట్లు తెలియజేశారు. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో సమీప కాలానికి అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. ఫేబ్‌లెస్ సెమీకండక్టర్ చిప్ డిజైన్, ప్రొడక్ట్ ఓనర్‌షిప్‌నకు వీలుగా పూర్తి అనుబంధ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రూ. 830 కోట్లు వెచ్చిస్తామని చెప్పారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్అండ్‌టీ షేరు నామమాత్ర నష్టంతో రూ. 2,923 వద్ద ముగిసింది.

భారత్ డిమాండ్.. 'బంగారం'

- సెప్టెంబర్ త్రైమాసికంలో 10% అప్
- 210.2 టన్నులుగా నమోదు
- ధన్‌తేరాస్ కొనుగోళ్లపై భరోసా

న్యూఢిల్లీ: భారత్ పసిడి డిమాండ్ 2023 క్యాలెండర్ ఇయర్ మూడవ త్రైమాసికంలో (జులై–సెప్టెంబర్) గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 10% పెరిగి 191.7 టన్నుల నుంచి 210.2 టన్నులకు ఎగసింది. పసిడి కొనుగోళ్లకు పవిత్రమైనదిగా భావించే ధన్‌తేరాస్ కొనుగోళ్లు భారీగా జరుగుతాయన్న విశ్వాసాన్ని పరిశ్రమ వ్యక్తం చేస్తోంది. ధరలు కొంత తగ్గడం, పండుగల డిమాండ్ దీనికి కారణం. చైనా తర్వాత పసిడి కొనుగోళ్లకు రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్ సెప్టెంబర్ త్రైమాసికం డిమాండ్‌పై ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు..

- వాణిజ్య వర్గాల అభిప్రాయం ప్రకారం, 10 గ్రాముల ధర రూ.60,000 వరకూ కొంత ఆమోదయోగ్యమైనదిగా వినియోగదారులు భావిస్తున్నారు. అంతకన్నా తక్కువ ధరలో పసిడి భారీ కొనుగోళ్లు జరగొచ్చని అంచనా.
- సెప్టెంబర్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 7 శాతం పెరిగి 146.2 టన్నుల నుంచి 155.7 టన్నులకు చేరింది. ఇదే కాలంలో కడ్డీలు, నాణేల డిమాండ్ 20 శాతం ఎగసి 45.4 టన్నుల నుంచి 54.5 టన్నులకు ఎగసింది. కడ్డీలు, నాణేల విభాగంలో డిమాండ్ 2015 గరిష్ట స్థాయిని చూసింది.
- మూడవ త్రైమాసికంలో పసిడి దిగుమతులు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 184.5 టన్నుల నుంచి 220 టన్నులకు ఎగసింది.



తొమ్మిది నెలల్లో 481.2 టన్నుల డిమాండ్..

2023 మొదటి 9 నెలల్లో బంగారం డిమాండ్ 481.2 టన్నులు. సంవత్సరం మొత్తంలో డిమాండ్ 700–750 టన్నులు ఉంటుందని అంచనా. 2022 డిమాండ్ 774 టన్నులతో పోల్చితే తగ్గడం గమనార్హం. అయితే దిగుమతులు మాత్రం పెరుగుతాయని అంచనా. 2022లో యల్లో మెటల్ దిగుమతులు 650.7 టన్నులు కాగా, 2023 సెప్టెంబర్ వరకూ జరిగిన దిగుమతుల విలువ 563 టన్నులు.

అంతర్జాతీయంగా డిమాండ్ 6 శాతం డౌన్

ఇదిలాఉండగా, అంతర్జాతీయంగా మూడవ త్రైమాసికంలో పసిడి డిమాండ్ 6 శాతం పడిపోయి 1,147.5 టన్నులకు చేరింది. సెంట్రల్ బ్యాంకుల నుంచి తగ్గిన కొనుగోళ్లు, కడ్డీలు, నాణేల డిమాండ్ తగ్గడం దీనికి కారణమని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది. చైనా డిమాండ్ మూడవ త్రైమాసికంలో 242.7 టన్నుల నుంచి స్వల్పంగా 247 టన్నులకు ఎగసింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ స్వర్ణ దీపావళి ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి పండుగ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో స్వర్ణ 'దీపావళి', తమిళనాడులో 'తంగ దీపావళి' పేరుతో ఆఫర్లు అందుబాటులోకి తెచ్చింది. కస్టమర్లు కొనుగోలు చేసిన బంగారం బరువుకు అంతే సమానమైన వెండిని ఉచితంగా పొందవచ్చు. వజ్రాల కొనుగోలుపై క్యారెట్‌కు 25 గ్రాముల వెండి ఉచితం. వెండి వస్తువుల తరుగుపై 25%, వెండి ఆభరణాల గరిష్ట విక్రయ ధర(ఎంఆర్‌పీ)పై 10% తగ్గింపు ఇస్తుంది. ప్రత్యేక ఆఫర్లతో దీపావళికి మరింత శోభ చేకూరుస్తున్నందుకు సంతోషిస్తున్నామని సంస్థ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

నాలుగు నెలల కనిష్టానికి మౌలిక రంగం

సెప్టెంబర్‌లో వృద్ధి 8.1%



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ సెప్టెంబర్‌లో 8.1% వృద్ధి రేటును నమోదు చేసుకుంది. అంతక్రితం 4 నెలల్లో ఇంత తక్కువ స్థాయి ఇదే తొలిసారి. ఈ ఎనిమిది రంగాల్లో క్రూడ్ ఆయిల్ మైనస్ 0.4%లో ఉండగా, బొగ్గు (16.1%), సహజ వాయువు (6.5%), స్టీల్ (9.6%) పురోగతి సాధించాయి. రిఫైనరీ ప్రొడక్టులు (5.5%), ఎరువులు (4.2%), సిమెంట్ (4.7%), విద్యుత్ (9.3%) రంగాలు కూడా వృద్ధి బాటన పయనించాయి. ఇక ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ ఈ గ్రూప్ వృద్ధి రేటు 7.8%. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 9.8%. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) సూచీలో ఈ 8 రంగాల వెయిటేజ్ 40.27%.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎస్‌వీఐఎంఎస్ మెడికల్ సైన్సెస్, తిరుపతిలో 100 పోస్టులు

తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్లు–04,అసోసియేట్ ప్రొఫెసర్లు–20, అసిస్టెంట్ ప్రొఫెసర్లు –76.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఎండీ లేదా ఎంఎస్ లేదా డీఎన్‌బీ చేసి ఉండాలి. పనిచేసిన అనుభవం ఉండాలి. హిందూ మతాన్ని అనుసరించే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌వీఐఎంఎస్), అలిపిరి రోడ్, తిరుపతి, తిరుపతి జిల్లా–517507 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.11.2023.
» **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 100 క్రెడిట్ ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో క్రెడిట్ ఆఫీసర్ స్కేల్ 2, 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **పోస్టుల వివరాలు:** క్రెడిట్ ఆఫీసర్ స్కేల్2–50, క్రెడిట్ ఆఫీసర్ స్కేల్3–50.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంబీఏ /పీజీడీబీఏ/పీజీడీబీఎం/సీఏ/సీఎఫ్ఏ /ఐసీడబ్ల్యూఏ/ఫైనాన్షియల్ రిస్క్ మేనేజర్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** క్రెడిట్ ఆఫీసర్స్ స్కేల్2 పోస్టులకు 25 నుంచి 32 ఏళ్లు, క్రెడిట్ ఆఫీసర్స్ స్కేల్ 3 పోస్టులకు 25నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు స్కేల్ 2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.69,810; స్కేల్ 3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230 వరకు అందుతుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.11.2023
» **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

కోచింగ్ లేకున్నా.. సక్సెస్ ఇలా!

» శిక్షణ లేకుండానే సివిల్స్‌లో విజయం సాధిస్తున్న వైనం
» నిర్దిష్ట వ్యూహాలతో.. స్వీయ అభ్యసనంతో గెలుపు బాట
» ఫిబ్రవరి 14న సివిల్స్–2024 నోటిఫికేషన్ విడుదల
» మే 26న ప్రిలిమ్స్‌కు దీర్ఘకాలిక ప్రిపరేషన్ మేలు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర ప్రతిష్టాత్మక సర్వీసుల్లోకి ప్రతిభావంతులను ఎంపిక చేసే పరీక్ష! దీన్ని జాతీయ స్థాయిలో అత్యంత కఠినమైన పరీక్షగా పరిగణిస్తుంటారు. సివిల్స్‌కు ఏటా లక్షల మంది పోటీపడుతుంటారు. కాని విజయం సాధించేది చాలా కొద్దిమంది మాత్రమే!! మరోవైపు ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకున్న వారికే విజయావకాశాలు దక్కుతాయనే అభిప్రాయం నెలకొంది! దీంతో.. శిక్షణ లేకుండా సివిల్స్‌లో నెగ్గలేమా? అనే సందేహం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2024 తేదీలను యూపీఎస్సీ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సివిల్ సర్వీసెస్ పరీక్షలో శిక్షణ లేకుండానే విజయం సాధించడానికి మార్గాలపై విశ్లేషణాత్మక కథనం..

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ అనేది అభ్యర్థులకు మార్గం చూపే ఒక సాధనం మాత్రమే. అంతిమంగా అభ్యర్థుల పరిశ్రమ, వారి సన్నద్ధతలే విజయంలో కీలకంగా నిలుస్తాయి అంటున్నారు నిపుణులు! అంటే.. సివిల్స్‌కు హాజరయ్యే అభ్యర్థులకు కోచింగ్ అనేది కేవలం మార్గ నిర్దేశం చేస్తుంది. గెలుపు అభ్యర్థుల ప్రిపరేషన్ శైలిపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టమవుతోంది. శిక్షణ లేకుండానే ప్రతి ఏటా ఎంతోమంది సివిల్స్‌లో సక్సెస్ సాధిస్తున్నారు. ఇందుకోసం అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

పరీక్ష విధానం

కోచింగ్ తీసుకోకుండా.. సివిల్స్‌కు హాజరవ్వాలనుకునే అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభానికి ముందే పరీక్ష విధానంపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. సివిల్స్ పరీక్షలో మూడు దశలు ఉంటాయి. అవి.. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ. ప్రతి దశ అత్యంత కీలకమే! పరీక్ష విధానం, పేపర్లు, సిలబస్ టాపిక్స్ గురించి సమగ్రంగా తెలుసుకోవడం ద్వారా దీర్ఘకాలిక ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకునేందుకు వీలవుతుంది.

సిలబస్ అవలోకనం

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలోని రెండు దశల రాత పరీక్ష (ప్రిలిమ్స్, మెయిన్స్)ల్లో విస్తృతమైన సిలబస్ ఉంది. అభ్యర్థులు రాత పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. తమ అకడమిక్ నేపథ్యానికి అనుగుణంగా ఉండే అంశాలు గుర్తించాలి. సివిల్స్ సిలబస్‌లో ప్రధానంగా హిస్టరీ, పాలిటీ, జాగ్రఫీ, ఎకానమీలు విస్తృతంగా ఉంటాయి. వీటితోపాటు కరెంట్ అఫైర్స్ సైతం పరీక్షలో విజయానికి కీలకంగా మారుతుంది.

ప్రీవియస్ పేపర్స్

కోచింగ్ లేకుండా ప్రిపరేషన్‌కు ఉపక్రమించే అభ్యర్థులు పరీక్ష తీరుతెన్నులపై అవగాహన పెంచుకునేందుకు పాత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయాలి. గత ఐదేళ్ల ప్రిలిమ్స్, మెయిన్స్ ప్రీవియస్ పేపర్లను ఒకటికి నాలుగుసార్లు విశ్లేషించాలి. ఇలా ప్రశ్న పత్రాలను విశ్లేషించడం వల్ల ప్రశ్నలు అడుగుతున్న తీరు, పరీక్షలో సదరు సిలబస్ టాపిక్స్‌కు లభిస్తున్న వెయిటేజీపై అవగాహన వస్తుంది. తద్వారా పరీక్ష కోణంలో ఏ అంశానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో తెలుస్తుంది. దీంతో ఎలా చదవాలో స్పష్టమైన అవగాహన లభిస్తుంది.



మెటీరియల్.. అత్యంత కీలకం

సివిల్స్ పరీక్షల విజయంలో చదివే పుస్తకాలు సైతం నిర్ణయాత్మకంగా నిలుస్తాయి. అందుకే ప్రామాణిక పుస్తకాలను సేకరించుకొని అధ్యయనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. తొలుత ఆరు నుంచి పదో తరగతి వరకూ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. ఆ తర్వాత పరీక్ష సిలబస్‌కు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను సేకరించుకోవాలి. ఇందుకోసం గత విజేతలు లేదా సబ్జెక్ట్ నిపుణుల సలహాలు ఉపకరిస్తాయి.

స్టడీ ప్లాన్

సిలబస్ కాపీతోపాటు ప్రామాణిక పుస్తకాలను సిద్ధం చేసుకున్న తర్వాత ప్రిపరేషన్ ప్రారంభించాలి. ప్రిపరేషన్ శాస్త్రీయంగా, నిర్దిష్ట ప్రణాళికతో ఉండేలా చూసుకోవాలి. అన్ని సబ్జెక్టులకు సమయం కేటాయించేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ప్రతిరోజు, ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ విభజన చేసుకోవాలి. క్లిష్టమైన అంశాలకు కొంత ఎక్కువ సమయం కేటాయించాలి.

రన్నింగ్ నోట్స్

ప్రిపరేషన్ సమయంలో ప్రతి సబ్జెక్ట్‌ను చదువుతున్నప్పుడు అందులోని ముఖ్యాంశాలతో రన్నింగ్ నోట్స్ రాసుకోవాలి. ఇలా నోట్స్ రాసుకునే క్రమంలో ఆయా టాపిక్‌కు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, సమకాలీన పరిణామాలు ఉండేలా చూసుకోవాలి. ఈ షార్ట్ నోట్స్ పరీక్ష సమయంలో రివిజన్‌కు ఉపయుక్తంగా నిలుస్తుంది. వేగంగా పదే పదే పునశ్చరణ చేసుకునేందుకు రన్నింగ్ నోట్స్ ఉపయోగపడుతుంది.

కరెంట్ అఫైర్స్

ప్రస్తుతం సివిల్స్ పరీక్షల శైలిని పరిశీలిస్తే..అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇందుకోసం ప్రతి రోజు ప్రామాణిక దినపత్రికలు చదవడం, ట్రెండింగ్ టాపిక్స్‌కు సంబంధించి టీవీ డిబేట్స్, న్యూస్ పేపర్ అనాలిసిస్‌లను అనుసరించడం వంటివి చేయాలి. తద్వారా ఆయా తాజా పరిణామాలపై లోతైన అవగాహన ఏర్పడుతుంది.

రైటింగ్ ప్రాక్టీస్

అభ్యర్థులు ప్రతి రోజూ కొంత సమయం సమాధానాల రైటింగ్ ప్రాక్టీస్‌కు కేటాయించాలి. తాము చదివిన అంశాలకు సంబంధించి పాత ప్రశ్న పత్రాలు లేదా నమూనా ప్రశ్న పత్రాల ఆధారంగా సమాధానాలు రాసుకోవడం, వాటిని విశ్లేషించుకోవడం చేయాలి. ఫలితంగా తమ ప్రిపరేషన్ స్థాయి తెలుసుకోవడమే కాకుండా.. రైటింగ్ స్కిల్స్, ప్రజెంటేషన్ స్కిల్స్ మెరుగవుతాయి. పదిసార్లు చదవడం కంటే ఒకసారి రాసిన విషయం ఎక్కువకాలం గుర్తుంటుందనే శాస్త్రీయ విశ్లేషణను పరిగణనలోకి తీసుకోవాలి. అంతేకాకుండా రైటింగ్ ప్రాక్టీస్ మెయిన్స్ పరీక్షలో వ్యాసరూప సమాధానాలు రాయడంలో ఉపయోగపడుతుంది.

మెంటారింగ్‌తో మేలు

సివిల్స్‌కు కోచింగ్ లేకుండా సొంతంగా సన్నద్ధమయ్యే అభ్యర్థులు.. మెంటారింగ్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గత విజేతలు, సబ్జెక్ట్ నిపుణులతో ఆన్‌లైన్‌లో సంప్రదింపులు సాగించడం సందేహాల నివృత్తికి దోహదం చేస్తుందని చెబుతున్నారు. ప్రిపరేషన్ సమయంలో గత విజేతలు, నిపుణులతో సందేహాలు నివృత్తి చేసుకోవాలని,తమ ప్రిపరేషన్ స్థాయిపై కచ్చితమైన విశ్లేషణ, అవగాహన పొందేందుకు ఈ మెంటారింగ్ సౌకర్యం ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్ సాధనాలు

సివిల్స్ స్వీయ ప్రిపరేషన్ అభ్యర్థులకు ఆన్‌లైన్ సాధనాలు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయి. యూ ట్యూబ్‌తోపాటు పలు సంస్థల ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు అందుబాటులో ఉంటున్నాయి. అభ్యర్థులు ఆయా మోడల్ లేదా మాక్ టెస్ట్‌ల ద్వారా తమ ప్రతిభను తెలుసుకోవడమే కాకుండా.. అవసరమైన సలహాలు, సూచనలు పొందే అవకాశం కూడా ఉంది. కరెంట్ అఫైర్స్, జనరల్ ఎస్సే తదితర విభాగాలకు సంబంధించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని కూడా సదరు ఆన్‌లైన్ పోర్టల్స్ అందిస్తున్నాయి. ఫలితంగా అభ్యర్థులు అప్‌డేటెడ్ నాలెడ్జ్‌తో ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

ఆప్షనల్స్‌పై స్పష్టత

మెయిన్ ఎగ్జామ్‌లో ఒక సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి రెండు పేపర్లలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్ దశ నుంచే దీనిపై అవగాహన పొందాలి. సిలబస్‌ను పరిశీలించి తమ అకడమిక్ నేపథ్యానికి అనుగుణంగా ఉన్న ఆప్షనల్‌ను ఎంచుకోవాలి. ఇలా ఆప్షనల్ విషయంలో స్పష్టత పొందిన అభ్యర్థులు.. దానికి సంబంధించిన ప్రిపరేషన్‌ను కూడా ముందు నుంచే ప్రారంభించాలి.

వ్యక్తిగత దృక్పథం

సివిల్స్‌కు సొంతంగా ప్రిపరేషన్ సాగించాలనుకునే అభ్యర్థులకు ఓర్పు, సహనం చాలా అవసరం. సివిల్స్ ఎంపిక అనేది నోటిఫికేషన్ నుంచి చివరి దశ ఇంటర్వ్యూ వరకు.. ఏడాదికి పైగా సాగే ప్రక్రియ. ఈ మొత్తం వ్యవధిలో అభ్యర్థులు తమ లక్ష్య సాధన దిశగా ఏకాగ్రత కోల్పోకుండా అడుగులు వేయాల్సి ఉంటుంది. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు మానసిక సమతుల్యత పాటించడం ఎంతో అవసరం. ఓర్పుగా, సహనంతో ప్రిపరేషన్ సాగించాలి. ఒకవేళ తొలి ప్రయత్నంలో విజయం లభించకపోయినా.. నిరాశకు, ఒత్తిడికి గురి కాకుండా ముందుకు సాగాలి.

సివిల్స్–2024

యూపీఎస్సీ ప్రతి ఏటా క్రమం తప్పకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షలను నిర్వహిస్తుంది. ముందుగానే ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల చేసి కచ్చితంగా పాటిస్తుంది. సివిల్స్–2024కు సంబంధించి నోటిఫికేషన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న వెలువడనుంది. మూడంచెల ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమినరీ పరీక్ష మే 26న జరుగనుంది. అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తే.. 2024 సివిల్స్‌లో విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

స్వీయ సన్నద్ధత.. ముఖ్యాంశాలు

- పరీక్ష తీరు, సిలబస్‌పై అవగాహనతో స్వీయ ప్రిపరేషన్‌కు అవకాశం.
- అకడమిక్ నేపథ్యానికి అనుగుణంగా ఆప్షనల్స్‌ను ఎంచుకోవడం మేలు.
- నిరంతర స్వీయ విశ్లేషణ, సమీక్షతో విజయ సాధనలో ముందడుగు.
- మెంటారింగ్ సదుపాయంతో బలాలు, బలహీనతలు తెలుసుకోవచ్చు.
- కీలక పాత్ర పోషిస్తున్న ప్రామాణిక పుస్తకాలు, రిఫరెన్స్ బుక్స్, దినపత్రికలు.

సివిల్స్ పరీక్ష విధానం

- సివిల్స్ పరీక్ష రెండు దశలు(ప్రిలిమ్స్, మెయిన్స్)గా ఉంటుంది.
- ప్రిలిమినరీ ఎగ్జామినేషన్‌లో రెండు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 200 మార్కులు చొప్పున మొత్తం నాలుగు వందల మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–1 జనరల్ స్టడీస్ కాగా, పేపర్–2 ఆప్టిట్యూడ్ టెస్ట్.
- రెండో దశ మెయిన్స్‌లో.. రెండు అర్హత పేపర్లు, ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు(జీఎస్–1, 2, 3, 4), ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌కు సంబంధించి రెండు పేపర్లు (ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–1, పేపర్–2) ఉంటాయి. అర్హత పేపర్లను 600 మార్కులకు.. మిగతా పేపర్లను ఒక్కో పేపర్‌కు 250 చొప్పున మొత్తం 1750 మార్కులకు నిర్వహిస్తారు.
- మెయిన్ ఎగ్జామినేషన్ తర్వాత చివరగా 275 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్ పేరుతో ఇంటర్వ్యూ ఉంటుంది.

సివిల్స్–2024 షెడ్యూల్ ఇలా

- **నోటిఫికేషన్ విడుదల:** 2024, ఫిబ్రవరి 14
- **ప్రిలిమ్స్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మార్చి 5
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2024, మే 26
- **మెయిన్స్ పరీక్ష తేదీలు:** 2024,సెప్టెంబర్ 20 నుంచి అయిదు రోజులు
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

క్లుప్తంగా...

నేడు 'వైఎస్సార్' అవార్డుల ప్రదానోత్సవం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను వరుసగా మూడో ఏడాది ప్రదానం చేస్తోంది. ఏడు విభాగాల్లో ఈ అవార్డులు అందజేస్తోంది. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 11 గంటలకుజరిగే అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరుకానున్నారు. 2023 సంవత్సరానికిగాను వివిధ రంగాల్లో సామాజిక అభ్యున్నతి కోసం అసామాన్య కృషి చేసిన, విశిష్ట సేవలు అందించిన 27 మందివ్యక్తులు, సంస్థలను అవార్డులతో సత్కరించనున్నారు. వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.10 లక్షల నగదు పురస్కారంతోపాటు మెమెంటో, పతకం, ప్రశంసాపత్రం అందజేస్తారు. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.5 లక్షల నగదు పురస్కారంతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రం బహూకరిస్తారు.

మాల్దీవులకు ఇండిగో సర్వీసుల పునరుద్ధరణ

శంషాబాద్: హైదరాబాద్–మాల్దీవులకు మధ్య ఇండిగో విమాన సర్వీసులను పునరుద్ధరించారు. గతంలో కొంతకాలం కొనసాగిన ఈ సర్వీసులను ఏడాది నుంచి నిలిపివేశారు. మంగళవారం ఉదయం 6ఈ–1798 విమానం 12.40 గంటలకు ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుని బయల్దేరింది. తిరిగి మధ్యాహ్నం 3.55 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి రాత్రి 6.45 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది. వారంలో మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

ఆర్టీసీ కార్మికులపై అధికారుల వేధింపులు

విప్లవ కార్మిక సమాఖ్య ఆరోపణ

బెల్లంపల్లి (మంచిర్యాల): రాష్ట్ర ఆర్టీసీ కార్మికులపై తీవ్రమైన పనిభారం పెంచి అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని విప్లవ కార్మిక సమాఖ్య(వికాస) ఆరోపించింది. 2018లో జరిగిన ఆర్టీసీ కార్మికుల సమ్మెల్యే 43మంది చనిపోయారని, వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని వికాస రాష్ట్ర కన్వీనర్ షంషీర్‌ఖాన్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు రోజుకు 18గంటలు పనిచేయాల్సి వస్తోందని, ఎనిమిది గంటల పని విధానాన్ని ఎప్పుడో రద్దు చేసుకుందన్నారు. ప్రశ్నించిన డ్రైవర్, కండక్టర్లను డిపో స్పేర్‌లో ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సిక్ లీవ్ ఇవ్వొద్దనే అప్రజాస్వామిక విధానాలకు తెర తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కండక్టర్లకు టార్గెట్ విధించి ఇబ్బందులకు గురి చేయడం వల్ల ఆందోళనతో అనారోగ్యానికి గురై డ్యూటీలు చేయలేకపోతున్నారని వివరించారు. కార్మికుల శ్రేయస్సు కోరుకుంటే పని భారాన్ని తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించి సంస్థలో ప్రజాస్వామిక వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను తరిమేయాలని, కాంగ్రెస్ సహా ఇతర పార్టీలను ప్రశ్నించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

ఎన్టీపీసీలో 9.69 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 9,696.78 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించామని అధికారులు మంగళవారం వెల్లడించారు. గత అక్టోబర్ వరకు 9,696.78 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించి 79.04 శాతం పీఎల్‌ఎఫ్ నమోదు చేసినట్లు తెలిపారు. 200 మెగావాట్ల మొదటి యూనిట్‌లో 208, రెండో యూనిట్‌లో 195, మూడో యూనిట్‌లో 176, నాలుగో యూనిట్‌లో–0, ఐదో యూనిట్‌లో 452, ఆరో యూనిట్‌లో 503, ఏడో యూనిట్‌లో 453 యూనిట్లు.. మొత్తంగా 2,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రస్తుతం 2,010 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ స్టేజీ–1లోని 800 మెగావాట్ల యూనిట్‌లో సాంకేతిక లోపం ఏర్పడటంతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశామని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

ఐఈఐటీఎస్‌సీ చైర్మన్‌గా వెంకట సుబ్బయ్య ఎన్నిక

ఖైరతాబాద్(హైదరాబాద్): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్‌గా డాక్టర్ జి.వెంకట సుబ్బయ్య ఎన్నికయ్యారు. అతిపెద్ద ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు పొందిన ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్‌కు రెండేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో భాగంగా చైర్మన్, కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, కె.సీతారాంబాబు పదవులను చేపట్టారు. అక్టోబర్ 2023 నుంచి 2025 అక్టోబర్ వరకు ఈ పదవుల్లో కొనసాగుతారు. ఇంజనీర్స్ సేవలను ప్రభుత్వ రంగ సంస్థలకు సలహాలు, సూచనలు చేయడంతో పాటు యువ ఇంజనీర్లకు ప్రస్తుత సవాళ్లపై సెమినార్లు, సదస్సులు ఏర్పాటు చేస్తామని వెంకట సుబ్బయ్య తెలిపారు. బుధవారం మాజీ చైర్మన్ బ్రహ్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు.

పదేళ్లయినా విస్తరించని కవచ్!

రైళ్లు ఢీకొనకుండా నిరోధించే సాంకేతికత 1,425 కి.మీ.కే పరిమితం



వందేభారత్ ఎక్స్‌ప్రెస్..



పరిజ్ఞానం: దేశీయం
నేపథ్యం: 2016 చివర్లో తయారీపై మొదలైన ప్రయోగాలు 2018 నాటికి పూర్తి. అందుకే దీన్ని తొలుత 'ట్రైన్–18'గా పేర్కొన్నారు. 2019 ఫిబ్రవరిలో ఢిల్లీ–వారణాసి మధ్య తొలి రైలు పరుగు ప్రారంభించింది. ఆలోచన నుంచి పట్టాలెక్కడం వరకు పట్టిన సమయం కేవలం రెండున్నరేళ్లు.
ఖర్చు: ఒక్కో రైలు తయారీకి అవుతున్న వ్యయం దాదాపు రూ. 100 కోట్లు.

కవచ్

ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు వచ్చినప్పుడు పరస్పరం ఢీకొనకుండా నిరోధించేందుకు అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా రూపొందించిన వ్యవస్థ.
పరిజ్ఞానం: దేశీయం
నేపథ్యం: 2013లో ప్రయోగాలు మొదలు. అవి విజయవంతం కావడంతో ఆ వ్యవస్థను వినియోగించేందుకు 2021లో అనుమతి. ప్రస్తుతం భారతీయ రైల్వే నెట్‌వర్క్ 1.29 లక్షల కి.మీ. మేర విస్తరించి ఉంది. కానీ కవచ్‌కు అంకురార్పణ జరిగి దశాబ్దం దాటుతున్నా ఇప్పటివరకు ఏర్పాటైంది కేవలం 1,425 కి.మీ. నిడివిలోనే.
ఖర్చు: కిలోమీటర్‌కు రూ.50 లక్షలు.

- బాలాసోర్ ఘోర దుర్ఘటన తర్వాత కూడా తీరు మార్చుకోని రైల్వే
- ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 5 లోకోమోటివ్‌లలోనే కవచ్ వ్యవస్థ
- వందేభారత్ రైళ్లు కూడా ప్రమాదపు అంచుల్లోనే..!

సాక్షి, హైదరాబాద్: వందేభారత్... వేగవంతమైన, ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన రైలు. కానీ వేగంగా, విలాసవంతంగా ప్రయాణించడం కంటే రైళ్లు భద్రంగా గమ్యస్థానం చేరడం చాలా ముఖ్యం. ఈ విషయాన్ని విస్మరించిన రైల్వే శాఖ... రైళ్లు ఢీకొనకుండా నిరోధించే కవచ్ వ్యవస్థను విస్తరించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ ఏడాది జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు–హౌరా ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఏకంగా 296 మంది ప్రయాణికులు దుర్మరణం పాలై నాలుగున్నర **నెలలు దాటినా నేటికీ కవచ్ వ్యవస్థను కొత్తగా ఒక్క** కిలోమీటర్ మేర కూడా అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఆ వ్యవస్థను విస్తరించి ఉంటే తాజాగా ఏపీలోని విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర దుర్ఘటన తప్పి ఉండేది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణమధ్య రైల్వే పరిధిలో కేవలం 5 డీజిల్ లోకొమోటివ్‌లలో దీన్ని ఏర్పాటు చేయడం తప్ప ఎలాంటి పురోగతీ లేదు. ఏటా 5 వేల కి.మీ. మేర ఈ వ్యవస్థను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇటీవల 3 వేల కి.మీ. మేర దీన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కానీ పనుల్లో వేగం లేదు.

టీకాస్ నుంచి కవచ్‌గా రూపాంతరం...

రైల్వే అనుబంధ పరిశోధన సంస్థ రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌ఓ) 2013లో తొలుత రైల్ కొలిజన్ అవాయిడెన్స్ సిస్టం (టీకాస్)ను సిద్ధం చేసింది. ప్రయోగాల కోసం వికారాబాద్–వాడీ–సనత్‌నగర్ సెక్షన్‌లను రైల్వే శాఖ ఎంపిక చేసింది. 260 కి.మీ. నిడివిలో ఆ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిశీలించింది. ఆరేళ్ల **క్రితం దాని పేరును కవచ్‌గా మార్చింది.**

కవచ్ పనితీరు ఇలా...

ప్రత్యేక కవచ్ యంత్రాలను రైల్వే స్టేషన్‌లలో, రైళ్లలో అమరుస్తారు. ట్రాక్‌పై ప్రతి కి.మీ.కు ఒకటి చొప్పున ఆర్‌ఎఫ్‌ఐడీ ట్యాగ్‌లను ఏర్పాటు చేస్తారు. రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నళ్ల కోసం నిర్ధారిత ప్రాంతాల్లో 40 మీటర్ల ఎత్తున్న టవర్లను ఏర్పాటు చేస్తారు. కమ్యూనికేషన్ టవర్, జీపీఎస్, రేడియో ఇంటర్‌ఫేస్‌లతో అనుసంధానిస్తారు. దీంతో ఎప్పటికప్పుడు ఇవి రైళ్లను నియంత్రిస్తుంటాయి. లోకో పైలట్ నిర్లక్ష్యంగా వ్యవహరించినా తనంతట తనుగా బ్రేక్‌లు వేసుకోవటం, హారన్ మోగించటం లాంటివి కవచ్ చేయగలదు. పొరపాటున ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా రెండు రైళ్లు వస్తే.. కనీసం 100 మీటర్ల దూరంలోనే అవి ఆటోమేటిక్‌గా నిలిచిపోతాయి.

2022 నాటికి కవచ్ ఎక్కడెక్కడంటే..

- ➡ నాందేడ్–నిజామాబాద్–సికింద్రాబాద్–కర్నూలు–గుంతకల్ మార్గంలో 960 కి.మీ.
- ➡ పర్బణి–పర్లివైజ్‌నాథ్–లాతూర్–వికారాబాద్ మార్గంలో 31 కి.మీ.
- ➡ వాడి–వికారాబాద్–సనత్‌నగర్ మార్గంలో 174 కి.మీ.
- ➡ ఇవి తప్ప, దేశంలోని మిగతా ప్రాంతాల్లో వీటి ఏర్పాటు జరగలేదు.

వందేభారత్‌లకూ పొంచి ఉన్న ప్రమాదం..

గంటకు 160 కి.మీ.వేగంతో (నిర్ధారిత పరిధి) దూసుకుపోతున్న వందేభారత్ రైళ్లలోనూ కవచ్ వ్యవస్థ లేదు. అవి పరుగుపెట్టే ట్రాక్ మొత్తం కవచ్ వ్యవస్థ ఏర్పాటైతేనే పనిచేసే పరిస్థితి ఉన్నందున వందేభారత్ రైళ్లు కూడా ఎదురెదురుగా ఇతర రైళ్లను ఢీకొనే ప్రమాదపు అంచులో ఉన్నట్టే.

కాచిగూడ ప్యాసింజర్‌కు తప్పిన ప్రమాదం

- కృష్ణా–కున్సి మధ్య విరిగిన రైల్వే పట్టాలు
- లోకో పైలెట్ సురేందర్ చాకచక్యం



నిలిచిపోయిన కాచిగూడ-రాయచూర్ ప్యాసింజర్ (ఇన్‌సెట్) విరిగిన రైల్వే పట్టా

కృష్ణా (నారాయణపేట జిల్లా): నారాయణపేట జిల్లా కృష్ణా మండలం కున్సి, కృష్ణా గ్రామాల మధ్య రైల్వే పట్టాలు విరిగిపోవడంతో లోకో పైలెట్ చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే...అక్టోబర్ 1న నుంచి కాచిగూడ–రాయచూర్ మధ్య కొత్త లైన్‌ను ప్రారంభించి, ప్యాసింజర్ రైలును నడుపుతున్నారు. కాగా..మంగళవారం సాయంత్రం ఈ కొత్త పట్టాలపై వెళుతుండగా.. రైలు ఇంజిన్ పట్టాలు దాటే సమయంలో బోగీ పెద్ద శబ్దం చేయడంతో లోకోపైలెట్ సురేందర్ ప్రమాదాన్ని పసిగట్టి వెంటనే రైలును నిలిపివేశాడు. ఆ తరువాత సిబ్బందితో కలిసి పరిశీలించగా...పట్టాలు విరిగిపోయి ఉన్నట్లు గమనించారు. దీంతో రైల్వే అధికారులకు సమాచారం అందించగా...వెంటనే రైల్వే శాఖ అధికారులు అక్కడికి చేరుకొని ఆ పట్టాలను సరి చేయించడంతో రైలు తిరిగి రాయచూర్‌కు బయల్దేరింది. లోకో పైలెట్ అప్రమత్తంగా లేకపోతే పెద్ద ప్రమాదం జరిగేదని ప్రయాణికులు తెలిపారు. కొత్తగా నిర్మించిన పట్టాలు ఒక నెల రోజుల్లోనే విరిగిపోవడం..నిర్మాణంలోని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పలువురు విమర్శించారు.

రూ.412 కోట్లకు చేరిన స్వాధీనాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు మంగళవారం రూ.16.16 కోట్లు విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.412.46 కోట్లకు చేరింది. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో చెక్‌పోస్ట్ వద్ద రూ.1.26 కోట్లు, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల వద్ద కారులో రూ.1.20 కోట్లు, చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వాహనంలో రూ.69 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మొత్తం రూ.5.6 కోట్ల నగదును పట్టుకోగా, ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.145.32 కోట్లకు పెరిగినట్లు సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడించారు.

డాక్టరేట్ అందుకున్న శంతను నారాయణ్

హాజరైన గవర్నర్ తమిళిసై ● 40 మంది మహిళలకు బంగారు పతకాలు ● 1,024 మందికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలు



పద్మశ్రీ శంతను నారాయణ్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ తమిళిసై, వీసీ ప్రొఫెసర్ రవీందర్

సాక్షి, హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: అమెరికాకు చెందిన అడోబ్ కంపెనీ సీఈవో పద్మశ్రీ శంతను నారాయణ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 49వ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. మంగళవారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 83వ స్నాతకోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, ఓయూ చాన్స్‌లర్ తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షత వహించగా పద్మశ్రీ శంతను నారాయణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పద్మశ్రీ శంతను నారాయణ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో చేసిన విశేష సేవలకు డాక్టరేట్‌కు ఎంపిక చేసినట్లు వీసీ ప్రొ.రవీందర్ పేర్కొన్నారు. ఇంతవరకు డాక్టరేట్లు అందుకున్న 49 మందిలో పద్మశ్రీ శంతను నారాయణ్ మూడో ఓయూ పూర్వవిద్యార్థి అవడం విశేషం. అనంతరం గవర్నర్ పీజీ విద్యార్థులకు బంగారు పతకాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓయూలో అన్ని విభాగాలలో బంగారు పతకాలను ప్రవేశపెట్టాలని, అందుకు పూర్వవిద్యార్థులు సహకరించాలన్నారు. నేడు (31న) తన పెళ్లిరోజు అయినప్పటికీ మీ కోసం పాండిచ్చేరినుంచి వచ్చానని ఆమె చెప్పారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు.

బంగారు పతకాలలో మహిళల రికార్డు..

ఓయూలో అత్యధికంగా బంగారు పతకాలు సాధించి మహిళలు రికార్డు సృష్టించారు. ప్రకటించిన 46 మంది పీజీ విద్యార్థుల్లో 40 మంది మహిళలు కాగా కేవలం ఆరుగురు మాత్రమే పురుషులు ఉన్నారు. వివిధ విభాగాలలో 1,024 మంది పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాలు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు తదితరులు పాల్గొన్నారు.

మా ఇంట్లో మూడో పీహెచ్‌డీ: శంతను నారాయణ్

స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మశ్రీ శంతను నారాయణ్ గవర్నర్ తమిళిసై, వీసీ ప్రొ.రవీందర్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అమ్మ, నా భార్య పీహెచ్‌డీ డాక్టరేట్లు కాగా తనతో మూడోదన్నారు. ప్రపంచంలో ఆర్థిక అభివృద్ధి వేగంగా జరుగుతోందని, మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా విద్యార్థులు అవకాశాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలను సాధించిన 1,024 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు.

ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు డాక్టరేట్

అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'భారతదేశంలో శాసనసభ్యుల శాసనాధికారాలు–వాటిపై న్యాయ సమీక్ష' అనే అంశంపై న్యాయశాస్త్రంలో చేసిన పరిశోధనకుగాను బాలరాజుకు పీహెచ్‌డీ పట్టా లభించింది. అడోబ్ కంపెనీ సీఈవో శంతను నారాయణ్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు.

డాక్టరేట్ల ఆనందం...

ఓయూ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్లు అందుకున్న అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. డాక్టరేట్ డిగ్రీలను అందుకున్న వారిలో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులు చేసేవారే అధికంగా ఉన్నారు. పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఉద్యోగాలు రావడంతో 10, 15 సంవత్సరాల క్రితం చదువులను వదిలేసి ఇక డాక్టరేట్‌ను అందుకోలేమని అనుకున్న మాకు వీసీ వన్‌టైం ఛాయిస్‌తో పరిశోధనను పూర్తి చేసే అవకాశం కల్పించారని అనేక మంది విద్యార్థులు పేర్కొన్నారు.

యాదాద్రీశుడికి బంగారు చీర బహూకరణ



బంగారు చీరను చూపెడుతున్న విజయ్, ఆలయాధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి సిరిసిల్లకు చెందిన నల్ల విజయ్ అగ్గిపెట్టిలో పట్టే బంగారు చీరను, శాలువాను మంగళవారం బహూకరించారు. మొదటగా శ్రీస్వామి వారిని దర్శించుకున్న నల్ల విజయ్, కుటుంబ సభ్యులు, అనంతరం అగ్గిపెట్టెలో తీసుకువచ్చిన బంగారు చీరను, శాలువాను ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం నల్ల విజయ్ మాట్లాడుతూ.. తన తండ్రి నల్ల పరంధాములు అగ్గిపెట్టెలో చీరను తయారు చేసి సిరిసిల్ల ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. అదే స్ఫూర్తితో తాను కూడా అగ్గిపెట్టెలో ఇమిడే చీరను తయారు చేశానన్నారు. ఇటీవల కాలంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయానికి, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాలకు వేర్వేరుగా రెండు గ్రాములతో అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీరను తయారు చేసి ఇచ్చినట్లు తెలిపారు. 15 రోజులు కష్టపడి, దేవుడిపై ఇష్టంతో ఐదున్నర మీటర్ల వెడల్పు, 48 ఇంచులు పొడవులో 120 గ్రాముల బరువుతో ఈ అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీర, శాలువాను తయారు చేశానన్నారు. ఇందులో 2 గ్రాముల బంగారం వాడానని, మిగతావి నూలు, రంగు ఉన్నాయని విజయ్ వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాల పోలీసులకు పతకాలు

- తెలంగాణలో 22 మందికి, ఏపీలో 12 మందికి..
- పురస్కారాలు ప్రకటించిన కేంద్ర హోంశాఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, సరిహద్దుల రక్షణ, ఆయుధాల నియంత్రణ, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి నాలుగు ఆపరేషన్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి కేంద్ర హోంశాఖ మెడల్స్‌ను ప్రకటించింది. 2023 సంవత్సరానికి తెలంగాణ నుంచి 22 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 12 మందిని ఎంపిక చేసినట్లు హోంశాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. హోంశాఖ 2018లో ఆపరేషన్స్ మెడల్స్‌ను ప్రవేశపెట్టింది. తెలంగాణలో ఇద్దరు ఐపీఎస్ అధికారులు, ఒక నాన్‌కేడర్ ఎస్పీ, ఒక డీఎస్పీ, ఒక ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఎస్‌ఐలు, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, తొమ్మిదిమంది కానిస్టేబుళ్లు మొత్తం 22 మందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఏపీ నుంచి ఇద్దరు ఐపీఎస్ అధికారులు, ఒక నాన్‌కేడర్ ఎస్పీ, ఒక ఇన్‌స్పెక్టర్, ఒక ఎస్‌ఐ, ఒక ఆర్‌ఎస్‌ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లు మొత్తం 12 మందిని ఎంపిక చేసింది.

తెలంగాణ నుంచి ఎంపికైన వారు

రాజేష్‌కుమార్ (ఐజీపీ), నరేందర్ నారాయణరావు చుంగి (ఎస్పీ), ఎస్.చైతన్య కుమార్ (నాన్‌కేడర్ ఎస్పీ), డీఎస్పీ ఆర్.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఎన్.రాజశేఖర్, ఎస్‌ఐలు పి.విజయభాస్కర్, ఏ.వరుణకాంత్ రెడ్డి, మహమూద్ యూసఫ్, హెడ్ కానిస్టేబుళ్లు టి.హరినాథ్, షేక్ అజారుద్దీన్, ఎం.జీ.శివమణి, ఎస్.ప్రసాద్, కే.సి. విజయ్‌కుమార్, పీసీలు మహమూద్ ఖాజా మొయిద్దీన్, మోహమ్మంద్ ఇంతియాజ్, బి.సుమన్, పి.రవీందర్, ఎం.రవీదర్‌కుమార్, ఎస్.ప్రేమ్‌కుమార్, ఎండీ షబ్బీర్ పాషా, ఇంతియాజ్ పాషా షేక్, ఏ.శ్రీనివాస్.

ఏపీ నుంచి ఎంపికైన వారు

వినీత్ బ్రిజ్ లాల్ (ఐజీపీ), బాబూజీ అట్టాడ (ఎస్పీ), ఈజీ అశోక్‌కుమార్ (ఎస్పీ, నాన్‌కేడర్), షేక్ సర్దార్ ఘని (ఇన్‌స్పెక్టర్), సవ్వన అనిల్‌కుమార్(ఎస్‌ఐ), ఎంవీఆర్‌పీ నాయుడు (ఆర్‌ఎస్‌ఐ), రాజన్న గౌరీ శంకర్ (హెడ్‌కానిస్టేబుల్), అనంతకుమార్ నంద (హెడ్‌కానిస్టేబుల్), పీసీలు అడప మణిబాబు, వి.శ్రీను, జి.భాస్కరరావు.

ఈసారి తేలికగా జేఈఈ సిలబస్

- కోవిడ్ కాలంలో తగ్గించిన సిలబస్‌కు అనుగుణంగా ప్రశ్నలు
- ఎన్‌టీఏ నిర్ణయం.. ప్రశ్నపత్రం కూర్పు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- నవంబర్ రెండో వారంలో నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) ఈసారి కొంత తేలిగ్గా ఉండే వీలుంది. ఈ దిశగా పేపర్ కూర్పు చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. దీనిపై ఇటీవల ఓ నిపుణుల కమిటీని కూడా నియమించింది. సీబీఎస్‌ఈ, ఎన్‌టీఎస్ఈల్లో కోవిడ్ కారణంగా తొమ్మిది, పదో తరగతుల్లో సిలబస్‌ను తగ్గించారు. ఇప్పుడు ఆ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. ఇదేకాకుండా జేఈఈ మెయిన్స్ కొన్నేళ్లుగా కష్టంగా ఉంటోందని, మ్యాథ్స్‌లో సమాధానాలు రాబట్టడానికి ఎక్కువ సమయం తీసుకుంటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని వర్గాల నుంచి దీనిపై ఫీడ్‌బ్యాక్ రావడంతో ప్రశ్నపత్రాన్ని సరళతరం చేయాలని ఎన్‌టీఏ నిర్ణయించింది. ఏయే చాప్టర్లలో మార్పులు తేవాలి? ప్రశ్నల స్థాయి ఎలా తగ్గించాలనే అంశంపై ఎన్‌టీఏ నియమించిన కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుందని, నవంబర్ రెండో వారంలో నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని ఎన్‌టీఏ అధికార వర్గాలు తెలిపాయి.

ఏప్రిల్‌కు ప్రిపేరవ్వడం ఉత్తమం

రాష్ట్రం నుంచి జేఈఈ రాయాలనుకునే విద్యార్థులు జనవరి బదులు ఏప్రిల్‌ను ఎంచుకోవడం మంచిది. ఇంటర్ పుస్తకాలపై అధ్యయనం కాస్త తగ్గించాలి. దీనికి బదులు ఆబ్జెక్టివ్‌పై దృష్టి పెట్టాలి. దీనివల్ల ఎక్కువ మార్కులు స్కోర్ చేసే వీలుంది. ఎన్‌టీఏ నోటిఫికేషన్ వస్తే ఏయే చాప్టర్ల నుంచి ఎన్ని ప్రశ్నలు వస్తాయనేది స్పష్టంగా తెలిసే వీలుంది.
– ఎంఎస్ రావు, జేఈఈ గణితశాస్త్ర నిపుణుడు

సెల్‌ఫోన్ వదిలితేనే స్టీరింగ్

ఆర్టీసీ డ్రైవర్లపై నియంత్రణ చర్యలు ప్రారంభించిన ఆర్టీసీ

- డిపోలకు రాగానే కంట్రోలర్ వద్ద ఫోన్లు డిపాజిట్ చేయాలని ఆదేశం
- ఇటీవలి కాలంలో బస్సు ప్రమాదాల నేపథ్యంలో నిర్ణయం
- ప్రస్తుతం అవగాహన కార్యక్రమాలు.. ఆ తర్వాత కఠిన చర్యలు

సాక్షి, హైదరాబాద్: డ్రైవర్లు బస్సు నడిపే క్రమంలో మొబైల్‌ఫోన్లు వాడుతూ ప్రమాదాలబారిన పడుతున్న ఘటనలు ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటుండటంతో టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నియంత్రణ చర్యలు ప్రారంభించింది. డ్రైవర్ల ఏకాగ్రత దెబ్బతినకుండా ఉండే చర్యల్లో భాగంగా వారు విధుల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ల వినియోగాన్ని నియంత్రించాలని నిర్ణయించింది. దీంతోపాటు డ్యూటీలో భాగంగా గమ్యం చేరిన తర్వాత.. తిరిగి మళ్లీ బయలుదేరేలోగా ఉన్న విశ్రాంతి సమయంలోనూ మొబైల్ ఫోన్లు వాడకుండా నిషేధించింది. ఈ చర్యలకు డ్రైవర్లు అలవాటుపడేలా వారికి అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఆ తర్వాత దీన్ని పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది.

నిబంధనలు ఇలా...

- ➡ హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే టీఎస్‌ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు బస్టాండ్‌కు చేరుకోగానే అక్కడి టీఎస్‌ఆర్టీసీ కేంద్రంలోని ఏటీఎం కార్యాలయంలో మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. తిరిగి బస్సు బయలుదేరే సమయంలో వాటిని తీసుకోవాలి.
- ➡ ఇతర దూరప్రాంతాలకు వెళ్లే ఏసీ బస్సుల్లో ఉండే అటెండర్‌కు డ్రైవర్ తన మొబైల్ ఫోన్ అప్పగించాలి. ఏవైనా ఫోన్ కాల్స్ వస్తే అటెండరే మాట్లాడి డ్రైవర్‌కు సమాచారం చెప్పాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యుల నుంచో, లేదా ఇతరుల నుంచో వచ్చే ముఖ్యమైన కాల్స్ ఉంటే బస్సును పక్కన ఆపి మాట్లాడిన తర్వాతే బస్సును నడపాల్సి ఉంటుంది.
- ➡ ఇద్దరు డ్రైవర్లు ఉండే నాన్‌–ఏసీ దూరప్రాంత బస్సుల్లో అయితే రెండో డ్రైవర్‌కు ఫోన్ అప్పగించాల్సి ఉంటుంది.
- ➡ హైదరాబాద్ సిటీ బస్సు సర్వీసుల్లోనూ కఠిన నిబంధనల అమలు ప్రారంభించారు. డిపోనకు రాగానే అక్కడి కంట్రోలర్‌కు డ్రైవర్లు ఫోన్లను అప్పగించాలి. ఈలోగా ముఖ్యమైన ఫోన్ కాల్స్ వస్తే విషయాన్ని తెలుసుకొని కంట్రోలర్లు ఆయా దారుల్లో ఉండే పాయింట్ల మీది కంట్రోలర్ల ద్వారా ఆ సమాచారాన్ని డ్రైవర్లకు చేరవేయాలి.
- ➡ అవగాహన కార్యక్రమాల తర్వాత ఈ నిబంధన పాటించని వారి నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని 2 నెలలపాటు బస్ డిపోల్లోనే ఉంచనున్నారు. అప్పటికీ తీరు మారకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

ఆ డ్రైవర్లకు భారం తప్పించే ఏర్పాటు..

బస్సు టికెట్లను అడ్వాన్సుగా ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్‌ఎస్) ద్వారా బుక్ చేసుకున్నప్పుడు ప్రయాణికుడికి బస్సు డ్రైవర్ సెల్ నంబర్ అందిస్తున్నారు. బస్సును ట్రాక్ చేసే క్రమంలో ప్రయాణికుడు డ్రైవర్‌కు పలుమార్లు ఫోన్లు చేయడం ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవలే ఆర్టీసీ రూపొందించిన గమ్యం యాప్‌ను ప్రయాణికులు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే బస్సును సులభంగా ట్రాక్ చేసుకోవడంతోపాటు ఇతర సమస్త సమాచారం తెలుస్తుంది. ఈ దిశగా ప్రయాణికులకు అవగాహన కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు టికెట్ బుక్ చేసుకుంటే.. డ్రైవర్ నంబర్‌కు బదు లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే సెంటర్ నంబర్ ఇవ్వనున్నారు. ప్రయాణికుడు ఫోన్ చేయగానే ఆ సెంటర్ సిబ్బంది సిస్టంలో గమ్యం యాప్ తెరిచి బస్సు వివరాలు తెలుసుకుని చేరవేస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.